# 'అదే' కథలు

కథా సంపుటి

- ఆర్.శర్మ దంతుర్తి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 240

కౌముది మాసపత్రికలో

జూన్ 2019 సంచిక నుంచి సెప్టెంబర్ 2022 సంచిక వరకూ వచ్చిన

కథల సంపుటి


| క్రమసంఖ్య | కథపేరు | పేజి |
|---|---|---|
| □ | మంచు తుఫాను | 4 |
| □ | శ్రీనివాస కల్యాణం | 7 |
| □ | శ్రావణమాసం నోము | 10 |
| □ | అబ్బాయి వచ్చాడు | 13 |
| □ | సి.యీ.వో | 16 |
| □ | ముందు చూపు | 19 |
| □ | వెలుగు నీడలు | 22 |
| □ | ఉచిత ఫోను | 25 |
| □ | ఎప్పుడూ మొగుడిదే తప్పు | 27 |
| □□ | ఎలక తోలు | 29 |
| □□ | కియా బ్రాండ్ | 32 |
| □□ | జీవితం | 34 |
| □□ | నోటిముందు దూకుడు | 36 |
| □□ | ఆరు నూరైనా, నూరు ఆరైనా | 38 |
| □□ | డ్రైవింగ్ | 39 |
| □□ | కీచులాటలు | 41 |
| □□ | సహధర్మచారిణి | 44 |
| □□ | ఐదుకి ఐదు | 46 |
| □□ | ఆగమ పండిట్ | 48 |
| □□ | ఎనిమిదో తరగతి థెరపీ | 50 |
| □□ | తెలివితేటలు | 54 |
| □□ | పెండ్లి పిలుపు | 56 |

| | | |
|---|---|---|
| [illegible] | బ్రహ్మచారి | 60 |
| [illegible] | చంద్రహారం | 62 |
| [illegible] | ఇంటి పేరు | 67 |
| [illegible] | స్వాతంత్ర్యం | 70 |
| [illegible] | బ్రహ్మచారిణి | [illegible] |
| 28 | మర్యాద రామన్న | 77 |
| 29 | రాత్రికి మీ ఇంట్లో | 80 |
| 30 | చదువు, డబ్బు | 83 |
| 31 | వెండి కంచంలో భోజనాలు | 86 |
| 32 | ఇంటి తాళాలు. | 90 |
| 33 | మరెప్పుడూ రాకండి | 93 |
| 34 | ఉద్యోగపు వేట | 96 |
| 35 | మానసిక వేదన | 99 |
| 36 | అరువు కారు | 102 |
| 37 | రెండిటికీ చెడ్డ రేవడి | 105 |
| 38 | వెంచర్ కాపిటల్ | 108 |
| 39 | ఉచిత సోఫా | 111 |
| 40 | నాస్తికుడు | 115 |

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకీ, బాధలకీ, దుఃఖాలకీ నా బాధ్యత లేదు.

# మంచు తుఫాను

బఫేలో న్యూ యార్క్, నవంబర్ *14, 2014.* పొద్దున్నే లేచిన వెంకట్ ఇంట్లోవాళ్లతో మాట్లాడి ఈ మధ్యే ఊళ్ళోకి వచ్చిన కొత్త దంపతులని థేంక్స్ గివింగ్ డిన్నర్ భోజనానికి పిలవడానికి ఫోన్ చేసేలోపుల ఇంటావిడ వచ్చి చెప్పింది, "సాయంత్రానికి స్నో ఎక్కువవ్వొచ్చుట."

వాతావరణం టివి లో చూసి వెంకట్ ఫోన్ చేసాడు, "రమేష్, వచ్చే వారంలో అనుకున్న థేంక్స్ గివింగ్ డిన్నర్ కుదరకపోవచ్చు ఈ స్నో వల్ల, ఈ రోజు సాయంత్రం వచ్చేయగలరా*?"*

"రమ్య ని కనుక్కుని చెప్తానండి," రమేష్ ఫోన్ పెట్టేసాడు.

తర్వాత రమేష్, రమ్యా మాట్లాడుకున్న విషయాలు డిన్నర్ పిలుపుతో మొదలై ఎప్పట్లాగా ఉన్నవే – పదింటికి రడీగా ఉండమంటే ఎప్పుడూ పదిన్నరలోపున అమ్మగారికి కుదరదు; టైం కి ఏ పనీ చేయదు ఈవిడ అని ఆయన గొడవ, ప్రతీదానికీ ఆయనకి తొందరెక్కువ అని ఈవిడ గొడవ, ఈవిడకి నచ్చినట్టూ ఆయన బట్టలువేసుకోలేదని మరో గొడవ, ఆవిడకి వంట రాదని ఇంకో గొడవా. ఇప్పుడొచ్చిన పిలుపుతో పిల్చినప్పుడు వెళ్లకపోతే బాగుండదని ఈవిడా, వెళ్తే స్నోలో డ్రైవ్ చేయడం కష్టం అని ఈయనా, సీట్లో దర్జాగా కూర్చుని 'ఆ, ఈ మాత్రం స్నో పడితేనే ఇంత గొడవా' అనుకునే అమ్మగారి గొడవా. ఇలా ఇద్దరూ వాదోపవాదనలు అయ్యేక ఎప్పుడూ అమ్మగారి చేయే నెగ్గాలి కనక రమేష్ ఫోన్ చేసి చెప్పేడు వెంకట్ తో వస్తున్నట్టూ. సాయంత్రం బయల్దేరుతూంటే అప్పటికే మంచు ఎక్కువౌతూంది. పాసెంజర్ సీట్లో పట్టుచీరలో ఉన్న అమ్మగారికిదేం పట్టలేదు; ఆవిడకు ప్రస్తుతం ఉన్న అతి ముఖ్యమైన ప్రణాళికల్లో పెట్టుకున్న బొట్టు సరిగ్గా ఉందా లేదా, అది మేచింగ్ అవునా కాదా, వేసుకున్న జాకెట్టు చీరకి నప్పిందా లేదా, చెవులకి పెట్టుకున్న కొత్త జూకాలు తల ఇలా కదిపితే తళుక్కుమంటున్నాయా లేవా అనేవి ఆవిడ విషయాలు.

దారిలో ఓ చోట ఆగి పిలిచినవారి ఇంట్లో ఇవ్వడానికి కొన్ని ఏపిల్స్, పువ్వులూ, ఓ ఏపిల్ పై కొన్నాక, మొత్తానికి వెంకట్ ఇంట్లో కెళ్ళేసరికి అమ్మగారు ఆల్ హేపీస్. డిన్నర్ ఇంకా అవలేదు లా ఉంది. అది అయ్యేలోపుల పెట్టిన పకోడీలు తింటూండగా టివీలో రాబోయే స్నో

తుఫాను ఎలా ఉంటుందో చర్చించుకుంటున్నప్పుడు రమేష్ అడిగేడు వెంకట్ ని, "ఇక్కడ నవంబర్ నెల వచ్చేసరికే స్నో ఎక్కువగా పడుతున్నట్టుందే? మేము అంతకు ముందు అలబామలో ఉన్నాం ఓ ఏడాది, అక్కడింత స్నో లేదు మరి."

"బాగా అంటున్నారా, ముందు స్నో, ఆ తుఫాన్ వల్ల మంచు పడ్డాక లేక్ పక్కనే ఉండడం వల్ల తిరిగి లేక్ ఎఫెక్ట్ స్నో అని మరోసారి తోక ఝాడిస్తుంది ఈ తుఫాను. అదీగాక ఇప్పుడొచ్చేది బాగా ఉధృతమైనది అంటున్నారు, చూద్దాం."

"మొత్తానికిదో కత్తిలాంటి స్నో తుఫాన్ అనుకోవాలి అయితే" రమేష్ అన్నాడు.

"సరిగ్గా చెప్పేరు కత్తి లాంటిదని. దానికి వెదర్ చానెల్ వాళ్ళిచ్చిన పేరు కూడా అదే, నైఫ్ అని."

డిన్నర్ అయ్యేక బయల్దేరుతుంటే రమేష్ అన్నాడు, "ఈ చలిలో కారు స్నోలో కూరుకుపోతే ఈస్ట్ ఆరోరా చేరగలమా?"

వెంకట్ ఏదో అనబోతూంటే రమ్య అంది "ఈయనకి ప్రతీదీ గోరంతలు కొండంతలు చేయడం ఇష్టం. ఈ మాత్రం నాలుగంగుళాల స్నో కే బాగా బెదిరిపోయి కేకలు పెట్టడం; ఎక్కడా చూడం ఇలాంటి మనిషిని."

రమేష్ అందుకుని అన్నాడు, "ఈవిడంతేనండి, ఎంతసేపూ చీరా, జాకెట్ మేచ్ అయ్యేయా లేదా, తన షోకూ సంబరమే తప్ప, నేనెలా పోయినా ఈవిడకి అక్కర్లేదు. ఓ సారి డ్రైవర్ సీట్లో కూచుంటే తెలిసొస్తుంది. పాసెంజర్ సీట్లో కూర్చుని కబుర్లు చెప్పడం కాదు."

వాళ్ళావిడ నవ్వుతూంటే, వెంకట్ అన్నాడు, "ఏమీ భయం లేదు, మంచు ఇప్పుడిప్పుడే కాస్త ముదురుతోంది. వెళ్ళిపోవచ్చు కంగారులేదు. మీకు దారిలో ఏదైనా సహాయం కావాలిస్తే నాకు ఫోన్ చేయండి, సరేనా?"

రమేష్ కారు స్టార్ట్ చేసాడు కానీ రమ్య అన్నమాట మనసులో తిరుగుతోంది. నేనా ప్రతీదీ గోరంతలు కొండంతలు చేసేది? ఈ స్నో లో కారు కదలకపోతే అప్పుడు ఈవిడ ఈ పట్టుచీరలో దిగి తోస్తుందా? చేసే పనేం లేదు కానీ ఎందుకిలా అంటుందో? టైమ్ కి ఏ పనీ చేయదు. రోజంతా ఆఫీసులో పనిచేసి వస్తే సాయంత్రం నలభై మైళ్ళ దూరంలో ఉన్న గుడికి వెళ్ళాలని ప్లాను. అక్కడ్నుంచి వచ్చేసరికి రాత్రి పదో పదకొండో అవుతుంది. మళ్ళీ పొద్దున్నే లేచి ఆఫీసుకెళ్ళవద్దూ? వీక్ డేస్ లో ఎక్కడికీ ప్రయాణాలు వద్దు అంటే, అబ్బే ఏడాదికొక్కసారే అని ముక్తాయింపు. అవును న్యూ ఇయర్ డే, సంక్రాంతి, శివరాత్రి, ఉగాదీ, రామనవమీ, కృష్ణాష్టమీ, దశరా, దీపావళీ ఏడాదికోసారి వచ్చినా అన్నింటికీ వెళ్ళేసరికి అది ఏడాదికి నలభైసార్లు అవుతోంది కాదూ? ఎప్పుడు నేర్చుకుంటుంది?

పాసెంజర్ సీట్లో అమ్మగారి ఆలోచనలు వేరు – నేనెప్పుడూ చీరా జాకెట్ మేచ్ అయ్యేయా అని చూస్తానా? మేచ్ అవ్వకుండా నీలం చీరా, పసుపు జాకెట్టూ వేసుకోవాలా? అప్పుడు అంట్లు తోమే పనిమనిషి లా ఉండదూ నా అవతారం? ఈయన వేసుకునే మట్టికొట్టుకుపోయిన జీన్ పాంటూ, వెలిసి పోయిన టి షర్ట్ గురించి ఎప్పుడైనా నేనేమైనా అన్నానా? అయినా వీడంతే, మొన్నోమాటు పదిన్నరకి రడీ అవమంటే, తాను బాత్రూంలో ఉండగానే పది అయినప్పటినుండీ అరుపులు. అంతకుముందు గుడికి బయల్దేరుతుంటే దారిలో అరిటిపళ్ళు కొనడానికి ఆపమన్నాననీ, అరగంట లేటుగా బయల్దేరాననీ, మరో గోల. ఉత్తిచేతుల్తోనా గుడికి వెళ్ళేది? అదీ శివరాత్రి నాడు! రోజూ ఎలాగా కుదిరేదు లేదు, ఏదో గుడికెళ్ళేటప్పుడైనా కట్టుకుందాం అని పట్టుచీర కట్టుకునేసరికి కొంచెం లేటయింది సరే; ఇంతలోనే కేకలు ఇంకా రడీ అవ్వలేదని. దానికిముందు, వాల్ మార్ట్ లో మొహానికి రాసుకోవడానికి కొన్న క్రీమ్ మీద ముప్ఫై డాలర్లు ఖర్చుపెట్టేసానని గోల. ఇదెక్కడి విచిత్రం! ఇవన్నీ కొనకూడదు, డబ్బులైపోతాయ్! మళ్ళీ రాత్రి పడకమీదకి చేరేసరికి తాను ఊర్వశిలా కనిపించాలి అయ్యగారికి.

తిరుగు ప్రయాణంలో ముక్కుమీద కోపంతో ఇద్దరికీ మాటల్లేకుండా స్నోలో కారు మెల్లిగా ఈడ్చుకుంటూ అపార్ట్ మెంట్ దగ్గిరకొచ్చేసరికి కారు పార్క్ చేసే చోట మంచు బాగా పడి ఉంది. అసలే రాత్రి దాదాపు పది కావొస్తోంది ఎవరూ లేరు ఏరియాలో. కారు అక్కడే ఆపి రమ్యని దిగి లోపలకి వెళ్లమన్నాడు రమేష్. అపార్ట్ మెంట్ ఎంట్రన్స్ కి దగ్గిరగా ఆపమని అమ్మగారి ఆర్డర్ – చలిలో నడవడం ఓ

కష్టం, పట్టుచీర పాడైతే అది మరో కష్టం కాదూ? అసలే ఈ మంచులో కారు కదలక చస్తూంటే ఇదేమిటని మరో చిన్న గొడవ. అక్కడే కార్లో ఒకరి మీద ఒకరు అరుచుకున్నాక, కారు ఎంట్రన్స్ దగ్గిరగా ఆపినప్పుడు అమ్మగారి మొహంలో కనీకనపడని చిరునవ్వుతో కూడిన విజయ గర్వం.

రమ్య కారు తలుపు తీసి స్నో లో నిలదొక్కుని మెల్లిగా నడుచుకుంటూ లోపలకి వెళ్ళి గుమ్మం దగ్గిరే ఆగింది రమేష్ రావడం కోసం. మరో పదీ పదిహేను నిముషాలు కారు అటూ ఇటూ కదపడానికి ట్రై చేసి కార్లో ఉన్న చిన్న బ్రష్ తో స్నో తుడిచి కష్టపడ్డాక మొత్తానికి పార్కింగ్ లాట్ లో బండి పెట్టి బయటకి దిగేడు రమేష్. అసలే రమ్య మీద కోపం, ఇప్పుడీ స్నో వల్ల చేతులు, కాలి వేళ్ళూ బిగుసుకుపోయి స్పర్శ తెలియనట్టు ఉంది. తలుపు లాక్ చేసి నాలుగడుగులు వేసాడో లేదో జర్రున జరాడు స్నోమీద. కింద పడిన రమేష్ కి దవడమీద కొంచెం రక్తం, కలుక్కుమని నెప్పి.

గుమ్మం దగ్గర నుంచి చూస్తున్న రమ్య గమనించింది కాబోలు, వెంటనే కారు దగ్గిరకొచ్చింది. మొత్తానికిద్దరూ ఒకరి చేయి ఒకరు పట్టుకుని స్నో లో మరోసారి కిందపడకుండా ఇంట్లోకెళ్ళి అద్దంలో రమేష్ మొహం చూసేసరికి కొంచెం వాపూ చిన్నగా గీరుకుపోయిన గడ్డం. వెంకట్ కి తామిద్దరూ ఇంటికి చేరినట్టు ఫోన్ చేసి చెప్పాక ఇంతకుముందున్న కోపతాపాలు మర్చిపోయి బట్టలు మార్చుకుని వెచ్చగా పడక మీదకి చేరారు; పడుతున్న స్నోకీ, మొహం మీద దెబ్బ కీ ధన్యవాదాలు చెప్పుకోవాల్సిందే. ఈ రెండూ లేకపోతే ఎడమొహం పెడమొహంలా ఉండేది కదా ఇద్దరికీను?

ఎవరెలా పోయినా తనకేం పట్టనట్టూ స్నో తుఫాను 'నైఫ్' మాత్రం మంచు అలా కురిపిస్తూనే ఉంది.

మర్నాడు పొద్దున్న రమేష్ వాచిన మొహం చూసి ఎమర్జన్సీ కి వెళ్దాం అని రమ్య అంటే అప్పుడు తెలిసిన విషయాల ప్రకారం మరో నాలుగు రోజులదాకా స్నో వల్ల ఎటువంటి ప్రయాణం కుదరదు; మామూలు జనాలకే కాదు, ఆఖరికి ఏంబులెన్స్ లు కూడా రోడ్డుమీదకి రాలేవు. డాక్టర్లు కానీ డెంటిస్ట్ లు కానీ ఎవరూ ఆఫీసులు తీయరు. ఎవరి పాట్లు వాళ్ళు పడవల్సిందే. ఇంట్లో ఉన్న మందుల్తో నెప్పి తగ్గినా వాపు తగ్గలేదు. లోపల ఏదో ఎముక విరిగిందేమో? మరో నాలుగు రోజులు ఎనిమిది గంటలకోసారి టైలెనాల్ వేసుకుంటూ, నోరు విప్పలేకా తిండి తినలేకా, మాట సరిగ్గా మాట్లాడలేకా గడిపాక అప్పుడు తెరిపిచ్చింది నైఫ్; అదీ ఎనభై అంగుళాల స్నో గుమ్మరించి. ఆ ఏడడుగుల స్నో తీయడానికి మరో రెండో, మూడో రోజులు. ఆఫీసుకి శెలవు పెట్టి హాస్పిటల్లో చూపించుకుని కొన్నికుట్లూ, మరో వాయి మందులూ, నోట్లో దాదాపు ఊడబోయిన రెండు దంతాల రిపేర్లూ, ఓ మూడు వందల డాలర్లూ సమర్పించుకున్నాక ఇంటికొచ్చేరు. రాబోయే హాస్పిటల్, మెడికల్, డెంటల్, డాక్టర్ల బిల్స్ తీరిగ్గా వడ్డించబోయేది వేరే. అవి త్వరలోనే విడుదల! వేచి చూడండి, బిల్లు రాగానే దయచేసి వెంటనే డబ్బు చెల్లించడం మర్చిపోకండేం?

ఇన్ని రోజుల్లోనూ రమ్య దగ్గిరుండి చూసుకుంది రమేష్ ని. అమ్మగారిని కసురుకున్నందుకూ, ఆవిడ మీద కోపం చూపించినందుకూ, తనని ఇన్ని రోజులూ కనిపెట్టుకుని ఉన్నందుకూ రమేష్ కి కాస్త సంతాపం, కృతజ్ఞత, సంతోషం, వగైరా, వగైరా మనసులో. అంతా సర్దుకున్నాక రమ్య నవ్వుతూ అంది, "నేను కారు, ఎంట్రన్స్ దగ్గిర ఆపమన్నాననీ, డిన్నర్ పార్టీలో వాళ్ళతో ఏదో అన్నాననీ కోపం వచ్చి అది స్నో మీద చూపించ పోయి కింద పడ్డారు. లేకపోతే హాయిగా ప్రతీరోజూ ఈ స్నో చూస్తూ వేడి వేడి పకోడీలు తింటూ మజా మజాగా ఉండేవాళ్ళం కదా? ఎక్కడకైనా వెళ్ళడానికి నేను రడీ అవుతున్నప్పుడు కాస్త లేట్ అయినా నిదానమే ప్రధానం. ఇప్పటికైనా తెలిసిందా?"

"తెలిసింది కానీ, ఈ విషయంలో నిదానం పనికిరాదు డియర్!" రెండు చేతుల్తో రమ్యని దగ్గిరకి లాక్కుని చుట్టేస్తూ చెప్పేడు రమేష్.

నీతి - పట్టుచీర కట్టుకున్నఅమ్మగారి కూడా పార్టీకి వెళ్ళినప్పుడు కోపం తెచ్చుకుంటే పళ్ళు రాల్తాయి, లేకపోతే కరకరలాడే వేడివేడి పకోడీలు తినొచ్చు.

# శ్రీనివాస కల్యాణం

**శనివారం** పొద్దున్న ఇడ్లీలు తింటూ ఈమెయిల్ చూస్తున్నప్పుడు మొదటగా కనిపించినది – స్థానిక గుడి సెక్రటరీ వెంకటేశ్వర్రావు పంపిన ఈమెయిల్. వచ్చిన కొత్త ఈమెయిళ్లలో ఇది నాలుగోదో అయిదోదో అయితే చూడకుండా ట్రాష్ లోకి పారేసేవాడే రాంబాబు కానీ ఇదే అన్నింటికన్నా పైన మొదటిది అవడం వల్ల రీడింగ్ పేన్ లో పూర్తిగా కనిపిస్తోంది దాని పూర్తి సారాంశం. "వచ్చేనెల శనివారం 26 తారీఖున గుడిలో శ్రీనివాస కల్యాణం తలపెట్టారు. అందరూ వచ్చి యధావిధిగా తలో చేయి వేయాలి. దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలే, ఆహ్వానితులే. వచ్చే 13 తారీఖులోపు ఫలానా శర్మగారికి కానీ, మరో అవధానుల గారికీ ఫోన్ చేస్తే మీరు ఎలా సహాయపడవచ్చో చెప్తారు. మర్చిపోకుండా తప్పకుండా వచ్చి ఈ కల్యాణం జయప్రదం చేయాలి." ఈమెయిల్లో కిందనా పైనా శంఖ చక్రాలు చేత్తో పుచ్చుకుని 'వస్తున్నావా?' అని చిలిపిగా నవ్వుతూ అడుగుతున్నట్టూ అయ్యవారి బొమ్మా, నిత్య కల్యాణ పచ్చతోరణానికి పక్కనే ఆయన ఇల్లాలి బొమ్మాను. మరికాస్త కిందన శర్మగారి, అవధాన్లు గార్ల ఫోన్ నెంబర్లు, ఊరి పటేల్ స్టోర్ వారి నెలవారీ ఎడ్వర్టైజ్ మెంటూను. మరి, మినప పప్పు అనడానికి మనకి నామోషీ కనక – ఉరద్ దాల్ లేకపోతే గోటా అనేదానికీ, దొండకాయలకీ, బెండకాయలకీ డిస్కౌంట్ వారం వారం మారుతుంది కదా? వచ్చి నన్నూ నా బిజినెస్ నీ పండించడోహో అనడం కంటే చవగ్గా అమ్ముతున్నాం రండి అనడం నయం కాదూ? ఇంకా బాగా కిందన ఇటువంటి ఈమెయిల్స్ మీకు అక్కర్లేకపోతే ఎలా వదిలించుకోవచ్చో అనే విషయం; దానికి ఫలానా చోట ఎలకని క్లిక్ అనిపించండి.

మరోసారి మెయిల్ పైకి వెళ్ళి మొదట నుంచీ చదివితే తెల్సినదేమిటంటే, ఈ కల్యాణం – ఫలనా వారు చేయిస్తున్నారు. వాళ్ళు దేవుడికి కొత్తగా నగలు కొన్నారుట. ప్రత్యేక విషయం ఏమిటంటే గుడి కట్టి ఇప్పటికి దాదాపు పదిహేనేళ్ళయినా ఇప్పటివరకూ శిఖరం పెట్టడానికి కుదరకపోవడం. ప్రస్తుతం దేశీయ జనభా ఎక్కువైయ్యారు కదా, అందువల్ల శిఖరం, గుడి పక్కనే ఉన్న కొంత ఏరియాలో మరో పెద్ద కల్చరల్ హాలూ అవీ కట్టాలి – పండగలకీ, పబ్బాలకీ వచ్చే జనాభాని తట్టుకోవడానికి. రాబోయే రోజుల్లో కట్టబోయే గుడి శిఖరానికి డబ్బుల కోసం తెలుగు వాళ్ళు అందరూ కలిసి ఇలా కల్యాణం చేయిస్తున్నారు. తమిళ తంబిలూ, కేరళా అన్నలూ వేరే ఇస్తున్నారు గుడి శిఖరానికి. తెలుగు వాళ్ళం మనం వెనకబడిపోతున్నాం ఈ విషయంలో. అందువల్ల తమరు – ఇక్కడ ఈమెయిల్ సరిగ్గా ప్రోగ్రాం చేసినట్టున్నారు, రాంబాబు గారు అనే పేరు పూర్తిగా పడింది కూడా – దయచేసి వచ్చి చేతికి ఎముక లేకుండా ఝూడించాలి.

కాసేపు ఈమెయిల్, మిగతా వెబ్ సైట్లూ చూసి ప్రపంచంలో ఎక్కడ ఎంత మంది పోయారో, దేశ విదేశాల అధ్యక్షులు రోజూ వేసే విసుర్ల నిర్వాకం, ఇండియా క్రికెట్ టీమ్ ఎక్కడ, ఏ దేశంలో ఆడుతున్నా కావాల్సినప్పుడు మాత్రం 300 కన్నా ఎక్కువ స్కోర్ చేయలేకపోవడం, మన వాళ్ళింతే అనుకోవడం, కాసేపు ఫేసు బుక్కూ, అందులో బొమ్మలూ అనే నాస్టాల్జియా అయ్యేక కంప్యూటర్ కట్టేసి లేచేడు రాంబాబు. మధ్యాహ్నం భోజనం చేస్తూంటే గీతతో చెప్పేడు పొద్దున వచ్చిన శ్రీనివాస కల్యాణం మెయిల్ సంగతి. ఇంకా టైమ్ ఉంది కనక అవధాన్లు గార్ని అడుగుదాం ఏమంటారో.

మెయిల్ వచ్చిననాడే ఫోన్ చేసేస్తే అంత బాగోదు కనక మర్నాడు ఆదివారం ఫలానా అవధాన్లు గారికి ఫోన్ చేస్తే తెలిసినదేమంటే, రెండేళ్ల క్రితమే ఈ ఊరు వచ్చిన రాంబాబు గుడికి సంబంధించినంతవరకూ "అ-తి ము-ఖ్య-మై-న" వ్యక్తి, కల్యాణానికి వచ్చితీరాలి; రాదంటే ఒప్పుకునేది లేదు. వచ్చేటప్పుడు తప్పకుండా పులిహోర తీసుకురావాల్సిందే. గుడి శిఖరానికి అయిదువందలు ఇస్తే గోడ ఇటుక ముక్క మీద రాంబాబు పేరు, అందరికీ కనిపించేలా రాస్తారు. వచ్చేరోజు దయచేసి చెక్కు బుక్కు పట్టుకురండి. పులిహోర దాకా బాగానే ఉన్నా మిగతాది విన్నాక ఫోన్ పెట్టేసి ఆయన్ని వదిలించుకోవడానికి మరో ఇరవై నిముషాలు పట్టింది రాంబాబుకి. ఆయన మాట్లాడుతూంటే తన ఎనిమిదేళ్ళ రెండో కూతురు ఏడుస్తోందనీ, దానికో క్లాస్ ఉందనీ, బయటకి వెళ్ళాలనీ అబద్ధం ఆడాల్సివచ్చిందంటే అది అవధాన్లు గారి నస తప్ప రాంబాబు తప్పుకాదు.

రాంబాబుకి ఉన్న గోల వేరు. గుడికి వెళ్తే పొద్దున్న పదింటిలోపు వెళ్ళాలి – అయ్యవారి కల్యాణం పన్నెండులోపుల అవుతుందన్నారు కానీ, పూర్తయ్యేసరికి ఒంటిగంట అవ్వొచ్చు. ఆ తర్వాత పెళ్ళి భోజనాలు అయ్యేసరికి మూడు అవడం గ్యారంటీ. అదలా ఉంచితే అమ్మాయిలనిద్దర్నీ పొద్దున్నే లేపి స్నానాలు చేయించి పట్టు పరికిణీలు తొడిగి తయారయ్యేసరికి పదిలోపున కుదురుతుందా? అదీకాక వెళ్ళేటప్పుడు ఏ పులిహోరో, దధ్ధోజనమో మరోటో పట్టుకెళ్లకపోతే ఎలా? గీత పొద్దున్నే లేచి ఈ పులిహోర చేయడానికి కూర్చున్నప్పుడు దాంట్లో కలపడానికి ఇది లేదనీ అది కొనలేదనీ తనమీద వేసే విసుర్లు వేరు. అవన్నీ తట్టుకుని వెళ్తే, పొద్దున్నే ఏదో తిని బయల్దేరినా, ఒంటిగంట దాకా పిల్లలని తిండి లేకుండా ఉంచగలడా? 'డాడ్ ఆకలి' అంటూ చంపేయరూ? ఎలాగోలా ఆగినా ఆ పులిహోర, దధ్ధోజనం చెరో చెంచాడూ తిని యాక్ అనేస్తే? అసలే దేశీ జనాభా ఎక్కువౌతోందని అన్నారు కనక తిండికి లైన్లో నుంచుంటే అసలు తన వంతు వచ్చేసరికి ఏమైనా మిగుల్తుందా? ఇంతా చేస్తే ఈ గోలలో తాను ఈ కల్యాణంలో 'శ్రీదేవి వంకకు చిలిపిగా చూడకూ, అలమేలుమంగకూ అలుక రానీయకూ' అనే శ్రీనివాసుడికేసి భక్తితో చూడడానికైనా సమయం చిక్కుతుందా? పోనీ వెళ్ళకుండా ఉందామా అంటే అసలే దేవుడి కల్యాణం; అందులోనూ అవధాన్లు గారు వచ్చితీరాలన్నారు.

ఎలాగైతేనేం, 26 తారీఖు శనివారం పొద్దున్నే పిల్లలిద్దర్నీ తయారు చేసి అందరూ ఎంగిలిపడిన తర్వాత గీత తయారు చేసిన పులిహోర జాగ్రత్తగా కారులో పెట్టి బయల్దేరేసరికి పది దాటుతోంది. వెళ్లడానికి మరో నలభై నిముషాలు. వెనక్కి వచ్చాక వంటింట్లో పులిహోర చేసిన సామాను అదీ కడుక్కోవడం తర్వాత సంగతి. ఈ ప్రహసనంలో రాంబాబుకి అనిపించిన సంగతి – ఏ ఇండియన్ రెస్టారెంట్లో భోజనానికి వెళ్ళినా ఇంతకన్నా చవకే. ఇదే మాట గీతతో అంటే ఆవిడ ఆ మాత్రం తెలిసినట్టూ, ఓ వంకర నవ్వు నవ్వి, 'అపచారం, అపచారం' అంది. గుడికి చేరేసరికి పదకొండు. నలుగురితోపాటు నారాయణా అనుకుంటూ తాము పట్టుకొచ్చిన పులిహోర బేసిన్ పూజారి గారికి దగ్గర్లో, ప్రసాదం ఉన్న చోట పెట్టి ఓ చివర కూర్చున్నాడు రాంబాబు కుటుంబంతో. కల్యాణానికి టికెట్ 25 డాలర్లు పెట్టేరుట, అది అప్పటికప్పుడు చెప్పాక తప్పదు కదా? ముందే చెప్తే ఎవరూ రారు రాంబాబూ ఆ మాత్రం తెలియకపోతే ఎలా? కేష్ లేకపోయినా ఏం ఫర్వాలేదు, గుడి లో అంతా హైటెక్! క్రెడిట్ కార్డు తీసుకుంటారు. అది కొన్నాక కాసేపు మౌనం, శ్రీనివాసుడి మీద మనసు లగ్నం చేద్దామనుకునేలోపుల చిన్న అమ్మాయి డాడ్ అంటూ చిటికెన వేలు చూపించింది రాంబాబుకి. హతోస్మి అనుకుంటూ లేచి దాన్ని బయటకి తీసుకెళ్ళబోయేసరికి పిల్లలు ఇద్దరూ తయారు. వెనక్కొచ్చేస్తూంటే మళ్ళీ అవధాన్లు గారు తగులుకుని ఇవ్వాల్సిన 500 డాలర్ల చెక్కు గురించి గుర్తు చేసాడు. ఆయన్ని తప్పించుకోవడానికి నవ్వుకుంటూ 'కల్యాణం అయిన తర్వాత చూద్దాం' అని వచ్చేసాడు రాంబాబు.

ఒంటిగంట అవుతుంటే పెళ్ళి పూర్తైంది. తర్వాత పూజారిగారి స్పెషల్ దీవెనలు నగలు కొనిచ్చిన దంపతులమీద, కల్యాణం కోసం 25 డాలర్ల టికెట్ కొన్నవారి మీదాను. శ్రీనివాసుడికి మిగతా అలగా జనంకేసి చూడ్డానికి ఇప్పుడు తీరికలేదు, మళ్ళీ తర్వాత ఎప్పుడైనా వీలు

చూసుకుని రండి. ఈ లోపుల వాలంటీర్లు ప్రసాదం హాల్ లోకి చేరుస్తూంటే, ఆకలి నక నకలాడుతోంది అందరికీను. ఇంక ప్రసాదం తినడానికి వెళ్ళొచ్చు అనుకునే లోపుల అర్జెంటుగా గుడి అధ్యక్షులవారి పదే పది నిముషాలంటూ – అరగంట ప్రసంగం. విషయం అందరికీ బాగా తెల్సినదే. వచ్చిన వ్యక్తులందరూ కూడా రాంబాబు లాగానే "అతి ముఖ్యమైన వారు." గుడి శిఖరానికీ, కట్టుబడికీ డొనేషన్ ఇవ్వాలి. అసలే ఆకలితో ఉన్న పిల్లలు చేతులు లాగుతూంటే రాంబాబుకి అనిపించిన విషయం – "ఇప్పుడే ప్రసాదం తినడానికి ముందు ఇలా అందర్నీ బలవంతంగా కూర్చోబెట్టి చెప్పడం దేనికీ?" మరోసారి కామన్ సెన్స్ రాంబాబూ, ఓ సారి ప్రసాదం తినడానికి వెళ్ళిపోతే ఈయన మాట్లాడేది వినడానికి ఎవరూ ఉండరు.

ఇచ్చిన అర్టిపండో, అవి అయిపోతే మిగిలిన రెండు బాదం పలుకులో చేత్తో పట్టుకుని ప్రసాదం హాల్లోకి వచ్చేసరికి రాంబాబుకి మరో ఆశ్చర్యం. ప్రసాదం ప్లేటుకి రెండు డాలర్లు మాత్రమే! తామందర్నీ అడిగి మరీ తీసుకురమ్మని చెప్పిన బేసిన్ లో పులిహోరా, దద్ధోజనం గుడివారు తమకే తిరిగి ప్లేట్ రెండు డాలర్లకి అమ్ముకుంటూ గుడికి డబ్బులు పోగేయాల్సినంత అధ్వాన్నంగా ఉందా గుడి డబ్బుల వ్యవహారం? గుడికి అందరూ ప్రసాదం పట్టుకొస్తే అది అందరికీ ఉచితంగా పంచుతారు కదా? ఒక్కసారి ఒళ్ళు మండుకొచ్చి, 'వెళ్ళి అడుగుతా ఇదేం పనో' అని గొంతు ఎత్తబోయిన రాంబాబుని వారించింది గీత.

"దారుణం, మనం తెచ్చిన పులిహోర మనకే అమ్ముతున్నారు. తెచ్చిన పులిహోర ఇక్కడిచ్చేసి ఖాళీ బేసిన్ తీసుకుని పోదాం, ఈ బేరసారాల వల్ల నాకు ఇక్కడేమీ తినాలని లేదు," కోపంగా అన్నాడు రాంబాబు.

అలా అడగడం బాగోదు కనక లైన్ లో నుంచుని మొహమాటానికి రెండు ప్లేట్లు ప్రసాదం కొని పట్టుకొచ్చింది గీత. తలో ప్లేట్ లో నాలుగు చెంచాలు ప్రసాదం మాత్రమే ఇచ్చారు గుడి కమిటీ వాలంటీర్లు. మరో కామన్ సెన్స్ రాంబాబూ, ఎన్ని ప్లేట్లు అమ్మితే అన్ని డబ్బులు. పిల్లలిద్దరికీ తలో ప్లేట్ తినడానికి ఇచ్చాక కాసేపు కూర్చుని ఖాళీ కడుపుతో, ఖాళీ అయిన తమ బేసిన్, పట్టుకుని బయటకొచ్చాడు రాంబాబు.

గుడిలోంచి బయటకి రాబోతూంటే గీత బాత్రూం లోకి దూరినప్పుడు అవధాన్లు మరోసారి తగులుకున్నాడు రాంబాబుని 500 డాలర్ల చెక్కుకి. ఈ సారి రాంబాబు మొహమాటం వదిలేసి విసురుగా చెప్పేడు 'నేను పైసా ఇవ్వను,' అంటూ.

ఆశ్చర్యంగా చూస్తున్న అవధాన్లుతో రాంబాబు చెప్పేడు, "కల్యాణం అని పిలిచారు, ప్రసాదం వండి తెమ్మన్నారు, అన్నీ ఒప్పుకున్నాక మేము తెచ్చిన ప్రసాదం మాకే అమ్మడం ఏవిటీ? ఇదేమైనా కూర్ల సంతా, అమ్ముకోవడానికీ కొనుక్కోవడానికీను? ఇందులో మళ్ళీ వాళ్ళు ఇది ఇచ్చారనీ, అది ఇచ్చారనీ ఊదరగొడుతూ మీరు ఇంత, మీరు అంతా అంటూ అడుగుతున్నారు. అసలు ప్రసాదం గురించి కాదు కానీ పిల్లల్ని కూడా దాదాపు రెండింటి దాకా ఖాళీ కడుపుల్తో కూర్చోబెట్టారు. తీరా చేసి బయటకొస్తే మేము తీసుకొచ్చిన పులిహోర, దద్ధోజనంలో మీ వాలంటీర్లకీ, అధ్యక్షులవారికీ కావాల్సిన ప్రసాదం ముందు తీసేసి వేరేగా దాచుకుని మిగిలినవి – అవీ మేం తెచ్చినవే, మాకే నాలుగు చెంచాలు పెట్టడానికి రెండేసి డాలర్లు వసూలు చేస్తున్నారు. డబ్బులు ఎంత కలెక్ట్ చేసామన్న గోలే తప్ప ఈ కల్యాణంలో ఏమిటి మీరు చేసినది? చేసే పనులకి సిగ్గూ, లజ్జా ఉండొద్దూ?"

"మీరు 500 డాలర్లు ఇస్తే ఇటుక మీద పేరు రాస్తాం, మీ పేరు శాశ్వతంగా ఉంటుంది ఈ గోడ మీద, ఈ ప్రసాదం అలా అమ్ముతున్నారని నాకూ తెలియదు. నా కూడా వస్తే కిందన మీకందరికీ ఫ్రీగా ప్రసాదం ఇప్పిస్తా," వెర్రిమొహం, దాని మీద పిచ్చి నవ్వు ఒకటి పులిమి తనకి ఏం తెలియనట్టూ చెప్పేడు అవధాన్లు.

"అటువంటి స్పెషల్ ప్రసాదం — అందరూ లైన్లో నుంచుని కొనుక్కుంటూంటే మీకూడా వచ్చి తీసుకోమంటారా, వద్దులెండి, గుడి గోడ మీద నాపేరు అనవసరం. నేను వచ్చినది గోడమీద పేరు రాయించుకోవడానికీ కాదు, ప్రసాదం కోసమూ కాదు; ప్రసాదంగా ఇచ్చిన ఆ రెండు బాదం పలుకులే చాలు. నాకేం తెలియదు అని నాటకాలు ఆడకండి; మంచి గుణపాఠం నేర్పారు కల్యాణం పేరుతో," పిల్లల చేతులు పట్టుకుని రాంబాబు బయటకి నడవబోయేడు.

రాంబాబు ఇలా తెగేసి చెప్పేసరికి అవధానులు మరో చేపకి ఎర వేయడానికి కదులుతుంటే, బాత్రూం లోంచి బయటకి వచ్చిన గీత వెర్రి మొహంతో ఉన్న అవధాన్లునీ, గుడి గుమ్మం దగ్గిర తనకోసం నించున్న రాంబాబునీ చూస్తూ అడిగింది, "ఆయన ఏమన్నాడు, ఏమయింది? వెళ్దామా?"

రాంబాబు ఏమీ మాట్లాడకుండా, సరే అన్నట్టూ తల ఊపి పిల్లల్తో ముందుకి నడిచేడు.

బండి స్టార్ట్ చేసి కదిలేటప్పుడు గుడి పక్క గోడకి ఉన్న కిటికీ అద్దంలోంచి బయటకి కనిపించే శ్రీనివాసుడికి నమస్కారం పెట్టుకుందామని చూసిన రాంబాబుకి ఎప్పట్లాగానే చిరునవ్వు ఒలికిస్తూ, 'ఇందులో నాదేం లేదు సుమా' అంటున్నట్టూ శ్రీనివాసుడి నవ్వు మొహం కనిపించింది.

చిరునవ్వు మొహం మీద కదులాడుతూంటే ఏక్సిలెరేటర్ నొక్కి బండి ముందుకి పోనిచ్చేడు, పాపం రాంబాబు.

*నీతి - గుడి కమిటీ, అధ్యక్షుల వారి బేరసారాలకీ, దేవుడి కల్యాణానికీ, దేవుడిచ్చే దీవెనలకీ అస్సలు సంబంధం లేదు.*

# శ్రావణమాసం నోము

**సాయంత్రం** ఆఫీసునుంచి ఇంటికొస్తూంటే దారిలో ట్రాఫిక్ స్థంభించినప్పుడు సెల్ ఫోను మోగింది. ఫోన్ ని కారులో ఉన్న బ్లూ టూత్ తో కలిపేడు కనక, కూర్చున్న చోటినుంచి అంగుళం కదలకుండా, డాష్ బోర్డ్ కేసి చూసేడు సురేష్. చేసేది ఇంటావిడే — ఎల్లుండి శుక్రవారం శెలవు పెట్టిందిట, శ్రావణమాసం మొదటి శుక్రవారం కనకా, ఆ రోజు వర లక్ష్మీ వ్రతం పూజ కనకాను. దారిలో ఆగి పువ్వులూ, పళ్ళూ, కొబ్బరికాయా, నానబోయడానికి ముత్తైదువలకి ఇచ్చే శనగలు తెచ్చిపెట్టాలి. సురేష్ కూడా శుక్రవారం శెలవు పెడితే మంచిది. పిల్లల్ని స్కూల్లో దింపడానికీ, దివ్య పూజ చేసుకుంటున్నప్పుడు ఏదైనా కావాలిస్తే అందించడానికీను. అక్కడితో అయినా బావుణ్ణు, కానీ సాయంత్రం శాన్ డియాగోలో ఉన్న స్నేహితురాలు నోముకి పిలిచింది, మరీ అంత దగ్గిర కాదు కానీ ముత్తైదువ పిలిస్తే వెళ్లకపోతే బాగుండదు కదా? అసలే మొదటి శ్రావణ శుక్రవారం.

కాసేపు ఇదంతా విన్నాక ట్రాఫిక్ కదులుతోందని చెప్పి ఫోన్ కట్టేసాడు సురేష్. ఈవిడ శ్రావణమాసం నోము కాదు కానీ తన దుంప తెగేలా ఉంది ఈ శుక్రవారం. పొద్దున్న ఏడింటికి శాంతా మోనికా ఇంట్లో బయల్దేరితే అరవై, డభ్భై మైళ్ళ దూరం రివర్ సైడ్ లో ఉన్న ఆఫీసుకి చేరడానికి రెండు గంటలు పడుతోంది, ఎంత హైవే మీద, కారు మరొకరితో షేర్ చేసుకుని వెళ్ళినా ఈ జనారణ్యంలోంచి బయటపడేసరికి. వెనక్కి వచ్చేటప్పుడు మళ్ళీ ఇదే గొడవ. ఎప్పుడైనా ఆఫీసులో అయ్యవారు కరుణిస్తే ఇంట్లోంచి పనిచేసుకోవచ్చు. ఏ మీటింగో, ఆడిటింగో, తాము అమ్మే సాఫ్ట్ వేర్ డిప్లాయ్ మెంటో ఉన్నరోజున అడగడం కూడా వేస్టు. చటుక్కున ఫోన్ తీసి శుక్రవారం ఏదైనా ఉందేమో అని చూసేడు.

అదృష్టం, ఏమీ లేవు. పొద్దున్న దివ్య ప్రసాదం, మహా నైవేద్యం అవీ చేసి పూజ మొదలుపెట్టేసరికే పది దాటొచ్చు. టేప్ రికార్డర్ లోనో యూ–ట్యూబ్ లోనో ఉన్న ఆడియో/వీడియో మంత్రాలు వింటూ లక్ష్మీపూజ అయ్యేసరికి పన్నెండు దాటడం ఖాయం. ఆ రోజుకి ఇంట్లోంచి పని చేస్తానని అడిగితే? ఎందుకొచ్చిన గోల, ఓ రోజు శెలవు పారేస్తే పోలే?

మరో అరగంటకి పటేల్ స్టోర్ ఉండే దారికి బండి మళ్ళించి దిగేడు సురేష్. కొనాల్సిన లిస్ట్ లో కొబ్బరికాయ మాత్రం పటేల్ స్టోర్ లో లేదు. ఏ వాల్ మార్ట్ లోనో మరో చోటో చూడాలి. మరో అరగంట రెండు మూడు షాపుల్లో గాలించి మొత్తానికి తాగడానికి అమ్మే తొక్క తీసేసిన కొబ్బరిబొండం ఒకటి సంపాదించాడు. కాయ కొనడం లో ఉండే బాధలు వేరు. అది కొట్టాక కుళ్ళిపోయి ఉంటే? బొండం అయితే ఎలాగోలా తొక్కతీస్తే లేత కాయ కనక ఏదో అమ్మవారికి కుళ్ళిపోయిన కాయ కొట్టలేదనే తృప్తి. ఇంటికొచ్చేసరికి దాదాపు ఎనిమిదిన్నరవుతోంది.

దివ్య శనగలు నానబోసి వచ్చాక భోజనం అయిందనిపించేసరికి దాదాపు పదకొండు. అప్పుడు చెప్పిన విషయం, శాన్ డియాగో నుంచి పిలిచిన ముత్తైదువ గారు దివ్య కి మేమమామ తమ్ముడి కొడుకు బావమరిది తోడల్లుడి భార్యే! అంటే సురేష్ కి కూడా వరసకి తమ్ముడో, ఏదో, ఏదనుకుంటే అదే అవుతాడు. ఎంతైనా రక్తసంబంధం కదా వెళ్ళకపోతే ఎలా?

ఈ కాకమ్మ కధలో సురేష్ కి తెలిసొచ్చిన విషయం ఏమిటంటే, తాను శుక్రవారం శెలవు పెట్టాలనే విషయం; దానికోసం దివ్య, వీళ్ళు మీకూ చుట్టాలే, మాకూ దగ్గిరవాళ్ళే' అంటూ ప్లాన్ చేయడం. ఇంత గోల ఎందుకో, నాకు వెళ్ళాలని ఉంది వెళ్దాం అంటే చాలదూ?

శాంతా మోనికా నుంచి శాన్ డియాగో వెళ్ళాలంటే దాదాపు నూట యాభై మైళ్ళు. శుక్రవారం కనక కాస్త తెరిపి ఉన్నా ఎంత లేదన్నా ముత్తైదువ గారింటికెళ్ళేసరికి మూడు గంటలు పడుతుంది – అదీ వర్షం, ఏ భూకంపం రాకుండా, ట్రాఫిక్ బాగుంటే. లేకపోతే ఎప్పుడు వెళ్తామనేది ప్రపంచంలో ఎవరికీ తెలియని చిదంబర రహస్యం. ఆ మధ్యన ఓ రోజు పొద్దున్నే ఆఫీసుకెళ్ళబోతుంటే భూకంపం వచ్చి హైవే మీద బ్రిడ్జ్ కూలిపోయి ఏ కారు ఎక్కడకి పోయిందో అవీ చూసేసరికి ప్రాణాలు పోయేయి. వారానికోసారి రిక్టర్ స్కేల్ మీద మూడూ, నాలుగుల మధ్య సర్దాగా వచ్చే భూకంపాలకే పైన పెట్టిన పచ్చడి సీసాలూ అవీ కిందపడడం మామూలే కదా? మూడింటికో నాలుగింటికో బయల్దేరితే నోము అయ్యాక వెనక్కి రావడానికి మరో మూడు గంటలు. రాత్రి పదకొండులోపున వచ్చేయగలిగితే అదృష్టమే.

"సరే నేను శెలవు పెడతాన్లే, ఆవిడ మనలని నోముకేనా లేకపోతే భోజనానికి పిల్చిందా?" అడిగేడు సురేష్.

"నోము అన్నారు; సాయంత్రం కనక భోజనం అని నేను అనుకున్నా."

"నువ్వు అనుకున్నా ఆవిడ అనుకోవద్దూ? అయినా ఆవిడ నీకు, భోజనానికి పిలిచేంత బాగా తెలుసా?"

"అంత బాగా తెలియదు. మహా అయితే బయట తినడమే, రాత్రి వచ్చేటప్పుడు."

"ఇంతోటి నోముకీ అంత దూరం వెళ్ళడం దేనికో," అందామని సురేష్ నోటిదాకా వచ్చింది కానీ, ఆ మాట అంటే దేనికి దారి తీస్తుందో తెలుసు కనక మాట్లాడకుండా టివి చూడ్డంలో నిమగ్నం అయిపోయేడు.

శెలవు పెట్టిన శుక్రవారం పొద్దున్నే పిల్లల్ని స్కూల్లో దింపి వెనక్కొచ్చాక దివ్య పూజ చేస్తూంటే ఇంటర్నెట్ మీద కాసేపు కూర్చుని, మెయిల్, న్యూస్ చూసి కట్టేసేసరికి పూజ పూర్తయింది కాబోలు, గంట వినపడి దేవుడి గదిలోకి వెళ్ళి నమస్కారం పెట్టి తొమ్మిది రకాల మహాప్రసాదం సుష్టుగా లాగించేడు. మధ్యాహ్నం పిల్లలు స్కూల్ నుంచి వెనక్కొచ్చేదాకా ఓ రెండు గంటలు హాయి.

అనుకున్న సమయానికి అమ్మగారు ఎప్పుడూ తయారవరు కనక నోముకి నానబోసిన బుట్టెడు శనగలు తలో జిప్ లాక్ బేగ్ లోనూ సర్ది బయల్దేరేసరికి మూడున్నర. ఈ లోపుల పిల్లల్ని తయారుచేసి బండి ఎక్కేలోపుల సురేష్ 'వెళ్ళేది నూట యాభై మైళ్ళు, బయల్దేరతావా ఇంక*?*' అని నూట అరవై సార్లు గొణిగాడంటే, గొణగడూ మరి*?*

రక్తసంబంధీకుల ఇల్లు చేరేసరికి దాదాపు ఆరున్నర కావొస్తూంటే ముత్తైదువలని లోపలకి పంపి సురేష్ బంధువుతో కబుర్లు మొదలుపెట్టాడు – చేసే ఉద్యోగం, ఊళ్ళో పెరిగే పెట్రోల్ ధరల దగ్గిర్నుంచి, అధ్యక్షుల వారి రోజువారీ విసుర్లూ, చివరకి ప్రతీ సినిమాలోనూ ఉండే బ్రహ్మానందం గురించీను. కాఫీ, టీలు కాదు కదా మంచి నీళ్ళు కూడా అడగకపోతే ఇచ్చే ఛాయలు లేవు ఇంట్లో ఎక్కడాను.

వచ్చిన గంటలో పనైపోయింది. ముత్తైదువలు అందరూ బొట్టు పెట్టించుకుని ఇచ్చినమ్మ వాయినం తీసుకున్న వాయినం శనగల మూటలు పట్టుకుని వెళ్ళిపోతూంటే సురేష్, దివ్యా కూడా లేచారు. ఇంటి హాల్ లో కానీ, వంటింట్లో కానీ ఏవీ వంట వండిన దాఖలాలు, వాసనలూ లేనప్పుడు భోజనానికి పిలవలేదని అర్ధంకావడానికి ఒక్కనిముషం చాలు కదా*?* "రక్త సంబంధీకులు ఏం ఊడబొడిచారో ఇప్పటికైనా తెలిసిందా*?*" బయటకొచ్చాక దివ్యని వెక్కిరించాడు సురేష్. జరిగినదంతా చూసాక, ఏమనాలో తెలియని దివ్య నోరు మెదపలేదు.

ఇంటికెళ్ళేసరికి పది దాటడం గారంటీ కనక దారిలో ఏదో ఒకటి ఎంగిలి పడడమే. పండగపూటా మాంసం వండే చేతుల్తో ముట్టేసుకున్న ఏ మెక్సికన్ చేసిన టాకోయో, బర్గెరో, మరొకటో తినడం తప్ప వేరే దారి లేదు కాబోలు. టాకో అనేసరికి పిల్లలిద్దరికీ ఒక్కసారి హుషార్ పుట్టుకొచ్చింది. దార్లో హైవే ఎక్కే ముందర ఆపి టాకోలు తింటూంటే దివ్య అడిగింది, 'శుక్రవారం ట్రాఫిక్ అంత లేదు కనక నేను డ్రైవ్ చేస్తా' అంటూ. సురేష్ కి ఇంక తప్పలేదు*;* అమ్మగారి ఆర్డరా, మజాకా*?*

బండి హైవే మీద మెత్తగా జారిపోతూంటే, పాసెంజర్ సీట్లో కూర్చున్న సురేష్ పొద్దున్న లేచినప్పటి నుంచీ ఏదో ఒక పని చేస్తున్నాడో, ఏమో, కళ్ళు మూతలు పడిపోతూ నిద్రలోకి జారిపోయేడు. పిల్లలు వెనక సీట్లో ఐ–పేడ్ ల మీద ఎప్పటిలాగానే ఆటలో, వీడియో చూడడమో.

అరగంట గడిచాక బండి బాగా స్లో అయి, ఆగుతూంటే, 'ఏమైంది*?*' అంటూ లేవబోయిన సురేష్ కి కారు వెనక కనబడిన ఎరుపు, నీలం లైట్ లు కనబడేసరికి అర్ధమైంది, ఏమయిందో*?* తర్వాత ప్రహసనం అతి సాధారణం. మొదటగా పోలీసాయన పట్టుచీర కట్టుకున్న దివ్యని చూసి ఆల్కహాల్ తాగారా అని అడుగుదామనుకుని నోట్లోంచి ఏమీ వాసన రావటం లేదు కనక స్పీడింగ్ టికెట్ చేతిలో పెట్టేడు – అమ్మగారు హైవే మీద డబ్భై మైళ్ళ లిమిట్ లో ఎనభై అయిదు వెళ్తున్నందుకు. కట్టాల్సిన ఫైన్ మూడువందల నలభై అయిదు డాలర్లు "మా–త్ర–మే." ఫలానా రోజుకి డబ్బులు కట్టేయడమో లేకపోతే వచ్చి కోర్టులో సమాధానం చెప్పుకోవడమో, మీ ఇష్టం వచ్చినది చేసుకోండి.

నీలం బట్టల పోలీసాయన వెళ్తూ మరో వార్నింగ్ ఇచ్చి వెళ్ళాడు – 'అసలే చిన్న పిల్లల్తో వెళ్తున్నారు, స్పీడింగ్ పనికిరాదు, జాగ్రత్త!' ఈ టికెట్, వార్నింగ్ విన్నాక తాను ఇంక డ్రైవింగ్ చేయనని దివ్య ఏడుపు మొహం పెట్టేసరికి సురేష్ డ్రైవర్ సీట్లోకి ఎక్కి చెప్పేడు అనునయించడానికి, 'ఆ! వీడి వార్నింగ్ సంగతి కేమిలే, నాకు తెల్సినంతలో పోలీస్ పట్టుకోనంతవరకూ, టికెట్ రానంతవరకూ ఎంత స్పీడ్ లో వెళ్ళినా నువ్వు మంచి డ్రైవర్ కిందే లెఖ్ఖ. ఒక్కొక్కప్పుడు అలా అవుతుంది. మనం ఎప్పుడో వీడికి డబ్బులు బాకీ, అది ఇలా ఇచ్చుకోవాలి.'

రాత్రి పదకొండున్నరకి ఇంటికొచ్చేసరికి కారు వెనక సీట్లో ఒళ్ళు తెలియని నిద్రలో జోగుతున్న పిల్లలిద్దర్నీ మంచం మీదకి ఎక్కించాక బట్టలు మార్చుకు వచ్చి పడుకున్నాడు సురేష్. గుడ్డికన్నా మెల్ల మేలన్నట్టూ మర్నాడు శనివారం కనక పొద్దుటే లేచే పని లేదు. తాను పెట్టిన శెలవు అలా ఉంచి మిగతావి లెక్క చూసుకుంటే, సురేష్ కి తేలిసినదేమిటంటే ఈ "శెలవు రోజు" తాను పొద్దున్న ఆరునుంచి రాత్రి పదకొండు దాకా, దాదాపు పదిహేడు గంటలు – కాలు కాలిన పిల్లిలా అలా తిరుగుతూనే ఉన్నాడు. శ్రావణ శుక్రవారం పూజ చేసినా, లక్ష్మీ కటాక్షం సంగతి అలా ఉంచితే పూజకి సంరంజామా, మూడు వందల మైళ్ళకి గాస్, టాకో బెల్ లో తిన్న తిండీ, స్పీడింగ్ టికెట్ తో కలిపి తమకి

దాదాపు నాలుగువందల యాభై డాలర్ల పైన చమురు వదిలింది జేబులోంచి. ఆలోచనలు వదుల్చుకోవడానికి తల విదిల్చి పక్కకి చూసేడు పక్కనే పడుకున్న దివ్య కేసి.

'నిమిత్తమాత్రంభవ సవ్యసాచిన్' అని తనతో అంటున్నట్టూ తలకింద చేయి పెట్టుకుని పడుకున్న అమ్మగారి మొహంలో ఏ భావమూ లేదు.

*నీతి - శ్రావణ శుక్రవారం, పూజా, పేరంటాలకి ఎంత డబ్బు ఖర్చుపెట్టి ఎన్ని మైళ్ళు డ్రైవ్ చేసినా దొరికేవి దోసెడు శనగలే*

# అబ్బాయి నచ్చాడు

**పెళ్ళి చూపులు** సాయంత్రం నాలుగున్నరకి అన్నారని మధ్యాహ్నం ఒంటిగంట నుంచీ తల్లి పోరుతోంది విమలని తెమలమని. మొహం కడుక్కుని బట్టలు మార్చుకోవడానికి అరగంట చాలదూ అని విమల ఈసడింపు. అలా కాదు తల దువ్వుకుని జడా అవీ వేసుకునేసరికి నాలుగైపోతుందని ఆవిడ గోల. ఇద్దరికీ గొడవ ఎలాగా తెమిలేది కాదు కనక మూడింటికి చదివే నవల చేతిలోంచి లాక్కున్నప్పుడు విమల లేచింది తయారవడానికి. ఏ చీర కట్టుకోవాలి, మెడలో, చెవులకి ఏమేం నగలూ పెట్టుకోవాలి, మొహానికేం రాసుకుని ఎలా కనిపించాలనేదాంట్లో మరో వాగ్యుద్ధం. ఇంతా తెమిలితే నాలుగున్నరకి రావాల్సిన అమెరికా అబ్బాయ్ గారి బృందానికి అప్పుడే రావడం కుదరదుట, దారిలో ఓ చోట ఎక్కడో గుడి దగ్గిర ఆగారు. అక్కడ పూజా పునస్కారాలు కానిచ్చి కొంచెం లేటుగా వస్తారు. వచ్చేది మొగ పెళ్ళివారు కనక, పొగరు అదీ తగ్గకుండా "దయచేసి" అనే మాట వాడకుండా జాగ్రత్తపడుతూ, *"ఏమనుకోకండి ఆలస్యానికి,"* అని ఫోన్ లో చెప్పారు. విమలకి మండుకొచ్చింది. ఇంత కష్టపడీ ముస్తాబు అయితే ఈయనగారు మరో గంటదాకా రాడు. వాళ్ళు వచ్చేదాకా తాను ఏం చేయాలి*?*

కాసేపు టివీ, అదీ చూసాక దాదాపు ఆరున్నరకి పెళ్ళికొడుకు, ఆయన తల్లీ తండ్రీ తో కలిపి ముగ్గురు*;* శుభకార్యాలకి ముగ్గురు బయల్దేరకూడదు కనక కూడా మరో చిన్న పదేళ్ళ అమ్మాయి, దిగారు టేక్సీలోంచి. పాత తరంలోలా మొదట వీళ్ళు ఏదో పెట్టినది తిన్నాక అమ్మాయిని తీసుకురావడం, చాపమీద కూర్చోబెట్టడం అవీ లేవు, కొత్త తరం, కొత్త రోజులూ కనక వీళ్ళు వచ్చేసరికే అందరూ హాల్ లోనే నిలబడి రండ్రండి అంటూ ఆహ్వానించేరు. మొదట పరిచయాలయ్యేక, ఫలహారాలు. అప్పుడు విమలతో అబ్బాయ్ ఒక్కడూ మాట్లాడ్డానికి పెద్దవాళ్లందర్నీ విమల నాన్నగారు ఇంటి వెనక పెరట్లోకి తీసుకెళ్ళాడు. అక్కడ ఆయన కాబోయే వియ్యంకుడితో అమెరికా ప్రెసిడెంట్ దగ్గర్నుంచి ఇండియాలో వర్షాభారం, వేసవిలో ఎండలూ, ప్రతీ సంవత్సరం ఫెయిల్ అవుతున్న పంచవర్ష ప్రణాళికల్తో సహా లోకాభిరామాయణం మాట్లాడుతూంటే విమల అమ్మ కాబోయే వియ్యపురాలిని మాటల్లో పెట్టి ఆవిడెక్కడివారో, కుల గోత్రాలూ తమ పెరట్లో పెరిగే నిమ్మచెట్టు పుట్టు పూర్వోత్తరాలు, మీ ఊర్లో ఉండే ఫలానా మాకు స్వయానా తమ్ముడి అత్తగారి పెత్తండ్రి మేనమామ, అంటూ ఏవో కబుర్లు చెప్తూ ఆవిడ మెడలో గొలుసుని బట్టీ, కట్టుకున్న పట్టుచీరా, చెవులకి పెట్టుకున్న రవ్వల దుద్దుల్ని బట్టీ ఆవిడ తాహతు, తాము వాళ్లకీ, వాళ్లకి తామూ తూగుతారో లేదో అంచనా ప్రయత్నం మొదలుపెట్టింది – కొంచెం తెలిసీ తెలియకుండా.

విమల, అభిరాం ఇద్దరూ మిగిలాక అబిరాం మొదటగా మాట్లాడుతూ అడిగేడు, *"మీరేం చదువుకున్నారండి?"*

"బియ్యే, బి.ఇ.డి." విమల చెప్పింది, అభిరాం కేసి చూస్తూ. ఈయన లావుగానే ఉన్నాడు అనుకుంటూ.

"ఏం సబ్జక్ట్ మీది? ఇంకా పైకి చదువుకుంటారా? మీకు బియ్యే, బిఇడితోపాటు నాలుగేళ్ళు కాలేజ్ చదువు ఉంది కనక అమెరికాలో మరో కాలేజీలో ఎమ్. ఎస్ లో సీటు రావొచ్చు. మీకు ఇంకా చదువుకోవాలని ఇష్టం ఉంటేనే సుమండీ!'

"అంత వరకూ ఆలోచించలేదు."

"నా అసలు పూర్తిపేరు అభిరామారావు. నేను అమెరికా వెళ్ళి నాలుగేళ్ళు అయింది. మీకు ఇంకా ఏమైనా విషయాలు కావాలిస్తే అడగండి."

"ఇండియాలో ఉన్నప్పుడు ఎక్కడ చదువుకున్నారు?"

"వరంగల్ లో బి.టెక్, ఆ తర్వాత మిషిగాన్, అమెరికాలో ఎమ్ ఎస్. చేసాను," అభిరాం మాటల్లో కొంచెం గర్వం గమనించింది విమల. అది పట్టించుకోకుండా అడిగింది,

"ఇప్పుడు మీరు చేసేది ఏం ఉద్యోగం? ఏ ఊర్లో ఉంటారు? గ్రీన్ కార్డ్ ఉందా?"

"నేను చేసేది డిట్రాయిట్ అనే చోట, ఫోర్డ్ కంపెనీలో ఇంజినీర్ ఉద్యోగం, కార్లకి ఇంజిన్ లో వాడే పార్ట్ లు ఎలా తయారుచేస్తే పెట్రోల్ ఆదా అవుతుందో అనే దానిమీద కాస్త రిసెర్చ్, కొంచెం మరో రకం పని. గ్రీన్ కార్డ్ ఇప్పిస్తాం అప్లికేషన్ పెట్టుకోండి అన్నారు అడిగితే. పెళ్ళి కాకుండా గ్రీన్ కార్డ్ వచ్చిందనుకోండి, తర్వాత భార్యకి రావడం కష్టం. అదే ముందు పెళ్ళి అయి ఉంటే ఇద్దరికీ ఒకేసారి గ్రీన్ కార్డ్ ఇస్తారు. అందువల్ల ముందు పెళ్ళి చేసుకుని వెళ్ళాక అప్లికేషన్ పెడదామని ఇలా మూడు వారాల శెలవుమీద వచ్చాను."

"మీకు సిగరెట్, బ్రాందీ తాగడం అలవాటుందా? మా ఇంట్లో ఎవరికీ లేదు అందుకని అడుగుతున్నా"

విమల వేసిన బుల్లెట్ లాంటి ప్రశ్నకి అభిరాం కొంచెం ఆశ్చర్యపోతున్నట్టూ మొహం పెట్టి చెప్పేడు, "రోజూ తాగను కానీ పార్టీలో ఎప్పుడైనా; సిగరెట్ మాత్రం అలవాటు ఉంది, మానడానికి ప్రయత్నం చేస్తున్నా."

మరి కాసేపు సినిమాలమీదా, మిగిలిన ఇంటెరెస్ట్ ల మీదా మాటలు గడిచాక విమలకి తెలిసివచ్చినదేమంటే, అభిరాం తెలుగువాడే కానీ ఆయన ఇంటెరెస్ట్ లు వేరే. తనకి నచ్చిన గాంధీగారి పుస్తకాలూ, అక్కినేని నాగేశ్వర్రావు, మేఘ సందేశం, మనవూరి పాండవులూ, భారద్దేశపు చరిత్రా అనేవాటి మీద ఈయనకి అంత ఇంటరెస్ట్ లేదు. ఆయన దృష్టిలో పెద్దవారు – తనకి నామ మాత్రంగా తెలిసిన క్లింటన్, బుష్, ఒబామా లూ, తాను ఎప్పుడూ పేరైనా వినని టామ్ హాంక్స్, టామ్ క్రూయిజ్, డెంజెల్ వాషింగ్టన్, డెమీ మూర్, టైలర్ స్విఫ్ట్ అనే పెద్దలూను. మహా అయితే గియితే ఇద్దరికీ నచ్చిన విషయాలు ఏవంటే కొన్ని బాలు పాడిన పాటలు, ఎవరూ ఎన్ని కాలాల్లో అయినా మెచ్చుకునే మాయాబజార్ సినిమా, అందులో మర్చిపోలేని సావిత్రి, ఎస్వీ రంగారావుల ఏక్షన్.

మరో పదిహేను నిముషాలు అవీ ఇవీ మాట్లాడుకుని ఇద్దరూ లేచి పెరట్లోకొచ్చేరు. కాసేపటికి మరో కప్పు టీ తాగి – కతికితే అతకదన్నారనే సామెత చెప్పుకుని బయల్దేరింది అభిరాం బృందం. ఇంటికి వెళ్ళే దారిలో తండ్రి అడిగేడు, అభిరాంని విమల నచ్చిందో లేదో.

"అమ్మాయి బాగుంది కానీ బాగా తెలివైందేమో" అనిపించింది, చెప్పేడు అభిరాం.

"అదేం, అలా అంటున్నావ్? తెలివైన అమ్మాయి అయితే మంచిదేగా?"

"మీకు ఏదైనా అడగాలని ఉందా అంటే, సిగరెట్, బ్రాందీ అలవాటుందా అంది, మరో విషయంలో తనకు తెలుగు, భారద్దేశం చరిత్రా, గాంధీగారు అంటూ చెప్పేసరికి నాకు కొంచెం చిన్నతనంగా అనిపించింది మరి, అవి నాకు అంత బాగా తెలియనందుకు."

అమ్మాయి బాగుందిరా, కుటుంబం మంచిది. ఇప్పటికే చూసిన సంబంధాలలో కొంతమందికి నువ్వు నచ్చలేదు, మిగతావాళ్ళు నీకు నచ్చలేదు. ఇంతకన్నా మంచి సంబంధం దొరకదేమో. ఏమాటకి ఆమాట చెప్పుకోవాలి, అసలే నువ్వు నల్ల బంగారానివీ, లావుగా ఉంటావు కూడా," అభిరాం తండ్రి నవ్వుతూ అంటించేడు చురక.

"ఇప్పుడు వీడికి పెళ్ళికాకపోతే మరో నాలుగో అయిదో ఏళ్ళు ఆగాలేమో," అభిరాం తల్లి చెప్పింది విమల నచ్చిందో లేదో అనే మాట నోట్లోంచి రాకుండా జాగ్రత్తపడుతూ. అలా కిందా, మీదా పడి అభిరాం చేత సరేననిపించారు తల్లీ తండ్రీ.

అభిరాం పార్టీ విమల నచ్చింది అని చెప్పాక అటువైపునుంచి సమాధానం రావడానికి మరో వారం పట్టింది. మొదట్లో ఈ పిప్పళ్ళ బస్తాని నేను చేసుకోనని భీష్మించుకు కూర్చున్న విమలని ఒప్పించడానికి. ఇదిలా ఉండగానే విమల ఇలా భీష్మించుకున్న విషయం విమల తండ్రి మధ్యవర్తితో చూచాయగా చెప్పేడు. కానీ ఇంకా పూర్తిగా అవునూ కాదూ అని చెప్పడానికి మరో కొన్ని రోజుల వ్యవధి కావాలిట. మధ్యవర్తికి మండుకొచ్చింది. అమ్మాయి మొహం ఎంత కళగా ఉంటే మాత్రం ఇంత పొగరా? అమెరికా సంబంధం తీసుకొస్తే కుర్రాడు నల్లగా, లావుగా ఉన్నాడనీ, ఇదనీ అదనీ వంకలు పెడుతున్నారే? అదే విషయం వెళ్ళి అభిరాం తండ్రి తో చెప్పేసేడు. ఈ సంబంధం కుదిరేది కాదు మరోటి చూద్దాం అంటూ. అభిరాం తండ్రికి గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టైంది. అసలే ఇప్పటివరకూ చూసిన ఏ సంబంధం కుదర్లేదు. ఇది కూడా పోతే ఎలా?

ఈ లోపుల అభిరాం బుర్ర పాడుచేసుకున్నాడు, విమల ఒప్పుకోదేమో అనీ, తనకింక తల్లీ తండ్రి చెప్పినట్టూ అమెరికా వెనక్కి వెళ్ళిపోయేలోపుల పెళ్ళే అవదేమో అనీను. మరి విమల కన్నాముందు చూసిన సంబంధాలలో ఏ ఒక్కటీ తనకి నచ్చలేదు. కొంతమందికి తాను నచ్చలేదు. విమల వద్దంటే మరోవారంలో ఇంకో సంబంధం చూడ్డానికి తీరికలేదు. ఉన్నా పెళ్ళికి సమయం లేదు. మరెలా? తా వలచిన ఏదో ఒక రంభ తనని వద్దంటే?

అయితే ఆ పై వారానికి ఎవరెంత చెప్పినా అభిరాంతో పెళ్ళికి ఒప్పుకోని విమల, ఆవిడ అమ్మతో "ఏకాంతంగా" మాట్లాడాక సరే అనేసింది అందరికీ ఆశ్చర్యం కలిగేలా. విమల తండ్రికి ఆవిడ ఏమి మంత్రం వేసిందో తెలియదు కానీ విమల పెళ్ళి అయిపోతున్నందుకు సంతోషమే. మళ్ళీ మధ్యవర్తితో కబురుపెట్టించాక ఆయన కొంచెం గింజుకున్నా, ఒప్పుకున్నాడు ఇద్దర్నీ కలిసి మాట్లాడ్డానికి.

అలా అభిరాం కి విమలతో పెళ్ళైపోయింది చక చకా పనులు అయ్యేక. వెనక్కి అమెరికా వెళ్ళేటప్పుడు విమల ఇంట్లో ఓ రెండ్రోజులుండి మరీ వెళ్ళాడు అల్లుడు – త్వరలో విమలని తీసుకెళ్ళడానికి కావాల్సిన వీసా కాయితాలు, అవీ పంపిస్తానని చెప్పి. పెళ్ళికొచ్చిన విమల స్నేహితులు విమల అదృష్టవంతురాలని కితాబిచ్చేరు – అవును అమెరికా వెళ్తుందనే అతి త్వరలో.

మరో నాలుగు నెలలకి విమల డెట్రాయిట్ లో దిగింది. ఆవిడని ఇంటికి తీసుకొచ్చాక మొదటివారం జెట్ లాగ్, రెండు నెలలు స్నేహితులతో పార్టీలు అయ్యాక అభిరాం కి ఓ రోజు గుర్తొచ్చి అడిగేడు విమలని, "నేను మొదట్లో లావుగా, నల్లగా ఉన్నానని, నన్ను చేసుకోనన్నావని మాకు మధ్యవర్తి ద్వారా వార్త అందింది ముందు. మరెందుకు ఒప్పుకున్నావు తర్వాత పెళ్ళికి?"

విమల నవ్వి ఊరుకుంది. అభిరాం ఏదో రెట్టించబోతే, ఆవిడ పని ఉన్నట్టూ పక్క గదిలోకి తప్పుకుంది మరో అవకాశం ఇవ్వకుండా. అభిరాం కి ఇంక నోరు మూసుకోక తప్పలేదు.

ఇంతవరకూ కథ చదివిన పాఠక మహాశయా, అభిరాం అడిగిన ప్రశ్నకి విమల సమాధానం చెప్పకుండా ఎందుకు నవ్వి ఊరుకుంది? మొదట్లో అభిరాం పిప్పళ్ళ బస్తాలా, కాకిలా నల్లగా ఉన్నాడంటూ పెళ్ళి సంబంధం ఒప్పుకోని విమల అమ్మతో ఏకాంతంగా మాట్లాడాక ఒప్పుకుంది కదా? విమల అమ్మ కూతురితో "ఏ–కాం–తం–లో" ఏమి చెప్పింది? ఈ రెండు భేతాళ ప్రశ్నలకి సమాధానం తెలియకపోతే, తెలిసీ చెప్పకపోతే ...

మొదటి ప్రశ్న కి సమాధానం – ఏ పెళ్ళైన అమ్మాయి కైనా సరే ఎప్పుడు నోరు మూసుకోవాలో, కూడదో వెధవ ప్రశ్నలేసే మొగుడి కన్నా బాగా తెలుస్తుంది కనక. ఇప్పుడు రెండో ప్రశ్న కి సమాధానం స్ఫురించిందా?

ఇప్పటికీ ఇంకా తెలియకపోతే ఈ కింద ఉన్న నీతి చదువుడు.

*నీతి - అమ్మాయి పెళ్ళిచూపుల్లో అమెరికా అబ్బాయి నచ్చాడు అని చెప్పిందంటే అది – అమెరికా, అక్కడ వచ్చే డాలర్లు నచ్చాయి అని అర్ధమోయ్ భగవాన్లూ.*

# సి.యా.వో

**చివరి పరీక్షలై** పోయేక స్కూళ్ళు అన్నీ మూసేస్తూంటే మొత్తం వేసవంతా ఇంట్లో కూర్చోవడం ఎలా అని పోరే పిల్లల్తో, భార్యామణితో కూర్చుని ఏమి చేయాలో చర్చించేడు సుబ్బా ఉరఫ్ డబ్బారేకుల సుబ్బారావు; తాముండే వర్జీనియా నుండి చూడ్డానికి వెళ్ళడానికి ఏయే ప్రదేశాలున్నాయో చూడబోతే న్యూయార్క్, న్యూ జెర్సీలు చూసేసినవే కనక ఆ కాంక్రీట్ వనాల్లో చూసేదేమీ లేదు. మహా ఐతే బోస్టన్ ఇంకా పైపైకి కెనడా తిరగొచ్చు. కిందకి కరోలినాలూ, అందరికీ ఉరకలేసే ఉత్సాహం తెప్పించే ఫ్లోరిడా ఉండనే ఉన్నాయి. పశ్చిమానికి కాలిఫోర్నియా, బిల్ గేట్స్ గారి వాషింగ్టన్, ఇంకా పక్కకి వెళ్తే మరో సారి కెనడా, హవాయీను. డబ్బులుండాలి గానీ అబ్బో, అలాస్కా లేదూ కాళ్లకి దురద పుడితే*?*

ఎక్కడికో అనేది తెలిస్తే నలుగురికీ కలిపి ఎంతవుతుందో, అది తాను ఖర్చుపెట్టగలడా అనేవి చూసుకోవచ్చు. గూగిల్, అమెజాన్, ఆర్బిట్జ్ వంటివి వచ్చేసాక ఎక్కడికెళ్ళాలన్నా ఎలకతో క్లిక్ క్లిక్ మనిపించడమే. అమ్మగారి సరదా హవాయి, పెద్దపాప సర్దా ఫ్లోరిడా, రెండోపాప ఎప్పుడూ పెద్దమ్మాయి కూడా తందానతాన కనక మళ్ళీ ఫ్లోరిడా. ఈ విషయంలో ఇంటాయన సుబ్బా గారి డబ్బులే ముఖ్యం గానీ ఆయన మనసులో ఏముందో, వెళ్లడానికి ఎక్కడికో అనేది నిర్ణయించడానికి ఆయన వోటు శుద్ధ పనికిమాలినదని జగమెరిగిన సత్యం కనక ఆయనని ఎవరూ అడగరూ, ఆయన నోరెత్తినా ఎవరూ పట్టించుకోరూ. సుబ్బా గారి తలనెప్పి కూడా ఈ ట్రిప్పులో తన చేతి చమురు ఎంత వదుల్తుందా అనేదే కానీ ఎక్కడకి వెళ్తున్నారనేది కాదు కదా*?*

ఫ్లోరిడా అయితే బండిమీద సామాను పెట్టుకుని డ్రైవ్ చేసుకుంటూ పోవచ్చు. అయితే హవాయీ, వాషింగ్టన్ లో ఉండే సియాటిల్ దాకా వెళ్ళాలంటే విమానం ఎక్కాలి. నాలుగు టికెట్లకీ, అక్కడ అద్దెకో కారూ, మళ్ళీ హొటళ్ళూ అదీ ఖర్చు. ఇదంతా ఓ ఎత్తు అయితే కడుపునిండా తిన్నాక కూడా మెక్ డొనాల్డు కనిపించగానే అర్జంటుగా ఆకలి వేసే పిల్ల రాక్షసుల తిండీ, చూసే చోట ప్రతీదానికీ ఓ టికెట్టూ, అది చాలదన్నట్టూ వాటిమీద పన్నూ అంతా కలిపితే... సుబ్బా ఇదే మాట పిల్లల్తో చెప్తే వాళ్ళన్న మాట – "డాడ్ నువ్వో చీపో గాడివి. మెక్ డొనాల్డ్ లో నాలుగు డాలర్లకీ, కారు పార్క్ చేయడానికి యాభై సెంట్లకీ కూడా లెక్కలు కడతావు." సుబ్బా పైకి అనలేని, అనని మాట ఏమిటంటే – నిజమే తాను చీపో గాడే అయితే ఈ బిగ్ మేక్ కి నాలుగూ, ఆ టాకోకి పదీ, ఇలా పార్కింగ్ కి మరో అయిదూ కట్టుకుంటూ పోతే చివరకి తేలేదేంటంటే – ఈ చిల్లరే మొత్తానికి తడిసి మోపెడయ్యి తనకి లాభం గూబల్లోకి వస్తోంది. అయినా అవసరం అయిన చోట తాను చేతికి ఎముక లేకుండా విదిలిస్తున్నాడుగా*?*

కిందామీదా మరో రెండురోజులు కుస్తీపట్టాక, సియాటిల్ ప్రయాణం ఖరారైంది సుబ్బా అండ్ కో గారికి. హాట్ వైర్ వారి పుణ్యమా అని విమానం, కారూ, హొటలూ అన్నీ ఒకే సారి కలిసొచ్చేయి. ప్లేన్ దిగగానే అక్కడే కారు తీసుకుని మరో అయిదు రోజులు హోటల్, అక్కడ్నుంచి ఇష్టం వచ్చినచోటికి తిరగడం. ఈ అయిదు రోజులూ ఏం చేయాలనేది సుబ్బాగారి చేతుల్లో ఎలాగా లేదు. ఓ సారి హోటల్లో దిగేక అక్కడ కనుక్కుని ప్లాన్ చేసుకోవచ్చు. మౌంట్ రైనియర్, స్పేస్ నీడిల్, ఈ రోజుల్లో ప్రతీ సిటీలోనూ తప్పనిసరిగా ఉండే ఓ హిందూ టెంపుల్,

అలా రోజుకోటి చూడొచ్చు. సియాటిల్ లో దాదాపు నిరంతరం పడే వర్షం కానీ అడ్డం వస్తే ఏదో మ్యూజియం, షాపింగ్ మాల్ ఎలాగా ఉండనే ఉన్నాయి. ఇండియన్ భోజనానికో మరో తిండికో సియాటిల్ లాంటి పెద్ద నగరంలో ఏం కొదువ?

సుబ్బాగారి కుటుంబం సీ–టాక్ ఎయిర్ పోర్ట్ లో దిగేసరికి రాత్రి పదకొండవుతోంది. అక్కడ్నుంచి మళ్ళీ అద్దె కారు, హోటల్ కి వెళ్ళేదారిలో ఎప్పటిలాగానే ఓ మాదిరి వర్షం. బుక్ చేసిన డబల్ ట్రీ హోటల్ కెళ్ళాక తెలిసొచ్చినదేమిటంటే సుబ్బాగారు రెండు రూములు బుక్ చేసారు, ఎందుకోగాని. పిల్లలు రెండు రూముల్లో ఉండొచ్చని చంకలు గుద్దుకుంటూంటే సుబ్బా కొంచెం అనుమానించి ఒకటే చాలు; రెండు రూములు మేము బుక్ చేయలేదని చెప్పి తాళాలు తీసుకుని లోపలకి వెళ్ళాక చెప్పేడు ఎందుకో. రెండు రూములు ఎలా తనపేరు మీద వచ్చాయో తెలియదు కనక అవి తీసుకుంటే రెండు చార్జీలు పడతాయి క్రెడిట్ కార్డులో. రోజుకి తొంభై డాలర్లతో అయిదు వందలదాకా చేతి చమురు వదుల్తుంది అది తీసుకుంటే. తీసుకోకపోతే ఒకటే బుక్ చేసారు కనక ఫర్వాలేదు. అయినా తాము కావాలన్నది ఒక రూమే కానీ రెండు కాదు కదా? అంతా విన్నాక పెద్దమ్మాయి "ఓకే మిస్టర్ పెర్ ఫెక్ట్" అని వెక్కిరించింది. ఝాము రాత్రి మంచాలమీదకి చేరారు.

ఓ రోజుకి సియాటిల్ లో చేపల మార్కెట్, ఎడతెగని నడక, మరో రోజు స్పేస్ నీడిల్, మరో రోజు ఎంత దగ్గిరనుంచి చూడచ్చో అంత దగ్గిర్నుంచి మౌంట్ రైనియర్, మరో రోజు గుడికి అలా ఏ రోజుకా రోజు ప్లాన్ చేసుకున్నా రోజులో మొదటి ప్లాన్ అయిపోయాక రెండో ప్లాన్ పక్కనే ఉన్న షాపింగ్ మాల్ లో సుబ్బా గారు షాపు బయటనుండి విండో షాపింగ్, సుబ్బా గారి కుటుంబం షాపులోపల నిజమైన షాపింగ్. అవును సుబ్బాగారి క్రెడిట్ కార్డ్ మీదే అన్ని చార్జీలూనూ. అందులో మళ్ళీ కొనేవి రకరకాలు – అమ్మాయిలకి బట్టలు కావాల్సినా అక్కర్లేకపోయినా, సియాటిల్ లో మాత్రమే దొరికో కొన్ని పాస్ట్రీలు, స్వీట్లు. ఎక్కడైనా ఏ మ్యూజియం లాంటిదో చూట్టానికి మళ్ళీ కార్డు మీదే చార్జీ. అమ్మగారు, అమ్మాయిగార్లూ సుబ్బాగారి కార్డ్ ఎక్కడపడితే అక్కడ జూం, జూమ్మంటూ స్వైప్ చేసి వాడారు మొత్తం ట్రిప్ అంతా. ఏది ఏమైనా ఈ కార్డ్ లో ఉన్నంత సుఖం ఒప్పుకోవాల్సిందే – ఎక్కడా పైసా బయటకి తీసే పనిలేదు. ఒకప్పుడైతే పేపరా ప్లాస్టిక్కా అని అడిగేవారు. ఇప్పుడంతా ప్లాస్టిక్కే – సామాన్లు తెచ్చుకునే సంచీలూ, కోలా తాగే స్ట్రా ల దగ్గిర్నుండి క్రెడిట్ కార్డులదాకాను. ఈ ప్లాస్టిక్ వల్ల పర్యావరణం పాడవుతోందోహో, తాబేలు, తిమింగలం లాంటివి చచ్చిపోతున్నాయోహో అని ఎవరు ఎంత గొంతెత్తి మొత్తుకున్నా – ప్లాస్టిక్కే మహారాజు.

వెకేషన్ అయ్యేక సుబ్బాగారు అన్ని సంచీలు సర్దేసి తన దగ్గిరకొచ్చిన ప్రతీ రసీదూ జాగ్రత్తగా దాచి అద్దెకి తెచ్చిన బండిమీద ఎయిర్ పోర్ట్ కి చేరారు. శనివారం రాత్రికి వర్జీనియా వెనక్కి వచ్చేక మళ్ళీ ఇంటికి రావడానికి షటిల్. ఏదైతేనేం, వెకేషన్ బ్రహ్మాండమైన హిట్టే. వందలకొద్దీ ఫోటోలు తీసారు. సియాటిల్ లో బిల్ గేట్స్ గారి భవనం, ఆయన ఆఫీసులూ దూరం నుంచైనా చూసారు. అన్నింటికన్నా ముఖ్యం గా చెప్పుకోవల్సింది అమ్మగారికి ఈ ట్రిప్పులో ఎక్కడా కోపం రాలేదు. సుబ్బాగారి మాటలకి మూతి మూడు వంకర్లు తిప్పలేదు. పిల్లలు కూడా 'డాడ్ ఈజ్ ద బెస్ట్ డాడ్ ప్రపంచం మొత్తంమీద' అని ఓ సర్టిఫికేట్ పారేసారు. వాళ్ళ ప్రపంచం అంతా ఎప్పుడు చూసారనే గూట్లే ప్రశ్న అటుంచితే, సర్వేజనా సుఖినోభవంతు.

వెకేషన్ నుంచి వెనక్కొచ్చాక ఓ ఆదివారం సుబ్బాగారు లెక్కలుచూసుకుంటే మొత్తానికి ఖర్చు ఆరువేల ఎనిమిది వందలని తేలింది. హాట్ వైర్ వారిది అందులో ప్లేన్, హోటల్, కారు ఖర్చు రెండువేల అయిదు వందలైతే మిగతావాటికి మరో రెండువేల మూడొందలు. సుబ్బా గుండె పీచుమంది కానీ ఏమీ చేయలేని అశక్తత. ఉన్న సేవింగ్స్ లో తాను సగం వాడేసాడు. మళ్ళీ డిసెంబర్లో ఇండియా ప్లాన్ ఉంది. దానికి లెక్క చూస్తే కనీసం పదివేలు అవుతుంది నలుగురికి. ఎలాగో తర్వాత చూడాలి. ఇప్పుడు ఆలోచిస్తే తలనెప్పి తప్ప మరో ప్రయోజనం శూన్యం. అమ్మగారు, పిల్లలూ రోజు రోజుకీ సంతోషంగా ఉన్నారు సియాటిల్ ట్రిప్ తల్చుకుంటూ. ఇంత డబ్బు ఖర్చైనా వాళ్ళకేం చింత ఉన్నట్టులేదు. అసలు ఇంత ఖర్చు ఎందుకైంది?

అలా మూడు వారాలు గడిచేక అప్పుడు వచ్చింది తాను కట్టాల్సిన క్రెడిట్ కార్డ్ బిల్లు. సుబ్బాగారు చెప్పినట్టుగానే హొటల్ వారు రెండు రూములకి చార్జీ వేసారు. తామున్న అయిదో, ఆరో రోజులకి – అయిదువందల నలభై ఆ రెండో రూముకి. ఫలానా రోజులోపుల ఈ మొత్తం కట్టకపోతే, రోజుకి ఇరవై ఒక్క శాతం మాత్రమే ఇంట్రెస్ట్ పడుతుంది. సుబ్బా గారు కల్లుతాగిన కోతిలా, ఫోన్ తీసి హాట్ వైర్, డబల్ ట్రీ హోటళ్ళమీద పడ్డాడు దీని సంగతి తేల్చడానికి. మీరు ఫలానా రోజుల రెండు రూములు బుక్ చేసుకున్నారు అని మా వెబ్ సైట్ చూపిస్తోంది అందువల్ల అది కట్టి తీరాల్సిందే అని హాట్ వైర్ వారి వాదన. హోటల్ వారి ప్రకారం సుబ్బా గారు రెండు రూముల్లోనూ ఉన్నారుట. దీన్ని వాదించడానికి సుబ్బాగారికి మూడు రోజులు పట్టింది. తాను రెండు రూముల్లో ఉన్నట్టూ అక్కడి హోటల్లో ఉన్న వీడియో కెమెరాలలో చూపించమని సుబ్బాగారు అడిగేసరికి హోటల్ వారు కాస్త వెనక్కి తగ్గేరు. ఈ ప్రహసనం అయ్యేక సుబ్బా ఇంట్లో వాళ్ళమీదా, హాట్ వైర్ మీదా, హోటల్ మీదా చాలా సార్లు అరిచేడు. అదీ బాస్కెట్ బాల్, ఫుట్ బాల్ క్రీడాకార్లు వాడే అచ్చులో ప్రచురించడానికి పనికిరాని ప్రత్యేకమైన భాషలో. ఇంత అయ్యేక ఆ రెండో రూమ్ చార్జీలు తీసివేయబడ్డాయి. మరో సారి సర్వేజనా సుఖినోభవంతు – కొంచెం ఆలశ్యంగానైనా.

అంతా సర్దుమణిగాక సుబ్బాగారికి ఓ అనుమానం పుట్టుకొచ్చింది. అసలు ఇంత దూరం వెళ్ళి ఇన్ని డబ్బులు ఖర్చుపెట్టి అడుసు తొక్కనేల, కాలు కడుగనేల? అసలీ వెకేషన్ విషయంలో తాను ఇంత టెన్షన్ పడుతుంటే ఇంట్లో అమ్మగారిక్కానీ అమ్మాయిలక్కానీ చీమ కుట్టినట్టుకూడా లేదే? ఈ కుటుంబం లో డబ్బు "మనది" అనే విషయం పట్టకపోవడం, ఈ డబల్ రూమ్ ప్రహసనం, ఈ వెకేషన్ లో కొన్న పనికొచ్చే పనికిరాని వస్తువుల, బట్టల గురించీ, వీళ్ళకి ఆనందం ఎలా వస్తోంది అసలు? అందులోనూ తాను మొదటినుండీ ప్రతీ విషయానికీ వద్దు వద్దు అంటున్నా, డబ్బు విషయంలో జాగ్రత్తగా ఉండమని చెప్తున్నా? ఇంత సంతోషంగా ఎలా ఉండగల్గుతున్నారు వీళ్ళు? మూడు రోజులు వదలని తలనెప్పితో ఈ అనుమానం బుర్ర తొలుస్తూనే ఉంది సుబ్బాకి. సమాధానం మాత్రం దొరకలేదు.

ఆ పై వారాంతం శుక్రవారం రాత్రి అందరూ పడుకున్నప్పుడు సుబ్బా టివి చూస్తో ఏదో ప్రోగ్రాం పెట్టేసరికి డెట్రాయిట్ కార్ల కంపెనీ సి.యీ.వో లు వాషింగ్టన్ లో ఉన్న కాపిటల్ హిల్ అనే చోట – కార్ల కంపెనీలు నష్టాల్లో ఉన్నాయి కనక వాటి తరపున డబ్బులు అడుక్కోవడానికి చేతిలో చిప్పతో వెళ్ళడం, వాళ్ళని కాంగ్రెస్ వారు ఇంటర్వ్యూ చేయడం చూపిస్తున్నారు. పాతదే, ఎప్పుడో జరిగినది రికార్డ్ చేసిన ప్రోగ్రాం. కాంగ్రెస్ మెంబర్ కాబోలు అడుగుతున్నాడు, "మీరు డిట్రాయిట్ నుంచి ఇక్కడకి ఎలా వచ్చారు?"

"కంపెనీ కుదిర్చిన ప్రేవేట్ ప్లేన్ మీద." ఫోర్డ్, జెనరల్ మోటార్స్, క్రైస్లర్ వారు విడివిడిగా ఉవాచ.

కోపం మండుకొచ్చిన కాంగ్రెస్ ఆయన అరిచేడు, "మీరు డబ్బులు ఇలా తగలేసే కంపెనీలని ఈ స్థితికి తీసుకొచ్చారు కాబోలు. ముగ్గురూ కలిసి ఒక ప్లేన్ లో వచ్చినా డబ్బులు ఆదా అయ్యేవి కదా? డబ్బులు ఇష్టం వచ్చినట్టూ తగలేయడం, అవి పోయాక వచ్చి మమ్మల్ని దేబిరించడం."

ఏం చెప్పాలో తెలియక ఓ వెర్రినవ్వు నవ్వుతున్నారు ముగ్గురు సి.యి.వో లూనూ. ఆ ఇంటర్వ్యూ అయ్యేక జర్నలిస్ట్ పెద్దాయన చెప్పేడు ఈ సి.యి.వోలు ఎందుకలా నిర్లక్ష్యంగా డబ్బులు ఖర్చుపెడతారో, "ఆ కాంగ్రెస్ ఇచ్చే డబ్బులు ఉచితం, అవి పన్నుల ద్వారా జనం మీద గడించేవి. ఇటు కాంగ్రెస్ వారివీ కాదు, అటు కార్ల కంపెనీవీ కాదు. అందువల్ల అవి ఎలా పోయినా ఈ సీ.యీ.వో. లకీ కాంగ్రెస్ వారికీ పట్టదు. డబ్బులు ఇవ్వకపోతే కంపెనీ మూసేసాక ఉద్యోగాలు పోయి జనం ఇబ్బంది పడతారు కనక ఇవ్వననడం కుదరదు. అది ఇద్దరికీ తెల్సిన మర్మం. ముందు ముందు లాభాలు వస్తే ఈ డబ్బులు ఇస్తామని చెప్పరు కనక, తిరిగి వెనక్కి ఇస్తారో లేదో ఎవరికీ తెలియదు ప్రస్తుతానికి."

అంతా చూసిన సుబ్బా మొహం మీద ఒక్కసారి చిర్నవ్వు పుట్టుకొచ్చింది. మూడు రోజులనుంచి తాను తల బద్దలు కొట్టుకున్న – వెకేషన్ లో తన జేబులోంచి చాలా డబ్బులు పోయినా ఇంట్లో సీ యీ వో అయిన అమ్మగారికీ, అమ్మాయిలకీ అంత సంతోషం ఎలా కలిగిందో అనే – సందేహం తీరిపోయినట్టూ. హాయిగా ఓ చిన్న నిట్టూర్పుతో టివి కట్టేసి మంచం మీదకి చేరాడు.

నీతి - ఖర్చు పెట్టే డబ్బులు నువ్వు సంపాదించినవి కానప్పుడు ఆ ఖర్చుపెట్టడంలో ఉండే సర్దాయే వేరు.

# ముందు చూపు

**కాబోయే అమెరికా** అల్లుడి ఇంట్లో వియ్యపురాలు, వియ్యంకుడూ బేరసారాలు సాగిస్తున్నారు. పెళ్ళికూతురు పక్కగదిలోంచి అన్నీ వింటోంది. పెళ్ళి ఖర్చులకి ఇంత, భోజనాలకి ఇంత, వీసా వచ్చాక మీ అమ్మాయి అమెరికా వెళ్ళడానికి మీరే ప్లేన్ టికెట్ పెట్టుకోవాలి, వగైరా. కొన్నింటికి డైరక్ట్ గా ఒప్పుకున్నా కొన్నింటికి బేరం. అన్నీ అయ్యేక వియ్యపురాలు ఓసారి కాబోయే కోడలు తో మాట్లాడతానని చెప్పేసరికి రేవతిని పిల్చేరు గదిలోకి.

ఏమీ ఉపోద్ఘాతం లేకుండానే కాబోయే అత్తగారు చెప్పేసింది, "అబ్బాయిని సరిగ్గా చూసుకోవాలి. వేళకి వండిపెట్టాలి. వాడికి కోపం వచ్చినా సర్దుకుపోవాలి. పెళ్ళైన కొత్తలో దెబ్బలాటలు వచ్చినా ఏమనుకోకూడదు. మాతో అన్నీ ఫోనుమీద చెప్తూ ఉండాలి..." అన్నీ అయ్యేక మరో ప్రశ్న – "మేము అమెరికా వస్తే నీకు ఇష్టమేనా?"

రేవతి చెప్పింది, "అదేమిటండి అలా అడుగుతున్నారు, మీరు వస్తే మాకు సంతోషమే కదా? అక్కడ ఎలా ఉంటుందో నాకు ఏమీ తెలియదు. ఆయన ఉద్యోగానికి వెళ్ళాక ఒక్కత్తినీ ఏం చేస్తాను? మీరు వస్తే నాకు తోడు ఉంటుంది కదా?"

"మేము పెర్మనెంట్ గా రాము గానీ వచ్చి చూసిపోతూ ఉంటాము. ఇక్కడ మా పనులు మాకున్నాయి కదా?"

"సరే, మీకెలా ఇష్టం అయితే అలాగే." నవ్వుతూ తల ఊపింది రేవతి.

కాబోయే అత్తగారు సంతోషంగా రేవతి చేతులు పట్టుకుని, "మా మంచి కోడలు," అంటూ బయల్దేరింది వాళ్ళాయనతో. ఇన్నాళ్ళ జీవితంలో ఆడవాళ్ళ విషయాలు బాగానే ఆకళింపు చేసుకున్న వియ్యంకుడు, అవునూ కాదూ అన్నట్టు తల ఆడిస్తూ బయటకి నడిచేడు.

పెళ్ళైపోయిన మూడునెలలకి రేవతి కాన్సాస్ లో దిగేక ఆర్భాటంగా అపార్ట్ మెంట్ లో స్వాగతం బెలూన్లూ, ఓ కేక్ కట్ చేయడం, అది సోము, రేవతిల మొహాల మీద రాయడం, ఆ తర్వాత భోజనం. ఇవయ్యేక కొత్త దంపతులనిద్దర్నీ వదిలేసి ఇళ్లకి వెళ్ళేరు స్నేహితులు, వచ్చే వీకెండ్ లో మరోసారి కలుద్దామని చెప్పి.

మూడు నెలలకి కొత్త సంసారం సర్దుకుంటూంటే వారాంతంలో ఓరోజు సోము ఏవో కాయితాలు నింపుతూంటే అడిగింది రేవతి అవి దేనికో.

"అమ్మనీ నాన్ననీ అమెరికా చూడ్డానికి రమ్మన్నాను, మరో మూడు నెలల్లో వస్తారు." చెప్పేడు సోము.

ఈ వార్త సోము సోమవారం ఉద్యోగంలోకి వెళ్ళగానే ఊరంతా తెలిసిపోయింది ఫోనుమీద. అవును రేవతి ఒకావిడకి చెప్తే అది మరో ఆవిడకీ అక్కడ్నుంచి కూర్ల సంతలో చెప్పినట్టూ ఊరంతాను. అప్పటికి ఊళ్ళో కొంతమందికి బాగా చనువు ఉన్న వాళ్ళలో ఒక పెద్దావిడ

రేవతికి ఫోన్ చేసి మరింత కూపీ లాగింది విషయాలు. అత్తగారు వస్తున్నారంటే కోడలు ఎలా ఉంటే ఆ వచ్చే పెద్దావిడ సంతోషిస్తుందో అన్నీ చెప్పాక అడిగింది, *"రేవతీ, వాళ్ళు రావడం నీకు ఇష్టమేనా?"*

"ఆ ఏదో లెండి. పెళ్ళికి ముందూ, పెళ్ళిలోనూ నానా జాగ్రత్తలూ చెప్పిందావిడ. మా అబ్బాయ్ బుద్ధిమంతుడు, ఇంత గొప్పా, అంత గొప్పా అంటూ, అక్కడకి ఇంట్లో తప్పులన్నీ నా మూలానే వస్తాయ్ అనుకుంది కాబోలు. పెళ్ళిలో ప్రతీదానికీ వంకలు. నాకు నచ్చలేదు. ఇక్కడికొచ్చాక నన్ను చూసి ఏమంటుందో అని నా బెంగ."

"అదే అమ్మాయ్, అత్తగార్లు అందరూ అంతే. అయితే జాగ్రత్తగా విను నేను చెప్పేమాట," అంటూ పెద్దావిడ ఓ పావుగంట ఏం చేయాలో అత్తగారితో చెప్పింది. అంతా విని రేవతి నోరు వెళ్ళబెట్టాక పెద్దావిడ కి ధన్యవాదాలు చెప్పి ఫోన్ పెట్టేసింది. ఆ తర్వాత పని అత్తగారిని ఎలా చూసుకోవాలో, ఆవిడకి ఏవి ఇష్టమో, కాదో అన్నీ సోము ని అడిగి తెలుసుకోవడం, ఆవిడకి నచ్చిన వంటలూ, రంగులూ అన్నీ నేర్చుకోవడం.

ఈ లోపున సోము స్నేహితుల్తో చెప్పుకోవడం మొదలుపెట్టేడు, "మా ఆవిడకి మా అమ్మ అంటే ఎంత ఇష్టమో, ఇప్పట్నుంచే అన్నీ అమ్మకి నచ్చినట్టూ చేస్తోంది. మీరైతే మీ ఆవిడా, అత్తగారు రకరకాలుగా కొట్టుకుంటూ, తిట్టుకుంటూ ఉంటారని చెప్తూ ఉంటారు కానీ మా ఆవిడ అలాంటిది కాదు."

ఈ కబుర్లు విన్న స్నేహితుల్లో సుధాకర్ అనే ఒకాయన పుసుక్కున "ముందు చూపు అన్నమాట," అన్నాడు.

సోము కి ఆయన అన్నది అర్థం కాక అడిగేడు, *"అదేమిటండి?"*

సుధాకర్ నవ్వి ఊరుకున్నాడు కానీ ఏమీ సమాధానం చెప్పలేదు. అది అక్కడితో అలా సమసిపోయింది.

ఆత్తగారు దిగేక రేవతికి తెలిసిన విషయం వాళ్ళు నాలుగు నెలలు ఉంటారు.ఈ నాలుగు నెలల్లోనూ వాళ్లని అటు కాలిఫోర్నియా ఇటు న్యూ యార్క్ దాకా తిప్పి చూపించాలి. ప్రతీ వారాంతంలోనూ అబ్బాయ్ గారు కారు బయటకి తీసి ఎక్కడికో ఓ చోటకి వెళ్ళడం, దారి ఖర్చులూ, మిగతావీ అన్నీ తడిసిమోపెడవ్వడం. ఆ ఖర్చుల సంగతి ఎలా ఉన్నా రేవతి మాత్రం అత్తగారిని బాగా చూసుకున్నట్టే.

పొద్దుట లేచినప్పటినుంచి రాత్రి పడుకోబోయే వరకూ రేవతిదే అంతా పని. అందరి అత్తల్లాగానే రేవతి అత్తగారికి కూడా కోడలు తనకి అడుగులకి మడుగులొత్తాలని ఆశ. కాఫీకీ టీ కి కూడా ఆవిడకి లేచే శక్తి ఉండదు. పొద్దున్న వంట సాయంత్రానికి పనికిరాదు. ఆ పూటకాపూట వండవల్సిందే. ఈ మధ్యలో మళ్ళీ పంటికిందకి పకోడీలో, బూందీయో మరోటో. సాయంత్రం అబ్బాయి ఇంటికి వచ్చాక ఆయన్తో కబుర్లు – ఇంట్లో మంచం మీద వేసే దుప్పట్ల రంగు దగ్గిర్నుంచి రాత్రి సాంబార్లో వేసే కూర ముక్కలదాకా. రోజంతట్లో ఒక్కసారి కూడా కోడలికి ఓ చేయివేసి సహాయం చేద్దామని కానీ, కిచెన్ లోకి వెళ్ళి అసలు రేవతి ఎలా ఉందో చూద్దామని కానీ ఆవిడకి తట్టలేదు. ఆవిడకి ఏమైనా కావాలిస్తే, "రేవతీ" అంటూ ఓ కేక పెట్టడమే. రేవతి కూడా ఊళ్ళో పెద్దావిడ ఏం చెప్పిందో కానీ, నోరు మెదపకుండా అన్నీ చేసిపెడుతూనే ఉంది అత్తగారికీ మామగారికీ. వాళ్ళు ఉన్న నాలుగునెలల్లో రేవతి రోజుకి ఆరుగంటలు మాత్రమే పడుకోగలిగింది అంటే అది అత్తగారి చలవే.

నాలుగు నెలలు దాటి అత్తా మామా తిరిగి ఇండియా వెళ్ళిపోతూంటే రేవతికి దరిద్రం వదిలినట్టూ అనిపించినది "హమ్మయ్యా ఇప్పుడైనా కాస్త విశ్రాంతిగా పడుకోవచ్చు" అనే ఆలోచనతో. ఇన్నాళ్ళబట్టీ రేవతి ఒక్కసారికూడా తన అమ్మా నాన్నల గురించిగానీ ఒక్క మాటైనా తనకి పితూరీగా చెప్పలేదనీ, ఎప్పుడూ కోపం తెచ్చుకోలేదనీ సోము స్నేహితులదగ్గిర డబ్బా కొట్టుకుంటూనే ఉన్నాడు. వాళ్ళు నవ్వుతూనే ఉన్నారు కూడా. అందులో సుధాకర్ మరీను.

అత్తామామలు వెళ్ళిపోయిన మరో మూడునెలలకి రేవతి ని డాక్టర్ దగ్గిరకి తీసుకెళ్ళినప్పుడు ఆవిడ మొత్తం పరీక్షచేసాక చెప్పిన విషయం – రేవతికి నెల తప్పింది, అయితే మనిషి విపరీతమైన పని వల్లో మరో కారణం చేతో చాలా నీరసంగా ఉంది. బలంగా ఉండాలంటే మరో మనిషి అవసరం; మందులు వాడినా సరే.

సోము, వెంఠనే చెప్పేసేడు డాక్టర్ తో, "మా అమ్మని రమ్మని చెప్తానండి ఇండియానుండి, రేవతిక్కూడా మా అమ్మంటే చాలా ఇష్టం. ఆ మధ్య అమ్మ వచ్చినప్పుడు ఇద్దరూ బాగా సఖ్యంగా ఉన్నారు."

రేవతికి ఈ మాట విని ఒళ్ళు జలదరించింది. ఆ సాయంత్రం మళ్ళీ ఊళ్ళో పెద్దావిడతో ఫోను.

సాయంత్రం సోము ఇంటికొచ్చాక రేవతి చెప్పినది ఇది, "క్రితంసారి మీ అమ్మా నాన్నా వచ్చారు కనక, ఈ సారి మా అమ్మని పిలుద్దామండి. నాకు ఈ రోజుల్లో సహాయం చేయడానికి అమ్మ దగ్గిర ఉంటే బాగుండునని ఉంది."

"అదేం? మా అమ్మ వస్తే క్రితం సారి ఇద్దరూ బాగానే ఉన్నారుగా? అమ్మకి తెలియదా నీకు ఏం కావాలో?"

"ఆవిడకేనా? మీ అమ్మగారు వస్తే ఆవిడకి పొద్దున్న దగ్గిర్నుంచి సాయంత్రందాకా నేనో పనిమనిషిగా అన్నీ చేతికి అందించాలి కానీ నేను ఉన్నానా ఊడేనా అనేది తట్టదు," మూతి మూడు వంకర్లు తిప్పుతూ చెప్పింది రేవతి, "ఉన్న నాలుగు నెలల్లో ఒక్కసారి కూడా వంటింట్లోకి వచ్చి ఓ చేయి వేసి హెల్ప్ చేస్తారేమో అని చూసాను కానీ, కూర్చున్న చోటునుంచి లేస్తేనా?"

"వంట్లో బాగాలేదోమోలే"

"ఎలా బాగుంటుంది? కూర్చుంటే లేవరు; అదే పనిగా తినడం, అసలే బరువెక్కువ, కాస్త లేచి అటూ ఇటూ తిరగడమో, ఏదో పని చేయడమో చేసినా బాగుణ్ణు. అలా తిని పడుకుంటే అంతే. అక్కడకీ చాలనట్టూ నా వంట మీద వంకలు, నేను కట్టుకున్న బట్టల గురించి కామెంట్లూ, ఇంట్లో అది లేదనీ ఇది లేదనీ, అన్నింటికీ నేనే" అక్కసు వెళ్లగక్కింది రేవతి.

"నాతో ఎందుకు చెప్పలేదీ విషయాలు వాళ్ళున్నప్పుడు?"

"ఎందుకూ చెప్పడం? నేను పితూరీలు చెప్తున్నానని మీ ముగ్గురూ నా మీద ఎగుర్తారు. మనం చూసిన డాక్టర్ ఏం చెప్పిందో విన్నారా? నాకు జ్వరం వచ్చినా, ఒళ్ళు సలుపుతున్నా ఆవిడ కాఫీ కలపుకోవడానిక్కూడా లేవదు. మనం ఇక్కడ రోజుకో సారి వండుకుంటాం కానీ ఆవిడకి పూట పూటకీ ఫ్రెష్ గా వండాలి. మీ అమ్మగారికి రోజూ పాదపూజ చేసి ఈ నీరసం అవీ కొని తెచ్చుకున్నాను నేను. రోజులో అసలు నాకు శెలవు అనేదే ఉండేది కాదు. మీకైతే ఆఫీసులో కూర్చుని ఏమీ తెలియవు."

మరో పావుగంట ఒకరి మీద ఒకరు విసుర్లు విసురుకున్నాక మొత్తానికి రేవతి అమ్మా నాన్నా అమెరికా రావడానికి నిశ్చయం అయింది. రేవతి ఊళ్ళో పెద్దావిడతో ఆరోజు సాయంత్రం చెప్పింది ఫోన్ చేసి, "అమెరికా వచ్చిన మా అత్తగార్ని బాగా చూసాను. ఇప్పుడు మీరు చెప్పినట్టూ, పురుడికి మా అమ్మ వస్తోంది."

"ఇది నా స్వంత ఆలోచన కాదమ్మా రేవతీ, తరతరాల నుంచీ వస్తున్నదే. నేను అమెరికా వచ్చినప్పుడు ఓ పెద్దావిడ నాకు చెప్పినదే నేను నీకు చెప్పాను. ముందు అత్తగార్ని సరిగ్గా చూసుకుంటే, తర్వాత మొగాడు మన అమ్మా నాన్నలని తీసుకురావడానికి సహాయం చేస్తాడు. ప్రపంచంలో మగాళ్ళందరూ అంతే!" పుల్ల విరిచేసింది పెద్దావిడ.

తర్వాతెప్పుడో, సోమూ ఆఫీసులో ఓ సారి సుధాకర్ కనిపించినప్పుడు అతను అన్న మాటలు గుర్తొచ్చి చెప్పేడు ఆయన్తో, "ఓ సారి మీరు ముందు చూపు అంటే అర్ధంకాలేదు కానీ ఇప్పుడు బాగానే అర్ధమైనట్టూ ఉంది."

"అది సర్వ సాధారణం బ్రదర్, నేను ఆ మాట అన్నప్పుడు అదేంటో అర్థం కాక అడిగేరు గుర్తుందా? నేను నవ్వి ఊరుకున్నాను ఎందుకంటే అది స్వంతంగా అనుభవిస్తే తప్ప తెలీదు. ఇంకో విషయం గుర్తు పెట్టుకోండి. మరోసారి కానీ మీ అమ్మా నాన్నా అమెరికా వస్తే ఈ సారి ఆవిణ్ణి మీ ఆవిడకి హెల్ప్ చేయమని చెప్పండి. ఆవిడ చేసినా చేయకపోయినా అత్తా కోడళ్ల దెబ్బలాటలు మాత్రం తప్పవు. మొదట్లో నెత్తిమీద పెట్టుకు చూసింది ఇప్పుడిలా అయిందేమిటా అని ఆశ్చర్యపడే పనిలేదు. రెండు చెవులూ కాకపోయినా ఓ చెవి వాళ్లకేసి పారేసి ఉంచండి. ఇంట్లో జరిగేది తెలుస్తూ ఉంటుంది. మరీ అంత అమాయకత్వం పనికిరాదు."

"అబ్బే రేవతి అలాంటిది కాదండి, మా అమ్మంటే ఇష్టమే."

"ఈ భూ ప్రపంచంలో ఒక ఆడమనిషి కి శతృవు ఎవరో తెలుసా బ్రదర్? ఆవిడ పక్కనే ఉన్న మరో ఆడమనిషి. మానవుడన్నవాడు పుట్టినప్పటినుండి ఈ రోజు వరకూ అత్తా కోడళ్ళు దెబ్బలాడుకోని ప్రపంచం లేదు. ఉత్తినే ఊహల్లో బతకడం మాని వాస్తవికంగా ఉండండి." వెళ్ళిపోతూ సుధాకర్ బిగ్గరగా నవ్వుతూ చెప్పేడు,

నీతిః మీ ఆవిడ అమెరికా వచ్చిన తన అత్తగార్ని నెత్తిమీద పెట్టుకుని బాగా చూసిందంటే దానర్థం, రాబోయే రోజుల్లో ఆవిడ అమ్మా నాన్నలు దిగబోతున్నారు.

## వెలుగు నీడలు

**మొదటిసారి అమెరికా** వచ్చిన రేణుక ని బయటకి తీసుకెళ్ళేడు మొగుడు సుధాకర్ షాపింగ్ చేయడానికి. రేణుకకి లోపలకి వెళ్తూంటే కళ్ళు విప్పార్చి చూడొద్దనీ, నోరు వెళ్ళబెట్ట వద్దనీ చెప్పాడు కూడా. అయినా క్రోగర్ షాపు లోపలకి వెళ్ళగానే రేణుక నోరు వెళ్ళబెట్టింది అది చూసి. ఏది కావాలిస్తే అది తీసుకుని బండిలో వేసుకోవడం, చుట్టూరా తిరగడానికి కావాల్సినంత చోటు. కాఫీ కొనేచోట బాటిల్ తీసుకుని తర్వాత వద్దు అనుకుంటే మరోచోట పెట్టేసినా ఎవరూ ఏమీ అనుకోరు. కూరల మీదా, నారల మీదా చిన్నగా పడే నీళ్ళ స్ప్రే, అవి పాడవకుండా ఉండడానిక్కాబోలు. కొనుక్కోవడానికి పాకం గారి లాంటి డో నట్ ల దగ్గిర్నుంచి కేకులదాకా రకరకాల చిరుతిళ్ళు. అద్భుతం!

క్రోగర్ ఇలా ఉందనుకుంటే, వాల్ మార్టు మరో అద్భుతం. కొండమీద కోతితో సహా అన్నీ దొరికే చోటు. బట్టలు, ఉప్పు, వాము, బియ్యం, పాలూ నీళ్ళూ, ఫోను, కంప్యూటర్లూ అంటూ దొరకనిదేదీ లేదు. ఇంక ఆగలేక రేణుక అడిగేసింది సుధాకర్ ని – ఇంకేం దొరుకుతాయో వాల్ మార్ట్ లో.

"డి. వెంకటేశ్వర్లూ, టి. వెంకటేశ్వర్లూ కూడా దొరుకుతాయ్," సుధాకర్ చెప్పేడు నవ్వుతూ.

"అంటే? దేవుడి బొమ్మలూ, పటాలూనా?"

"కాదోయ్ వెర్రిమొహమా, మా కాలేజీలో డి. వెంకటేశ్వర్లు అనేవాణ్ణి డివీలు అనీ, టి. వెంకటేశ్వర్లు అనేవాణ్ణి టివిలు అనీ అనేవాళ్ళం. అలా ఇక్కడ వాల్ మార్ట్ లో డివిడిలూ, టివిలూ కూడా దొరుకుతాయ్!" నవ్వేడు సుధాకర్ మరోసారి.

అలా మూడు నెలలు షాపు మీద మరో షాపు తిరిగాక రేణుకకి తెలిసొచ్చిన విషయం – మనం ఏది ఎక్కడ కొన్నా జేబులోంచి పైసా తీయాల్సిన పని లేదు. అన్నింటికీ ప్రయోగించే ఒకే ఒక ఆయుధం క్రెడిట్ కార్డు. ఏది కావాలిస్తే అది కొనేసుకుని కార్డ్ అనేస్తే వాళ్ళే

చూసుకుంటారు. ఒక్కడాలర్ దగ్గిర్నుంచి తాము ఈ మధ్య రెండు వేలు పోసి కొన్న టివి దాకా అన్నింటికీ క్రెడిట్ కార్డే. అప్పు ఇవ్వడం కార్డ్ వారి గొప్ప అయితే దాన్ని తీసుకోవడం తమ గొప్ప.

అలా తమకి అవసరం ఉన్నా లేకపోయినా, "ఏది పడితే అది" కొనేసుకునే రోజుల్లో రేణుక అమెరికా వచ్చిన నాలుగో నెల మరో అద్భుతం జరిగిపోయింది. ఇండియాలో ఎప్పుడూ పేంట్లు వేసుకోకపోయినా అమెరికా లో ఎలా తప్పదు కనక రేణుక కొన్న ఒక పేంట్ ఆవిడకి పట్టకపోవడంతో సుధాకర్ ఇంటికొచ్చాక చెప్పింది – తాము కొన్న పాతికడాలర్ల పేంట్ మీద పెట్టిన డబ్బులు పోయినట్టే అని.

"ఎందుకు పోయినట్టు? నీకు పేంట్ నచ్చిందన్నావుగా?"

"కొంచెం బిగుతుగా ఉంది. అది వేసుకోలేను."

"అదా, అయితే తిరిగి ఇచ్చేసి మరోటి తీసుకోవచ్చు."

"ఎలాగెలాగా?" ఆశ్చర్యపోయింది రేణుక.

"బిల్లు చూపించి ఇది ఇచ్చేస్తే మరోటి తీసుకోవచ్చు. లేకపోతే డబ్బు వాపస్ ఇస్తారు."

"బిల్లు లేకపోతే?"

"వెళ్ళి చెప్పవచ్చు ఏ రోజు కొన్నామో. దానిని బట్టి వాళ్ల కంప్యూటర్ లో చూసి మన బిల్లు బయటకి తీసే ఛాన్స్ ఉంది. కానీ ఇది అన్ని చోట్లా పనిచేయకపోవచ్చు. అందుకే ఎప్పటికైనా బిల్లు జాగ్రత్తపెట్టుకోవడం మంచిదే."

ఈ అద్భుతం జరిగిననాటినుండి తర్వాత మూడు నెలల్లో సుధాకర్ దాదాపు ఇరవై ముఫ్ఫైసార్లు వాల్ మార్ట్ కీ, టార్గెట్ షాపులకీ సరుకులు వాపస్ ఇవ్వడానికి వెళ్ళేడు. ఏడాది గడిచేసరికి సుధాకర్ కి విసుగొచ్చింది ఈ తతంగం చూసి. అమ్మగారికి ఏది కావాలో ఏది అక్ఖర్లేదో తెలియదు. కనిపించింది కొనడమే. ఓ రెండు రోజులు పోయాక తిరిగి ఇచ్చేయడం. ఓ రోజు ఇద్దరూ బెస్ట్ బై అనే షాపులో కొన్న హెడ్ ఫోన్స్ వాపస్ ఇస్తూంటే మేనేజర్ గారు తనగదిలోకి పిల్చేడు ఇద్దర్నీ. లోపలకి తీసుకెళ్ళాక చెప్పేడు అతి మామూలుగా,

"మిమ్మల్ని మేము దాదాపు అయిదారు నెలలనుండీ గమనిస్తున్నాం. ఏదో ఒకటి కొనడం, ఓ వారం పదిరోజుల్లో వెనక్కి ఇవ్వడం. ఏమిటి మీ కథ? మీకు అక్కర్లేకపోతే కొనడం దేనికీ వాపస్ ఇవ్వడం దేనికీ?"

"అబ్బే మేము అన్నిసార్లు ఇక్కడకి రాము. ఏదో ఈ సారికి ఇక్కడకి రావడం అయింది. అయినా ఈ హెడ్ ఫోన్స్ సరిగ్గా పనిచేయడం లేదు," బుకాయించబోయేడు సుధాకర్.

మేనేజర్ తన దగ్గిరున్న కాయితాలు తీసి చూపించేడు ఆరునెలల్లో వీళ్ళు కొన్నదీ వాపస్ ఇచ్చినదీ. అంతా అయ్యాక సుధాకర్ రేణుకల నల్ల బడ్డ మొహాలు చూసి ఖచ్చితంగా చెప్పేడు మేనేజర్ – "మీకు ఇది బాగుండకపోతే వేరేది తీసుకోండి కానీ డబ్బులు వాపస్ ఇవ్వం. మరోసారి ఇలా చేస్తే అసలు వాపస్ కాదు కదా, వేరేది తీసుకోవడం కూడా ఒప్పుకోము. ఇదే మీ ఆఖరి ఛాన్సు."

వేరే హెడ్ ఫోన్స్ తీసుకుని ఇంటికొచ్చాక సుధాకర్ అరవడం మొదలుపెట్టేడు రేణుకమీద ప్రతీదీ ఇలా కొనడం ఇవ్వడం వల్ల. ఆవిడకి మంటెక్కి పోయి తిరిగి సుధాకర్ మీద అరిచింది తప్పు తనదా అంటూ.

అయితే ఆ తర్వాత రేణుక అవలంబించిన కొత్త సూత్రం ప్రకారం ఆవిడ కొనడం మానదు గాక మానదు, కానీ వెనక్కి ఏదైనా వాపస్ ఇవ్వాల్సి వస్తే ఆ తలనెప్పి సుధాకర్ ది. అలా అమ్మగారు వాపస్ కార్యక్రమంలో ఏ షాప్ మేనేజర్ పెట్టే తిట్లలోంచీ, వార్నింగులలోంచీ బయటపడింది. ఎన్ని తిట్లు తిన్నా సుధాకర్ కి ఇది తప్పని మేళం. కొనడానికి అమ్మగారు వస్తారు కానీ వాపస్ ఇచ్చేటప్పుడు మాత్రం తద్దినం తనదే.

ఓ రోజు కొన్న ముప్ఫై డాలర్ల సరుకు వాపస్ ఇస్తూంటే వాల్ మార్ట్ వారు ఉవాచ – "అయ్యా మీరు బిల్లు కూడా తేలేదు. మా కంప్యూటర్ పనిచేయదు అలాగ. బిల్లు లేకపోతే మేమిచ్చేది ఐదు డాలర్ల నలభై ఆరు సెంట్లు. కావాలిస్తే ఇక్కడో సంతకం తగలేయండి."

"అదేంటండి, నేను ముప్పై పెట్టి కొన్నాను ఈ సరుకు," సుధాకర్ చెప్పబోయేడు.

"అవునా, సరే బిల్లు చూపించండి, ముప్పైకి కొన్నట్టు"

"అది లేదు కనకే కదా ఈ గొడవ"

"అందుకే ఐదూ నలభై ఆరు తీసుకుని బయటకి దయచేయండి." నవ్వుతూనే చురుక్కుమనిపించింది వాల్ మార్ట్.

ఇంటికొచ్చాక రేణుక ని అడిగేడు బిల్లు ఎక్కడ ఉందో.

"నాకేం తెలుసు? మీరే దాచుకుంటూ ఉంటారు అవన్నీను," ఆవిడ విసురుగా వచ్చింది సమాధానం.

అయితే సరుకులు కొన్నాక వాటిని ఇంటికి తెచ్చుకునేటప్పుడు అమ్మగారి మొహంమీద వెలిగే వెలుగు ఈ సారి లేకపోవడం సుధాకర్ గమనించాడు. అటువైపు నుంచి రేణుక, సరుకులు వెనక్కి వాపస్ ఇస్తూంటే సుధాకర్ మొహం లో కనిపించే నల్లటి నీడలు గమనించలేదని సుధాకర్ కి అనిపించింది. ఇలా నాలుగైదు సార్లు అయ్యేక సుధాకర్ కి చూసుకుంటే పోయినవి రెండు వందల డాలర్లు నెలకి. ఇంక అప్పట్నుంచీ బుద్ధి వచ్చి వాపస్ ఇవ్వడానికి వెళ్ళడం మానుకున్నాడు అత్యంత అవసరం అయితే తప్ప.

ఈ వెలుగునీడలు ఇలా కొంతకాలం జరిగేక సుధాకర్ అన్ని బిల్లులూ ఒకచోట పెట్టడానికో ప్లాస్టిక్ డబ్బా కొని వాడడం నేర్చుకున్నాడు. అన్నింటికన్నా మరో పెద్ద విషయం ఇప్పుడు అమ్మగారు సరదాగా షాపింగ్ కి వెళ్ళాలంటే సుధాకర్ కి ఎప్పుడూ ఆఫీసు పనీ, ఇంట్లో పనీ వల్ల తీరికే లేదుట. మొగుడికి తీరిక లేనందువల్ల అమ్మగారు షాపింగ్ మానరు కనక ఆవిడకి తన క్రెడిట్ కార్డ్ కాపీ ఒకటి ఇప్పించాడు సుధాకర్.

ఇప్పుడు అమ్మగారో స్వతంత్రపు పక్షి. ఎవరితోనైనా షాపింగ్ కి వెళ్ళి ఆవిడకి కావాల్సినవీ అక్కర్లేనివీ కొనేస్తూ ఉంటుంది. డబ్బులు మనవి కానప్పుడు అవి ఖర్చుపెట్టడంలో ఉండే ఆనందం వేరు కదా? అదీకాక క్రెడిట్ కార్డు చేతిలో ఉంది కనక ఎక్కడా పైసా బయటకి తీసే పనే లేదు. రెండో మూడో రోజులు పోయాక సుధాకర్ షాపుకెళ్ళి కొన్నింటికి ఇస్తూనే ఉంటాడు. బిల్లు ఉంటే పూర్తి వాపస్ లేకపోతే మళ్ళీ వాగ్యుద్ధం. ఇద్దరికీ అప్పుడూ, ఎప్పుడూ తగాదాలు వస్తూనే ఉంటై, సరుకులు వాపస్ ఇచ్చే విషయంలో, బిల్లు ఎక్కడ ఉందో, అసలు ఉందో లేదో అనే విషయాల్లో. ఒక్కొక్కప్పుడు ఈ అరుపులు పక్కవాటాల్లోకి వినిపిస్తున్నాయని కొందరు పక్కవాళ్ళు అన్నాక అరుపులు తగ్గించి వెలుగు నీడల్లో సరిపుచ్చుకుంటున్నారిప్పుడు దంపతులు.

వెలుగు – సరుకులు కొనేటప్పుడు అమ్మగారి మొహంలో, నీడలు – రిటర్న్ చేసేటప్పుడు షాపులో లైనులో నుంచున్న అయ్యగారి మొహంలో.

*నీతిః అమ్మగారు ఏ సరుకు ఎక్కడ కొన్నా, బిల్లు జాగ్రత్తపెట్టుకునే పనీ, అమ్మగారు ఏ సమయంలో ఆర్డర్ వేస్తే ఆ సమయంలో సరుకు షాపులో వాపస్ ఇచ్చే పనీ ఎప్పుడూ అయ్యగారిదే.*

## ఉచిత ఫోను

**సెల్ ఫోన్లు ఇప్పుడిప్పుడే** మార్కెట్లోకి వస్తున్నై; అదీ చవగ్గా. ఇంట్లో అందరికీ తలో ఫోనూ ఇస్తారు. దానికి మొదటి ఏడాది వంద డాలర్లు మాత్రమే. ఉచిత ఫోన్! అయితే తీరిగ్గా కిందన కనీకనిపించని అక్షరాల్లో రాసినది – రెండేళ్ళకి సంతకం పెట్టాలి వాళ్ళదగ్గిరే ఉంటామని. ఆ ఏడాదికి వంద డాలర్లు ఆ తర్వాత మూడు వందలకి పెరుగుతుంది. అప్పుడు వద్దంటే కుదరదు. అంటే రెండేళ్ళలో 1200 ప్లస్ 3600 వెరసి 4800. దాన్ని రెండేళ్ళకి అనుకుంటే నెలకి 200 అయింది కాదూ? ఆ ఇచ్చే ఉచిత ఫోన్ మరీ అంత నాసిరకం కాదు కానీఏదో బాగానే పని చేస్తుంది. మనని అదుపులో ఉంచుకోవడానికి ఫోన్ కంపెనీ వారు పన్నిన పన్నాగం – ఆ ఫోన్ మరే కంపెనీకి పనిచేయదు. ఫోన్ ఉచితమా, మజాకా? ఓ సారి సంతకం పెట్టేక ఇంక ఎంత నెత్తీ నోరూ కొట్టుకున్నా కుదరదు.

అలా మోహన్రావు అమ్మగారికీ, ఇద్దరు కూతుళ్ళకీ, తనకీ తలో ఫోన్ తీసుకుని నెలకి వందతో మొదలుపెట్టేడు సంత. ఇన్ని ఫోన్లు ఉన్నా ఇంట్లో మరో ఫోన్ ఉండొద్దూ? దానికి వోనేజ్ వారి ఫోన్ ఉంటే చాలు – ఈ మూల పాపా న్యూ గినియా నుంచి అటు చైనా దాకా ఎక్కడికైనా సరే ఉచితంగా లేకపోతే అతి చవగ్గా ఈ సుబ్బారావునో, యాంగ్ యున్ గారినో, టాం, డిక్ లలో ఎవరినైనా సరే ఫోన్ చేసి అటు ఎవరు ఎత్తారో తెల్సినా తెలియక పోయినా తెలుగువాళ్ళే అయి ఉండచ్చనే నమ్మకంతో "ఒరే, ఇవాళ మీ ఆవిడ ఏం కూర చేసింది?" అని అడిగేయవచ్చు.

ఫోన్ లు తీసుకున్న మొదటినెల చివరిలో మోహన్రావుకి తెలిసిన విషయం – తనకి అమెరికాలో మహా ఉంటే ఓ పది మంది స్నేహితులున్నారు. అందులో ఆఫీసులో వాళ్ళు ముగ్గుర్ని తీసేస్తే మిగతా వాళ్ళు తనతో కాలేజీలో చదువుకున్న నలుగురు. బాకీ దూరపు బంధువులు. ఆఫీసులో వాళ్ళతో మాట్లాడేది తాను ఎప్పుడైనా అఫీసుకు వెళ్ళడం లేట్ అయితే చెప్పడానికి. కాలేజీ స్నేహితులకి తనలాగే నూరుకోవడానికి వాళ్ళ కత్తులు వాళ్ళకున్నాయ్. అందువల్ల ఎప్పుడైనా నెలకోసారి ఫోన్ చేస్తారేమో. బంధువులంటే తెల్సిందే – పెళ్ళో, చావో అయితే తప్ప వాళ్ళు కాల్ చేయరు. తాను చేసినా వాళ్ళకి తీరిక లేదు.

అయితే కూతుళ్ళిద్దరూ ఇప్పుడు ఫోన్ లకే అతుక్కుపోయి అందులో వీడియోలు, సినిమాలు, స్నేహితులతో కబుర్లూ, టెక్స్ట్ మెసేజీలూ, అవి చాలవన్నట్టూ అందులోనే హోమ్ వర్క్, అది స్నేహితులతో షేర్ చేసుకోవడం. ఇప్పుడు వాళ్ళకి ఫోన్ లేకపోతే కాలం కదలదు. ప్రతీదానికీ ఓ ఆప్ ఉంది కనక మొహం చూసుకోవడానికో ఆప్, మేకప్ కి మరొకటి, ఫోటోలకి మరొకటి, అలా దైనందిన ఫార్మసీలాగ తయారైంది వీళ్ళ జీవితం. ఫార్మసీ లో మనకి కడుపులో ఆకలి అయితే ఓ మందు, ఆకలి అవకపోతే ఓ మందు. తింటే అరగడానికో మందూ, అరక్కపోతే మరోమందూ, అరిగి బయటకి రాకపోతే ఓ మందూ, అరిగినది ఎక్కువగా వచ్చేస్తే మరో మందూ ఉన్నట్టు ప్రతీదానికీ ఇప్పుడో ఆప్. ఆ ఆప్ లేకపోతే జీవితం ఆగిపోదూ? పొద్దున్నలేవగానే మోహన్రావు తండ్రి అరచేయిమీద శ్రీరామ అని రాసుకుని కళ్ళకద్దుకున్నాడంటే ఆ రోజులు వేరు. ప్రస్తుతంలో లేవగానే ఫోన్ కేసి చూసుకోవాలి – ఎవరెవరు మెసేజ్ పంపించారో. ఓ సారి మోహన్రావు దాని మీద అరిస్తే పిల్లలిద్దరూ కల్సి పన్నిన ఉపాయం, ఫోన్ వాల్ పేపర్ మీద రాముడి పటం పెట్టడం. లేవగానే రాముణ్ణి చూస్తున్నాం కదా అని ముక్తాయింపు ఇచ్చేసరికి మోహన్రావు నోరుమూసుకున్నాడు. ఇప్పుడు పొద్దున్న లేవగానే ఇంట్లో తమ తమ ఫోనుల్లోంచి తలో టైపు 'మేలుకో శ్రీరామా' అనేది పాట వస్తోందంటే అది ఆప్ ల వారి చలవే.

కూతుళ్లనైతే మోహన్రావు గదమాయించగల్డు కానీ అమ్మగారిని ఏం అనగలడు? అందువల్ల అమ్మగారి ఫోన్ లో ఆప్ లు వేరు, తెలుగు సినిమా వీడియోలు వేరు. వాట్సాప్ లో అమ్మగారికొచ్చే విషయాలు వేరు. సహధర్మచారిణి మాట సరే కానీ ఎవరి ఫోన్ మెసేజీలు వాళ్లవే కదా? అలా ఒకరి ఫోన్ ఒకరు చూడరాదు. కావాలిస్తే అమ్మగారు తమకొచ్చిన మెజేజీలు అయ్యగారికి ఫార్వార్డ్ చేస్తారు. అలా వచ్చినవి చూసి ఆనందించవచ్చు. అమ్మగారు తనకి తనే కనుక్కున్న మరో విషయం – వోనేజ్ వారి ఆప్ ఉంది! అది కానీ ఓ సారి ఫోన్ మీద

పెట్టుకున్నారా, ఇంట్లోంచే కాదు మానవుడనే వాడున్న ఎక్కడినుంచైనా సరే ఇప్పుడు ఫోన్ చేసుకోవచ్చు. ఎక్కడికైనా రోడ్ ట్రిప్ వేసుకున్నా, ఏదైనా సైట్ సీయింగ్ ఉన్నా ఫోన్ లు తప్పనిసరి. మరి జస్ట్ ఎయిమ్ అండ్ షూట్ లాగా ఫోటోలు తీసుకోవద్దూ? అయితే మరో విషయం – సైట్ సీయింగ్ లో కానీ, బీచిల్లో గానీ ఎవరికీ సముద్రాన్ని చూడ్డానిక్కానీ అక్కడ కాసేపు నిశ్శబ్దంగా కూర్చుందామని కానీ, రోడ్ మీద డ్రైవ్ చేస్తుంటే చుట్టూ ఆకుపచ్చని బయళ్ళు చూడ్డానిక్కానీ, దేనికీ తీరికలేదు. మొహం కళ్ళూ ఫోన్ మీద, చేతుల్లో స్మార్ట్ ఫోన్. జీవితాలు గడిచిపోతున్నాయి. ఎప్పుడైనా వార్తలు చూడ్డానికి ఫలానా వెబ్ సైట్ చూసే అలవాటు ఉండేది కానీ ఇప్పుడు ఆ వార్తలన్నీ సెకనుకోసారి మేసేజీలుగా వస్తూంటే ఇంకా వెబ్ సైట్ లు చూడ్డం దేనికీ?

ఏడాది గడిచేక మోహన్రావుకు బిల్లు, మొదట్లో ఫోన్ కంపెనీ వారు చెప్పిన ప్రకారం, నెలకు రెండు వందలైంది. ఫోన్ లు వాడకం వల్ల ఎదిగే పిల్లలిద్దరికీ కొత్త ఫోన్ లు కావాలిట. అమ్మగారు అడగలేదు కానీ ఫలానా ది పని చేయదు ఈ ఫోన్ లో, మరోటి బాగా నెమ్మదిగా ఉంది అని సతాయించడం తెలుస్తూనే ఉంది. కాలం ఇలా గడుస్తుంటే, అమ్మగారి వేలువిడిచిన బాబయ్య వరస తమ్ముడి కొడుకు ఆడపడుచు ఈ మధ్యనే ఆస్ట్రేలియా వెళ్ళారుట. ఓ సారి అమెరికా వస్తున్నారు; మీ ఇంటికి వస్తారు ఓ వారం రోజులు అని మోహన్రావుగారికి అమ్మగారు ఆర్డర్ వేసారు. మోహన్రావు సరే అనేశాడు ఎవరో ఒకరు బంధువులు వస్తున్నందుకు. వచ్చినావిడా, అమ్మగారు చిన్నప్పటి కబుర్లలో పడ్డారు. మొగాళ్ళిద్దరూ మోడీ గారి గురించీ, సర్జికల్ స్ట్రయిక్స్ గురించీ, మిగతా వాటి గురించీ మాట్లాడుకుంటూంటే.

భోజనాల వేళ కబుర్లలో వచ్చినావిడ మోహన్రావు గురించి విసుర్లు విసరడం మొదలుపెట్టింది. ఆవిడ చెప్పడం ప్రకారం ఇండియాలో అందరూ అనుకునే విషయం – మోహన్రావు పైసా పైసాకీ లెక్కపెట్టుకుంటాడు, పాతకాలం మనిషి. ఫోన్ కొని పెట్టమంటే కూతుర్లకీ, వాళ్ళావిడకీ కలిసి ఎంతవుతుందా, అది రెండేళ్ళకి ఇలా అయితే, ఎంత నష్టం, ఫోన్ ఉచితంగా వస్తే ఎంత లాభం, కూతుళ్ళనిద్దరినీ ఫోన్ అంత ఇదిగా వాడవద్దనడం, ఫోనుల్లో రాముడి మేలుకొలుపు పాటలు పెట్టమనడం, వగైరా, వగైరా. అన్నింటికన్నా దారుణం ఆవిడ వేసిన విసుర్లలో, తాను బాగా పిసినారి వాడు. పెళ్ళాం పిల్లలకి బట్టల దగ్గిర్నుంచి, ఇంట్లో అంట్లు తోముకునే డిష్ వాషర్ సోపు దాకా ప్రతీదీ చవకరకం కొంటాడు. తమ కుటుంబం నలుగురూ ఒకేసారి ఇండియా వెళ్ళాలంటే డబ్బులైపోతాయి కనక ఇద్దరేసి చొప్పున వెళ్తారుట; అదీ మూడేళ్లకోసారి. కొన్ని చోట్ల మోహన్రావుకి కోపం వచ్చినా ఇంటికొచ్చిన బంధువులమీద అరవడం బాగుండదు కనక తయాయించుకుని ఊరుకున్నాడు.

ఈవిడ తమకి అంత బాగా తెలియక పోయినా ఇదేమిటిలా అంటోందనుకున్న మోహన్రావు తర్వాత నవ్వడం మొదలుపెట్టాడు అవన్నీ సరదాగా తీసుకుని. ఈ విసుర్లు వాళ్ళు ఉన్న వారంరోజులూ సాగుతూనే ఉన్నయి. ఓ రోజు ఇంక ఉండబట్టలేక మోహన్రావు అడిగేడు, "ఇవన్నీ నేను అన్నాననీ నేను ఇలా ఉంటాననీ మీకెలా తెలుసు? మీరెప్పుడూ నన్ను ఇంతకు ముందు చూడనైనా లేదు కదా?"

ఆస్ట్రేలియా బంధువు మరింత నవ్వుతూ చెప్పింది, "నాకే కాదు ప్రపంచంలో ఉన్న మీ, మా బంధువులందరికీ తెలుసు మోహన్రావు బావా!"

"అదే ఎలాగ తెలిసిందా అని అడుగుతున్నా," రామారావు అడిగేడు.

ఆవిడ మరింత నర్మగర్భంగా నవ్వుతూంటే, రామారావు ధర్మపత్ని ఒక్క మాటతో ఆవిడ నోరు మూయిస్తూ అంది, "ఆయనంతే లెండి, ప్రతీదానికీ రాద్ధాంతం చేస్తారు. మీరేం చెప్పక్కర్లేదు."

ఆవిడ అప్పటికి ఇంక నోరు మూసుకుంది కానీ రామారావుకి ఏమీ తెలియలేదు. వాళ్ళు తిరిగి ఆస్ట్రేలియా వెళ్ళిపోయిన కొన్ని రోజులకి కూతుళ్లకి కేటాయించిన గదిలోకి వెళ్ళి రామారావు ఇద్దర్నీ అడిగేడు, "అసలీ ఇంట్లో విషయాలు ప్రపంచం అంతా ఎలా తెలుస్తున్నాయో"

వాళ్ళిద్దరూ ఫోన్ లోంచి మొహం కూడా తిప్పకుండా చెప్పేరు, "మాకు తెలియదు డాడ్!"

ఏం చేయాలో తెలియక బుర్ర గోక్కునే మోహన్రావుతో అప్పటికి అతని వెనకకి వచ్చి నించున్న సహధర్మ"చారిణి" అంది,

"ఆ బంధువులమ్మాయి ఏదో అంటే, ఉత్తినే భుజాలు తడుముకుంటారెందుకు?"

*నీతిః ఫోన్ కొని పెట్టడం వరకే నీపని. ఆ తర్వాత నువ్వు చేసే ప్రతీ పనీ ఇండియా నుంచి పాపా న్యూ గినియా దాకా అందరికీ చేరవేసే పని మరొకరిది. ఇంటి దొంగని ఈశ్వరుడైనా పట్టలేడు కానీ వాట్సాప్ అయితే ఏమో?*

# ఎప్పుడూ మొగుడిదే తప్పు

మొదటి సారి కాన్పు కనక తల్లీ తండ్రీ వచ్చాక గీతని హాస్పిటల్లో చేర్పించారు పురుడొచ్చినప్పుడు. మరో రెండు రోజులకి ఇంటికెళ్ళిపోవచ్చు పుట్టిన కొడుకుతో. అసలే మొదటి పిల్లాడు, తమకేమీ తెలియదు అనుకునే రామారావుకి అత్తా మామలు బాగా సహాయం చేసినట్టే పిల్లాడిని జాగ్రత్తగా చూసుకోవడంలో. రామారావు రోజుకి ఎనిమిది గంటలు పడుకోగలిగాడంటే అది అత్తగారి కష్టమే. పాపం ఆవిడ ఒళ్ళు దాచుకోకుండా నిద్రాహారాలు మానుకుని సేవ చేసింది. చంటి పిల్లాడు ఏడ్చినా, పాలు పట్టడానికి అర్ధరాత్రి లేవవల్సి వచ్చినా ఆవిడ విసుక్కోకుండా లేచిందనీ, కూతురికీ అల్లుడికీ నిద్ర పాడవకుండా చూసిందనీ పైకి తెలియనివ్వలేదు. కూతురికి ఈ సమయంలో ఆరువారాలు కష్టంగా ఉంటుందని ఆవిడకి ముందే తెలియడం ఓ విషయం అయితే అల్లుడు సరిగ్గా నిద్రపట్టకపోతే మర్నాడు ఆఫీసుకెళ్లలేడని ఆవిడ అమెరికా వచ్చాక నేర్చుకున్న రెండో విషయం. ఏమైనా మూడునెలలు ఇట్టే గడిచిపోయి మనవడు చిరునవ్వు నవ్వడం మొదలుపెట్టేసరికి అత్తామామలు ఇండియా బయల్దేరారు – అక్కడ దేశంలో అన్నీ వదిలేసి ఇక్కడ కూర్చోవడం ఎలా అనే నెపం మీద. గీత ఎంత బతిమాలినా లాభంలేకపోయింది. అల్లుడు అడిగితే ఆవిడ చెప్పిన మాట, "ఎంతకాలం మా మీద ఆధారపడతారు? మేము వెళ్ళాలి, మీ పనులు మీరు నేర్చుకోవాలి కదా?"

వాళ్ళు వెళ్ళిపోయిన మూడోరోజు నుంచీ అసలు నిజం అర్ధం కావడం మొదలైంది. పిల్లాడు రాత్రి లేస్తే మళ్ళీ వాడు పడుకునేదాకా భుజం మీద వేసుకుని తిప్పాలి. పొద్దున్నంతా పడుకుంటే రాత్రి పడుకోడు కనక మరీ కష్టం. ఎనిమిది గంటల నిద్ర మాట అటుంచితే రాత్రి పాల సీసాలు కడగడం, రోజుకి పిల్లాడికి మూడు సార్లు బట్టలు మార్చడం, వాడు కనక దోకితే మరోసారీ, ఈ బట్టలన్నీ ఉతకడానికి మరో యత్నం వగైరా. కాస్త మెల్లిగా ఏవో పళ్ళరసం లాంటివి పట్టవచ్చేమో అనుకునేలోపు వాడికి ఏదో జ్వరం. డాక్టర్ దగ్గిరకి పరుగులు. ఏదో జాండిస్ లాంటిదేమో అనే అనుమానం, స్పెషలిస్ట్ దగ్గిరకి మరో పరుగు.

అలా ఆరునెలలు గడిచాక దార్లో పడ్డారు గీతా, రామారావులు. కుర్రాడు నవ్వితే నవరతన్ కూర్మా, పొర్లితే పూర్ణం బూరెలూ, పాకితే పాయసం అనుకుంటూ ఒక్కో మెట్టూ సెలబ్రేట్ చేసుకుంటూ. తొమ్మిదో పదో నెల వచ్చాక నడవడం నేర్చుకునేసరికి కుర్రాడికి జుట్టు, గోళ్ళూ పెరగడం మొదలుపెట్టాయి బాగా. గోళ్ళయితే రామారావు తీయడం అలవాటు చేసుకున్నాడు కానీ గీత ఇండియా నుంచి వచ్చిన ఆర్డర్స్ ప్రకారం రామారావుని పిల్లాడి తలమీద చేయి వేయనివ్వలేదు. వాడి పుట్టువెంట్రుకలు తీసేదాకా తలమీద ఎవరూ కత్తి పెట్టరాదు. అందులోనూ అమ్మగారికి మొక్కు ఉందాయే.

పదకొండో నెల వచ్చేసరికి కుర్రాడి జుట్టు బాగా పెరిగిపోయి కళ్ళకి అడ్డం పడుతుంటే రామారావు గీతకి నచ్చచెప్పబోయేడు మొహం మీద జుట్టు మాత్రమే కట్ చేస్తాననీ, కుదరకపోతే వాడి కంట్లో జుట్టూ పడితే ఈ సారి చూడ్డానికెళ్ళినప్పుడు పీడియాట్రిషియన్ వేసే అక్షింతలు తప్పవనీను.

"కుదరదు, పుట్టువెంట్రుకలు తీయకుండా కత్తి పెడితే మహా పాపం," అమ్మగారు ఉవాచ.

"మరి వాడి కంట్లో పడుతోందిగా జుట్టు?"

దీనికి గీత కనిపెట్టిన మందు, ఒక హెయిర్ స్ప్రే కొనడం, కుర్రాడి జుట్టు వెనక్కి రబ్బర్ బేండ్ పెట్టి కట్టడం. ఇండియా ముగ్గురూ కలిసి వెళ్ళడం అప్పుడే కుదరదు కనక కుర్రాడి జుట్టు పెరుగుతూనే ఉంది. హెయిర్ స్ప్రే అవుతూనే ఉంది. రామారావు ఎన్ని చెప్పినా గీత చెప్పడం "జుట్టు మీద కత్తి పెట్టడం తప్పు. రామారావుకి ఏమీ తెలియదు. ఇంక చాలు." కోపం వచ్చినా, పైకి అనకపోయినా లోపల గింజుకుంటూనే ఉన్నాడు రామారావు కుర్రాడి జుట్టు ఉడతలు పీకిన తాటి టెంకలా తయారౌతుంటే. కానీ చేసేదేవుంది?

ఓ వారాంతం కొత్తగా పరిచయం అయిన మరో కుటుంబం భోజనానికి పిలిస్తే కుర్రాణ్ణి తీసుకుని వెళ్ళేరు ముగ్గురూను. దారిలో గుర్తొచ్చింది – కుర్రాడికి హెయిర్ స్ప్రే రాయడం మర్చిపోయేరు. వాళ్ళింటికెళ్ళాక కబుర్లలో పడి కుర్రాణ్ణి వదిలేసినప్పుడు వాడు ఇంట్లో అక్కడే ఉన్న మెట్లమీదనుంచి జర్రున జారి కిందన పడ్డాడు. తలకి దెబ్బ తగల్లేదు కానీ కాలికేదో అయింది. గీత అంది, "మా ఇంట్లో మెట్లమీద నుంచి ఎప్పుడూ పడలేదండి కానీ ఇక్కడ ఇలా అయిందేమిటో"

సందర్భం చూసి రామారావు జూలు విదిల్చేడు, "ఎందుకు పడడూ, వాడికి జుట్టు కంటిమీదకి వచ్చేసి కళ్ళు కనపడవు. నేను మొహం మీద జుట్టు మాత్రమే కట్ చేస్తానన్నా నా మీద ఎగుర్తావు."

ఇంటాయన అన్నాడు, "ఎందుకలా వదిలేసారు జుట్టు, ముందు వైపు కొంచెం కత్తిరించవచ్చుకదా?"

"ఈ మహారాణి గారికి మొక్కు ఉందండి. అది ఎక్కడో ఇండియాలో వాళ్ల ఊరి వెంకటేశ్వరుడి గుళ్ళోనే చేయించాలి. ఈ లోపుల కుర్రాడు ఇలా కింద పడినా, తల బద్దలు కొట్టుకున్నా తల మీద కత్తి పెట్టరాదు. పెడితే నాతో సహా అందరం సర్వనాశనం అయిపోతాం. ఇవాళ అదృష్టం కొద్దీ తలమీద దెబ్బ తగల్లేదు కానీ రేపు వాడికి ఏదో ఒకటి అవ్వొచ్చు. అయితే మాత్రం జుట్టుమీద కత్తి పెడితే వాళ్ల ఊరి వెంకటేశ్వరుడు తన సుదర్శన చక్రం మా మీద వదిలి చంపేయడూ? అవునా గీతా?" మరోసారి వెక్కిరించాడు రామారావు.

ఇంటాయన చెప్పేడు, కాస్త బుజ్జగింపు ధోరణిలో, "అలా అనుకోనవసరం లేదు. పుట్టువెంట్రుకలంటే, పూర్తిగా గుండు చేయించడం. మధ్యలో చిన్న కత్తెర వేసి కొంత కట్ చేస్తే అది పుట్టువెంట్రుకల కింద రాదు. అలాగని మరీ మంగలి షాపులో చేయించక్కర్లేదు కూడా"

"మరెలాగండి? మంగలి షాపుకెళ్ళకూడదు. ఇండియా వెళ్ళేలోపు మరో నాలుగు నెలలు పట్టేటట్టుంది."

"మీరే బాత్రూం లో ఓ చిన్న కత్తెర వేయండి రామారావు గారు," ఇంటాయన చెప్పేడు.

"ఈవిడ నన్ను ముట్టుకోనిస్తుందా? భలేవారే?" గీత ఎలా మూతి మూడు వంకర్లు తిప్పినా రామారావు తాను చెప్పాలనుకున్న మాట పైకి చెప్పేసేడు.

డిన్నర్ అయిపోయి ఇంటికొచ్చేటప్పుడు ఎవరికీ మాటల్లేవు. ఎలా ఉంటాయ్ అమ్మగారికి కోపం వస్తే? కుర్రాడు కారు సీట్లో పడుకున్నాడు హాయిగా. మర్నాడు ఆదివారం కుర్రాడు పొద్దున్నే ఆడుకుంటూంటే తీరిగ్గా లేచిన రామారావు కాఫీ కలుపుకోవడానికి కిచెన్ లోకి వెళ్ళినప్పుడు గీత చెప్పింది, "వాడికి మొహం మీద జుట్టు కత్తిరిస్తారా? కిందపడకుండా ఆడుకుంటాడు."

"అదేం, నేను వాడి జుట్టు మీద కత్తిపెడితే మహాపరాధం అన్నావుగా?"

"నిన్న భోజనం చేస్తూంటే ఆయన చెప్పారుగా కొంచెం జుట్టు కత్తిరిస్తే అది పుట్టువెంట్రుకలు తీయడం కింద రాదని, అందుకే. అదీకాక వాడికి కళ్ళు కనిపించడం లేదని మీరే అన్నారుగా?"

"వాళ్ళింటికి వెళ్లకముందు నేను ఎంత చెప్పినా అది కుదరదన్నావు కానీ, ఈ మధ్యనే ఈ ఊళ్ళోకి వచ్చి మొదటిసారి మనలని భోజనానికి పిల్చిన ఆయన చెప్పగానే అది రైట్ అయిపోయింది నీకు." కుర్రాణ్ణి ఎత్తుకుని బాత్రూం లోకి కదుల్తూ అన్నాడు రామారావు మొహం అదోలా పెట్టి.

గీత ఆ మాట విననట్టూ అంది, "కత్తెర వాడికి గుచ్చుకోకుండా జాగ్రత్త!"

**నీతిః ఏ నాటికైనా ముక్కూ మొహం తెలియని వాళ్ళు ఏది చెప్పారో అదే రైటు. తనతో ఎన్నాళ్ళో కలిసి ఉన్న మొగుడు చెప్పింది ఏ విషయంలోనైనా ఎప్పుడూ తప్పు. ఇంకా అర్థం కాలేదా? మరి మాట్లాడకండి.**

# ఎలక తోలు

**మూడేళ్ళు హెచ్–1** వీసామీద వంటింట్లో చేతులు కాల్చుకున్నాక ఇండియా వెళ్ళి రమాదేవిని పెళ్ళిచేసుకుని వెనక్కొచ్చేడు రాంబాబు. పెళ్ళిచూపుల్లో మాటల్లో చెప్పేడు కూడా రాంబాబు తనకి వంట అంతంత మాత్రంగా వచ్చనీ కానీ తాను వండినది తాను తినగలడనీను. రమాదేవికి వంట రాదుట కానీ బంగారు పిచిక లాంటి అమెరికాలో ఇంజినీర్ మొగుడు వస్తుంటే వంట అడ్డా? ఎప్పుడో నలుడూ, భీముడు వంట బాగా వచ్చినవాళ్ళంటే ఆ రోజులు వేరు. ఇప్పుడైతే రైస్ కుక్కర్ లో బియ్యం, నీళ్ళూ వేసి అలా స్నానం చేసి వచ్చేలోపున ఒక మెయిన్ వంటకం సిద్ధం. తర్వాత కూరా నారా ఉన్నా లేకపోయినా కొంచెం నూనె, పెరుగూ ఆవకాయ ఉంటే ఆ రోజుకి సరి. కాస్త వెసులుబాటు ఉంటే చేతిలో ఫోన్ మీద – ఇంగ్లీషులో, తెలుగీషులో లేకపోతే తెలుగులో అయినా సరే 'బీరకాయ కూర' అని కొడితే గూగిలమ్మ అన్నీ చేతికందిస్తుంది. అలా వంట అనేది పెద్ద గొడవే కాదు.

అయితే రమాదేవికి పెళ్ళైన ఆరునెలలదాకా వీసా రాలేదు. ఈ ఆరునెలల్లో రమాదేవి తల్లి లక్ష సార్లు కూతురికి వంట నేర్పుదామని ప్రయత్నం చేసింది కానీ తీరికేదీ? అసలే చేసే ఉద్యోగం జావా ప్రోగ్రామర్ అనబడే బ్రహ్మ పదార్థం. మిగతా లాంగ్వేజ్ ప్రోగ్రామర్లు రాముణ్ణి మ–రా, మ–రా అంటూ వాల్మీకి మహర్షి మొదట్లో గుర్తుంచుకున్నట్టూ, తనని జా–వా అనే అక్షరాలు తిరగేసి వా–జా, వా–జా అంటూ, వాజమ్మ అని వెక్కిరించినా, ఆఫీసులో తాను రాసిన జావా మీద మేనేజరు చేత ఎన్ని తిట్లు తిన్నా బయట సొసైటీలో మాత్రం తానో అతిరథ మహారథులైన సాఫ్ట్ వేర్ ఇంజినీర్లలో ఒకరు! కూతురికి వంట నేర్పడంలో ఇంక తానేం చేయలేనన్నట్టూ రమాదేవి తల్లి చేతులెత్తే సమయానికి వీసా వచ్చింది రమాదేవికి. ఆ తరం వాళ్ళకి యూ–ట్యూబూ అవీ తెలియవు కనకా, తెలిసినా పెద్ద చూడరు కనకా ఆవిడ రమాదేవికి 'ముప్పై రోజుల్లో వంద వంటలు' అనే ప్రముఖ టి.వి ఏంకరమ్మ రాసిన పుస్తకం, ఓ ప్రెషర్ కుక్కరూ, పోపు గిన్నెలూ, అలా మరికొంత సామాను కొని ఇచ్చింది. ఇవి కొనివ్వడానికి ఒకటే ఆలోచన. ఎప్పటికైనా – ఆవిడ తన జీవితంలో నేర్చుకున్నట్టూ – కూతురు కూడా నేర్చుకోవల్సిందే కదా? గుర్రాన్ని నీళ్ళ దగ్గిరకి తీసుకెళ్ళగలం కానీ దాని చేత నీళ్ళు తాగించగలమా?

కొత్త పెళ్ళాం అమెరికా వచ్చిన మూడు రోజుల్లో రాంబాబు కి అర్థమైనదేమంటే అమ్మగారికి వంట రాదు. అది సరే గానీ ఆవిడకి వంట నేర్చుకోవడం అంటే ఏ మాత్రం ఇష్టం లేదు. వంటింట్లో టైమ్ తగలేయడం కంటే పొద్దున్నలేచినప్పట్నుండీ రాత్రి పడుకోబోయేవరకూ తన వ్యాపకం – కంప్యూటర్. అందులో వెబ్ సైట్లు, సినిమాలు, పాటలు, ఆటలు, ఫేసు బుక్కు లాంటి అద్భుతమైన సరుకు ఉచితంగా వస్తూ

ఉంటే వంటింట్లో సమయం గడపడం ఎంత అవమానం! పెళ్ళాం కొత్తది కనక మొదటి మూడు నెలలూ రాంబాబే వంట చేసి పెట్టేడు రమాదేవికి.

మూడునెలల్లోనే అమ్మగారికి ఉద్యోగం రాదు కనక ఆవిడ ఇంకా అప్లికేషన్ లు పెడుతున్నారు. ఇంట్లో లాప్ టాప్ మీద వరస మామూలే. అయితే వంటింట్లో మైక్రోవేవ్ వల్లా, రడీగా తినడానికి సీరియల్, డోనట్ లాంటివి ఉండడం వల్ల రాంబాబు ఆఫీసుకెళ్ళిపోయాక అమ్మగారు ఇవి తింటూ కాలక్షేపం చేస్తున్నారు. సాయంత్రం రాంబాబు వచ్చి వండి వారుస్తాడు తన కొచ్చిన విధంగా వంట. వచ్చిన వంట అంటే చారు కాచడం, బంగాళా దుంప వేపుడు, రమాదేవికి వంట రాకపోయినా ఆవిడ కూడా తెచ్చిన పుస్తకం చూసో, యూ ట్యూబ్ చూసో వంకాయ పచ్చడి, లేకపోతే బీరకాయ కారం కూర. చికెన్, మటన్ లాంటివి వండడంలో రాంబాబు సిద్ధహస్తుడవుతున్నాడు. రోజులు గడిచే కొద్దీ రాంబాబు దారిలో పడుతున్నాడు.

ఎప్పుడైనా రాంబాబు రమాదేవిని వంటింట్లోకి హెల్ప్ కోసం పిలిస్తే ఆవిడ గోముగా వయ్యారాలు పోతూ రాంబాబు వంట మెచ్చుకుంటూ, అతను ఎంత మంచి మొగుడో చెప్తూంటుంది. దాంతో ఐస్ అయిపోయి రాంబాబు ఏమీ అనడు. అయినా పెళ్ళాం మొగుడి వంట మెచ్చుకోవడం గొప్ప కాదుటండీ? నలుడు, భీముడూ కూడా బాగా చేసేవార్ట వంట. ఎప్పుడైనా రాంబాబు కి వంట్లో బాగోలేనప్పుడో, బోరు కొడితేనో బయట టాకోలో, పిజ్జాలో ఉండనే ఉన్నై. శని ఆదివారాల్లో ఎవరైనా భోజనానికి పిలిస్తే హాయి. లేకపోతే 'ఆల్ యు కెన్ ఈట్' అనే బఫే లంచ్ లు ఉన్నాయి కూడా, రారమ్మని పిలుస్తూ. అలా చిలకా గోరింకలు చలామణీ అయిపోతున్నారు. అమ్మగారు అందరి దగ్గిరా – అంటే తమకి తెల్సిన దేశీయులందరి దగ్గిరా వాళ్ళాయన ఎంతటి గొప్ప వంటవాడో, అసలు తనని వంటింట్లో ఏదీ ముట్టుకోనివ్వడో గొప్పలు పోతూ చెప్పుకుంటూ ఉంటుంది. రాంబాబు భుజాలు పొంగించుకుంటూ ఉంటాడు.

అమ్మగారు అమెరికాలో దిగిన ఎనిమిది నెలలకి కాబోలు కడుపులో ఏదో తేడాగా ఉంటే డాక్టర్ దగ్గిర తేలారు. మొదటగా చూడాల్సింది రక్తం. అప్పుడు చెప్పిన విషయాల ప్రకారం ట్రై గ్లిసరైడ్స్ అమ్మగారికి మూడు వందల యాభై, కొలెస్టరాల్ రెండువందల ముప్పై, గ్లూకోజ్ నూట నలభై. డాక్టరమ్మ తనకి కొడుకో కూతురో పుడతారని మంచి వార్త చెప్తుందనుకున్న చిలకా గోరింకా నీర్సపడిపోయేరు. ఈ అంకెల్తో కళ్ళు తిరుగుతూ కడుపులో తేడాగా ఉందంటే ఉండదూ మరి? అర్జెంటుగా ఇప్పుడు చేయాల్సింది – తినే తిండి మార్చడం. బయట తినరాదు. ఇంట్లో ఎండు రొట్టెలు, నీళ్ళపాలు, వగైరా. అన్నింటికన్నా ముఖ్యం అమ్మగారు బరువు తగ్గాలి, రోజూ ఎక్సర్ సైజు తప్పనిసరి. రోజూ తినే అన్నం – అదే వైట్ రైస్ తొంభై శాతం తగ్గించాలి. ఏదైనా తినవలసింది కొంచెం కొంచెం గా మాత్రమే.

ఇదంతా విన్నాక రమాదేవి డాక్టర్ తో చెప్పేసింది రాంబాబు వింటూండగానే – "ఈయనకి వంట రాదు. ఆయన ఏది చేసి పెడితే అది నేను తినాల్సి వస్తోంది అసలే నేను ఉద్యోగం లేక కాస్త డిప్రెషన్ లో ఉన్నాను. అందువల్ల ఇలా అయింది. ఇప్పట్నుండీ ఏదో ఒకటి చేస్తాం." ఎదురుగా డాక్టర్ లేకపోతే ఏమై ఉండేదో కానీ చేతి పిడికిళ్ళు బిగుసుకున్న రాంబాబు ఇప్పుడు మొహం గంటు పెట్టుకుని వినీ విననట్టు ఊరుకున్నాడు. అబలల మీద, అమాయకపు ఆడవారి మీద అందులోనూ విట్ నెస్ లు ఎదురుగా ఉండగా, చేయి చేసుకుంటే జైల్లో పెట్టరూ?

ఇంటికొచ్చాక ఒకరి మీద ఒకరి అరుపులు. "నీకు వంటరాదు, నువ్వు నేర్చుకోవు, అస్తమానూ లాప్ టాప్ మీద కూర్చుని ఏమిటి నువ్వుచేసేది" అంటూ ఈయన.

"నేను వంటెందుకు నేర్చుకోవాలి. ఈ రోజుల్లో ఆడా మగా సమానం అంటుంటే, అదీ గాక నేను ఉద్యోగం కోసం రోజూ అప్లికేషన్ లు పెడుతూ చూస్తున్నా" అంటూ ఈవిడా.

ఇవి ఎప్పటికీ తెమిలేవి కాదు కనక అరుపులు తగ్గాక మళ్ళీ మామూలుగా జీవితం. ఇదంతా ఇండియాలో వాళ్ళకి జేరడానికి మరో రోజు పట్టాక రాంబాబు అత్తగారు ఏదో అనబోతూ ఉంటే కూతురికీ అల్లుడికీ వినిపించకుండా మామగారు ఆవిడని వారించాడు అట్నుంచి – వాళ్ల గోల వాళ్ళని పడనీయ్ అంటూ.

ఈ తలనెప్పి అంత తొందరగా వదలదు కనక డాక్టర్ ఇచ్చిన మందులేసుకుంటూ, పక్కనే ఉన్న ఒక హెల్త్ క్లబ్బులో తేలారు చిలకా గోరింకాను. మీకు జీవితంలో ఇన్ని కిలోగ్రాముల రైస్, ఇన్ని కిలోల పంచదార, ఇన్ని కూరలు, ఇన్ని కోళ్ళూ, ఇన్ని గుడ్లూ, ఇంత మాంసం అని బ్రహ్మ రాత రాసిపెట్టి ఉంటుంది. అంటే బతికే అరవై డబ్బై ఏళ్ళకి సరిపడా కూడు బ్రహ్మ గారు ఇచ్చి పడేసారు. అందులో జీవితాంతం తినాల్సినవి ముప్పై ఏళ్ళకే తినేసారనుకోండి, ఏమౌతుంది? కోటా అయిపోయింది కనక ఆ తర్వాత ఎండు గడ్డి తినాలి, అవునా? అలా హెల్త్ క్లబ్ లో చేరిన చిలకా గోరింకలకి ఇప్పుడు తిండి పలచబడింది. పొద్దున్న నీళ్ళపాలు, పంచదార లేని సీరియల్ చిన్న కప్పుతో మాత్రం, మధ్యాహ్నం ఒక కారట్, ఆకలేస్తే "పేద్ద గ్లాసుడు" మంచినీళ్ళూ, సాయంత్రం గ్రీన్ టీ, రాత్రికి మళ్ళీ ఎండుగడ్డి అనబడే ఒక రొట్టె – అవును అన్నీ పటేల్ వారు అమ్మేవే. ఎందులోనూ నూనె ఉండరాదు. అయితే ఒక్కసారి సడన్ గా ఉపవాసాలు మొదలుపెడితే ఢాం అని చచ్చిపోతారు కాబట్టి మెల్లిగా ఒక్కోటీ తగ్గించుకుంటూ, మందులేసుకుంటూ బయట తిళ్ళూ, పార్టీలు కట్టేసి, ఓ ఏడాది కి మళ్ళీ సరిగ్గా లైన్లోకొచ్చారు దంపతులు. ఈ సారి మరో టెస్ట్ లో డాక్టరమ్మ చెప్పినది – రక్తం మామూలు లెవెల్లోకి వస్తోంది. ఇప్పుడే అతి జాగ్రత్త అవసరం లేకపోతే అమాంతం మళ్ళీ పెరుగుతాయి.

కొన్నాళ్ళు పోయేక ఇండియా సంఘంవారు ఎక్కడో పార్టీకి పిలుస్తే వెళ్ళారు – గత ఏడాదిలో ఎప్పుడూ వెళ్ళలేదు కదా అనుకుంటూ. సమోసాలు, ఛాట్ లు నోరు ఊరిస్తూ కనబడినా సలాడ్ అనే ఎండుగడ్డి మెల్లిగా నవుల్తూ ఉంటే ఓ పెద్దాయన వచ్చి పలకరించాడు, "సరిగ్గా అన్నీ అందుతున్నాయా, తిండి బాగుందా, అబ్బే ఏమీ సరిగ్గా తినడంలేదు మీరు, వచ్చి ఇలా ఓ ప్లేట్ బిర్యానీ తీసుకోండి" అంటూ.

రాంబాబు లేవబోతూంటే రమాదేవి అడ్డుకుని చెప్పింది, "వద్దండీ మేము డైట్ మీద ఉన్నాం."

"అదేమిటండోయ్, మీరిద్దరూ చూడబోతే ముప్పై ఏళ్లలోపు ఉన్నారు. ఇప్పుడే డైట్ ఏమిటీ?"

"మా ఆయనకి అసలు వంట రాక మసాలాలు, మీగడా, వెన్నా అన్నీ కలిపేసి వండేసేవాడు, అవన్నీ ఎంత డోకు వచ్చినా తినేసేవాళ్ళం. అందువల్ల ఇలా అయింది. అయినా మొగాళ్లందరూ ఇంతే," నవ్వుతూనే అంది రమాదేవి.

"భలేవారే, ఆ మాత్రం వంటరాని మొగుళ్ళెవరండీ అమెరికాలో?"

"ఎవరా ఇదిగో మా ఆయనే ఉన్నాడు. ఈయనకి పప్పులో పోపు వేయడం కూడారాదు. చికెన్ అయితే అది కడిగేసి వెన్న రాసి మూత పెట్టేసి పటేల్ లో దొరికో పొడి దాని మీద చల్లుతాడంతే."

అమెరికా వచ్చినప్పటినుంచి ఇప్పటివరకూ ఈవిడ వంటింట్లో చేయి వేయకపోవడం, గతిలేక తాను వంట నేర్చుకోవడం, అందులో ఆవిడ తెచ్చిన పుస్తకం చూసీ, యు-ట్యూబ్ చూసీ నేర్చుకున్నవీ, అవి వండాక మహారాణిగారు తనని ఇంటా బయటా మెచ్చుకోవడం గుర్తొచ్చాయి రాంబాబుకి. ఈ రెండేళ్లలో తను నేర్చుకోని, తనకి రాని వంటలేదు. ఆఖరికి ఒక పార్టీలో చికెన్ మసాలా తన చేత చేయించింది కూడా ఈవిడ, బాగుంటుందని ఊదరకొట్టి. ఇంత చేసాక తన వంట లొట్టలు వేసుకుంటూ తినడం, పార్టీల్లో తానెంత గొప్ప వంటవాడో అందరికీ చెప్పిన రమాదేవేనా ఈవిడ? అంత చేసి పెట్టినా ఇప్పుడు ఈవిడ అనేదేమిటీ? తనకి వంటరాదు. ఆ మాట పోనీ తనతో చెప్పిందా? డాక్టర్ దగ్గిరా ఈ ముక్కూ మొహం తెలియని ఇండియన్ దగ్గిరా తన గోడు వెళ్ళబోసుకుంటోంది, ఇదంతా తన తప్పు అన్నట్టూ. తాను వంట చేయకపోయి ఉంటే ఈవిడ ఏమి చేసి ఉండేది?

ఎందుకో ఆ రోజు రాంబాబుకి ఎన్ని అప్లికేషన్ లు పెట్టినా ఇప్పటికీ ఉద్యోగం రాని జావా ప్రోగ్రామర్ రమాదేవిని ఒకప్పుడు ఆవిడ పనిచేసిన ఇండియా ఆఫీసులో వాజమ్మ అని పిలవడంలో ఏదో నిజం ఉందనిపించింది.

**నీతిః మీరు ఎంత కష్టపడి మీ ఆవిడకి వండి పెట్టినా, నలభీమ పాకం అనేది పుస్తకాల్లో చదువుకునేది మాత్రమే. మొగాడి వంట ఎలకతోలు లాంటిది. దొన్ని తెల్లగా చేయడానికి తోమడం అనవసరం/అసంభవం; అది కనీసం మీ గురించి మీ ఆవిడ అభిప్రాయం.**

# కియా బ్రాండ్

**ఎప్పుడో రెండు** వారాల క్రితం కాబోలు శ్రీకాంత్ చెప్పేడు సుమతో, హిందీ తెలుగు తమిళ సినిమా తారలందరూ కలిసి వాళ్ల ఊరు వస్తున్నారు. వీళ్ల ని చూడ్డానికి తనకి స్థానిక ఇండియా సంఘం వారు రెండూ టికెట్లు అంటగట్టారు. ఎలాగా కొన్నాం కనక వెళ్ళాలి. లేకపోతే ఈ డబ్బులు గంగలోకి పోయినట్టే.

"రెండు వారాల తర్వాత కదా?" సుమ అంది తేలిగ్గా.

"ఇప్పట్నుంచీ చెపితే అప్పటికి తెములుత్తావేమోనని చెప్పానులే," వెక్కిరించేడు శ్రీకాంత్.

సాయంత్రం ఆరింటికి ప్రోగ్రాం. వెళ్ళడానికి గంట పడుతుందనుకుంటే, కనీసం నాలుగున్నరకి బయల్దేరొద్దూ? రెండు దాటుతుంటే, శ్రీకాంత్ 'తెములు, తెములు' అంటూ సణగడం మొదలు పెట్టాడు. ఆయనకి దారంతా డ్రైవింగ్ ఎలా ఉంటుందా, కార్ పార్కింగ్ సరిగ్గా దొరుకుతుందా లేదా, ప్రోగ్రాం అంతా అయ్యాక క్షేమంగా రాగలమా అనేవి పడితే సుమకి ఎలాగోలా సరైన భారతీయ బట్టలు వేసుకున్నామా, అందర్లో సరిగ్గా కనిపించామా అన్నవే. ఆవిడ ఒక్కో డ్రెస్ వేసుకోవడం, బాగోలేదు మరోటి అంటూ ఇంకోటి ట్రై చేయడం, జరుగుతూంటే గడియారం వీళ్ళిద్దర్నీ చూసి నవ్వుకుంటూ ముందుకి పరుగెడుతూనే ఉంది.

ఓ డ్రెస్ వేసుకున్నాక వచ్చి ఈ డ్రెస్ బాగుందా అని అడగడం, ఈయన ఆ బాగానే ఉందనడం, మరో డ్రెస్ మరోసారి అడగడం, ఈ లోపుల టైమ్ నాలుగున్నర. ఈయనకి నీలం రంగు నచ్చితే అమ్మగారికి లేత ఆకుపచ్చవి నచ్చుతాయి. అలాగని పైన వేసుకునేది నీలం, కిందవేసుకునేది ఆకుపచ్చవి వేసుకోవడం కుదర్దని ఆవిడ ఉవాచ.

పీకలమీదకి కోపం వచ్చి 'ఇంక దీనికి వెళ్ళడం మానేద్దాం' అందామని శ్రీకాంత్ కి అనిపించింది కానీ అలా అంటే మిగతా వీకెండ్, ఆ తర్వాత మరో వారం రోజులూ జీవితం ఎలా ఉంటుందో తెలుసు కాబట్టి నోరు మూసుకోవాల్సిన పరిస్థితి. అదీగాక ఈ షో కి డబ్బులు చాలా వదిలాయి. అలా లోపల గింజుకుంటూ, పైకి వెర్రి నవ్వులు నవ్వుతూ మొత్తానికి బయటకొచ్చేసరికి అయిదుంపావు. మరో నలభై నిముషాల్లో యాభై మైళ్ళు వెళ్ళి కారుపార్క్ చేసి సరైన సీటు సంపాదించాలి. ఈ లోపున ఏ అడ్డంకీ రాకపోతేనే సాధ్యం ఇవన్నీ.

బండి హైవే మీదకి వెళ్ళాక శ్రీకాంత్ తన పవర్ చూపించడం మొదలుపెట్టాడు స్పీడు ఎనభై కి పెంచి.

"జాగ్రత్త, పోలీస్ పట్టుకుంటే ఫైన్, మరింత లేటూ అవుతుంది," సుమ హెచ్చరించింది పక్కనుంచి.

లోపల కోపం వచ్చినా, సుమ చెప్పినది నిజమే కనక స్పీడు తగ్గించేడు. మరో ఇరవై తొమ్మిది మైళ్ళు వెళ్ళాక ముందు ట్రాఫిక్ జామ్ అయి ఉండడంతో స్పీడు తగ్గించక తప్పలేదు. కాసేపటికి తెలిసినదేమంటే, ముందు పెద్ద ఏక్సిడెంట్ అయింది. అందులో ఎవరైనా గాయపడ్డారో అదీ తెలియదు. అది క్లియర్ అయ్యేదాకా ఆగాల్సిందే.

శ్రీకాంత్ కి లోలోపల కోపం గా ఉంది. ఈవిడ అనుకున్న ప్రకారం బయల్దేరితే ఈ పాటికి వెళ్ళిపోయి ఉండేవారు కదా? అయినా పెళ్లై ఎన్నేళ్ళయినా ఇదే సంతా? ఎప్పుడు ఎక్కడికి వెళ్ళాలన్నా లేటు గా బయల్దేరడం. డాక్టర్ దగ్గిరకి లేటు, గుడికి లేటు, ఏదైనా ప్రయాణానికి బయల్దేరదామనుకుంటే లేటు. ఇండియా వెళ్ళడానిక్కూడా ఎయిర్ పోర్ట్ కి రెండు గంటల ముందు రావాలోయ్ అని వాళ్లు మొత్తుకుంటున్నా మనం ఎప్పుడూ అలా వెళ్లం.... ఈ గొడవలో ఉండగా తెలిసి వచ్చినది – పైన ఏదో హెలికాప్టర్ వస్తున్న చప్పుడు.

ఎవరో అనుకుకోవడం వినిపించింది, "ఇద్దరు పోయారు, మూడో ఆయనని హెలికాప్టర్ లో ఆస్పత్రికి తరలిస్తున్నారు. ట్రక్, కారు కలిసిన దారుణమైన ఏక్సిడెంట్." అంత కోపం ఒక్కసారి చల్లారిపోగానే హైవే మీదే అందరూ దిగి చూస్తుంటే కారు తలుపు తీసి తానూ కిందకి దిగేడు శ్రీకాంత్ ఏమైందో చూడ్డానికి. కొన్నిక్షణాలు అలా నుంచున్నాక ముందుకెళ్ళి చూద్దామా అనుకున్నాడు కానీ బాగోదని వచ్చి కూర్చున్నాడు. చావు సంగతి వినగానే అదో రకం శోకం మనసులో. ఆ ఏక్సిడెంట్ తనకి కానందుకు సంతోషమా?

మరో అరగంట అలాగే మాటామంతీ లేకుండా కూర్చున్నాక సుమతో చెప్పేడు, "ఏదో ఏక్సిడెంట్ అనుకుంటా, ఇద్దరు పోయారుట, మరో మనిషిని హెలికాప్టర్ లో తీసుకెళ్తున్నారని చెప్పుకుంటున్నారు. మరో అరగంట పట్టవచ్చు."

"అయ్యో, మరెలా?"

"ఏం చేస్తాం, అవతల మనిషి చావు బతుకుల్లో ఉన్నాడంటున్నారు కదా?"

దాదాపు ఆరు అవుతుంటే మెల్లిగా నత్త నడక మొదలుపెట్టింది ట్రాఫిక్. కారు అద్దాల్లోంచి చూస్తే తెలిసిన విషయం, దెబ్బ తగిలిన కారు నుజ్జై పోయింది. అసలు అందులో మనుషులు ఒకరో ఇద్దరో బతకడం కూడా అసంభవం. ఆ హెలికాప్టర్ లో మనిషి ఎలా బతికాడో మరి. అక్కడనుంచి బయల్దేరాక మరో నలభై నిముషాలకి కార్ పార్క్ చేసి లోపలకెళ్ళారు. అదృష్టం, ఆరూ నలభై అవుతున్నా ఇంకా అసలు ప్రోగ్రాం మొదలవలేదు. పట్టు చీరల గరగరలు ఇంకా వస్తూనే ఉన్నాయి. మంచి సీటు చూసుకుని కూర్చున్న మరో అరగంటకి ప్రోగ్రాం మొదలైంది.

అల్లాటప్పా ఏక్టర్లు మొదట్లో స్టేజి మీద కబుర్లు తర్వాత పెద్ద తలలు, మధ్య మధ్యలో సినిమా పాటలు, కాస్త విరామం మళ్ళీ ఇటువంటివే. అలామూడు గంటలు అయ్యేక చివర్లో భోజనాలు. దాదాపు పదకొండింటికి బయటకొచ్చి కారెక్కారు వెనక్కి రావడానికి. బండి ముందుకి పోనిస్తూ చెప్పేడు శ్రీకాంత్, "నువ్వు పడుకోకు కారులో. నన్ను కబుర్లలో పెట్టకపోతే హైవే మీద నాకు నిద్ర వచ్చి ఏక్సిడెంట్ అవ్వొచ్చు." సరేనని సుమ బుర్ర ఊపాక బండి బయల్దేరింది.

బయల్దేరినప్పుడున్న కోపం ఇప్పుడు లేదు శ్రీకాంత్ కి. దారిలో చూసిన ప్రోగ్రాం గురించీ తిన్న తిండి గురించీ వీటికి గుంజిన డబ్బుల గురించీ కబుర్లవుతూంటే వెళ్ళేటప్పుడు ఏక్సిడెంట్ అయిన స్థలం దగ్గిరకొచ్చింది బండి. చూసిన ఏక్సిడెంట్ గుర్తొచ్చి, శ్రీకాంత్ అన్నాడు, "పాపం ఏమైందో మూడో ఆయనకి?"

"రేపు టివిలోనో పేపర్లోనో తెలుస్తుందనుకుంటా," సుమ చెప్పింది.

ఇంటికొచ్చి మంచం మీదకి చేరాక శ్రీకాంత్ అన్నాడు,"లేట్ గా బయల్దేరినా మొత్తానికి ప్రోగ్రాం మిస్ అవలేదు."

"ఇప్పటికైనా అర్ధమైందా?" సుమ అంది.

"ఏమిటి అర్ధం కావడం?"

"నేను మీరు చెప్పినట్టూ నాలుగున్నరకి బయల్దేరి ఉంటే ఆ ఏక్సిడెంట్ మనకే అయి ఉండేదేమో? అయినా ఇండియన్ ప్రోగ్రాం ఏదీ సమయానికి మొదలు పెట్టరని తెలియదా, నన్ను ఉత్తినే కంగారు పెట్టడం దేనికీ?"

ఏక్సిడెంట్ తమకే అయి ఉంటే అనే ఆలోచన రాగానే శ్రీకాంత్ సన్నగా వణికేడు. సుమని దగ్గిరకి లాక్కుంటూ అన్నాడు, "ఈ సారికి నువ్వు నెగ్గినట్టే కానీ అస్తమానూ అలా లేట్ గా బయల్దేరకు డార్లింగ్. అయినా ఇలా జరుగుతుందని ముందే ఎలా తెలుస్తుంది? అస్తమానూ ఇలా అవదుకదా?"

"ఇప్పుడు అలా అయినా అవకపోయినా, ఎప్పుడూ నాకు తెలుస్తుంది; ఐ నో ఇట్ ఆల్!" సుమ కూడా దగ్గిరకి జరిగి శ్రీకాంత్ ని హత్తుకుని నవ్వుతూ అంది.

**నీతిః ఏ విషయంలోనైనా సరే కంగారు పనికిరాదు. అమ్మగారి బ్రాండ్ కియా వాడుడు. కియా అనగా కె – నో (know), ఐ – ఇట్ (it), ఎ – ఆల్ (all).**

# జీవితం

**అర్ధరాత్రి ఒంటిగంటో** రెండో అయినప్పుడు కాబోలు నారాయణకి ఇండియానుండి ఫోన్ వచ్చింది. మావయ్య చేసాడు – తన కూతురి పెళ్ళి ఇరవైరోజుల్లో పెట్టుకున్నాట్ట. తప్పకుండా "బంధు మిత్ర సపరివారంగా" వచ్చి తీరాలని చెప్పేడు. ఈ మాత్రం దానికి అపరాత్రి అర్ధరాత్రి అని చూసుకోకుండా ఫోన్ చేయడం దేనికో అని నారాయణ అనుకున్నాడు కానీ నిద్ర పాడైనందుకు అరిస్తే బాగుండదని నోరుమూసుకున్నాడు. పై వారాంతంలో ఇంటర్నెట్ మీద కూర్చుని గాలిస్తే నారాయణకి తెలిసొచ్చిన విషయం – ఈ పెళ్ళిళ్ల సీజన్ తో టికెట్ రెండువేలకి పైబడి ఉంది. బంధుమిత్ర సపరివారంగా అంటే అమ్మగారు, యువరాణీ, రాజూ కలిపితే మొత్తానికి ఎనిమిదివేల డాలర్లు. ఆ పైన ఇండియాలో "కనబడిన ప్రతీ వస్తువు" కొనేటప్పటికి మరో రెండు వేలు వదుల్తాయి. ఏది ఏమైనా పదివేల డాలర్లకి నీళ్ళధారే. దీనికన్నా హవాయి వెళ్ళిరావడం చవక. కానీ అది పైకి చెప్పరాదు. నోరు విప్పితే అక్షింతలు పడవూ, మా కన్నా హవాయి ఎక్కువా అంటూ?

దీనికున్న మరో దారి తానొక్కడూ వెళ్ళడం. మూడువేలలో కొట్టుకురావొచ్చు; సకుటుంబ, ధర్మపత్నీ సమేతస్య అనడానికేం? అలా ఇంట్లో భారతిని, యువరాజు రాణీలని ఒప్పించి మొత్తానికి ఒకటే టికెట్ కొని పెళ్ళికెళ్ళేడు నారాయణ. అయితే డబ్బులు దగ్గిర చిన్న తిరకాసు వచ్చింది. చేతికి ఎముకలేకుండా ఎప్పటి డబ్బులు అప్పుడు ఖర్చు అవుతున్నాయి కనక బేంక్ లో డబ్బులు చూసుకుంటే సరిగ్గా రెండువేలు మాత్రం ఉన్నై. అమ్మగారు ఉద్యోగంలో చేరినప్పటినుండి ఆవిడ డబ్బులు వేరేగా దాస్తున్నారు కనక ఆవిడని అడిగితే ఇస్తారు కానీ తర్వాత ఇచ్చేయాలి. ఎంత పాపాత్ముడు కాకపోతే స్త్రీ ధనం వాడతాడు? అలా భారతి దగ్గిర డబ్బులు తీసుకుని టికెట్ కొని ఇండియా వెళ్ళేడు నారాయణ. వెనక్కి వచ్చేలోపుల జీతం వస్తుంది; రాగానే ఇచ్చేస్తాడు కదా? దానికేం తొందర అయినా? అమ్మగారి దగ్గిర తీసుకోవడం అంటే జీరో పెర్సెంట్ ఇంటెరెస్ట్ లోన్ కాదూ?

పెళ్ళికొడుక్కీ, పెళ్ళికూతురికీ తలో సిటిజెన్ వాచ్ కొని పట్టుకెళ్ళాడు. ఆ వాచీలు కొనడానికి ఓ షాపులో వారిచ్చిన ముప్పై శాతం డిస్కౌంట్ వాడాడనీ, అందువల్ల రెండు వాచీలు కలిపి నూట యాభైలోపునే కొన్నాడనీ చెప్పలేదు ఎవరికీ నారాయణ. అమెరికా నుంచి సిటిజెన్ వాచీలు పట్టుకుచ్చేడు మా మేనల్లుడు అని మావయ్య బంధువుల్తో చెప్పుకుంటే నారాయణ సంతోషపడ్డాడు కూడా. పెళ్ళి అయ్యేక అందరికీ కావాల్సిన ఇండియా బట్టలూ, నాలికబద్దలూ, పొడులూ, పచ్చళ్ళూ, స్వీట్లూ, జంతికలూ అన్నీ పట్టుకుని వెనక్కొచ్చాడు. ఖర్చు లెక్క చూసుకుంటే మొత్తానికి మూడువేల ఎనిమిదివందలు తేలింది. ఫర్వాలేదు. భారతికి కొన్న చీరలూ, డ్రెస్ లూ, యువరాజా, రాణీలకి బట్టలూ వగైరా చూస్తే అంతా హుపీస్ అని చెప్పుకోవాలిసిందే. బేంక్ ఖాతా చూస్తే జీతం వచ్చి ఉంది. అయితే ఖర్చులకి డబ్బులుంచుకుని మిగతాది భారతికి ఇవ్వడానికి రెండు మూడు నెలలు పట్టింది. అయితేనేం, అనుకున్నట్టుగా అమ్మగారికి – అయితే మాత్రం అప్పు అప్పేకదా – ఇవ్వాల్సిందే. ఇవ్వనంత కాలం ఆ మాట భారతి రెండు మూడు రోజులకోసారి గుర్తు చేస్తూనే ఉంది. అది నారాయణకి ఎప్పటికప్పుడు మనసులో ముల్లులా గుచ్చుకుంటూనే ఉంది.

మొత్తానికి జీరో ఇంటరెస్ట్ లోన్ కట్టేసాక అదో హాయి. ఈ లోపుల అమ్మగారు కాస్త గునిసారు త్వరగా డబ్బులివ్వలేదనీ, అయినా ఈ మాత్రం పెళ్ళికి ఈయనగారు వెళ్లడం ఎందుకనీ, మరోటనీ. నారాయణ మాత్రం రాముడు మంచి బాలుడిలా నోరుమూసుకున్నాడు, ఏమీ సమాధానం చెప్పకుండా. అయినా మీకు తెలియనిదేముంది, ఇటువంటి విషయాల్లో మౌనమే మంచిదని జగద్విదితం కదా? అయితే డబ్బులు లేటుగా ఇచ్చినందుకు అమ్మగారు తనకి ఏదో పాఠం నేర్పడానికి వేరేగా ఏదో ప్లాన్ వేసుకున్నారని నారాయణకి తెలియలేదు.

ఆరునెలలు గడిచాక ఓ రోజు మళ్ళీ ఫోన్ ఇండియా నుంచే. భారతి తమ్ముడికి మోటార్ సైకిల్ ఏక్సిడెంట్ అయింది. ఓ కాలూ రెండు పక్కటెముకలూ విరిగేయి. బాగానే ఉన్నాడు కానీ ఓ సారి అక్క రావడం కుదురుతుందా చూసిపోవడానికి అని సందర్భం చెప్పేరు. ఇది జరిగింది అక్టోబర్ నెలలో. ఓ సారి మళ్ళీ ఇంటర్నెట్ మీద టికెట్ల గురించి చూస్తే ఇప్పుడు తెల్సిన విషయం – ఒక్కో టికెట్ పన్నెండు వందలు. మరీ అంత చవకా కాదు, ఖరీదూ కాదు. నారాయణ ఈ మధ్యనే పెళ్ళికి వెళ్ళాడు కనక మరోసారి వెళ్ళడానికి శెలవు లేదు. అక్టోబర్ కనక యువరాణీ రాజులకి స్కూల్ ఉంది. అలా భారతి ఒక్కర్తీ వెళ్ళాలి. కుదుర్తుందా? మళ్ళీ ఓ సారి బేంక్ లో చూసుకుంటే నారాయణ దగ్గిరున్నవి మూడువేలు. రెండువేలలో అమ్మగారు వెళ్ళి వచ్చేయవచ్చు.

అయినా భారతి ఉద్యోగం చేస్తోంది కదా, ఆవిడ డబ్బులు ఆవిడ పెట్టుకోలేదా? నారాయణ ఆ మాటే భారతితో అంటే ఆవిడే చెప్పింది, "ముందు మీరు టికెట్ కొనండి, నేను వెనక్కి వచ్చాక ఆలోచిద్దాం, డబ్బుల సంగతి. ఇప్పుడు అసలే తమ్ముడికి ఏక్సిడెంట్ అయి మంచం మీద ఉన్నాడు."

అలా అమ్మగారు ఇండియా వెళ్ళిపోయారు దర్జాగా. వెనక్కి వచ్చేటప్పుడు మళ్ళీ ఇండియా బట్టలు, పచ్చళ్ళూ, పొడులూ వగైరా. వెనక్కి వచ్చాక ఖర్చు చూసుకుంటే ఈ సారి కూడా మూడువేల పైన అయింది. కొన్నాళ్ళు పోయాక నారాయణ అడిగేడు, "నీకు టికెట్ కొనడానికి డబ్బులు ఇస్తానన్నావు కదా, ఇస్తావా?"

"నేనిస్తానని ఎప్పుడూ చెప్పలేదే? అయినా నన్ను పోషించడం, ఇటువంటి వాటికి ఖర్చుపెట్టడం మీ బాధ్యత. అయినా అంత పీనాసితనం ఏవిటి? మనందరం ఒక కుటుంబం కాదా?"

"అవునులే అయినా నేను వెళ్ళినప్పుడు నీదగ్గిర తీసుకున్న డబ్బులు ఇచ్చేసాను కదా? అన్ని ఖర్చులూ పెట్టుకుంటూ, క్రెడిట్ కార్డ్ బిల్లులు కట్టుకుంటూ, ఈ ప్రయాణం ఖర్చులూ అవీ పెట్టుకోవడానికి నా జీతం ఎక్కడా సరిపోవడంలేదు. చూస్తున్నావు కదా?"

"ఆ, ఇచ్చారు, దానికి మూడు నాలుగు నెలలు ఏడిపించి మరీ ఇచ్చేరు. మీకివ్వడానికి బదులు ఏ బేంకులో పెట్టుకున్నాకాస్త ఇంటరెస్ట్ అయినా వచ్చేది."

"మరి మిగతా డబ్బుల్తో ఇంటికి మోర్గేజీ, ఖర్చులూ అవీ నేనే పెట్టుకుంటున్నా. నిన్ను ఒక్కపైసా అడగలేదు. అందువల్లే అలా లేట్ అయింది కానీ నిన్ను ఏడిపించాలని కాదే?"

"ఆ ఖర్చులన్నీ మీ బాధ్యత అని చెప్పాను కదా? నేను సంపాదించేస్తున్నానని ఏడుపా? నేనెందుకివ్వాలి అసలు వీటికి డబ్బులు? అయినా మీ కళ్ళు నా జీతం మీద పడ్డాయే ఈ మధ్యన? ఆ మాత్రం పెళ్ళాం పిల్లల్ని పోషించలేనివారు పెళ్ళెందుకు చేసుకున్నట్టో?" విసురుగా అనేసి మరో గదిలోకి వెళ్ళిపోయింది భారతి.

ఆ రోజు రోజంతా ఎందుకో నారాయణకి తాము నలుగురూ ఒకే ఇంట్లో రూమ్మేట్లుగా కలిసి ఉంటున్నాం కానీ భారతి చెప్పిన కుటుంబంలా కాదు అని లక్షసార్లు అనిపించాక, జ్ఞాన నేత్రం తెరుచుకుంది – పెళ్ళయిన ఆలుమగలు పుట్టిన పిల్లలతోపాటు ఒకే ఇంట్లో ఉన్నా, ఒకే బెడ్రూంలో ఒకే మంచంమీద పడుకున్నా ఎవరికి వారే యమునాతీరే.

**నీతిః స్త్రీ ధనం ఆశించరాదు. అమ్మగారి జీ(వి)తం ఎప్పుడు అమ్మగారిదే.**

# నోటి ముందు దూకుడు

**ఇండియాలో** రిజర్వేషన్లు ఉన్నట్టే అమెరికాలో కూడా ఉన్నాయి కానీ అవి బయటకి కనిపించవు. అవి దేశీ ఇంట్లో మాత్రం తూ.చ తప్పకుండా జరిగిపోతూ ఉంటాయ్. ఇది నమ్మశక్యంగా లేకపోతే ఓ సారి వెనక్కి చూసుకోండి.

యూనివర్సిటీలో చదువుకునేటప్పుడు మీరు ఒకరిద్దరి రూమ్మేట్స్ తో ఉండేవారా? ఎప్పుడైనా కారున్న ఓ సీనియర్ కుర్రాడు మిమ్మల్నందర్నీ షాపింగ్ కో, సినిమాకో తీసుకెళ్తే దారిలో ఏ టాకో జాయింట్ లోనో మెక్ డొనాల్డ్ లోనో ఆగి చిన్నపాటి ఫలహారమో, లంచ్, లేకపోతే ఇండియన్ రెస్టారెంట్ లో భోజనం అదీ కాకపోతే మరోచోట పిజ్జా అదే ఆల్ యూ కెన్ ఈట్ అనే చోట ఆగి తిన్నారా? అక్కడ ఎంత సంతోషం, మనకి నచ్చినవి ప్లేట్ లో పెట్టుకుని తిన్నంత తినేసి మిగతాది పారేసినా ఎవడూ అడగడు. దీనికి మీరు పెట్టుకున్న పేరు స్వేచ్ఛ. అయితే మీకు చదువైపోయి పట్టాభిషేకం అయ్యేక ఏమైంది? మొదట్లో పిజ్జా మీద మష్ రూమ్ టాపింగ్, కింద మామూలు బాటమింగ్ అమ్మగారికి ఏమాత్రం నచ్చకపోయినా మీరు తెప్పించారని ఆవిడ తిన్నారు ఒకట్రెండు సార్లు. ఆ తర్వాత ఆవిడ తెలుసుకున్న విషయాల ప్రకారం, మష్ రూం టాపింగ్ ని గ్రీన్ ఆలివ్స్, గ్రీన్ పెప్పర్స్ లాంటివి ఆక్రమించాయి – వాటికంటే బ్లాక్ ఆలివ్స్, పైనాపిల్ మీకు ఇష్టం అని తెలిసినా సరే. పోనీ పిజ్జా బాటమింగ్స్ మార్పు ఉండదనుకున్నారు మీరు కానీ అందులోనూ ఉరమరగా మార్పులొచ్చాయి. గార్లిక్ అయితే మంచిదిట వంటికి. అలా మీరు "కుటుంబం కోసం" కొన్ని వదులుకున్నారు – ఆ, కడుపు నిండడానికి ఏదో ఒకటిలే అనుకుంటూ, అవునా కాదా? మామూలు టాకో స్థానం ఇప్పుడు టాకో సలాడ్ ఆక్రమించింది. అలా మీకు వేరేది తినాలని ఉన్నా, పస్తు ఉండాల్సి వస్తుందేమోనని నచ్చని పిజ్జా ఒక్క స్లయిస్ తో సరిపెట్టుకుని 'అబ్బే నాకు ఆకలి లేదు' అనడం నేర్చుకున్నారు. రాముడు మంచి బాలుడు; ఎవ్వరితోనో దెబ్బలాడడు. అందమైన అబద్ధములు ఆడును.

తొందర్లో మీకు ఒకరిద్దరు మహారాజులో, మహారాణీలో లేకపోతే వీళ్లలో ఓ కాంబినేషన్ పుట్టుకొచ్చారు. మహారాజు, మహారాణి అని ఎందుకనడం అంటే వాళ్లని ఎత్తుకుని పెంచేటప్పుడు, కాళ్ళు చాపితే సాక్స్, బూట్లు వేసి బయటకెళ్లడానికి కార్లో కూర్చోపెట్టేటప్పుడూ, ఏమాత్రం

తేడా వచ్చినా మీరెంత అర్జెంట్ పని మీద వెళుతున్నా, వెంటనే కారు ఆపి వాళ్ల అవసరాలు చూసారుగా అందుకే. అలా రాజా రాణీలకి పదీ పదకొండేళ్ళు వచ్చేవరకూ భుజాలమీద వేసుకు తిప్పి ఇటు యూనివర్సల్ స్టూడియోనుంచి అటు డిస్నీలాండ్ దాకా తిప్పారు అవన్నీ చూసి వాళ్ళు ఆనందిస్తారని. అయితే ఓ సారి డిస్నీలోకి వెళ్ళాక అక్కడ మీరు రాజా/రాణీలని బండిలో పెట్టి చుట్టూ చూపించారా లేకపోతే వారికి దయాపర్ మార్చడానికీ, ఎండ తగలకుండా నీడలో ఉంచి వేయి కళ్ళు పెట్టుకుని చూస్తే వాళ్ళు హాయిగా బజ్జున్నారా? అక్కడ పోనీ ఏదైనా తిందామనుకుంటే మన ఇండియన్స్ తినేదేమీ కనపడదు కనక మెక్ డొనాల్డ్ లో వేయించిన దుంప ముక్కల్తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఏదైమైనా మీరు మళ్ళీ "కుటుంబం" కోసం కష్టపడ్డారు. ఆ రోజు ఏం తిన్నా తినకపోయినా డిస్నీ జనం లోంచి ఏ మాత్రం దెబ్బలు తగిలించుకోకుండా, రాజూ, రాణీ తప్పిపోకుండా బయటపడినందుకు, ఆ తర్వాత అర్ధరాత్రో అపరాత్రో ఎక్కడా కారుకి ఏక్సిడెంట్ కాకుండా డ్రైవ్ చేసుకుని వెనక్కి వచ్చినందుకు మీకు సంతోషం. పోదురూ బడాయి, ఆమాత్రం ఎవరు చేయరు, ఇండియాలో మాత్రం మీ నాన్నగారు, మిమ్మల్ని సైకిల్ మీద కూర్చోబెట్టుకుని కూర్ల సంతకి తీసుకెళ్ళినప్పుడూ, ఎగ్జిబిషన్ చూపించడం లోనూ మీకు చేయలేదా ఏమిటి?

ఉత్తరోత్తరా ఇంట్లో ఎప్పుడైనా మీకో పెసరట్టో, మసాలా దోశ లాంటిదో తినాలంటే ఎవరికి తీరిక అది చేయడానికి? మహా అయితే మైసూర్ వుడ్ లాండ్స్ అనే చోటో, ఉడిపి లాంటి రెస్టారెంట్ లోనో తినడం బెటర్. ఇంట్లో అవన్నీ చేస్తూ కూర్చుంటే ఫేసు బుక్కు, వెబ్ సైట్లూ, ట్విట్టరూ చూడ్డం ఎలా, ఇంట్లో ఆ పెసరట్టు, ఉల్లిపాయ, ఆయిల్ వాసన అదీ పోవడం ఎలా? మీకు నచ్చినది మీరు చేయగలుగుతున్నారు, కనీసం హోటల్లో అయినా; అమెరికావాడు చెప్పలేదుటండీ కుటుంబ సౌఖ్యం, ధన ధాన్య వృద్ధిం అంటూ? గూట్లే ప్రశ్నలు వేయకండి. హిందూ మంత్రాలైనా సరే శంఖువులో పోస్తేకానీ తీర్థంకానట్టూ అమెరికావాడు చెప్తే కానీ అది మన తలకెక్కదు కదా?

ఈ లోపున మహారాణి, రాజు పెద్దవాళ్లవుతుంటే పిజ్జా ఆర్డర్ మీ చేతుల్లోంచి జారిపోయింది. ఇప్పుడు రాత్రి అన్నం తిందామనుకునే లోపులే రాణీగారు ఆల్రడీ ఒక చైనీస్ జాయింట్ నుంచి ఆర్డర్ చేసేసారు. అదే మీరు తినగలిగేదే లెండి – వెజిటేబిల్ రైస్ అని. అది మీకిష్టం అని ఓ సారెప్పుడో చెప్పారుగా? అందులో ఉప్పు ఎక్కువైపోయి ఇప్పటికి నలభై ఐదేళ్ళొచ్చిన మీకు బ్లడ్ ప్రెషర్ పెరిగిపోతుందని తెల్సినా తిన్నారు మరి రాణీగారు "మీ గురించి మాత్రమే" వేరేగా ఆర్డర్ చేసినందుకు సంతోషపడిపోయి. తర్వాత మరోరోజు రాజాగారికి పిజ్జా తినాలనిపించింది. మామా జానీ అనేచోట మన ఇష్టం వచ్చినట్టు ఆర్డర్ చేద్దాం, వాళ్ళు నా బ్లడ్ ప్రెషర్ అదీ దృష్టిలో పెట్టుకుని చేస్తారు అని మీరెంతగానో చెప్పడానికి ప్రయత్నం చేశారు. కానీ అమ్మగారు, రాణీ గారు, రాజు గారు మిమ్మల్ని – పనికిరాని బేవార్స్ గా చూస్తే – దానికి తల ఒగ్గి వాళ్ళకి ఇష్టం అయిన పిజ్జా హట్ లోంచే ఆర్డర్ ఇచ్చారు. ఆ ఆర్డర్ చేసినవి తినకపోతే డబ్బులు దండగ అనేదొకటీ, ఇంట్లో మరొకటేదీ వండరు ఇంక ఆ పూటకి పస్తుండాలనేది మరొకటీ గుర్తుంచుకుని ఆ "పెట్టిన" ముక్కలు తింటూంటే బ్లడ్ సుగర్ పెరిగింది, తర్వాత రోజు ఒంట్లో బాగోలేక ఆఫీసుకు శెలవు పెట్టారు కూడా.

మరికొన్ని ఏళ్ళొచ్చాక డాక్టర్ చెప్పినదాని ప్రకారం ఇంక ఎండు గడ్డే గతి. "ఏది పడితే అది" తినడం కుదరదు. నచ్చినది తినడం అసలు కుదరదు. ఒకానొకప్పుడు స్టూడెంట్ జీవితంలో "ఇష్టం వచ్చినది" తిన్నారంటే అప్పుడు మీకు పట్టాభిషేకం కాలేదు, మీరో స్వేచ్ఛా జీవి; అప్పుడు మీకు ఇరవై రెండేళ్ళు మాత్రమే. ఇప్పుడు "పెట్టినది" తినాలి అది ఎండు గడ్డి అయినా, టమోటా సాస్ కలిపిన పచ్చగడ్డి అయినా. లేకపోతే పంచదార వేసుకోకుండా ఓ గ్లాసు పాలు, డాక్టర్ ఇచ్చిన మందూ, తినగలిగితే ఓ అర్టిపండూ. అలా నోరుకట్టేసుకోవాల్సిన రోజులు వస్తూనే ఉన్నయి ఇన్నాళ్ళ బట్టీను. అలా రావడం మీరు గమనించారా లేదా అనేది వేరే విషయం.

ఆగండాగండి రిజర్వేషన్ ల గురించి కదూ చెప్పుకోవడం మొదలుపెట్టాం? రెండోసారి పుట్టిన చిన్న వయస్సు మహారాణీ/రాజూ షెడ్యూల్ ట్రైబ్ వారు, వారిది మొదటి విడత. వారికివ్వాల్సినవి వారిచ్చేసాక మొదటి సారి పుట్టిన రాజూ/రాణీ షెడ్యూల్ కేస్ట్ వారు. వారిది

రెండో విడత. అవిపోతే మిగిలిన దాంట్లో అమ్మగారిది బాక్ వార్డ్ కేస్ట్. ఆవిడది మూడో విడత. వీళ్ళ అవసరాలు తీ(ర్చా)రాక మిగిలినవి ఫార్వార్డ్ కేస్ట్ వారికి వస్తై. అదీ వాళ్ళు చేయి విదిలించాక. వాళ్ళ మూడ్ బట్టీ, అవసరాల బట్టీ ఆ విదిలించడం అనేది ఆధారపడుతుంది. ఐ ఐ టి లో సీటు దగ్గిర్నుంచీ మీరెప్పుడూ ఫార్వార్డ్ కేస్ట్ లోనే నెగ్గుతూ వస్తున్నారు. రాముడు మంచి బాలుడు; ఎవ్వరితోనో దెబ్బలాడడు. అందరినీ బాగా చూసుకొనును. మీరు అమెరికా వాడు చెప్పినట్టూ, కుటుంబం కోసం ఏదైనా చేయగలరు, చేసారు, చేస్తారు కూడా. మీది యమా టేస్టు. మీరు ఎంత తెలివైన వాళ్ళండీ!

**నీతిః రాముడు ఎంతమంచి బాలుడైనా పెళ్ళైయ్యాక నోరు మూసుకుని "పెట్టినది తినడం" నేర్చుకోకపోతే పస్తే.**

# ఆరు నూరైనా, నూరు ఆరైనా

**వారాంతం** న్యూజెర్సీనుంచి పిట్స్ బర్గ్ ప్రయాణం పెట్టుకున్నారు సురేష్ సంధ్యాను. ఒకేరోజు లో వెళ్ళి వచ్చేయడం కష్టం సోమవారం శెలవు కనక ఓ రోజు రాత్రి అక్కడ హొటల్లో ఉంటే ఆదివారం సాయంత్రంలోపున వచ్చేయడానికి ప్లాను. ఆదివారం ఎంత రాత్రైనా వచ్చేస్తే సోమవారం తీరిగ్గా పడుకుని మంగళవారం ఉద్యోగానికి వెళ్లవచ్చు. పెళ్ళై మూడేళ్ళకి సతాయించడానికి చిన్న పిల్లలులేరు కనకా, వాతావరణం బాగానే ఉంటుంది కనక ఏమీ గొడవలేనట్టే. హొటల్లో పొద్దున్న బ్రేక్ ఫాస్ట్ ఉచితం. రాత్రి భోజనానికి వండుకోవడానికో రైస్ కుక్కర్ పట్టుకెళ్తే కూడా ఉన్న మిగతా కూరా నారా వేడి చేసుకుని డిన్నర్ కానిచ్చేయవచ్చు. అదో వెసులుబాటు.

అలా పిట్స్ బర్గ్ చేరాక రాత్రి హొటల్లో పడుకుని పొద్దునే గుడికి చేరారు తొమ్మిదిన్నరకి. అప్పుడే అరగంట ముందు తలుపులు తీసినట్టున్నారు, ప్రథమపూజ మొదలుపెట్టారు. పూజా హారతీ అయ్యేక అక్కడ అమ్మే, బొమ్మలూ కాలెండర్లూ అన్నీ చూస్తూ బయటకొచ్చేసరికి పన్నెండు దాటుతోంది. కిందన భోజనశాలలో మామూలే. పెరుగన్నం, పులిహోర, దోశ, ఇడ్లీ అన్నీ అమ్ముతున్నారు. అవి తింటూంటే అమ్మగారికి ఎవరో తెలుసున్నవాళ్ళు కనిపించేరు. ఇంతకుముందు ఇండియాలో ఒక కోర్స్ చేసినప్పుడు క్లాసులో ఇద్దరూ కలిసారుట. బోల్డు కబుర్లు. అవి అయ్యేసరికి రెండున్నర. ఇంక వెళ్ళిపోవచ్చు అనుకుంటూంటే అప్పుడు పేలింది టపాకాయ అయ్యగారిమీదకి.

పిట్స్ బర్గ్ దగ్గిర్లోనే ఉన్న వీలింగ్, వెస్ట్ వర్జీనియాలో ఏదో జాతర ఉందిట. అమ్మగారికి ఇప్పుడు కలిసిన పాత స్నేహితురాలూ, వాళ్ళాయనా వెళ్తున్నారు. మనం కూడా వెళ్తే? సురేష్ కి ఏ మాత్రం నచ్చలేదు ఈ వ్యవహారం. ఈ రోజు సాయంత్రానికి న్యూ జెర్సీ వెళ్ళిపోదామనుకుంటే ఇదేం గోల? ఇప్పుడు ఈ జాతర చూడ్డానికెళ్తే రాత్రికి న్యూజెర్సీ వెళ్లడం అసంభవం. వీలింగ్ లో ఎక్కడో హొటల్ చూసుకుని పడుకోవాలి. ఎక్కడో హొటల్లో పడుకున్నా సోమవారం డ్రైవ్ చేసుకుంటూ వెళ్తే ఇంటికి ఏ అర్ధరాత్రో వెళ్ళేసరికి వళ్ళు హూనం అయితే మంగళవారం ఉద్యోగానికెళ్లడం ఎలా?

దాంతో కాస్త వాదులాట. స్నేహితురాలు ఎదురుగా ఉండగానే అవునంటే కాదని అనుకోవడం, మళ్ళీ ఆవిడా, వాళ్ళాయనా "మేం మిమ్మల్ని కలిసి చాలాకాలం అయిందిగా?" అనే ఆఖరి అస్త్రం ప్రయోగం; ఎట్టి పరిస్థితులలో అయినా అమ్మగారిమాటే నెగ్గాలి కనకా సురేష్ కి తప్పలేదు, వళ్ళు మండినా. దీనికి మరో సమిధ – సంధ్య ప్రయోగించిన పాసుపతాస్త్రం – ఆరు నూరైనా నూరు ఆరైనా తాము వెస్ట్ వర్జీనియా వెళ్ళితీరవల్సిందే. సోమవారం శెలవు. మరీ అంత లేట్ అయితే మంగళవారం శెలవు పెట్టొచ్చు. అయినా ఇన్నేళ్లకి కలిసిన స్నేహితురాలు!

వీలింగ్ వెళ్ళేసరికి అయుదు. జాతర ఓహైయో రివర్ గట్టున. ఆ తర్వాత అన్ని జాతరలూ ముగించినట్టే బాణసంచా కాల్చుట, వాటికి ఫోటోలు, వగైరా. అన్నీ అయ్యేసరికి రాత్రి తొమ్మిది. అప్పుడు చూసుకుంటే ఊరికి దూరంగా ఎక్కడో హోటల్ దొరుకుతుంది. కానీ ఫోన్ చేసినప్పుడు హోటలమ్మ చెప్పడం ప్రకారం ముందు రిజర్వేషన్ చేయించుకోలేదు కనక హోటల్ లో గది రాత్రికి తొంభైనాలుగు డాలర్లు మాత్రమే. పొద్దున్న ఫలహారం ఉచితం. అన్నింటికన్నా ముఖ్యం స్నేహితురాలు వాళ్ళాయనా కూడా అదే హోటల్లో ముందు బుక్ చేసుకున్నారు. వాళ్లకూడా ఉండడం బావుంటుంది కదా? డబ్బుల్దేవుంది, కుక్కని కొడితే రాలవూ?

ఇదంతా విన్నాక సురేష్ అన్నాడు, "కుక్కని కొడితే డబ్బులు రాల్తాయో లేదో కానీ అది కరవడం మాత్రం నిజం."

అలా రాత్రి వీలింగ్ లో గడిపాక సోమవారం పొద్దున్నే మళ్ళీ రోడ్డుమీదకి. స్నేహితురాల్ని వదలగానే సురేష్ ఆవిణ్ణి ఏదో అందామనుకున్నాడు కార్లో ఇలా ప్లాన్ అంతా మార్చినందుకు. కానీ నోరు విప్పితే ఏమౌతుందో తెలుసుకనక మౌనం.

ఓ రెండొందల మైళ్ళు నడిచాక అప్పుడు గేస్ కొట్టించడానికి బండి ఆపి మళ్ళీ కదిలేదాకా మాటల్లేవు. ఇద్దరికీ ఎందుకో తెలియకపోతే కదా? తర్వాత మాటలు మెల్లిగా కలిసేయి. అసలు ఇలా ఈ జాతర ఎందుకో అని సురేష్ అంటే పాత స్నేహితురాలంటే అంత ముఖ్యం కాదా అని ఈవిడ వాదన. చివరకి ఇది రాజుకుంటూంటే సురేష్ అడిగేడు, అసలు ఈ స్నేహితురాలు ఎందుకంత ముఖ్యం, ఈ జాతర కి వెళ్ళడం ఎందుకో.

అమ్మగారి ఉవాచ, "ఇంత చెప్పినా మీకు అర్ధం కాదే? ఇంక చెప్పడం అనవసరం మనం వెళ్ళాం, బాగా ఎంజాయ్ చేసాం. మీకు బోల్టు లీవు ఉంది. ఈ రోజు వెళ్ళిపోతాం రాత్రికి ఎలాగానూ. దానికి ఇంత గొడవా? ఎప్పుడో కనిపించే స్నేహితురాలికోసం ఆ మాత్రం చేయలేమా?

కోపంతో సురేష్ అడిగేడు, "అయితే మాత్రం అంత ఆరు నూరైనా నూరు ఆరైనా వెళ్ళాల్సిన అవసరం ఏమిటి? ముందు ప్లాన్ చేసుకోలేదు కదా? అనవసరంగా హోటల్ మీద దాదాపు వంద డాలర్లు ఖర్చుపెట్టాల్సి వచ్చింది."

"చెప్పాల్సింది చెప్పానుగా, ఇంకా దేనికి మట్లాడ్డం దీని గురించి?" అమ్మగారు పక్కకి తిరిగి కళ్ళు మూసుకుంది.

ఎందుకో సురేష్ కి హోటల్ కౌంటర్లో వంద డాలర్లు చెల్లిస్తే హొటలమ్మ తిరిగి ఆరు డాలర్లు చిల్లర ఇవ్వడం గుర్తొచ్చింది.

**నీతిః ఆరు నూరైనా, నూరు ఆరైనా ఎప్పుడు అమ్మగారి మాటే నెగ్గుతుంది (అనగా, ఆరు డాలర్లు ఎన్నటికీ వంద డాలర్లు కాకపోవచ్చు కానీ వంద డాలర్ల నోటు నిముషంలో ఆరు డాలర్లవుతుంది)**

# డ్రైవింగ్

**జీవితంలో** కొన్ని ఎప్పటికీ మారవు అనేది జగద్విదితం. ఉదాహరణకి చూడండి. నీలేష్ కులకర్ణికి నాసిక్ స్కూల్లోంచి బయటకి రాగానే ఢిల్లీ ఐ ఐ టి లో సీటు, అక్కడ నాలుగేళ్ళు చదువుకున్నాక వెంటనే అమెరికా అందర్లాగానే. అదింకా పూర్తవకుండానే వర్జీనియా టెక్ లో ఎమ్ ఎస్ కి సీటు. ఏ ఐ ఐ టి లో చూసినా ఇదే కదా ప్రహసనం? దీంట్లో ఎవరో ఒకరిద్దరు తేడాగా ఉండి, ఐ ఏ ఎస్ రాసినా మొత్తానికి తొంభై శాతం దిగేది అమెరికాయే కనక ఇందులో పెద్దగా ఆశ్చర్యంగా చెప్పుకోవడానికేం లేదు. అయితే నీలేష్ కి వర్జీనియా టెక్ లో ఎమ్ ఎస్ అవుతూనే ఉద్యోగం వచ్చేక ఇంక మిగిలినది ఇండియా వెళ్ళి న్యూటన్ గారి మోడర్న్ మూడో సూత్రం ప్రూవ్ చేయడం. అంటే 'అమెరికా వచ్చిన ప్రతి ఇండియన్ తనకి నచ్చిన ఈక్వల్ అండ్ ఆపోజిట్ జెండర్ ని పెళ్ళిచేసుకుని అమెరికాకి తీసుకొస్తాడనే' కొత్త సూత్రం.

అలా ఇండియా వెళ్ళిన నీలేష్ కి చూసినవాటిలో బాగా నచ్చేసిన సంబంధం బాంబే లోని నమితా అరోరా. మధ్యవర్తి ద్వారా విన్న విషయాల ప్రకారం ఆరోరా కుటుంబం కాస్తో కూస్తో డబ్బున్నవారే. మరీ అంత మెర్సిడిస్ కారు కాదు కానీ, బాంబేలో విలే పార్లే అనే చోట చిన్న ఇల్లూ ఓ బుల్లి కారూ ఉన్నాయి. అమ్మాయి కూడా మెకానికల్ ఇంజినీరింగ్ చదువుకుంది విక్టోరియా జూబ్లీ కళాశాలలో. ప్రస్తుతానికి ఓ చిన్న ఉద్యోగం చేస్తోంది. నీలేష్ కి బాగా నచ్చిన అంశం నమిత ఏమీ భేషజాలు లేకుండా మాట్లాడింది తనతో. చదువుకునేటప్పుడు కాలేజీ రోజుల గురించి అడిగితే సరదాగా సమాధానాలు చెప్పింది కూడా. కట్టూ బొట్టూ చూస్తే సంప్రదాయంగా ఉంది. నీలేష్ తల్లి కూపీలాగిన విషయాలు కూడా బాగున్నాయి. వియ్యపురాళ్ళు ఇద్దరూ ఒకరికొకరు నచ్చినట్టే లెక్క. మొగుళ్ళకి ఇవేం అంత పట్టవు కనక 'మీ ఇష్టం' అనేసారు. అలా పెళ్ళి కుదిరిపోయి దంపతులైపోయిన మూడునెలలకి కొత్తకాపురం మొదలైంది సాల్ట్ లేక్ సిటీలో.

ఎప్పుడో వర్జీనియా టెక్ లో జేరగానే నేర్చుకున్న డ్రైవింగ్ కి మెరుగులు దిద్దుకుంటూ నీలేష్ ఇప్పుడు ఉద్యోగం వచ్చాక – ఉద్యోగం రాగానే ఇండియన్స్ కానీ చైనీస్ కానీ హోండా, టొయోటా కారు తప్ప మరోటి కొనుక్కోరని నిరూపిస్తూ – తాను కొనుక్కున్న టయోటా కామ్రీ కారులో నమిత ని తీసుకుని దేశం మీద తిరుగుతున్నాడు వీలున్నప్పుడల్లా. అయితే ఇంట్లో డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నది తనకొక్కడికే కనక నమిత డ్రైవ్ చేయకూడదు. దీనివల్ల మరిన్ని కష్టాలున్నై. నమితకి ఉద్యోగం వచ్చేలోపు ఇంట్లో బోరు కొడుతోంది. అసలే ఎప్పుడూ గల గలమనే మంచి ఏక్టివ్ సిటీ బాంబేలోంచి వచ్చినావిడ. ఇక్కడ నాలుగ్గోడల మధ్యా పిచ్చెక్కినట్టుంది. బయటకెళ్ళాలంటే డ్రైవింగ్ తప్పనిసరి. మరో నెల గడిచేసరికి తన గోడు వెళ్ళబోసుకున్నాక నీలేష్ డ్రైవింగ్ లైసెన్స్ ఆఫీసుకి తీసుకెళ్ళేడు.

మొదట్లో లెర్నర్ పర్మిట్, ఆ తర్వాత టెస్ట్ పాసైతే లైసెన్స్ ఇస్తారు. ఫలానా రోజుకి రావచ్చు ప్రాక్టీస్ చేసాక. లెర్నర్ పర్మిట్ తీసుకున్నప్పటినుండి వీకెండ్ తీర్థయాత్రలన్నీ మానుకుని నీలేష్ నమితకి డ్రైవింగ్ నేర్పించడం మొదలుపెట్టాడు. మొదట్లో గంట, తర్వాత అది పెంచుకుంటూ మూడేసి గంటలు ప్రాక్టీస్.

ఇలా పక్కకి తిరగకూడదు; అదిగో ఎర్రలైట్ చూసుకోలేదు. అమ్మోయ్, చంపేసిందిరో, ఏక్సిడెంట్ వెంట్రుకవాసిలో తప్పింది అంటూ నమిత మీద నీలేష్ అరుపులు. ఆవిడ మొహం ముడుచుకోవడం, ఇంటికొచ్చాక ఒకరిమీద ఒకరికి ఏడుపు; మళ్ళీ వారాంతానికి మరో సారి తయార్. ఏక్సిడెంట్ కాకుండానే ఎందుకీయన అరుస్తాడని ఆవిడనుకుంటే చిన్న గీత పడినా, సొట్ట పడినా ఏక్సిడెంట్ అయితే ఇన్స్యూరెన్స్ ఎలా పెరుగుతుందో తనకి ఆఫీసుకెళ్ళడానికి ఎంత కష్టమో, ఎవడు కోర్టుకి కేసు వేసి లాగుతాడో, ఏది ఎటు తిరిగి ఎటొస్తుందో అని అయ్యగారి పైకి చెప్ప(లే)ని ఏడుపు. పోనీ ఇంత నా మీద అరవకుండా ఏ డ్రైవింగ్ క్లాసులోనో జేర్పించవచ్చు కదా అని నమిత అడిగితే దాని కయ్యే ఖర్చు నాలుగు వందలకి పైన. హమ్మో! నెలకి తమకయ్యే గ్రోసరీ ఖర్చే అంత లేదు. ఆ డబ్బులు ఇలా తగలేయడం దేనికీ?

అయితే అయ్యగారికి తెలీని విషయం మరోటి ఉంది. వీక్ డేస్ లో అమ్మగారు రోజూ డ్రైవింగ్ లైసెన్స్ రూల్స్ అవీ బాగా వంటబట్టించుకున్నారు. అయినా అమ్మగారికి డ్రైవింగ్ రాకపోతే కదా? బాంబేలో ఉన్నప్పుడు అక్కడ బుల్లి కారు చాలాసార్లు నడిపారు కూడా. నాలుగు నెలలు ప్రాక్టీస్ అయ్యేక డ్రైవింగ్ టెస్ట్ లో నమిత ఫెయిల్ అయింది. ఇప్పటి వరకూ తనకి బాగానే డ్రైవింగ్ వచ్చు అనుకున్న నమితకి ఇది పెద్ద షాక్. స్టాప్ సైన్ దగ్గిర పూర్తిగా ఆపలేదుట, రివర్స్ పార్కింగ్ అంత బాగా చేయలేదు అని ఫెయిల్ చేసారు. నమిత మీద ఈ సారి అయ్యగారు తన కోపం చూపించాడు – "నీకేదో పెద్ద డ్రైవింగ్ బాగా వచ్చు అని అన్నావుగా, ఇదేనా" అంటూ. కాసేపటికి నమిత ఏడుపు ఆపేక సరే అని సముదాయించడం తప్పదు కదా, నీలేష్ మొదటి సారి తనకీ అలాగే అయినట్టు చెప్పాక సర్దు మణిగింది ఆ రోజుకి

మరో మూడు వారాలు మళ్ళీ ప్రాక్టీస్. మళ్ళీ ఒకరి మీద ఒకరు అరుపులు; మళ్ళీ టెస్టింగ్. ఈ సారి టెస్ట్ కి వచ్చినాయన మంచివాడే. బయటకొచ్చి పాస్ అన్నాడు కాసిని తప్పులున్నా. అలా అమ్మగారికి స్వేచ్ఛ ఇవ్వబడింది. ఇప్పుడు అమ్మగారో డ్రైవర్. పొద్దునే అయ్యగార్ని

ఆఫీసు దగ్గిర దింపాక ఆవిడదే కారు. మొదట్లో ఇంటికి దగ్గిర్లోనే రోడ్లమీద తిరిగాక మెల్లిగా ఆ పైకి, మరో చోటికి ఆ తర్వాత హైవేమీదకి తిరగడం అలవాటైంది. మొదట్లో ఉన్న జంకు పోయి ఇప్పుడు అమ్మగారు జాం అంటూ ఎక్కడికైనా వెళ్ళిపోగలదు. అలా ఎక్కడికి వెళ్ళిపోతోందో మాత్రం అయ్యగారికి తెలియకుండా జాగ్రత్త పడింది.

నాలుగునెలలు పోయాక ఓ వారాంతం రోజు పొద్దున్నే కాఫీ తాగడానికి వంటింట్లోకి వెళ్తే ఎనిమిది వందల డాలర్ల కేష్ కౌంటర్ మీద ఉండడం చూసి అక్కడే ఉన్న నమితని అడిగేడు ఆశ్చర్యంగా నీలేష్, "ఎవరిదీ డబ్బు?"

"నాదే, అదే మనదే"

"అవునా, ఇక్కడకెందుకొచ్చిందా అని?"

"నా సంపాదన చూపిద్దామని" చిలిపిగా నవ్వుతూ అంది నమిత.

"నువ్వు ఉద్యోగం చేస్తున్నట్టు నాకు తెలియదే, ఎప్పుడు మొదలు పెట్టావేమిటి?"

"నిన్ను ఆఫీసులో దింపాక పక్కసందులో ఉన్న కార్ మెకానిక్ షాపులో వాలంటీర్ గా చేస్తానని మెకానికల్ ఇంజినీర్ ని అనీ చెప్పాను. ముందు వద్దు అన్నా రెండు మూడు సార్లు అడిగితే సరే అన్నాడు. ఓ రెండు నెలలు చేసాక చుట్టుపక్కల ఉన్న గాస్ స్టేషన్లు, షాపులలో ఓ ఎడ్వర్టైజ్ మెంట్ ఇచ్చాను – ఆయిల్ ఛేంజ్ కి, బ్రేక్ పేడ్స్ మార్చడానికి పని చేస్తాను అని. పొద్దున్న పది నుండి మధ్యాహ్నం మూడు వరకూ అపాయింట్ మెంట్ ద్వారా మాత్రమే, మన ఇంటి గరాజ్ లోనే. అలా రెండు నెలలు వాలంటీర్ గా చేసాక ఇవన్నీ ముందే తెలుసు కనక ఇలా మొదలుపెట్టాను."

కళ్ళు విప్పార్చుకుని నోరు వెళ్ళబెట్టిన నీలేష్ అలా చూస్తూంటే ఇంకా చెప్పింది నమిత, "ఈ మాత్రం పని నేను చేయలేనా? ఇండియాలో మా కారుకి చిన్న చిన్న పనులు నేనే చేసాను అనేకసార్లు. ఇక్కడ మెకానిక్ అవడానికి లైసెన్స్ లేదు కానీ చీప్ గా ఆయిల్ చేంజ్ చేస్తానన్నా, బ్రేక్ పేడ్స్ మారుస్తానన్నా మనదగ్గిరకి రావడానికి బోల్టుమందున్నారు కదా? అలా ఇంట్లోనే ఉండి పనిచేస్తున్నా."

"మరి ఆ తీసేసిన మురికి ఆయిల్ ఏం చేస్తావు?"

"ఓ చిన్నపాటి డ్రమ్ కొన్నాను, అందులో తీసేసిన ఆయిల్ పడుతున్నాను. వీలున్నప్పుడు వెళ్ళి అది రీసైకిల్ సెంటర్లోనో మరో చోటో ఇవ్వొచ్చు ఎక్కడో కనుక్కుని. అదేమంత పెద్ద విషయం?"

"ఇవన్నీ నీకు ముందే తెలుసు అన్నావు. ఇండియాలో అయితే మాత్రం ఎలా తెలుసు?"

"అమ్మాయిగారు విక్టోరియా జూబ్లీ నుంచి మెకానికల్ ఇంజినీర్ అని మర్చిపోయావా నీలేష్?" వచ్చి తనని దగ్గిరకి లాక్కునే నీలేష్ తో అంది నమిత,

***నీతిః డ్రైవింగ్ ఒక్కటే ఏం ఖర్మ, ముదితల్ నేర్వగ రాని విద్య కలదే ముద్దార నేర్పించినన్***

# కీచులాటలు

**ఆ రోజుకి** షాపు కట్టేసి మధ్యాహ్నం మూడింటికి బయల్దేరేడు కరుణాకర్ కొడుకుని కాలేజీనుంచి ఇంటికి శెలవులకి తీసుకురావడానికి. గత రెండేళ్ళగా ఇదో ప్రహసనం అయి కూర్చుంది. వాడికి శెలవులిచ్చినప్పుడల్లా తాను ఆఫీసుకి మధ్యాహ్నం దుమ్మా కొట్టేసి బయల్దేరాలి. రాత్రికి వాణ్ణి ఇంటికి తీసుకురావడం. లాంగ్ వీకెండ్ అయ్యాక మళ్ళీ దింపడం. శెలవు ప్రకటించగానే డార్మ్ లో ఉండడానికి

కుదరదుట. అలా నాలుగేసి వారాలకొకసారి ఇలా వెళ్ళి తీసుకువస్తున్నాడు కుర్రాణ్ణి. ఇంట్లో తనకి మరో కుర్రాడు హైస్కూల్లో చదువుతున్నాడు. వీడుకూడా వెళ్ళిపోతే గూడు ఖాళీయే. ఆ ఆలోచనతోటే ఒక్కసారి గుండె పీకింది కరుణాకర్ కి. ఇద్దరూ ఇంట్లోంచి వెళ్ళగానే అమ్మగారు ఇంక తనమీద హద్దూ పద్దూ లేకుండా నోరుపారేసుకుంటుంది కాబోలు. ఇప్పటికే ప్రతీసారి కీచులాడుకుంటూంటే కుర్రాళ్ళు తమని విషప్పురుగుల్లా తీసిపారేసి చూస్తున్నారు. ఆవిడకి తనమాట నెగ్గడమే కావాలి కానీ ప్రపంచం ఏమనుకుంటోందో అక్ఖర్లేదు. కొంతమంది అంతే, ఎన్నేళ్ళొచ్చినా అలా కీచులాడుకుంటారు కాబోలు. తన దురదృష్టం కొద్దీ తానూ ఈ కొంతమందిలో ఒకడు.

కరణ్ పదిహేడేళ్లకి స్కూల్ అయ్యేక మూడు గంటల దూరంలో ఉన్న కార్నెగీ మెలన్ యూనివర్సిటీ లో సీటు వచ్చినప్పుడు కరుణాకర్ చెప్పడానికి ప్రయత్నించాడు ఎక్కడ ఎందులో చేరితే మంచిదో? క్లీవ్ లాండ్ లో తాము ఉన్న చోటే తన ఉద్యోగం వల్ల కేస్ వెస్టర్న్ లో చేరితే మంచిదనీ, దగ్గిరే ఉండొచ్చనీ. కానీ కుర్రాడి ఆలోచనలు వేరు. వాడికి ఇంటినుండి దూరంగా ఉండాలని ఉంది కాబోలు, కార్నెగీ ఇంత మంచిది, అంత మంచిది అని చెప్పి అక్కడే చేరాడు. తమ కీచులాటలతో విసుగెత్తలేదు కదా? ఈ సారి వెనక్కి వచ్చేటప్పుడు అసలు మాట్లాడి చూద్దాం వీడితో అనుకుంటూ బండి ముందుకి పోనిచ్చాడు.

ఆరింటికి కుర్రాణ్ణి ఎక్కించుకుని మళ్ళీ వెనక్కి ప్రయాణం. దారిలో అడిగాడు, డిగ్రీ అయ్యాక ఏం చేద్దామనుకుంటున్నాడో కరణ్, అసలు వాడి ఇష్టాయిష్టాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి.

"నేను ఇక్కడ డిగ్రీ అయ్యాక ప్రిన్స్ టన్ యూనివర్సిటీకి వెల్దామనుకుంటున్నా, అక్కడ రోబోటిక్స్ లో బాగుంటుందిట. అందులో మాస్టర్స్ చేద్దామనుకుంటున్నా."

"ఒరే, నీ ఇష్టాలు బాగానే ఉన్నా, మరి మనం కొన్ని ఆలోచించాలి. నేను పెద్దవాణ్ణవుతున్నా. ఒకప్పటిలాగా గంటల తరబడి డ్రైవ్ చేయలేను. అదీగాక తమ్ముడి బాధ్యత ఇంకా ఉంది నామీద. ఇక్కడ క్లీవ్ లేండ్ లో నా ఉద్యోగం ఉన్నంతకాలం ఉండవచ్చు. మీ అమ్మ అయితే ఏదో చిన్న ఉద్యోగం చేస్తోంది ఇక్కడ. ఇప్పుడు నువ్వు అంతదూరం వెళ్తే నిన్ను ప్రతీ మూడేసి వారాలకి వచ్చిఇలా తీసుకురావడం కుదరదు. మనం కుటుంబం అందరం కలిసి ఉండాలంటే ఇక్కడే దగ్గిరలో ఉంటే బాగుంటుంది కదా?"

"నేను క్లీవ్ లాండ్ రాను. అయినా నేను పెద్దవుతున్నాను. ఇరవై ఏళ్ళు వస్తాయి వచ్చే ఏడుకి. మీరు రావక్కర్లేదు. వీలున్నప్పుడు నేనే ఫ్లయిట్ మీద వచ్చేస్తాను."

"శెలవులకి ఈ ఎయిర్ లైన్స్ టికెట్ ఖరీదులు ఎలా ఉంటాయో ఎరుగుదువా? ఖర్చు ఎక్కువా, సీటు దొరక్కపోవచ్చు. దొరికినా జనం ఎక్కువైతే, స్నో పడితే అవి కేన్సిల్ అవుతాయి. అప్పుడేం చేస్తావు?"

"అప్పుడు చూసుకుందాం అయినా ఇప్పుడివన్నీ ఎందుకు చెప్తున్నారు నాకు? నేను స్కూల్ పూర్తి చేసాను. మీరు ఇండియా నుండి మంచి జీవితం కోసం ఇక్కడకి వచ్చినట్టే, నేను నా దారి చూసుకుంటున్నాను. మీకు డబ్బులు అయిపోతాయని వర్రీ కాబోలు. నేను ఉద్యోగం చేసినప్పుడు ఇచ్చేస్తాను లెండి." నిష్టూరంగా అన్నాడు కరణ్.

"అది కాదురా, నేనూ అమ్మా పెద్దవాళ్లమౌతున్నాం. పిల్లలు దగ్గిర్లో ఉంటే బాగుంటుందని…."

తర్వాత ప్రయాణం ఏమీ మాటల్లేకుండా గడిచింది. రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చాక ఏదో కతికి మంచం ఎక్కారిద్దరూ. మర్నాడు శనివారం ఏదో ప్రోగ్రాం గుడిలో. వెళ్తున్నప్పుడు గుడిలో ప్రోగ్రాం గురించి కబుర్లలో మళ్ళీ తల్లీ తండ్రీ కీచులాటలు – ప్రోగ్రాం గురించీ,

మరోదాని గురించీను. వాళ్ళిద్దరూ అరుచుకుంటూంటే పిల్లలిద్దరూ నోరుమూసుకోవడం ఎప్పట్నుండో అలవాటైందే కదా? ఆ తర్వాత దారిలో మళ్ళీ చర్చలు కరణ్ వెళ్లబోయే స్కూల్ గురించి.

ఈసారి కరణ్ నిక్కచ్చిగా చెప్పాడు కరుణాకర్, తల్లితోనూ, "నేను ఎటువంటి పరిస్థితుల్లోనూ మళ్ళీ క్లీవ్ లాండ్ వచ్చి మీతో ఉండను. నాకు నచ్చిన కోర్సులో చేరుతా. దూరం అయితే అవుతుంది. అయినా ఇది రెండేళ్ల తర్వాత కదా?"

ప్రోగ్రాం అయ్యాక అమ్మగారు వెంటనే వెళ్ళి పడుకుంది. శనివారం రాత్రి టివిలో ఏదో సినిమా చూసి దాదాపు ఒంటిగంటకి పడుకోవడానికి తన బెడ్రూం లోపలకి వెళ్తూ ఇంకా కుర్రాళ్ళు పడుకోకపోవడం చూసి వాళ్ల గదిలోకి వెళ్లబోతూ మాటలు వినిపిస్తే అక్కడే నిలబడి వినడం సాగించాడు కరుణాకర్.

చిన్న కుర్రాడు కాబోలు అడుగుతున్నాడు, "ఒరే అన్నా, నువ్వు వెళ్ళాక నాకు ఒక్కడికీ బోరు కొడుతోంది. ఇక్కడకి వెనక్కి వచ్చేసి ఎమ్ ఎస్ లో చేరవచ్చు కదా? అమ్మా, నాన్న కీచులాడుకుంటూంటే నాకు మునుపు నువ్వు ఉండేవాడివి ఏదైనా మాట్లాడ్డానికి. ఇప్పుడెవరూ లేరు....."

పాలిపోయిన మొహంతో అవాక్కయిన కరుణాకర్ పెద్దాడు ఏం చెప్తాడా అని చెవులు రిక్కించాడు. చిన్న గొంతుతో పెద్ద కుర్రాడు చెప్తున్నాడు "ఎందుకొచ్చిన గోలరా? వీళ్ళిద్దరూ కీచులాడుకోవడం, మధ్యలో మనకి గోల. మళ్ళీ ఎడమొహం పెడమొహం. వీళ్ళిద్దరికీ కలిసి ఉండడం అన్నది ఈ జన్మలో లేదు. ప్రతీ దానికీ దెబ్బలాటలే.  విసుగెత్తుతోంది. నేను వచ్చింది నిన్న సాయంత్రం. ఈ రోజు సాయంత్రం గుడికెళ్ళేలోపు మళ్ళీ వీళ్ళిద్దరూ కీచులాటలు.  అసలు వీళ్ళు కలిసి ఎందుకుంటారో అర్థంకాదు. ఇష్టంలేకపోతే విడాకులు తీసుకోవచ్చుగా? ఇక్కడకొచ్చి ఈ గొడవలు వినడం కంటే హాయిగా అక్కడే డార్మ్ లోనే బాగుంది బతుకు – స్నేహితుల్తో. ఈ శెలవుల్లో నాకు రాక తప్పక గానీ కావాలని వస్తాననుకుంటున్నావా? నేను చెప్తున్నాను విను, నువ్వుకూడా ఈ ఏడాది ఎలాగోలా గడిపేయి. తర్వాత నేను చెప్తా కార్నెగీలో లేకపోతే ప్రిన్స్ టన్ లో సీటు గురించి. సరేనా? ఇక్కడున్నంతకాలం మనకి మనశ్శాంతి అన్నది ఉండదు. వీళ్ళిద్దరూ ఏడాదిలో రెండు రోజులు నవ్వుతూ ఉండడం ఎప్పుడైనా చూసావా? వీళ్ళింతే. మనం ఉన్నంతకాలం మనకి తప్పదు. ఒకసారి బయటకెళ్ళడానికి అవకాశం వస్తే పాడుచేసుకోకు. నేను అందుకే కార్నెగీ కి వెళ్ళా, కేస్ వెస్టర్న్ మంచిదని తెలిసినా. మళ్ళీ నోరు జారకు నాన్న దగ్గిర."

కళ్ళు తిరుగుతుంటే మెల్లిగా నడుచుకుంటూ వచ్చి మంచం మీద వాలిపోయాడు. పక్కనే అమ్మగారు – ఎప్పుడు తప్పు ఆవిడది కాదు అని నమ్మే ఆవిడ కనక – ప్రశాంతంగా నిద్రపోతోంది. కళ్ళు మూసుకున్నాడు. ఎప్పుడో ఝాము రాత్రి నిద్ర పట్టింది. ఏవో రకరకాల పీడకలలు – తాను వంటరి అయిపోయినట్టూ, వంటిమీద బట్టలు ఊడిపోయి ఏదో సముద్రం ఒడ్డున నగ్నంగా నిలబడినట్టూ.

పొద్దున్న లేచేసరికి ఏదో నిశ్చయించుకున్నట్టున్నాడు, ఆదివారం మధ్యాహ్నం దాకా ముభావంగా ఉన్నాడు కరుణాకర్.

కుర్రాణ్ణి సాయంత్రంలోపు మళ్ళీ పిట్స్ బర్గ్ లో దింపాలి. మధ్యాహ్నం నాలుగవుతుంటే బయల్దేరారు. రాత్రి సరిగ్గా నిద్రపోని కరుణాకర్ కుర్రాణ్ణి డ్రైవ్ చేయమని చెప్పి పక్క సీట్లో కూర్చుని నిద్రలోకి జారుకున్నాడు.

కుర్రాణ్ణి డార్మ్ లో దింపాక వెనక్కి వచ్చేస్తూ చెప్పాడు కరణ్ తో, "ఈ వారాంతం నేను ఆలోచించాను నీ గురించీ, తమ్ముడి గురించీను. మీరిద్దరూ రెక్కలొచ్చిన పక్షులు. మీ జీవితాలకి అడ్డు రాను. నా జీవితం లోంచి నువ్వు నేర్చుకున్నదేమైనా ఉండి నీకు ఉపయోగపడితే మంచిదే. ఎప్పుడో ఒకప్పుడు ఇటువంటి పరిస్థితి అందరి తల్లితండ్రులకీ వస్తుందనుకుంటా. అయితే ఒక్కమాట, నీకేదైనా కష్టం వచ్చి చెప్పుకోవాలనిపిస్తే నేను ఉన్నా. మీ క్షేమం ఆలోచించడానికి.  గుడ్ లక్, టేక్ కేర్."

**నీతిః ఎవరూ మరొకరి జీవితాన్ని శాసించలేరు. రెక్కలొచ్చిన పక్షులు వాటికిష్టం వచ్చిన చోటికి ఎగురుతాయి. ఇంట్లో పెద్దవాళ్ల కీచులాటలు మా-త్ర-మే ఈ ఎగరడానికి ఒక్కొక్కప్పుడు అతి పెద్ద కారణం కావొచ్చు.**

# సహధర్మచారిణి

**ఉద్యోగంలో** చేరాక ఏడాదికి ఇల్లు కొన్నాడు మూర్తి. ఆ తర్వాత మూడు నెలలక్కాబోలు ప్రసాద్ పలకరించాడు ఫోను మీద. తాను ఏదో కాన్ఫరెన్స్ కి సిన్సినాటీ వస్తున్నాట్ట. ఆ కాఫరెన్స్ వాళ్ళే తిండీ, హోటల్లో గూడూ చూసుకుంటారు. కానీ ఓ సాయంత్రం స్నేహితుణ్ణి కలుసుకోవడం కుదురుతుందా అని అడిగేడు.

చదువుకునే రోజుల్లో తనతోపాటు ఒకే అపార్ట్ మెంట్ లో ఉన్న ప్రసాద్ ని కలుసుకోవడానికి ఎందుకు కుదరదూ? తప్పకుండా కుదురుతుందని చెప్పాక ప్రసాద్ వచ్చేరోజుకి తాను శెలవు పెట్టడానికి నిశ్చయం అయింది.

ప్రసాద్ ఊర్లోకొచ్చాక అతనుండే హోటల్ కెళ్ళి ఇంటికి తీసుకొచ్చేడు మూర్తి ఆదివారం మధ్యాహ్నం లంచ్ కి. పరిచయాలయ్యేక కబుర్లూ, భోజనం. ప్రసాద్ మాటల్లో అడిగేడు మూర్తిని, "చదువుకునే రోజుల్లో అస్తమానూ ఏదో ఒక మంచి గ్రాండ్ చెరోకీ అనే జీపులాంటి కారు కొనాలి అనేవారుగా ఇప్పుడీ ఫోర్డ్ కారు కొన్నారేం?"

"ఆ పరిస్థితుల్లో అలా అనిపించేది. ఇప్పుడీ ఇల్లూ అదీ కొన్నాక బడ్జెట్ చూసుకుంటే నేను కొనగలిగేది ఫోర్డ్ ఒకటే తేలింది. ఏం చేస్తాం? మరో కొన్నాళ్ళకి చూద్దాం లెండి, ఏమో సుమిత్ర ఇప్పుడు చదివే ఎమ్ ఎస్ అయిపోయి మంచి ఉద్యోగం లో చేరితే చూడొచ్చు."

ఇదంతా వింటున్న సుమిత్ర చురచురా చూడ్డం మూర్తి చూడలేదు గానీ, ప్రసాద్ కి మాత్రం కంటి చివరనుంచి కనిపించింది. పెళ్లయ్యాక మూర్తి బాగా మారాడు అనిపించింది ప్రసాద్ కి ఎందుకో.

ఊర్లోకి వచ్చిన తెలుగు సినిమాకి బయల్దేరదీసాడు మూర్తి భోజనం అయ్యేక. సరే అమ్మగారు బయల్దేరేసరికి కాస్త టైమ్ పడుతుంది కనక మిత్రులిద్దరూ కబుర్లలో పడ్డారు. ఈ లోపున అమ్మగారినుంచి ఆర్డర్ మూర్తికి. మూర్తి బెడ్రూం లోకి దూరేడు ఆవిడతో మాట్లాడ్డానికి.

ఆ తర్వాత మూర్తి ఆఫీసుగదిలోకి వెళ్ళి ఏదో పనిలో పడేసరికి ప్రసాద్ కూడా అతని వెనకనే వెళ్ళాడు. మూర్తి సుమిత్ర బట్టలు ఇస్త్రీ చేయడం కనిపించింది. ప్రసాద్ మొహంలో చిరునవ్వు. ఎందుకో ఒక్కసారి తాము స్టూడెంట్ జీవితంలో మాట్లాడుకున్నది గుర్తొచ్చింది. అప్పుడేమైందంటే...

కబుర్లలో ప్రసాద్ చెప్పేడు ఓ రోజు కుర్రాళ్ళకి ఏ హోమ్ వర్క్ అదీ లేనప్పుడు టివి చూస్తుంటే, "వినవోయ్ మూర్తీ ముళ్ళపూడి వారి జోకు, ఓ పెద్దాయన కంచం కడుగుతున్నాట్ట ఇంట్లో. ఆయన స్నేహితుడు చూసి అడిగేడు, 'ఇదేమిటోయ్, ఇదెప్పణ్ణుంచి నీ కంచం నువ్వే కడగడం?' స్నేహితుడు చెప్పేట్ట, 'అబ్బే ఎన్నడూ లేదు.' ఈయన మరోసారి ఆశ్చర్యంగా అడిగేడు, "ఎందుకులేదు, నా కళ్లతో నేను చూస్తే?' దానికి స్నేహితుడి సమాధానం మరింత ఆశ్చర్యం – 'అది మా ఆవిడ కంచం, నాది కాదు.' నవ్వులు.

మూర్తి అన్నాడు, "నేనైతే అలా ఎన్నటికీ చేయను. అసలు మా ఆవిడ ఉద్యోగం చేయడమే నేను ఒప్పుకోను కూడా. ఆవిడ ఇల్లు చక్కపెడుతుంది నేను ఉద్యోగం చేస్తా."

ప్రసాద్ అన్నాడు, "మరీ అంత అన్యాయమా, అయినా ఈ రోజుల్లో ఇద్దరూ ఉద్యోగం చేయకపోతే ఖర్చులు తట్టుకోవడం కష్టం కాదూ?"

ఇన్నేళ్ళు గడిచాక ఇప్పుడీ ఆఫీసులో సుమిత్ర బట్టలు ఇస్త్రీ చేసే మూర్తితో ప్రసాద్ అన్నాడు నవ్వుతూ, " 'మా ఆవిడ ఉద్యోగం చేయదు, ఆవిడే ఇల్లు చక్కబెడుతుంది' అన్న మూర్తి ఇప్పుడిలా చేయడం చూస్తే మూర్తి మారినట్టున్నాడే?"

"సుమిత్ర ఒక్కర్తీ పని చేసుకోలేకపోతోంది," అందువల్ల నేనూ ఓ చేయి వేస్తున్నా. అయినా ఆవిడ సహ ధర్మ చారిణి కదా – అంటే కుటుంబంలో ఇద్దరం సగం సగం పనులు చేసుకుంటూ ఉండొద్దూ?"

"అవునా ఇంకేం పనులు చేస్తూ ఉంటావ్ మూర్తీ ఇంట్లో?"

"లాండ్రీ, అంటే బట్టలు ఉతకడం, కూరలు తరగడం లాంటివీ, సుమిత్ర చదువుకుంటూంటే ఆ రోజుకి అన్నీ నేనే చేస్తా."

ప్రసాద్ నవ్వి ఊరుకున్నాడు.

సినిమా అయ్యేక సుమిత్రని ఇంట్లో దింపేసి ప్రసాద్ ని ఎయిర్ పోర్ట్ కి తీసుకెళ్ళాడు మూర్తి. దారిలో మూర్తి అడిగేడు ప్రసాద్ పెళ్ళి ఎప్పుడు చేసుకోబోతున్నడో అనే విషయాలు.

"చూద్దాం లెండి తర్వాత. ఆ వచ్చేది సహ ధర్మచారిణో సగ ధర్మచారిణో ఏంటో అర్ధం కావట్లే ఇంకా,"

"అదేమిటి?"

"చూస్తూనే ఉన్నాం కదా? పెళ్ళి అవ్వనంతవరకూ సహధర్మచారిణికోసం వెదుకులాట. తర్వాత ఆవిడని ప్రసన్నంగా ఉంచడానికి మన పనీ ఆవిడ పనీ కూడా చేయాలి..."

"ఇంట్లో పని ఇద్దరూ కలిసి చేసుకోపోతే ఎలా?"

"మూర్తిగారూ, బయటపని మీకెలాగా తప్పదు కదా, మరి ఉద్యోగం కూడా చేయని సహధర్మచారిణి గారు ఇంట్లో పని కూడా చేయరా? మరేం ఇంకేం చేస్తారో. అయినా మనందరం పెళ్లవనంతవరకూ ఒక మాట, అయ్యాక మరో మాటా కాబోలు ఏం చేస్తాం?"

మూర్తి ఓ వెర్రి నవ్వు నవ్వేడు ఏం చెప్పాలో తెలియక. ఎయిర్ పోర్ట్ లో దిగాక వెళ్తానన్నట్టూ చేయి ఊపాడు ప్రసాద్. మిత్రుడికో హగ్ ఇచ్చి అన్నాడు మూర్తి, "స్టూడెంట్ జీవితం వేరూ, పెళ్ళయ్యాక గృహస్తు జీవితం వేరూ. మనం అమెరికన్స్ లాగా కొంతకాలం కలిసి ఉండడం, ఇష్టం లేకపోతే వెంటనే నీ దారి నువ్వు చూసుకో అనడం చేయలేం కదా, అందువల్ల మనకీ ఎడ్జస్ట్ మెంట్ తప్పదనుకుంటా..."

"అర్ధంమైంది లెండి. డోంట్ వర్రీ. మీ జీవితం మీ ఇష్టం వచ్చినట్టూ జీవించవచ్చు. మీకు వచ్చే ఆవిడ సహ ధర్మచారిణా, సగ ధర్మచారిణా అనేది మీరూ మీరూ నిర్ణయించుకోవాలి. మధ్యలో బయటవాళ్లకి సమాధానం చెప్పుకోవడం ఎందుకూ? మీరెలా ఉన్నా ఆ జీవితం మీది, నాకు అర్ధమయ్యేలా చెప్పడం కూడా అనవసరం కదా? ఇలా అన్నానని ఏమీ అనుకోకండి కానీ మీ ఇంట్లో విషయాలు మీకు మీరు సమర్ధించుకోవడానిక్కూడా ఎవరికీ చెప్పక్కర్లేదు. దీన్నే మనం ఒకప్పుడు స్టూడెంట్స్ గా ఉన్నప్పుడు అనుకున్నాం, పెళ్లయ్యాక ఆవిడ ఆడించినట్టూ ఆడడమే అంటూ. గుర్తుందా? రేపొద్దున్న నాకు పెళ్ళయ్యాక నేను కూడా ఇలాగే అవ్వొచ్చు కూడా."

మొహం ఎటో పెట్టి గుర్తుందన్నట్టూ బుర్ర ఆడించాక, చెప్పేడు, "మరి వెళ్తా లేట్ అవుతోంది మీకు కూడా," మూర్తి కదిలేడు. మూర్తి కారు కదుల్తుంటే అది కనిపించినంత మేరకి చేయి ఊపి ఎయిర్ పోర్ట్ లోకి నడిచేడు ప్రసాద్.

**నీతిః సహధర్మచారిణి అంటే "కొన్ని" విషయాల్లో సగం ధర్మం మాత్రమే చేసేది. మిగతా విషయాల్లో ఎవరి ధర్మం వారిదే. లేకపోతే మొగుడిదే మొత్తం ధర్మం; ఆవిడ పని ఆర్డర్ వరకే, తర్వాత నిమిత్తమాత్రురాలు.**

# ఐదుకి ఐదు

**మెయిల్ బాక్స్** లోంచి పట్టుకొచ్చిన కాయితాలు టేబిల్ మీద పారేసినవి రాత్రి భోజనం అయ్యేక చూస్తుంటే వెంకటేశ్వరన్ ఉరఫ్ వెంకీ చూసిన విషయం – పబ్లిక్స్ అనబడే గ్రోసరీ స్టోర్ లో ఏవైనా అయిదు సరుకులు కొంటే అయిదు డాలర్ల లాభం. అయితే ఒకటే చిక్కు – ఆ కొనేవి అయిదూ ఈ ఆఫర్ కి సంబంధించినవై ఉండాలి. అది తెలుసుకోవడం ఏమంత కష్టం కాదు. ప్రతీ వస్తువు కిందా అది ఆఫర్ కి సంబంధించిందా కాదా అనేది పేద్ద అక్షరాలతో రాసి ఉంటుంది. తమకి కావాల్సిన తైరు, అనగా పెరుగు లేదా యోగర్ట్ ఎలాగా కొనాల్సిందే. అది ఒకప్పుడు రెండు డాలర్లకి అమ్మేది ఈ మధ్యన పెంచేసి మూడు డాలర్లు చేసారు వెధవలు. ఈ ఆఫర్ కానీ యోగర్ట్ కి సంబంధించినదైతే ఓ పది డబ్బాలు కొనేసి పది డాలర్లు ఆదా చేయవచ్చు.

అలా ఇంటికొచ్చిన కాయితం కూలంకషంగా చదివి షాపుకెళ్ళాడు వెంకీ, కూడా కూతురు వస్తానంటే దాన్ని వెంటబెట్టుకుని. అసలే ఈ మధ్యన హైస్కూల్లోకి వచ్చిన రాణీగారు తన స్వంత వస్తువులు తానే కొనుక్కుంటారుట. డాడ్, మామ్ కొనే "పాతకాలపు," "చీప్," అండ్, "ముసిలివాసన" వేసేవి ఆవిడకి నచ్చడం మానేసి చాలాకాలం అయింది. అలా షాపులో తేలిన వెంకీ గారికి మొహం చాంతాడంత అయే విషయం తెలిసింది,

యోగర్ట్ డబ్బాలు అయిదు కొంటే అయిదు డాలర్లు ఇచ్చే దానిలో భాగమే. హమ్మయ్య, పది కొంటే దాదాపు ఇరవై రోజులు వాడొచ్చు. పది డాలర్లు లాభం. అయితే రాణీగారు కొనాల్సిన లిస్ట్ లో మంచినీళ్ళు కూడా ఉన్నై. అవెందుకంటే రాణీగారికి ఇంట్లో కుళాయ్ నీళ్ళు అంటే అసయ్యం. అవి తాగలేకపోతున్నారు. అన్నింటికన్నా మంచి విషయం ఏమిటంటే ముప్ఫైరెండు బాటిళ్ళ పాక్ మూడు డాలర్లైనా, ఇప్పుడు రెండు డాలర్లకి కొనవచ్చు – అదే మళ్ళీ అయిదు కొంటే అయిదు డాలర్ల ఉచిత పధకంలో. మరి యోగర్ట్ ఇందులో ఇరికించడం ఎలా? ఓ సారి అయిదుకి అయిదూ వాడితే మరోసారి కుదురుతుందో లేదో? దీనికి రాణీగారిచ్చిన సలహా అద్భుతం.

అన్నీ ఒక్కసారే కొనక్కర్లేదు. ముందు యోగర్ట్, టమోటా, బ్రెడ్డూ, మిగతా సరుకులు కొనేసి అయిదుకి అయిదూ తీసుకుందాం. అవి కార్లో పెట్టేసి మరోసారి వచ్చి ఈ వాటర్ బాటిల్స్ కొంటే మరో అయిదికి అయిదు! మరోసారి వచ్చి యోగర్ట్ మాత్రం కొంటే మరోసారి అయిదుకి అయిదు. ఇలా ఎన్ని సార్లైనా చేయొచ్చు. అన్నింటికన్నా ఈజీ మరోటి ఉంది, అటూ ఇటూ మూడు సార్లు తిరగక్కర్లేకుండా. అన్నీ ఒకే బిల్లులో వేయకుండా మూడు బిల్లులు వేయడం. ఈ రోజుల్లో

కొనేటప్పుడు అన్నీ మనమే స్కాన్ చేసుకోవచ్చు కనక అడిగే నాధుడు లేడు. అలాక్కాదూ అంటే విడివిడిగా స్కాన్ చేయమని చెప్పినా స్టోర్ వారు ఏమీ అనరు. అమ్మటం ముఖ్యం కదా వాళ్ళకి? వెంకీకి బాగా నచ్చేసింది ఈ ఐడియా, ఏమైనా రాణీగారు తెలివైనది. ఎంతైనా ఇండియా నుంచి వచ్చిన తెలివైన ఐ ఐ టి వెంకీగారి కూతురు కాదూ?

వెంకీగారికి రెండు/మూడు ట్రిప్పుల ఐడియా నచ్చింది. మొదటిసారి అన్నీ కొనేసి కార్లో పెట్టాక రెండో సారి మరోసారి లోపలకి వెళ్ళి నీళ్ళ బాటిల్స్ కొని కార్ట్ లో పెట్టుకుని వస్తూంటే తలుపు దగ్గిర లాటరీ టికెట్లు అమ్మే మెషీన్ కనిపించింది. ఆ మధ్యన ఎప్పుడో ఓ సారి లాటరీ కొంటే ముప్పై డాలర్లు తగిలింది. ఈ రోజు దాదాపు మూడు ట్రిప్పుల్లో ట్రిప్పుకి ఐదు డాలర్ల చొప్పున లాభం వస్తూంది అంటే తనకి అదృష్టం ఉన్నట్టే కదా అనిపించి ఓ టికెట్ కొందామా అనుకుంటూ సందేహిస్తూంటే మళ్ళీ రాణి గారు అడిగింది – "లాటరీ కొంటావా డాడ్?" అంటూ.

ఎందుకు మనకి ఎలాగా తగల్దు ఇది పోనీయ్ అంటూ ముందుకి సాగాడు వెంకీ, కానీ మనసులో పీకుతోంది. ఏమో ఈ రోజు తన అదృష్టం బాగానే ఉన్నట్టుంది. పోనీ ఓ అయిదు డాలర్లతో కొంటే?

మూడో ట్రిప్పులో ఇంక మనసు ఊరుకోక మెషీన్ దగ్గిర ఓ పది డాలర్ల నోటు తీసి లోపలకి పోనిచ్చాడు. కనిపించే టికెట్లలో ఏది కొందామా అనుకునే లోపుల రాణీగారు పది డాలర్లకొచ్చే ఒక స్క్రాచ్ టికెట్ మీద పంచ్ విసిరేసింది. ఒక్క రెండు మూడు సెకండ్లు గరగర చప్పుడు, ఆ తర్వాత బయటకొచ్చిన పది డాలర్ల టికెట్.

పది డాలర్లకీ పది చోట్ల బరకాలి. ఏ నెంబరైనా కలిస్తే ఆ నెంబర్ కింద ఉన్న డబ్బులు అక్కడికక్కడే ఇచ్చేస్తారు – వందా మూడొందలు లోపు అయితే. బాగా ఎక్కువగా తగిల్తే దానికి వేరే తతంగం. రాణీగారు అక్కడే ఉన్న పెన్సిల్ ముక్క తీసుకుని ఆ స్క్రాచ్ మీద బరుకుతుంటే వెంకీ, అదృష్టం కోసం "లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం, శ్రీరంగ ధామేశ్వరీం ---" అంటూ మనసులో దండం పెట్టుకోవడం మొదలుపెట్టాడు. తనకి ఈ రోజు తప్పకుండా ఏదో ఒకటి తగలవల్సిందే అనిపించడం మొదలైంది.

ఈ లోపుల రాణీగారు పక్కకి తిరిగి చెప్పింది, "ఇందులో ఒక్కటి కూడా తగల్లేదు డాడ్!"

వెంకీ ఏదో అనబోతూ ఉంటే అక్కడికెప్పుడొచ్చాడో స్టోర్ మేనేజర్, వెంకీతో చెప్పాడు, "సర్, మీ అమ్మాయి చూడబోతే మైనర్ లా ఉంది. రూల్స్ ప్రకారం మైనర్స్ ఇలా లాటరీ లో టికెట్ కొనడం, స్క్రాచ్ చేయడం చేయకూడదు. మరోసారి ఇలా చేయడం మీకూ మాకూ మంచిది కాదు. ఎవరైనా పోలీస్ రిపోర్ట్ ఇస్తే---"

ఇది విన్న వెంకీ మేనేజర్ కి థేంక్స్ చెప్పేసి కంగారుగా బండి తోసుకుంటూ బయటకెళ్ళిపోయేడు కూతురితో. కారు స్టార్ట్ చేస్తుంటే ఆరోజు తాను చేసినది సేవింగ్స్ ఎలాగైందో, అది షేవింగ్ ఏమో అని వెంకీకి అనుమానం పుట్టుకొచ్చింది కానీ స్టోర్ మేనేజర్ ఇచ్చిన వార్నింగ్ మనసులో గుచ్చుకోగానే అన్నీ మర్చిపోయి బండి ఇంటికేసి పోనిచ్చేడు.

*నీతిః అయిదు వస్తువులు కొంటే మిగిలిన అయిదు డాలర్ల సేవింగ్స్ తో ఎప్పుడు లాటరీ టికెట్లు కొనరాదు.*

# ఆగమ పండిట్

**రావు గారింట్లో** శనివారం సాయంత్రం సత్యన్నారాయణ వ్రతం, ఆరింటికి. ఎన్నో ఏళ్ళుగా పనిచేస్తున్న స్థానిక గుడి పూజారి, అవధానులుగారిని పిలిచారుట; ఆయనైతే బాగా చేయిస్తారని. ఆయనకి తోడుగా ఈ మధ్యనే కొత్తగా వచ్చిన ఆగమ పండిట్ వీరేశ్వర శాస్త్రిగారు వస్తున్నారు. అయినా సత్యన్నారాయణ వ్రతానికి ఇద్దరెందుకో మరి?

పిలిచినవాళ్ళందరూ బాగానే వచ్చినట్టున్నారు. పాతికమంది దాకా ఉన్నారు అందరూ తలో డిష్ వండి పట్టుకొచ్చారు కాబోలు, హాల్లో టేబిల్ అంతా నిండిపోయి ఉంది. తాము పట్టుకొచ్చిన పులిహార బేసిన్ అక్కడే టేబిల్ మీద పెట్టి నారాయణ ఓ మూల కూర్చున్నాడు పెళ్ళాం పిల్లల్తో. ఇంకా పూజ మొదలవలేదు కనక పక్కనే ఉన్న ఎవరో పలకరించారు నారాయణని. ఓ షేక్ హేండ్, కాస్త చిన్నగొంతుతో కబుర్లు. చిన్నపాటి వ్రతం చేయించడానికి ఇద్దరు పూజార్లెందుకో అని నారాయణ జనాంతికంగా అంటే ఆయనే చెప్పాడు – అవధానులు గారికి వయసు వస్తోంది కనక శాస్త్రిగారు కూడా వచ్చేరు సహాయానికి. శాస్త్రి గారు కొత్తగా అమెరికా వచ్చి ఏడాది అయింది. డ్రైవింగ్ అదీ ఇప్పుడిప్పుడే అలవాటవుతోంది. ఆయన డ్రైవ్ చేస్తుంటే, అవధానులుగారు పాసెంజర్ సీట్లో తీరిగ్గా కూర్చోవచ్చు కదా, అందుకే ఇద్దర్నీ పిలిచారుట. అతిథుల్లో ఎవరిగొడవ వారిదే కనక మిగతావాళ్ళు ఇదంతా పట్టించుకున్నారో లేదో కానీ దూరం నుంచి పూజార్లిద్దరూ మాట్లాడుకునే మాటలు కర్ణాకర్ణిగా వినిపిస్తున్నాయి నారాయణకి.

"ఇక్కడమంత్రాలు సరిగ్గా చెప్పకపోతే వీళ్ళకి కోపం వస్తుందేమో?" శాస్త్రి అవధానులగారిని అడుగుతున్నాడు.

"నేనున్నాను కదరా అబ్బాయ్, ఏం ఫర్వాలేదు. ఇక్కడ కూర్చున్నవారిలో నూటికి తొంభై మంది కంప్యూటర్ ఇంజినీర్లు. వాళ్లకి వచ్చిన ఓ లాంగ్వేజీ తప్ప సరిగ్గా ఆ కంప్యూటర్ గురించే ఏమీ తెలియదని అంటుంటారు. వీళ్లకి సంస్కృతం రాదు. మంత్రాలు అసలే రావు. ఈ మంత్రాల మధ్యలో మనం ఓ పాత సినిమా పాట పాడినా అర్థం కావడం అటుంచి ఎవరికీ పట్టదు. ఇటువంటివి సవాలక్ష చూసాను నేను." నవ్వుతున్నారు అవధానులు.

అవధానులు గారు చెప్పినది కాస్త నిజమే కాబట్టి నారాయణకి కోపం వచ్చినా ఈ సమయంలో అందరి ముందూ ఏమైనా అంటే బాగుండదు కనక ఏదో అందామనుకుని నోరు మూసుకున్నాడు. పూజార్లు అన్నీ అమర్చాక, అటూ ఇటూ జరిగి రావుగారు, ఆయన సతీమణి సరిగ్గా కూర్చున్నాక పూజ మొదలైంది.

గణపతి పూజ మొదలుపెడుతూ, గణానాంత్వా గణపతిం హవామహే... అంటూ అవధానులు శాస్త్రికేసి చూస్తూ, ఆయన అందించే అక్షింతలూ అవీ ఓ చేత్తో తీసుకుంటూ ఇటు రావుగారికి ఏం చేయాలో చెప్తున్నాడు. ఈ లోపుల కబుర్లు చెప్పుకునే జనం మెల్లిగా మాటలు కట్టుపెడుతుంటే పూజార్ల మంత్రాలు తప్ప మరోటి ఏమీ లేదు ఇంట్లో. ఇష్టం ఉన్న

వాళ్ళు ఇటు సత్యన్నారాయణ మూర్తి పటం మీద దృష్టిపెడుతున్నారు. లేనివాళ్లకి చేతిలో స్మార్ట్ ఫోన్ లు ఉండనే ఉన్నై. వేరే గదుల్లో చిచ్చర పిడుగులు ఏవో ఆటలో కబుర్లో చెప్పుకుంటున్నారు. పట్టుచీరలు అతి భక్తితో చేతులు ఎత్తి దేవుడికో నమస్కారం పెట్టుకుంటున్నారు స్వామివారికి.

ప్రథమ గణపతి పూజ అయ్యేసరికి ఏదో అడుగుదామని శాస్త్రికేసి చూసిన అవధానులకి నోటమాట రాలేదు. శాస్త్రి కట్టుకున్న పంచ ఊడిపోయి ఉంది మొలమీద. ఏం చేయాలా అని కాసేపు ఆలోచించి చిన్నగొంతుతో అన్నాడు,

"శాస్త్రీ, పంచ, పంచ, పంచామృత స్నానం కి అన్నీ ఉన్నాయా?" చేయి శాస్త్రిగారి ఊడిపోయిన పంచకేసి చూపిస్తూ. అవధానులు గారు చిన్నగొంతుతో ఇలా అనడం నారాయణకి వినిపిస్తూనే ఉంది.

లోకపాలక పూజ అవుతూంటే మరోసారి అవధానులు గారు ""శాస్త్రీ, పంచ, పంచ, పంచామృత స్నానం కి అన్నీ ఉన్నాయా?" అనడం విన్నాక నారాయణ తలఎత్తి చూసాడు ఇదేమిటా అని. శాస్త్రి అన్నీ సరిగ్గా ఉన్నట్టు చెప్తూంటే అవధానులుగారి మొహంలో కాస్త కోపం, మరోసారి ఆయన "పంచ, పంచ, పంచామృత స్నానం," అని కొంచెం గట్టిగా అంటూంటే వ్రతం చేయించుకునే ఇంటాయన అన్నీ సరిగ్గా లేవు కాబోలు అని లేవబోయేడు చూడ్డానికి.

"పాలు లేవండి ఇక్కడ," అని అవధానులు ఇంటాయనతో అంటూ, "శాస్త్రీ, పంచ, పంచ, పంచామృత స్నానంలో అన్నీ సరిగ్గా కలిపేరా?" అన్నాడు. ఈ సారి ఎందుకో నారాయణకి అనుమానం వచ్చింది. ఏం జరుగుతోందా అని చూడబోయేడు. ఇంటాయన పాలు పట్టుకొచ్చాక ఆయనతో అవి సత్యన్నారాయణ స్వామిమీద తమలపాకుతో జల్లమని చెప్తూ అవధానులు మంత్రం మొదలుపెట్టాడు మళ్ళీ – ఈ సారి శాస్త్రికేసి మళ్ళీ చేయి చూపిస్తూ,

"పంచ, పంచా మృతంలో మొదటిది పాలు...పాలు ...ఆప్యాయస్వ సమేతు తే విశ్వత స్సోమ వృష్ణియం....శాస్త్రీ, పంచ. పంచ... భవా వాజస్య సంగధే: రెండోది – (పెరుగు).. దధిక్రావుణ్ణో అకారిషం, జిష్ణోరశ్వస్య వాజినః.... శాస్త్రీ పంచ, పంచ ఊడిపో... సురభినో ముఖాకరత్ప్రుణ ఆయూగంషి తారిషత్: మూడోది (నెయ్యి) శుక్రమసి జ్యోతిరసితేజోసి దేవో వస్సవితోత్పునా ....పంచ ఊడిపోయింది త్వచ్ఛిద్రేణ పవిత్రేణ వసోస్సూర్యస్య రశ్మిభిః నాలుగోది (తేనె)..... మధువాతా ఋతాయ ...."

ఒక్కసారి బుర్రలో వెలుగు వెలిగినట్టై మంత్రాలు వింటున్న శాస్త్రి ఏదో పని ఉన్నట్టూ లేచి పంచ మీద చేతులువేసుకుని వెళ్తూంటే అవధానులు మొహంలో చిర్నవ్వు. మొదట్నుండీ ఈ "పంచ" అనేదాన్ని ఇంత ఎందుకు సాగదీస్తున్నారా అనేది శ్రద్ధగా వింటున్న నారాయణ నోట్లోంచి ఫకాల్న ఒక్క నవ్వు వచ్చింది. చుట్టూ ఉన్న జనం ఒక్కసారి అదిరిపడి నారాయణకేసి చూసారు. నారాయణ అందరికేసీ ఓ చూపు 'సారీ' అన్నట్టూ పడేసి మళ్ళీ పూజలో నిమగ్నమైపోయేడు.

లేచి వెళ్ళిన శాస్త్రి మరో రెండు నిముషాలక్కాబోలు పక్కగదిలోకి వెళ్ళి పంచ సరిచేసుకుని వచ్చి మళ్ళీ కూర్చున్నాడు పూజలో. ఏదైతేనేం మొత్తానికి పూజ నిర్విఘ్నంగా కొనసాగింది. నారాయణ విన్నాడో లేదో పట్టించుకోని అవధానులు తృప్తిగా పూజ పూర్తి చేసాక అందరూ ఇచ్చిన దక్షిణ, సరుకులూ మూట గట్టుకుని అందరకీ దీవెనలిచ్చారు.

తర్వాత కాస్త ఫలహారం పూజార్లకి. వాళ్ళకున్న ఆచారం ప్రకారం ఇక్కడ రావుగారింట్లో భోజనాలు చేయరుట. ఫలహారం తినేసి కాఫీతాగి వెళ్ళిపోతారు. వాళ్ళు వెళ్ళిపోతూంటే నారాయణ కారు దాకా వచ్చేడు, సాగనంపడానికి.

శాస్త్రి డ్రైవ్ చేయడానికి సీట్లో కూర్చున్నాక నారాయణ ఇటు పాసెంజర్ సీట్లో ఉన్న అవధానులు గారితో నవ్వుతూ అన్నాడు, "మొత్తానికి అసాధ్యులండి, పూజ బాగా చేయించారు. పంచ పంచ పంచ అంటు పంచ అమృతం స్నానం, అంటూ శాస్త్రిగారితో చెపుతూ."

"ఎవరూ గమనించరనుకున్నాను. మీరు విన్నారేమిటి?" అవధానులు కూడా చిరునవ్వు నవ్వేరు.

"అన్ని సార్లు రెట్టించి అంటూంటే వినమూ మరీ?" మొత్తానికి శాస్త్రిగారికి సందేశం అందింది కదా?"

"ఏమనుకోకండి కుర్రాడు కదా, చూసుకోలేదు ఒక్కొక్కప్పుడు అలా అవుతూ ఉంటుంది. అందువల్ల అలా మంత్రాల్లో కలిపి చెప్పేశాను. అందరి ముందూ కుర్రాడు చూసుకోకుండా లేచాడనుకోండి ఎంత అవమానం?"

"అవునులెండి. ఆ మాత్రం నాకూ తెలుసు. నేనూ ఒకప్పుడు ఇండియాలో ఇలా పూజ చేయించిన వాడినే, అన్నవరం కొండ మీద గుడిలో పనిచేసే మా నాన్నగారితో కలిసి." నారాయణ చెప్పేడు.

"అవునా, సంతోషం. పూజ నిర్విఘ్నంగా అయింది. అదే చాలు. సర్వేజనా సుఃఖినోభవంతు."

అటుపక్కన డ్రైవర్ సీట్లోంచి ఇదంతా వింటున్న శాస్త్రి మొహంలో కూడా చిన్న వెర్రినవ్వు. ఏమనాలో తెలియక ఇంక వెళ్తాం అని చెప్పి కారు ముందుకు పోనిచ్చాడు శాస్త్రి.

***నీతిః అమెరికా వీసా రావడానికి ఇద్దరే అర్హులు – సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు, ఆగమ పండిట్ లనబడే గుడి పూజారులూను. ఇద్దరికీ ఎటువంటి క్వాలిఫికేషన్ అవసరంలేదు. కోడ్ పనిచేసినంత కాలం అదెలా రాసారో, అందులో ఏముందో తెలియ(క్కర్లే)నట్టే, పూజ నిర్విఘ్నంగా జరిగినంత కాలం ఏ మంత్రం, ఎలా చెప్పారా, అందులే ఏం చెప్పారా అనేది పూర్తిగా అనవసరం.***

## ఎనిమిదో తరగతి థెరపీ

రామం ఆఫీసు నుంచి ఇంటికొచ్చాక తెలిసిన విషయం, శాంతి పొద్దున్ననుంచీ ఏమీ తినలేకపోతోంది. వికారం, వేవిళ్ళూ కనక ఏదీ తినడం కుదరదు. పొద్దున్ననుంచీ తాగిన నిమ్మరసం, కాస్త జావా అదీ తప్ప మరేదీ నోట్లోకి పోవడం

లేదు. డాక్టర్ మొదట్లో చెప్పినదే, మరో రెండు మూడు వారాలలో అంతా సర్దుకుంటుంది. రామానికి ఏం చేయాలో తెలియలేదు. అసలే ఇది మొదటిసారి తమకి ఈ విషయం.

"పోనీ కొంచెం టీ కానీ గ్లూకోజ్ వాటర్ లాంటిది కానీ తాగుతావా?" అడిగేడు.

"వద్దు. ఇంటికి ఫోన్ చేసాను. మామ్మ ఏమీ తినవద్దనీ, నిమ్మకాయ బద్ద నాలిక మీద రాసుకోమనీ చెప్పింది."

"డాక్టర్ ఏదైనా తినొచ్చన్నారుగా?" క్రితం సారి వెళ్ళినప్పుడు గైనకాలజిస్ట్ చెప్పిన విషయం గుర్తొచ్చి అడిగేడు రామం.

"ఆవిడకేం, ఎన్నైనా చెప్తుంది. మామ్మకి తెల్సినంత ఆవిడకి తెలియద్దూ?"

రామానికేం చెప్పాలో తెలియలేదు. ఏమంటే ఎటొస్తుందో తెలియదు కనక నోరుమూసుకున్నాడు. మరో రెండువారాలు ఇలాగే గడిచాక నెమ్మదిగా వికారం అదీ పోయి నెమ్మదించింది శాంతికి. అన్నీ సరిగ్గా జరుతున్నాయి. డెలివరీకి ఫలానా రోజు అన్నారు కానీ ఓ వారం అటూ ఇటూగా ఉండడం మంచిదే కదా? ఈ వార్తలన్నీ ఎప్పటికప్పుడు ఇండియాలో మామ్మకి చేరుతున్నాయి కూడా.

ఏడో నెలలో రామం అమ్మా, నాన్నా దిగారు శాంతిని చూడడానికీ, డెలివరీ టైం లో సహాయానికీను. అసలు వాళ్లని అమెరికా రప్పించడానికే ఓ ప్రహసనం. శాంతి తన అమ్మనీ నాన్ననీ పిలుద్దామంటే వాళ్లు వద్దు అనీ, తన తల్లినీ తండ్రినీ రమ్మన్నాననీ రామం వాదన. ఏదైతేనేం, మొత్తానికి అయ్యవారి మాట నెగ్గితే సరే ఎవరైతే ఏమిటని ఆవిడ సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయినా ఫోను మీద మామ్మ ఎప్పటికప్పుడు తనకి సలహాలిస్తోంది కదా? అదీకాక అత్తగారు మంచిదే, మరో ఆడ మనిషి సహాయం ఉంటుంది కనక ఏమీ కంగారులేదు.

అయిదో నెలలో మరో సారి స్కానింగ్ చేసి చెప్పిన విషయం – పుట్టేది తప్పకుండా వంశోద్ధారకుడే! రామానికి అమ్మాయైనా అబ్బాయైనా ఒకటే అనిపించినా తల్లికీ, శాంతికీ, ఇండియాలో మామ్మగారికీ అద్భుతమైన వార్త ఇది. అప్పట్నుండి వాళ్లని పట్టడం గగనమైపోయింది రామానికి.

శాంతికి అత్తగారు వచ్చినప్పటినుండి జీవితం సుఖంగానే ఉంది కూడా. అత్తగారు పుట్టబోయే మనవడి మీద ప్రేమో మరి కోడలిమీద ప్రేమో, శాంతిని బాగానే చూస్తోంది. అయితే రామం జీవితం మాత్రం మరింత జటిలమైంది. దీనికి కారణం ఇప్పుడు అమెరికా వచ్చిన రామం తల్లీ, ఇండియాలో ఉన్న శాంతి మామ్మ కూడబలుక్కుని శాంతి ఏం చేయాలో ఏం తినాలో, కూడదో చెప్తున్నారు. అందులో విషయాలు కొన్ని వింటే రామానికి మతిపోయే పరిస్థితి. ఆ విషయాల ప్రకారం రోజూ తీరిక ఉన్నా లేకపోయినా బండి మీద షాపులన్నీ తిరిగి అడిగినది తెచ్చిపెట్టడం ఒక ఎత్తైతే రెండోది అసలు ఆ అడిగినవి ఏ షాపులో ఉన్నాయో ఎక్కడ దొరుకుతాయో కనుక్కోవడం. కొత్త కొత్త పేర్లు, వింతలూ, విషయాలూ తెలిసొస్తున్నాయ్ రామానికి.

మొదటిది – దొరికిన స్వీట్లు కొనడం. ఇది ఈజీగా ముగిసిపోయింది, వారాంతం పటేల్ స్టోర్ లో. ఇంకా మిగతావి కేకులో, కాకరకాయలో అవీ అమెరికన్ గ్రోసరీలో దొరుకుతాయ్. రెండోది – పుల్ల మామిడికాయ కొనాలి. మామిడికాయ ఎలాగోలా సంపాదించవచ్చు కానీ అది పులుపోకాదో ఎలా తెలుస్తుంది? దానికి రెండు మూడు ట్రిప్పులు. మరోసారి కావాల్సినది శొంఠి పొడి. దీనికి మరోసారీ మరోసారీ తిరగాల్సి వచ్చింది. అల్లం లా ఉండే శొంఠి అయితే దొరికింది కానీ ఇండియా మామ్మగారి ప్రకారం శొంఠి పొడి అన్నంలో కలుపుకుని తినవల్సిందే! దాన్ని పొడి చేయడానికి రామం అమ్మ ఇంట్లో ఉన్న మిక్సీ ట్రై చేయబోయింది కానీ కుదర్లేదు. అందుకు స్థానిక గుడిలో పెద్దమనిషి ఇచ్చిన సలహా మాత్రం అద్భుతంగా పనిచేసింది. కాఫీ గ్రైండర్ అని వాల్ మార్ట్ లో అమ్ముతారు ఇరవై డాలర్లకి. అది అద్భుతం గా పనిచేసింది శొంఠి పొడికి. ఏదైనా గొడవ వస్తే అర్ధరాత్రీ అపరాత్రీ గైనకాలజిస్ట్ కి ఫోన్ చేస్తూనే ఉన్నారు, ఇదో ప్రోబ్లెం అనీ అదో ప్రోబ్లెం అనీ. ఆవిడ చెప్పినది విని ఇంట్లో చెప్తే అదంతా తప్పు అని కొట్టిపారేసి మామ్మ చెప్పినట్టూ ఏ నిమ్మకాయో నోట్లో పెట్టుకోవడం లేకపోతే ఆవిడ ఫోనులో చెప్పిన కషాయం తాగడం. ఇంతోటి పనికీ తనని అర్ధరాత్రి డాక్టర్ కి ఫోన్ చేయమని చెప్పడం ఎందుకో అని రామానికి అనిపించినా నోరెత్తితే ఏమౌతుందో తెలుసు కనక నోరు మూసుకోవడం.

ఎనిమిదో నెలలో తగిలిన తలమీద బొప్పి పుట్టే విషయం – పుట్టే కొడుకు తెల్లగా ఉండాలంటే కుంకుమ పువ్వు తినాలి ప్రతీదానిలో కలుపుకుని. పాలల్లో వేసుకుని తాగితే మరింత మంచిది. కుంకుమ పువ్వుకోసం మళ్ళీ మార్కెట్ మీద పడ్డాడు రామం. దాన్ని ఇంగ్లీషులో ఏమంటారో? అయినా గుర్రం తోక వెంట్రుక దగ్గిర్నుంచి పిల్లి మీసాల దాకా అన్నీ అమ్మే పటేల్ స్టోర్ ఉండగా ఎందుకు చింత? వెళ్ళి అడిగేడు రామం షాపులో.

పటేల్ గురువు బయటకి తీసి ఇచ్చి అడిగేడు నవ్వుతూ, "డెలివరీ టైమ్ ఎప్పుడండి?"

వార్నీ వీడిక్కూడా తెల్సిపోయిందే అనుకుంటూ చెప్పేడు రామం, "మరో రెండు నెలల్లో. ఇది ఎంతండి?"

"ఇరవై నాలుగు డాలర్లు"

పటేల్ చెప్పినది విని కళ్ళు తేలేస్తుంటే ఆయనే చెప్పేడు, "దీన్ని స్పానిష్ సఫ్రాన్ అనంటారు. చాలా ఖరీదు. చిన్న బాక్సు అయినా గ్రాముల లెక్కలో అమ్ముతాం. ఎక్కువ వాడక్కర్లేదు. కేష్ ఇస్తారా, కార్డా?"

అది పట్టుకొచ్చాక దాని తాగడానికి శాంతికి డోకు దాని కంపుకీ వాసనకీ. తాగి తీరాలని మామ్మగారి ఆర్డర్! గ్లాసుపాలలో ఆ కుంకుమ పువ్వు వేసి నోటి దగ్గిర ఉంచడం అత్తగారి పని. అది మింగలేకా కక్కలేకా అవస్థ పడుతుంటే పోనీ అని వదిలేయడం. యాభై గ్రాముల కుంకుమ పువ్వుకి ఇరవైనాలుగు డాలర్లు తగలేసినందుకు రామానికి కోపం. ఏమీ చేయలేని స్థితి.

తొమ్మిదో నెలలో గైనకాలజిస్ట్ దగ్గిర అడిగేశాడు రామం ఏమైతే అదే అయిందని – ఇలా స్పానిష్ సఫ్రాన్ పాలల్లో కలిపి తాగితే బిడ్డ రంగు మారుతుందిట కదా అని. పక్కనుంచి శాంతి చేయి గిల్లుతూనే ఉంది అడదొద్దని అయినా అడిగేశాడు రామం. శాంతి మొహం ముడుచుకోవడం అందరూ చూసినదే.

ఇలాంటివి చాలా చూసిందేమో, ఆవిడ నవ్వుతూ అంది, "అబ్బే బిడ్డ రంగు జెనెటిక్స్ మీద ఆధారపడి ఉంటుంది కానీ తాగే పాల మీదా అందులో కలుపుకునే పంచదార మీదా ఉంటుందా? సరిగ్గా ఆలోచించండి కానీ ఏవో మూఢ నమ్మకాలు వద్దు. అయినా మీరిద్దరూ పుట్టే బిడ్డ ఆరోగ్యం గురించి ఆలోచించాలి కానీ రంగు మీద కాదు."

వెనక్కి ఇంటికొస్తుంటే దారిలో శాంతి మొహం మాడ్చుకోవడం ఇంటికొచ్చాక అత్తగారితో ఇదంతా చెప్పడం అయ్యేక అందరూ కల్సి రామానికి అక్షింతలు జల్లారు; రామం అమ్మ అయితే కాస్త గౌరవంగానో, కటువుగానో "ఇంక నువ్వు నోరు మూసుకోరా" అనేసింది కూడా.

మొత్తానికి డెలివరీ రోజుకి పండంటి కొడుకే ఆరోగ్యంగా పుట్టాక తెల్లగానే ఉన్నాడు. మరో రెండు రోజులకి ఇంటికొచ్చారు. తెల్లటి మనవణ్ణి చూసుకుని అత్తగారు అనుక్షణం మురిసిపోతూ ఎప్పటికప్పుడు ఇండియా మామ్మగారికి చెప్తూనే ఉంది విషయాలన్నీ. ఆవిడ అక్కడ సంతోషంతో బొబ్బట్లు ఇంట్లో చేసి అందరికీ పెట్టింది.

"గైనకాలజిస్ట్ సరిగ్గా చూసి మంచిమంచి మందులూ అవీ ఇవ్వడం, హాస్పిటల్ సరిగ్గా చూడ్డం వల్ల అంతా బాగా జరిగింది. వాడి రంగు మన దగ్గిర్నుంచి వచ్చినదే," సంతోషంగా అన్నాడు రామం, కొడుక్కి రెండు నెలలు వచ్చాక.

"ఛా, ఛా, ఆ గైనకాలజిస్ట్ ఏం చేసింది? మామ్మ చెప్పినట్టూ కుంకుమ పువ్వూ అవీ వాడాను, అత్తగారు చెప్పినట్టూ అన్నీ సరిగ్గా తిన్నాను. అందుకే వాడు ఆరోగ్యంగా తెల్లగా ఉన్నాడు, అవును కదండీ?" శాంతి అత్తగారికేసి చూస్తూ అంది; అత్తగార్ని పొగిడితే తనకొచ్చే సుఖం ఏ కోడలికి తెలియదు కనక?

ఒక్కసారి తనమీద అటువంటి మాట అందులోనూ కోడలి నోట్లోంచి రాగానే ఆవిడ రెచ్చిపోయి అంది, "అవును, డాక్టర్లకేం తెలుసు? మాకు అయితే ఇటువంటి విషయాల్లో ఎక్స్ పీరియన్స్ ఉంది. వాళ్ళకేమో పుస్తకాల్లో ఏవుందో అదే తెలుసు అదే చెప్తారు. వాళ్ళెప్పుడూ అంతే, ఇండియా అయినా అమెరికా అయినా."

"అమ్మా అలా అంటావేమిటే, పాపం ఆవిడ ఎప్పుడు అర్ధరాత్రి ఫోన్ చేసినా విసుక్కోకుండా అడిగిన అన్నింటికి సమాధానం చెప్పి ఎంత హెల్ప్ చేసింది? అందులోనూ ఆవిడ ఈ ఊళ్ళో బాగా పేరున్న డాక్టర్."

"దాందేవుందిరా, వాళ్లందరూ అలాగే చేస్తారు. మామ్మగారు ఇండియానుంచీ, నేను ఇక్కడ ఉండీ చేసిన సహాయం నీకు కనపళ్ళేదు కానీ డాక్టర్ ని వెనకేసుకొస్తున్నావా?" ఈసడించింది రామం అమ్మ.

ఏమనడానికీ తోచక రామం తండ్రికేసి చూసాడు కనీసం ఆయనైనా తనకి వత్తాసు పలుకుతాడేమోనని. ఆయన ఇవన్నీ విన్నాడో లేదోకానీ నిమిత్తమాత్రుడిలాగా టివిలో వచ్చే ఏదో ఛానెల్లో తెలుగు సినిమా హీరో చొంగ కార్చుకుంటూ హీరోయిన్ చుట్టూ తిరిగి పాడే పాట వినడంలో నిమగ్నమై ఉన్నాడు.

**నీతిః ఇండియాలో ఎనిమిదో తరగతి మాత్రమే చదువున్న బామ్మ చెప్పిన థెరపీ – ఎవరు ఏమన్నా సరే, కాకలు తీరిన అమెరికా డాక్టర్ చెప్పిన థెరపీ కన్నా - ఎప్పుడూ మంచిది.**

## *తెలివితేటలు*

**కాన్సాస్** నుంచి రాత్రి ఫోనొచ్చింది కవితకి. అక్కడ ఉండే పిన్ని కూతురు కవితని ఈ వేసవిలో చూడాలనుకుంటోంది వస్తావా అని అడుగుతోంది. అప్పటికి పడుకున్న రాఘవని అడిగి పొద్దున్న చెప్తానని పెట్టేసింది. వెళ్ళాలంటే దూరం ఒహైయోనుంచి కాన్సాస్. వెళ్ళకూడదనుకుంటే మళ్ళీ ఎప్పుడు కలుస్తారో తెలియదు కదా.

పొద్దున్న రాఘవ ఆఫీసుకెళ్తుంటే చెప్పింది రాత్రి వచ్చిన ఫోన్ సంగతి. సరే సాయంత్రం మాట్లాడదాం అని కంగారుగా వెళ్ళాడు ఆయన. సాయంత్రం మళ్ళీ ఇదే కబురు. వెళ్దామా వద్దా? వీలు చూసుకుంటే నాలుగు రోజులు పడుతుంది రానూ పోనూ. అక్కడకి డ్రైవ్ చేసుకుని వెళ్ళడం చవక ముగ్గురి పిల్లల్తో తానూ, కవితా విమానం ఎక్కితే అక్కడ మళ్ళీ ఎవరిమీదో ఆధారపడాలి ప్రతీదానికి. అద్దెకి కారు తీసుకుంటే మరో ఖర్చు. ఏదైనా అయిదు ఫ్లైట్ టికెట్లు దండగే. ఆరునుంచి ఎనిమిది గంటల్లో డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళిపోవచ్చు. ఇప్పుడు నేను రాను అంటే చెప్పులోని రాయి చెవిలోని జోరీగ కంటిలో నలుసులా, కాలిలో ముల్లులా అలా గుచ్చుకుంటూనే ఉంటుందని వేమన తాత ఏనాడో చెప్పినదే కదా?

అలా జూలై నెలలో నాలుగో తారీఖుకి కాన్సాస్ లో ఉండేలా బయల్దేరారు. అక్కడ జూలై నాలుగో తారీఖుకి జరిగే బాణసంచా చూడ్డం ఒకటైతే, పిల్లలకి స్కూళ్ళు సరిగ్గా కట్టేసి ఉండడం మరొకటి. తీరా అక్కడకి వెళ్ళాక తెలిసిన విషయం – పిన్ని కూతురు తాము ఒక్కర్నీ కాదు పిలిచినది – ఆవిడకున్న బంధుగణంలో మరో రెండు ఫామిలీలు అప్పటికే వచ్చి ఉన్నాయి. పిన్ని కూతురూ వాళ్ళాయనా కొత్తగా ఓ ఏడాది క్రితమే వచ్చారు కాబోలు తెలుసున్న అందర్నీ పిలిచారుట. రెండు బెడ్రూంల అపార్ట్ మెంట్ లో నాలుగు కుటుంబాలు. దొరికిన చోట జాగా చూసుకుని పడుకోవడం, నోటికి పెట్టినదో పట్టినదో తినడం. ఓ వారమే కదా?

వారం బాగానే గడిచింది గానీ రాఘవ చూసినది మాత్రం పిన్ని కూతురూ, కవితా వచ్చిన వాళ్ళకి వండి వార్చడానికి ఒళ్ళు గుల్ల చేసుకోవడం చూస్తున్నా కూడా ఆవిడ వైపు బంధుగణంలో ఎవరూ కూడా వంటింట్లోకి వచ్చి సహాయం చేయకపోవడం. అసలు కవిత కూడా అందరూ తలో చేయీ వేస్తారనుకుంది కానీ వీళ్లని చూసేసరికి అసలు

విషయం అర్ధమైంది. పొద్దున్న కాఫీల దగ్గిర్నుంచి రాత్రి మంచం ఎక్కేదాకా అన్నీ వీళ్ళిద్దరే చేయాలి కానీ ఆ రెండు కుటుంబాల వాళ్ళూ కాళ్ళూ చేతులూ ఎత్తరు. దానికి తోడు ఏదైనా పనిలో సహాయం చేయమని అడుగుతారేమో అది తప్పించుకుందాం అన్నట్టూ చేతిలో ఫోను తీసి అందులో ఏవో చాటింగ్, ఫేసు బుక్కూ వగైరా – అదే ప్రపంచం అన్నట్టూను. పిల్లల చేతుల్లో ఐపేడ్ లూ, అమ్మా ఆకలే అనే అరుపులూ విని కవితా, పిన్ని కూతురూ ఏదో చేసిపెట్టాలి. అన్నింటికన్నా వింత, ఈ బంధువుల్లో ఆడవాళ్ళిలా ఉంటే వాళ్ళాయనలు కూడా నిమిత్త మాత్రం భవ సవ్యసాచిన్ అన్నట్టూ, "మేమేం చేయగలం?" అనే ధోరణి.

ఓ రోజు ఇంక ఊరుకోక కవిత రాఘువ దగ్గిర వెళ్ళబోసుకుంది ఈ గొడవ అందరూ పడుకున్నాక. "ఏం చేద్దాం, ఓ రోజు బయట భోజనం కానిద్దామా పోనీ?" అన్నాడు రాఘువ.

"సరే మీరే ప్రపోజ్ చేయండి," కవిత చెప్పింది.

మర్నాడు రాఘువ అందరూ వింటూండగా చెప్పాడు, "పాపం ఇక్కడ హోస్ట్ ఒక్కరే కష్టపడుతున్నారు కదా వంటింట్లో ఈ రోజు బయట భోజనానికి వెళ్దామా?"

బులెట్ లాగా ప్రశ్న సంధించేడు పక్కనే ఉన్న పెద్దమనిషి ఈ పిచ్చి నవ్వు నవ్వుతూ "మీరిస్తారా డబ్బులు అందరికీ, మనందరం కలిసి ఓ పాతిక మంది ఉన్నాం. రెండువందలు వదుల్తుంది ఎంతలేదన్నా."

చెప్పు తీసుకుని ఫెడేల్ మంటూ ప్రశ్న అడిగినాయన చెంపలు వాయించాలన్నంత కోపం వచ్చింది రాఘవకి. నవ్వుతూ అన్నాడు, "లేదే ఎప్పట్లాగే ఇ.డి.వి అంటే ఎవరి డబ్బులు వాళ్లవే అనేది పాటించడమే."

పెద్దమనిషి మొహం ముడుచుకున్నాడు జేబులోంచి డబ్బులు తీయాలనేసరికి. బయటకెళ్ళినా మరో చోట ఏదైనా తింటే తన కుటుంబానికి తాను డబ్బులు పెట్టుకోలేనివాడు ఇంతదూరం ఎందుకొచ్చినట్టో అనుకున్నాడు రాఘువ.

ముభావంగా మిగతా రోజులు గడిపేసి వెనక్కొచ్చారు ఓహైయో. వచ్చేటప్పుడు కవిత చెప్పిన విషయాలు మొత్తం దారి అంతా ఇవే. ఆ వచ్చిన కుటుంబాలు అమెరికాలో పదేళ్ల బట్టీ ఉంటున్నారు – కొలొరాడోలో ఒకరూ, మిన్నెసోటాలో మరోకరూ. ఇలా ఎక్కడికి వెళ్ళినా ఏ పనీ చేయరు అమ్మవార్లు. పిన్నికూతురికి ఇది తెలియక వాళ్లని పిలిచింది బంధువులు అనుకుంటూ. పోనీ వచ్చినవాళ్ళు కొత్తగా వచ్చిన వాళ్లకి ఏదైనా ఇచ్చారా అంటే అదీ లేదు. వెళ్ళేటప్పుడు తలో ఇరవై డాలర్లూ చేతిలో పెట్టారుట. వారంరోజులు ఇంట్లో ఉండి ఏ పని చేయకుండా ఉన్నా ఇరవై డాలర్లా? ఏం బతుకులు, ఛీదరించుకున్నారు తాను పిన్ని కూతురూను; అలా దారంతా కవిత చెప్తూనే ఉంది. మధ్యలో తనకి నిద్ర ఎలా లేదో, పిన్ని కూతురూ తానూ ఎంత కష్టపడ్డారో, ఒళ్ళు గుల్ల చేసుకున్నారో అన్నీ చెప్పాక నిద్రలోకి జారుకుంది కవిత. అర్ధరాత్రో అపరాత్రో ఇంటికి చేరారు.

స్కూళ్ళు తెరిచి మళ్ళీ ఎవరి గొడవల్లో వాళ్ళు పడేసరికి ఇదిగిదిగో అంటూ థేంక్స్ గివింగ్ వచ్చింది. అయిదు నెలలకి ఆడవాళ్ళు అన్నీ మర్చిపోయినట్టున్నారు. కవితకి మళ్ళీ ఫోన్ కాన్సాస్ నుంచి. ఆ కొలొరాడో, మిన్నెసోటా పత్రివ్రతలు పతీ సమేతంగా మళ్ళీ కాన్సాస్ వస్తున్నారు. కవిత కూడా వస్తే బాగుంటుంది కదా, అందరూ కలిసి గడపొచ్చు, సరదాగా. కవితకి కూడా హుషార్ పుట్టుకొచ్చినట్టూ రాఘవకి అనిపించింది. రాఘవకి మండుకొచ్చి అడిగేడు, "క్రితం సారి జరిగినది మర్చిపోలేదా, మళ్ళీ అక్కడకే వెళ్దామంటున్నావు?"

"అస్తమానూ అలా ఉండరేమోనండి. క్రితం సారి అలా ఉన్నా."

"మనుషులు ఎప్పుడూ మారరు. మారినట్టూ కనిపిస్తారంతే. అయినా నీ పిన్నికూతురు నిన్ను ఎందుకు పిలిచిందో ఇప్పటికీ అర్ధంకాలేదా?"

"ఎందుకు? ఏమిటా అడగడం?"

"నువ్వూ, నీ పిన్ని కూత్రురూ వెర్రి మొహాలని తెలుస్తూనే ఉంది కదా? ఆ కొలొరాడో, మిన్నెసోటా పత్రివ్రతలు కాలూ చేయీ కదపరు. ఏదో తాము విపరీతమైన బిజీ అన్నట్టూ ఫోను మీద, తెచ్చుకున్న లాప్ టాప్ ల మీదా పడి చూడడం. వాళ్లకి వండి వార్చడానికి పిన్ని కూతురికి ఓపిక ఎక్కడ్నుంచి వస్తుంది? అందుకే నిన్ను పిలుస్తున్నది. క్రితం సారి జరిగినదే అది కదా? ఆ మాత్రం అర్ధం కాలేదా?"

"నిజమే కాబోలు, అయినా అస్తమానూ అలా ఉండకపోవచ్చు కదా?"

"మరో సారి అడగకు, నేను రాను. ఆవిడకి ఫోన్ చేసి చెప్పుకో. మా ఆయనకి కుదరదు అని. ఎవరో ఒకరు వచ్చినప్పుడల్లా నిన్ను వంట మనిషిలా వాడుకోవడానికి మీ పిన్నికూతురికి అలవాటయ్యేటట్టుంది. దీనికి మొదట్లోనే ఫుల్ స్టాప్ పెట్టకపోతే పీకలమీదకి వస్తుంది. ఆవిడేదో నీమీద ఆపేక్ష ఒలకబోస్తోందని నీ ఊహ. మీ పిన్ని కూతురు ఈ పతివ్రతలకి చేయబోయే సేవలు తప్పించుకోవడానికి నిన్ను తెలివిగా వాడుకుందామని ఆశ. కావాలిస్తే నేను ఇలా అన్నానకి కూడా చెప్పుకో ఆవిడకి. ఐ డోంట్ కేర్. ఆ మాత్రం అర్ధం కాలేదా?"

సంగతి పూర్తిగా అర్ధమైనట్టూ, పిన్ని కూతురితో మాట్లాడ్డానికి కవిత ఫోన్ బయటకి తీసింది.

***నీతిః చుట్టాలని ఇంటికి ఆహ్వానించే పిన్ని కూతుర్లూ, గ్రహించండి; తెలివితేటలు ఏ ఒక్కరి సొంతమూ కాదు.***

## పెండ్లి పిలుపు

**శనివారం** పొద్దున్న కాఫీ తాగుతుంటే ఫోను మోగింది కేదార్ గంగూలీ ఇంట్లో. సంతోష్ పేరుతో ఫోను చేసినాయన కేదార్ తో కలిసి చదువుకున్నాట్ట నాలుగేళ్ళ క్రితం కాలిఫోర్నియా యూనివర్సిటీలో. ఫలానా డిపార్ట్ మెంట్ లో ఫలానా చోట ఉండేవాణ్ణి గుర్తుందా అంటూ పలకరింపు.

కేదార్ కి గుర్తొచ్చింది. "ఆ! చెప్పండి ఏమిటిలా చేసారు?" అడిగేడు.

"నాకు ఈ ఊళ్ళోనే ఉద్యోగం వచ్చింది, క్రితం వారం చేరాను. ఇక్కండంతా కొత్త కదా ఎవరైనా స్నేహితులు తెలుస్తారేమోనని కనుక్కుంటే మీగురించి తెల్సింది. ఈ వారాంతం కలుసుకోవడం కుదుర్తుందా?"

"ఓ గంట పోయాక ఫోన్ చేస్తాను మా ఆవిణ్ణి కనుక్కుని," చెప్పి ఫోను పెట్టేసేడు కేదార్ గంగూలి. వెనక్కి ఆలోచించాడు కేదార్, తాను సంతోష్ ని కలుసుకోవడం అదీను. సంతోష్ అనబడే ఈ తమిళ తంబి అంత స్నేహితుడూ కాదు, మరీ అంత తెలియని వాడూ కాదు. కానీ ఇప్పుడు పెళ్ళయ్యాక తనకి వీడితో స్నేహం అనవసరం. అలాగని కలుసుకోనంటే ఏడుస్తాడేమో కూడా. కాసేపు ఆలోచించాక సుధతో చెప్పాడు, "ఓ సారి పిలిచి కలుద్దాం, తర్వాత ఏదైనా తిరకాసు వస్తే తప్పుకోవచ్చు. అయినా ఈ తంబి గురించి అనేకకథలు ఉన్నాయి వినడానికి."

"ఏం కథలు?"

"వీడు రూం లో ఉండే కుర్రాళ్ళ టూత్ పేస్ట్ అదీ వాడతాడనీ, షాంపూ కూడా కొనుక్కోకుండా డబ్బులు దాచుకుంటాడనీ రకరకాల కథలు. అసలే వాళ్ళు నోట్లో నాలిక బద్దలూ అవీ వాడరు. కంపు కొడుతూ ఉంటుంది. చెప్తే కోపం చెప్పకపోతే మొహంమీద మొహం పెట్టి మాట్లాడతారు. అంతా వాసన." కాస్త చిరాగ్గా చెప్పాడు కేదార్.

ఈ కబుర్లు అయ్యేక కేదార్ ఫోన్ చేసి చెప్పాడు, "రేపు మధ్యాహ్నం మూడింటికి రండి," అంటూ, అటు లంచ్ కి డిన్నర్ కి కాకుండా చూసుకుంటూ.

మర్నాడు మధ్యాహ్నం దిగాడు సంతోష్. తాను చేసే ఉద్యోగం, ఎక్కడ ఉండేదీ, ఎలా ఈ ఊర్లోకొచ్చాడూ అన్నీ చెప్పి మరో రెండు గంటలకి వెళ్ళాడు మరోసారి కలుస్తానని చెప్పి.

అలా మొదలైన సంతోష్ తో స్నేహం ఏడాది గడిచేసరికి కేదార్ కి విసుగొచ్చింది. ప్రతీదానికీ తనకి ఫోన్ చేయడం, తాను ఇలా ఇలా చేస్తే మంచిదా, కాదా అని అడగడం. కారు కొనడానికి వెళ్తున్నాట్ట వస్తారా సహాయానికి అంటూ అడిగితే వెళ్ళాడు ఓ రోజు. మొత్తం రోజంతా పోయింది ఆ బేరం ఆడ్డంలో. పోనీ కారు కొన్నాడా అంటే అదీ లేదు. ఓ రెండు వందల డాలర్లు తేడా వచ్చిందిట ఖరీదులో, వద్దు అని వెనక్కి వచ్చేసాడు. మరోసారి లేప్ టాప్ కొనడానికి ఇదే తంతు. తన దగ్గిరకొచ్చి సినిమా డివిడిలూ, కావాల్సిన సాఫ్ట్ వేర్ అవీ పట్టుకెళ్లడం.

మిగతా చోట్ల, పటేల్ స్టోర్ లో అనేకానేక సార్లు కనిపించాడు. ఓ సారి క్రికెట్ మేచ్ జరుగుతోందిట రమ్మని పిలిచాడు కూడా. బ్రహ్మ చారుల గదిలోకి వెళ్ళాక ఆ వాతావరణం, అరుపులూ కేకలూ, ఒకప్పుడు తనకి తెల్సినదే అయినా విసుగొచ్చి మేచ్ అవకుండా వెనక్కి వచ్చేసాడు కేదార్. ఆ తర్వాత సంతోష్ ని కలవడం తగ్గించేడు. ఆయనక్కూడా కేదార్ మెల్లిగా పక్కకి తప్పుకోవడం తెలుస్తున్నట్టే ఉంది.

ఓ రోజు ఫోన్ చేసి అడిగాడు కేదార్, "ఆ మధ్యన మీ కిచ్చిన ఆరు పాత హిందీ సినిమా డివిడిలు వెనక్కి ఇస్తారా? ఆ మధ్యన ఇచ్చిన ఒరాకిల్ సాఫ్ట్ వేర్ డివిడిలు కూడా తెచ్చిపెట్టండి. ఇప్పుడోసారి పనిపడింది వాటితోటి."

"మీ డివిడిలు పట్టుకుని పారిపోతాననుకుంటున్నారా? ఇస్తానులెండి," విసురుగా వచ్చింది సమాధానం. కేదార్ కి ఎందుకు వీడితో పెట్టుకున్నానా అనిపించాక చేసేదేం లేదు కనక ఆ విషయం అలా వదిలేసాడు.

మరో ఆరునెలలకి సంతోష్ తో పనిచేసే మరొకాయన కనిపించినప్పుడు కేదార్ తో చెప్పాడు, "సంతోష్ కి వేరే ఊళ్ళో ఉద్యోగం వచ్చిందండి, పై వారమే వెళ్ళిపోతున్నాడు."

ఈ ఊరు వచ్చినప్పుడు మొదట్లో తన దగ్గిరకొచ్చిన వాడు, ఇప్పుడు వెళ్ళిపోతూంటే చెప్పనేలేదు. పోనీ వెళ్ళిపోతే వెళ్ళిపోతున్నాడు, తన దగ్గిర తీసుకున్న డివిడిలు ఇవ్వ వద్దా? ఫోన్ చేసి అడిగేడు అదే విషయం.

"మీ డివిడిలా? ఎక్కడపెట్టానో కనిపించడం లేదు. అన్నీ పేక్ చేసేసాను. ఆ ఊరెళ్ళాక వెతికి పోస్టులో పంపుతాను, ఇప్పుడు అవన్నీ బయటకి తీయడం కుదర్దు."

చెప్పు తీసుకుని కొడదామంత కోపం వచ్చాక అన్నాడు కేదార్, "అదేంటి, నేను దాదాపు రెండు మూడు నెలలనుంచి అడుగుతున్నా ఇవ్వలేదు. ఇప్పుడు వేరే ఊరికి వెళ్ళిపోతున్నా నాతో చెప్పలేదు; పోనీ నా దగ్గిర అరువు తీసుకున్న డివిడిలు నాకు తిరిగి ఇవ్వడానికి అంత కోపం ఎందుకు?"

"కోపం లేదు, నాకు ఖాళీ లేదు అంతే," ఫోన్ పెట్టేసాడు సంతోష్.

అలా కేదార్ కి సంతోష్ తో సంబంధం తెగిపోయింది. ఆ తర్వాత సంతోష్ వర్జీనియా వెళ్ళిపోయాడని చెప్పారు ఎవరో. తన డివిడిలు పోయినా వ్యక్తి దరిద్రం వదిలడంతో కేదార్ కి తలనెప్పి తీసేసినట్టైంది.

అప్పుడొచ్చింది మరో ఫోన్ కాల్, మళ్ళీ సంతోష్ దగ్గిర్నుంచే. ఈ సారి దాన్ని ఆన్సర్ చేయకుండా వదిలేసాడు. వారం లో పది సార్లు మోగాక ఎవరూ ఆన్సర్ చేయనప్పుడు మెసేజ్ పెట్టాడు సంతోష్, "కేదార్, నాకు పెళ్ళి సంబంధం కుదిరింది, పెళ్ళి వర్జీనియాలోనే చేసుకుంటున్నాం. మీరు తప్పకుండా రావాలి."

తాను కనక ఈ పెళ్ళికి వెళ్తే, ఈ సారి సపత్నీ సమేతంగా తనమీదకి దిగుతాడేమో, అని సమాధానం ఇవ్వకుండా వదిలేసాడు కేదార్. ఆ పై వారంలో మరో అయిదారు సార్లు మెసేజ్, తర్వాత ఈమెయిల్లో పెళ్ళి శుభలేఖ వచ్చేయి. వాటిక్కూడా సమాధానం ఇవ్వలేదు కేదార్. అప్పుడొచ్చింది పోస్టల్ మెయిల్లో పెండ్లి పిలుపు అంటూ మరో శుభలేఖ. అమ్మాయి వర్జీనియాలో డాక్టర్ ట. ఈ సంతోష్ గారు ప్రోజక్ట్ మేనేజర్ అనో ఏదో ఉంది. తాను మొదటినుండీ సంతోష్ దగ్గిర్నుంచి ఏమీ ఆశించలేదు. తమ ఊరొస్తే కావాల్సిన సహాయం చేసాడు కూడా. అయినా తన దగ్గిర డివిడిలూ అవీ పట్టుకెళ్ళి అవి ఇవ్వకుండా మోసం చేసాడు పెద్దమనిషి. అడిగితే కోపం. పోనీ వేరే ఊరికెళ్ళాక పంపిస్తానని చెప్పిన డివిడిలు పంపించాడా అంటే అదీ లేదు. ఇంత జరిగాక ఈ పెద్దమనిషికి పెళ్ళయితే తనకేం, ఎవరికో శ్రాద్ధం పెడితే

తనకేం? అయినా సరే విడవకుండా తనని 'నాకు పెళ్ళి అవుతోంది, రా, రా' అని ఎందుకు పిలుస్తున్నాడు? వెళ్ళే ఉద్దేశ్యం ఎల్గా లేదు కనక, శుభలేఖని ట్రాష్ లో పడేశాడు కేదార్.

మర్నాడు ఆఫీసులో లోపలకి వెళ్లబోతోంటే రిసెప్షన్ లో ఉన్నావిడ పిలిచి చెప్పింది, "మీ కోసం ఎవరో సంతోష్ అనే ఆయన ఫోన్ చేసారు పొద్దున్న. మీకు చాలా మంచి స్నేహితులట కదా, తనకి పెళ్లవుతోందిట; మీకు వెడ్డింగ్ కార్డ్ పంపించారుట. అది అందిందో లేదో, అందువల్ల ఎడ్రస్ ఇచ్చారు రమ్మని. తప్పకుండా రావాలి, అంటూ దాదాపు ప్రతీసారి చెప్తున్నాడు. ఇదిగో ఆయనిచ్చిన ఎడ్రస్," నవ్వుతూ కాయితం అందించింది భామ.

"అబ్బే, ఓ రెండు మూడు సార్లు కలిసానంతే, ఈ సారి ఫోన్ చేస్తే ఇలా మెసేజ్ నాకు చేరిందనీ, మళ్ళీ చేయక్కర్లేదనీ చెప్పగలరా? ధన్యవాదాలు," మొహం జేవురించిన కేదార్ చెప్పాడు.

"తప్పకుండా చెప్తాను," తెల్లావిడ మాట విని ముందుకి కదిలేడు కేదార్.

ఆ తర్వాతెప్పుడో కేదార్ ని పటేల్ స్టోర్ లో చూసినప్పుడు సంతోష్ పెళ్ళికెళ్ళిన మరో కుర్రాడు చెప్పాడు – "మీరు పెళ్ళికి రాలేదని అందరి ముందూ అన్నాడు పెళ్ళిలో, మేమందరం కలిసి ఓ వాచ్ సెట్ కొనిచ్చాం. మీరు సంతోష్ తో పాటు కలిసి చదువుకున్నారనీ, అయినా రాలేదనీ అంటూనే ఉన్నాడు పెళ్ళిలో మాతో."

"నేను ఆయనా ఒకే యూనివర్సిటీలో చదువుకోవడం నిజమే కానీ, అబ్బే నాకూ ఆయనకీ అంత స్నేహంలేదు. ఈ ఊరొచ్చాక కొన్ని సార్లు కలిసాం అంతే. మేమిద్దరం క్లోజ్ ఫ్రెండ్స్ కూడా కాదు. ఓ సారి ఆ పెద్దమనిషే నా దగ్గిర సినిమా డివిడిలూ, సాఫ్ట్ వేర్ అవీ తీసుకుని వాటితో ఉడాయించాడు. నన్ను మోసం చేయడానికి ఆయనకి సిగ్గు లేకపోతే వెళ్ళి ఆయన పెళ్ళి చూడ్డానికి నాకు ఉండొద్దా? అయినా నేను పెళ్ళికి రాకపోతే అందర్తో చెప్పుకోవడం దేనికీ?"

"మిమ్మల్ని దాదాపు వంద సార్లు పిలిచాననీ, మీరు ఉద్యోగంలో బాగా సంపాదిస్తూ, పెళ్ళికి రాకపోయినా గిఫ్ట్ ఏమీ పంపలేదు, నేను డాక్టర్ ని పెళ్ళి చేసుకుంటున్నానని ఆయనకి అసూయ అనీ అందరితోనూ అన్నాట్ట" ఆ కుర్రాడు చెప్పాడు కేదార్ నోరు విప్పి ఏదో అనబోయేలోపునే, బయటకి వెళ్ళిపోతూ.

కేదార్ మొహం పాలిపోతూంటే బయటకొచ్చాడు. కొన్న సామాను బండిలో పెట్టి కూర్చున్నాడు స్థబ్దుగా చాలాసేపు, తనని పెళ్ళికి పిలిచింది గిఫ్ట్ కోసం అన్నమాట అనే విషయం తెలియగానే. కాసేపటికి తెలివి వచ్చినట్టై బండి ముందుకి కదిలించి, మనసు కుతకుత ఉడుకుతుంటే కోపం ఉగ్గబట్టుకోలేక ఒక్కసారి గట్టిగా అరిచేడు, "చావు దరిద్రుడా!"

**నీతిః పెళ్ళికి ఎవరైనా చాలా సార్లు పిలుస్తున్నారంటే దానర్థం వాళ్ళకి కావాల్సిన గిఫ్ట్ గురించీ, వాళ్ళావిడ ఎంత అందగత్తో, డబ్బున్నదో గొప్పలు చెప్పుకోవడానికి. మీతో ఉన్న/లేని స్నేహం గురించి అని ఆపోహ పడరాదు.**

# బ్రహ్మచారి

ఎమ్ ఎస్ ఆఖరి సెమెస్టరు లో ఉన్నప్పుడు ఇంక తర్వాత ఎలాగా చేసే పని ఉద్యోగం సంపాదించడం, వెనువెంటనే పెళ్ళి చేసుకోవడమూ కనక నిఖిల్ స్నేహితుల్తో, చెప్పడం మొదలుపెట్టాడు, ఎవరైనా అమ్మాయి ఉంటే చూడమని. ఎలాగా ఇండియా వెళ్ళి పెళ్ళి చేసుకోవచ్చుగా అనే వాళ్లకి సమాధానం ఏమంటే, ఇక్కడున్న మరో ఎమ్ ఎస్ చేసే అమ్మాయి అయితే వీసా గొడవలు ఉండవు. సులభంగా పని అయిపోతుంది. అయితే నిఖిల్ మర్చిపోయిన ముఖ్యమైన విషయం అతనికి సడన్ గా తగిలిన చెంపదెబ్బలా చివరి వరకూ తెలియలేదు.

ఇలా అమ్మాయి గురించి వెతికే రోజుల్లోనే, పాత స్నేహితుడు టెక్సాస్ రమ్మని పిలిచాడు. దాని ప్రకారం, యూనివర్సిటీ స్ప్రింగ్ బ్రేక్ లో నిఖిల్ అందరి యూనివర్సిటీ కుర్రాళ్ళ దగ్గిరా టాం-టాం వేసి చెప్పుకున్న విషయం, తాను స్నేహితుడి దగ్గిరకి వెళ్ళేది – ఉద్యోగ ప్రయత్నం కోసం, అక్కడే ఉద్యోగం చేస్తున్న తన స్నేహితుడికి తెలిసిన మరో ఎమ్.ఎస్ చేసే అమ్మాయిని చూడ్డానికీను. ఇలా బాకా ఊదడానిక్కారణం తన తోటి కుర్రాళ్ళు రాబోయే పరీక్షలకి సీరియస్ గా చదుకుంటున్నప్పుడు, చివరి సెమెస్టర్ లో ఉన్న తనకి ఇటువంటి బాదర బందీలు లేవని చెప్పుకోవడానికీ, ఆ చదువుకునే కుర్రాళ్ళు తన గురించి తెలిసి కుళ్ళుకోవడానికీను. ఉద్యోగం వచ్చేసి, ఆ అమ్మాయిని ఇంప్రెస్ చేయగల్గితే, ఓహ్, దెబ్బకి రెండు పనులు అయిపోతాయ్ కదా. తర్వాత హైద్రాబాద్ వెళ్ళి ఇంట్లో తాను అమెరికాలో చూసిన ఈ అమ్మాయిని తప్ప మరొకరెవర్నీ చేసుకోనని చెప్పేసి ఒప్పించేయడమే! అదృష్టం తన్నుకు రావడం అంటే ఇంత కన్నా మరోటి ఏముంది?

అలా నిఖిల్ వారం రోజుల శెలవుకి టెక్సాస్ లో తేలాడు తన స్నేహితుడి ఇంట్లో. స్నేహితుడంటే ఒకప్పుడు తనకి కాలేజీలో సీనియర్. ఇప్పుడు మంచి ఉద్యోగంలో ఉన్నాడు; పెళ్ళై, ఒక పాప కూడా. స్నేహితుడి వాళ్ళావిడకి తెలిసిన అమ్మాయే ఈ ఎమ్.ఎస్ చేసే అమ్మాయి; లేదా నిఖిల్ కి చూపించబోయే, కాదు కాదు, నిఖిల్ ఆలోచనల ప్రకారం అతనికి కాబోయే భార్య! మరీ అమ్మాయిని ఒక్కర్తినీ ఇంటికి పిలవడం బాగోదు కనక "ఫలానా ఇండియన్ రెస్టారెంట్ కి వస్తారా మీ స్నేహితురాలితో కలిసి, అక్కడ అన్నీ మాట్లాడుకోవచ్చు," అని నిఖిల్ స్నేహితుడు అడిగేడు. భలేవారే, గుడిలో కలుసుకోవచ్చుగా అనే గూట్లే ప్రశ్న అడుగుతారేం? మరీ మొదటిసారే గుడిలో కలుసుకుంటే కొత్త పెళ్ళి కొడుకూ, పెళ్ళి కూతుర్లలా వీళ్ళు సిగ్గు పడిపోరుటండీ? అందువల్ల రెస్టారెంటే మంచిది. అలా న్యూ ఇండియా రెస్టారెంట్ లో మధ్యాహ్యం బఫే కి తేలారు వీళ్ళు నలుగురూ, వాళ్ళు ఇద్దరూను.

స్నేహితుడి భార్యకి ఈ అమ్మాయ్ ఇండియాలో "బాగానే" తెలుసు. ఎలా తెలుసని మరో గూట్లే ప్రశ్నా? ఈవిడ వేలు విడవని మేనత్త, కూతురి అల్లుడిగారి మేనకోడలే ఈ ఎమ్ ఎస్ చేసే సుధ. రెస్టారెంట్లోకి వెళ్ళాక ఎవరెక్కడ

కూర్చోవాలో నిఖిల్ స్నేహితుడు జాగ్రత్తగా అమర్చాడు ఓ రౌండ్ టేబిల్ దగ్గిర; అలా నిఖిల్, సుధ పక్కపక్కనే కూర్చోవడానికీ, మాట్లాడుకోవడానికి కుదర్చబడింది. అందరూ సర్దుకుని కూర్చున్నాక ఒక్కొక్కరూ వెళ్ళి కంచాల్లో తిండి తెచ్చుకోవడం, కబుర్లూ వగైరా. స్నేహితుడు నిఖిల్ తో చెప్పేడు, "ఒరే నీ పక్కనే సుధకి సీటు కుదిర్చాను. ఇప్పుడు ఆవిడతో జాగ్రత్తగా మాట్లాడు. అమ్మాయి కుటుంబం మంచిది. మన వాళ్ళే, మా ఆవిడ కూడా చెప్పింది, అమ్మాయితో నీ గురించి. నోటికొచ్చినట్టూ వాగి ఉన్న అభిప్రాయం పాడుచేసుకోకు."

అప్పటికే సుధ నచ్చేసిన నిఖిల్ చెప్పాడు, "తప్పకుండా, సుధ నాకు బాగా నచ్చేసింది."

అన్నం తింటూంటే కబుర్లలో నిఖిల్ అడిగేడు సుధని, "మీరేం చేద్దామనుకుంటున్నారు ఎమ్ ఎస్ తర్వాత?"

"ఏవుందీ, ముందు ఉద్యోగ ప్రయత్నం. అది రాకపోతే ఏం చేయాలో ఆలోచించుకోవడం వగైరా."

తర్వాత తాము చదివే స్కూల్ గురించీ గ్రేడ్ ల గురించీ, ఎక్కడ ఉద్యోగం వస్తే డబ్బులు బాగుంటాయో, ఎక్కడైతే సులభంగా స్థిరపడవచ్చో అనే కబుర్లూ, సినిమాలూ, రాజకీయాలూ, తర్వాత వీసా, గ్రీన్ కార్డ్ అనే కబుర్లూ అయ్యేక సుధ అంది, "నేనింకా రెండో సెమెస్టర్ లోనే ఉన్నా, మీరేమో ఉద్యోగం కోసం వెతుకుతున్నట్టున్నారు. తర్వాత మీరేం చేద్దామనుకుంటున్నారు? డాక్టరేట్ చేసే ఉద్దేశ్యం ఉందా?"

"అబ్బే, నాకిప్పుడు మంచి మార్కులొచ్చాయ్ అన్ని సెమెస్టర్స్ లోనూ. వెంఠనే ఉద్యోగం లో జేరిపోయి వెనువెంఠనే చేయవల్సింది పెళ్ళి చేసుకోవడం," అసలు ఈ పెళ్ళి సంగతి ఆవిడతో ఎలా చెప్తామా అనే మీమాంస లో ఉన్న నిఖిల్ విజృంభించి చెప్పేసేడు సుధతో.

ఆవిడ విందో లేదో కానీ కాసేపటికి నిఖిల్ వెళ్ళి మరో కంచంలో చికెన్, మటన్ తెచ్చుకుని తినడం సాగించాడు. ఈ సారి ఆశ్చర్యపోయినట్టూ చూసి సుధ అడిగింది, "మీరిలా మాంసం తింటారా? మీరు వెజిటేరియన్ అనుకున్నానే?"

"అదేమిటండోయ్, మన మహర్షులందరూ బ్రహ్మస్వరూపులనే అంటారు, వాళ్ళు కూడా మాంసం తింటారని పుస్తకాల్లో చదువుకున్నాం కదా?" నవ్వేడు తన తెలివితేటలకి నిఖిల్.

"ఓ అది కాదు లెండి. మనం ఇళ్ళలో తినం కదా, పూర్వకాలం వాళ్ళేం చేసారో మనకెందుకు?"

"ఇంట్లో తినం కానీ బయట నేనేదైనా తినగలను. కాలేజీ హాస్టల్లో అలవాటైంది. నాకు 'ఇది తినకూడదనీ అది తినకూడదనీ' పట్టింపు లేదు."

"మరి మీ ఇంట్లో తెలుసా, అమ్మా నాన్నలకి కానీ మిగతావారిగ్గానీ?"

"నాన్నగారికి తెలుసనుకుంటా. అయితే ఏమిటి, బయట నేను ఏం తిన్నానో తినలేదో ఆయన అడగరు, నేను చెప్పను. మా ఇద్దరి మధ్యా ఇదో జెంటిల్ మెన్ బిజినెస్ అనుకోండి." నవ్వేసాడు నిఖిల్.

ఈ మాటల్లో భోజనం పూర్తి కావొచ్చింది, బిల్లు చెల్లించి బయటకొచ్చాక ఒకరికొకరు టాటా చెప్పుకుని ఎవరి కార్ల దగ్గిరకి వాళ్ళు బయల్దేరారు. భోజనాంతరం వెంటనే ఓ సిగరెట్ కాల్చకపోతే మనసు కొట్టుకుపోతుంది కనక తానో సిగరెట్ అంటించాడు నిఖిల్ స్నేహితుడితో అక్కడే నించుని. స్నేహితుడి భార్య, కూతురూ కార్లో కూర్చుని ఫోను మీద మెసేజ్ లు చూసుకుంటున్నపుడు. నిఖిల్ ఇలా సిగరెట్ కాలుస్తూండడం దూరం నుంచి చూస్తున్న సుధ, ఆవిడ స్నేహితురాలి కళ్ళల్లో పడనే పడింది.

ఇంటికెళ్ళిన స్నేహితురాల్తో మాట్లాడుతున్నప్పుడు ఆవిడ అడిగింది సుధని, "అబ్బాయి నచ్చాడా?"

"ఛీ, ఛీ," ఈసడించి ఒక్క మాటలో చెప్పేసింది సుధ, "ఈయన గారు మాంసం ముక్కలు తిని సిగరెట్లు తాగుతూ ఉంటే నేను ఓర్చుకోవాలా? పైగా అడిగితే, జెంటిల్ మాన్ బిజినెస్ అని ఓ పెద్ద పేరు పెట్టి చేసే పనులు సమర్ధించుకుంటున్నాడు. మాకు తెలిసిన ఇళ్ళలో ఇటువంటి వారు ఒక్కరూ లేరు. మందుకొట్టి మాంసం తినేవాళ్ళకి మిగతా ఎటువంటి అలవాట్లున్నాయో? ఆ కంపు నేను భరించలేను."

"పెళ్లయ్యాక అలవాట్లు మార్పించవచ్చు. అదేం పెద్ద కష్టం కాదు," స్నేహితురాలంది, "ఇంతకీ ఈయన నీకు నచ్చాడా?"

"మరోసారి దీని గురించి ఇంక అడక్కు. అయినా నేనిప్పుడు ఎమ్ ఎస్ పూర్తి చేయాలి కదా ముందు, ఈయన గురించి అక్కడ ఆయన సిగరెట్ ముట్టించినప్పుడే మర్చిపోయాను. నచ్చడమా పాడా?"

శెలవులు హుషారుగా స్నేహితుడితో గడిపి, టెక్సాస్ నుంచి వెనక్కొచ్చిన నిఖిల్ రెండుమూడు రోజులు ఆగి స్నేహితుడికి ఫోన్ చేసి అడిగేడు, "అమ్మాయి ఒప్పుకుందా?"

"లేదు; ఎందుకొప్పుకుంటుంది? నేనెంత చెప్పినా పట్టించుకోకుండా, గొప్పగా చికెన్ తినడం గురించి మీ ఇంట్లో వాళ్ల జెంటిల్ మాన్ తనం గురించీ డబ్బా కొట్టేవు కదా? ఆ తర్వాత సిగరెట్ కాల్చడం కూడా చూసారుట. కుదరదని ఖరాఖండీగా చెప్పేసింది. అసలు మరోమాటే లేదు ఆ తర్వాత, అనుభవించు."

**నీతిః పెళ్ళి వన్ వే ట్రాఫిక్ కాదు. పెళ్ళికి ముందు అబ్బాయికి ఏం కావాలో తెలిసినట్టే, అమ్మాయికి, అందులోనూ అమెరికాలో చదువుకుంటున్న అమ్మాయికి – ఏం కావాలో మరింత చాలా బాగా తెలుసు.**

# చంద్రహారం

**అమెరికా వచ్చేముందు** అన్నపూర్ణకి వాళ్ల మామ్మ చెవిలో చెప్పిన రహస్యం ప్రకారం అమెరికాలో బంగారం చవక. మామ్మకి ఎప్పటినుండో చంద్రహారం చేయించుకోవాలని కోరిక ఉండేది కానీ ఏనాటికీ డబ్బులు కుదుర్చుకోలేకపోయింది. అలాగే కూతురైనా చేయించుకుంటుందని కలలు కంది ఆవిడ, కానీ అవీ నెరవేరలేదు. మనవరాలు అమెరికా వెళ్తోంది

కనక మామ్మ బతికుండగానే చంద్రహారం మెడలో వేసుకుని ఓ ఫోటో చూపిస్తే తృప్తిగా ఆవిడ జీవితం వెళ్ళిపోతుంది. అన్నపూర్ణ సరే అంది కానీ విమానం ఎక్కేలోపుల ఈ రహస్యం మనవరాలికి దాదాపు నూట పాతిక సార్లు చెప్పింది మామ్మగారు. మొదటిసారీ రెండోసారీ పట్టించుకోని అన్నపూర్ణకి చంద్రహారం చేయించుకోవాలనే కోరికకి అలా విమానం ఎక్కకుండానే బీజం పడింది – నూట పాతిక సార్లు.

బీజం పడితే చాలదు కదా, పడిన బీజానికి నీళ్ళు పెట్టాలి ఎప్పటికప్పుడు, ఆ గింజ మొలకెత్తితే చుట్టూ కలుపు లేకుండా చూడాలి. అలా జాగ్రత్తగా పెంచితే అది మహా వృక్షమై తన కోరిక తీరుస్తుంది. హెచ్ వన్ వీసా మీద కాలిఫోర్నియా వచ్చిన అన్నపూర్ణ ఓ సారి తన ఉద్యోగంలో పడగానే ఇవన్నీ మర్చిపోయింది కానీ ఎప్పుడు ఇంటికి ఫోన్ చేసినా మామ్మగారు చంద్రహారం సంగతి గుర్తు చేస్తూనే ఉన్నారు. అలా చంద్రహారమనే బీజానికి పాపం మామ్మగారే నీళ్లు పోస్తూ వస్తున్నారు. కొన్నాళ్లకి అన్నపూర్ణకి పెళ్లైంది అయినా రెక్కాడితేగానీ డొక్కాడదన్నట్టున్న ఉద్యోగంలో వచ్చే డబ్బుల్తో చంద్రహారం కొనడం అసాధ్యం. అప్పుడు మొగుడితో ప్రస్తావించిందీ చంద్రహారం విషయం.

అదే ఆవిడ చేసిన తప్పు. మొగుడు రమేష్ ఇంతెత్తున ఎగిరాడు చంద్రహారం సంగతి చెప్పగానే. డబ్బులు అలా తగలేయడం కంటే ఏ అమెజాన్ స్టాక్ కొనడమో మంచిదిట. అదీ కాకపోతే ఒక పెద్ద ఇల్లో, లేక మరో అపార్ట్ మెంటో కొని అద్దెకిస్తే నెల నెలా డబ్బులొస్తాయిట. ఏటా కట్టే పన్నులో రాయితీ కూడా లాగవచ్చు. అలా గంటల తరబడి అన్నపూర్ణకి ఉపన్యాసాలు ఇచ్చి మొత్తానికి ఈ చంద్రహారం విషయం నీరుకార్చేడు రమేష్.

మొగుడిలా చెప్పగానే ఆ వారాంతం అన్నపూర్ణ ఈ విషయాన్ని మామ్మకి చెప్పేసింది ఫోనులో. ఎంతైనా ముద్దుల మనవరాలు కదా? మామ్మకి ఇటువంటి పనికిరాని ఉపన్యాసాలు రెండు తరాలబట్టీ అలవాటు. ఆవిడ చంద్రహారం చేయించుకుంటానంటే తాతగారు ఇటువంటిదే ఒక ఉపన్యాసం దంచి ఆవిడని నీరుగార్చేడు. పోనీ కూతురైనా చేయించుకుంటుందనుకుంటే, దాన్ని అల్లుడిచ్చిన ఉపన్యాసం పాడుచేసింది. ఈ మగాళ్లందరి ఆలోచనలూ పనికిరానివి. ఈ విషయం చూచాయగా చెప్పి మామ్మ అంది, "మొగాళ్లందరూ అంతే, అయినా రెండు విషయాలు గుర్తు పెట్టుకో అమ్మలూ. మొదటిది "నీ సంపాదనతో నువ్వు, నీ కోసం" చంద్రహారం చేయించుకుంటున్నావు. మొగుడి అధికారం ఏమిటి ఇందులో? రెండోది, చంద్రహారం మెడలో వేసుకుని ఏ పెళ్ళికో గుడికో వెళ్తే నిన్నందరూ చూసే చూపు ఎలా ఉంటుందో ఊహించు." ఇలా మామ్మ మనవరాలితో మాట్లాడి మళ్ళీ పురి ఎక్కించింది. అప్పటికి అన్నపూర్ణకి అర్థమైంది – మిన్ను విరిగి మీదపడినా సరే తాను రాబోయే రోజులలో చంద్రహారం చేయించుకు తీరాల్సిందే.

కొన్నాళ్ళు పోయేక కాలిఫోర్నియాలోనే ఉన్న అన్నపూర్ణ దూరపు బంధువు, ఏనాడో అమెరికా వచ్చిన కమల దగ్గిర్నుంచి పిలుపు వచ్చింది వారాంతంలో భోజనానికి రమ్మని. అన్నపూర్ణకి ఈవిడ అత్త వరస. కమలత్త అమెరికా వచ్చి ముప్పై ఏళ్లు దాటుతోంది. వాళ్ళకి పిల్లలు పెద్దవాళ్లయ్యాక గూడు ఖాళీ అయి చాలా కాలం అయింది కూడా. ఆవిడ

మొగుడు రమేష్ తో స్టాకు మార్కెట్టూ, దేశ రాజకీయాలు మాట్లాడుతూంటే ఆడవాళ్ళిద్దరూ వంటింట్లో కబుర్లలో పడ్డారు. కబుర్లలో అన్నపూర్ణ చంద్రహారం కొనుక్కోవడానికి పడే పాట్లూ అవీ చెప్పేసరికి మరిన్ని కబుర్లు దానిమీద. కమలత్తగారికో చంద్రహారం ఉందిట; అది తీసి చూపించారు ఆవిడ అన్నపూర్ణని పై అంతస్తులో ఉన్న తమ బెడ్రూం లోపలకి తీసుకెళ్ళి. అలా అన్నపూర్ణ దాన్ని చూస్తున్నప్పుడు ఆవిడ మొగుడిచేత చంద్రహారం ఎలా కొనిపించుకుందో అవీ చెప్పాక ఆడవాళ్ళు మరో అరగంట మాట్లాడుకున్నారు అనేకానేక విషయాలు – కిందన మగాళ్ళని అలా వదిలేసి.

తర్వాత భోజనం చేస్తున్నప్పుడు కబుర్లలో కమలత్త గారు చెప్పింది రమేష్ తో, "మా కొలీగ్ ఒక అమెరికా ఆవిడకి పెళ్ళి అవుతోంది. ఇండియన్స్ చీరలు కట్టుకుని వస్తే ఆవిడకి ఆనందం. అన్నపూర్ణని పంపిస్తారా? పెళ్ళి వచ్చే వారమే." రమేష్ ఏదో చెప్పేలోపుల అన్నపూర్ణ అంది, "చీర కట్టుకోవడం వరకూ సరే గానీ పెళ్ళికి వెళ్ళడానికి నాకు మెడలో ఈ పుస్తెలతాడు తప్ప మరోటి లేదు. నేను రావడం బాగుండదు."

తనకేదో తెల్సినట్టూ రమేష్ అనేశాడు పైకి, "పెళ్ళికి మనుషులు ముఖ్యం కానీ మెడలో నగలా ముఖ్యం? అలా బంగారం మీద డబ్బులు తగలేయడం కంటే వాటిని ఏ అమెజాన్ లాంటి కంపెనీ స్టాక్ కొనడానికో వాడవచ్చు గదా? " దానికి కమలత్త గారూ ఆవిడ మొగుడూ అభ్యంతరం చెప్పారు – "అలాక్కాదు, చీర కట్టుకుని నగలు అలంకరించుకోకుంటే ఏం బాగుంటుంది? అయినా పెళ్ళికి ఉత్తి బోసి మెడతో వెళ్తే ఎంత అవమానం? నగలు ఉండాల్సిందే." కమలత్తగారి మొగుడు మరింత జ్ఞానబోధ చేసాడు రమేష్ కి, "అమెజాన్ స్టాక్ సంగతి బాగానే ఉంది కానీ స్టాక్ మార్కెట్ కుదేలైతే అవన్నీ పోయినట్టే కదా, బంగారం అయితే పసిడి విలువ. ఎప్పటికైనా పనికొస్తుంది."

గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టైంది రమేష్ కి, "ఈ పెళ్ళికి ఇప్పుడో నగ కొనాలా అయితే?" మొహం వేలాడేస్తూ అడిగాడు, "అదీ ఒక్కరోజు తతంగానికి?"

అన్నపూర్ణ బోసి మెడకి కమలత్తగారు మరో సలహా ఇచ్చారు, "నా దగ్గిరో నగ ఉంది అది పెళ్ళిలో వేసుకోమనండి. ఇంటికి రాగానే ఇచ్చేద్దురు గాని. అదేం పెద్ద కష్టం కాదు." ఎప్పుడైతే తాను అర్జెంటుగా ఓ నగ కొనక్కర్లేదో అప్పుడే వెంఠనే ఒప్పేసుకున్నాడు రమేష్.

అలా పై బుధవారంలో అన్నపూర్ణ ఆఫీసుకి శెలవు పెట్టి మరీ కమలత్తగారింటికి వెళ్ళింది, కమలత్తగారి కొలీగ్ పెళ్ళికి. పెళ్ళికి వెళ్ళిన అన్నపూర్ణ మెడలో కమలత్తగారి చంద్రహారం అనేక పెళ్ళి ఫోటోలలో అదిరేటట్టూ పడింది కూడా. ఆ ఫోటోలు రమేష్ కి చూపిస్తారు అవన్నీ వచ్చాక పెళ్ళివారు ఏ వెబ్ సైట్లోనో, ఫేసు బుక్కులోనో పెడితే. సాయంత్రానికి రమేష్ ఇంటికి వచ్చేసరికి అప్పటికే సిద్ధంగా ఉన్న భయంకరమైన పిడుగు పడింది అతని మీద.

మంచం మీద పడుకుని ఏడుస్తోంది అన్నపూర్ణ ఇతనొచ్చేసరికి. ఏవిటో ఏమైందో అంటూ కనుక్కుందామంటే అవిడ ఏడుపు వదలదు. ఓ గంటా కిందా మీదా పడ్డాక కోపం తెచ్చుకోనని మాట ఇచ్చాక అప్పుడు చెప్పింది భార్యామణి –

పెళ్ళిలో అంతా బాగా జరిగింది. కానీ వెనక్కి వచ్చేసరికి మెడలో ఆవిడిచ్చిన చంద్రహారం కనపడలేదు. అన్నపూర్ణ ఎప్పుడూ చంద్రహారం వాడలేదు, అలవాటు లేదు కనక ఆ హారం ఎప్పుడెలా కిందపడిపోయిందో అసలు ఎలా పడిందో ఏమీ తెలియలేదు. గుర్తున్న విషయం ఒకటే – పెళ్ళి అవగానే వచ్చి కార్లో కూచున్నాక ఆ చంద్రహారం తీద్దామని మెడలో చేయి పెడితే చంద్రహారం లేదు! పెళ్ళికి వచ్చిన తెలుసున్న అందర్నీ అడిగారు కానీ ఫలితం శూన్యం.

కోపం వచ్చిన రమేష్ ఏదో అనబోయి ఆగాడు – ఇప్పుడే కోపం తెచ్చుకోనని మాట ఇచ్చాడు కదా. ఆ తర్వాత రెండు గంటలు ఇద్దరూ నీది తప్పంటే నీది తప్పని వాదించుకున్నాక మొత్తానికి తెలిసి వచ్చినదేమంటే – చంద్రహారం ఖరీదు మొత్తం పంతొమ్మిదివేల డాలర్లు. అది ఎలాగో ఒకలాగ కమలత్త గారికి ఇవ్వాలి. ఇవ్వకపోతే ఆవిడ ఏమనుకుంటుందో? వెంటనే రమేష్ తన స్టాకు ఎకౌంట్లూ అన్నీ తీసి చూసుకున్నాడు. కొన్న అమెజాన్ స్టాకూ, మరో రెండు మూడు స్టాకులూ అమ్మాలి. మొత్తం పాతికవేలు వస్తుంది. తాము పెట్టిన డబ్బులతో పోలిస్తే లాభమే కానీ స్టాకు అమ్మేస్తున్నందుకు కాపిటల్ గైన్స్ అనే పన్ను కట్టాలి బ్రదరూ. అలా లెక్కలు కట్టుకుని కమలత్తగారికి ఇవ్వాల్సిన పంతొమ్మిదివేలూ, కాపిటల్ టాక్సూ తీసేస్తే సరికి సరి. పోతే మొత్తం పోయినట్టే. మరో రెండు రోజులు గింజుకున్నాక ఇలా మొత్తం బిల్లు సెటిల్ చేయడానికి అటు కమలత్త గారూ ఇటు రమేష్ వప్పుకోవడం తో కథ మొదటిసారి సుఖాంతం. ఇన్నాళ్లలోనూ పాపం ఆ కొత్త అమెరికన్ పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ కూడా చర్చిలో పెళ్ళికి వచ్చిన అందరికీ ఫోన్లు చేసి రెండుమూడు సార్లు అడిగారుట. నగ ఎవరికీ దొరకలేదు. 'సో సారీ' అని చెప్పారు కూడా.

అయితే డబ్బులిచ్చే ముందు రమేష్ అడగనే అడిగాడు కమలత్త గార్ని, "మీకు హోమ్ ఇన్స్యూరెన్స్ ఉంటే పోయిన నగలకి వాళ్ళు డబ్బులిస్తారు కదా, దానికి డిడక్టిబుల్ అనేది నేను ఇస్తాను మీ నగ డబ్బులు మీకు వచ్చేస్తాయి." కమలత్త గారు వెంటనే చెప్పింది, "అదీ కనుక్కున్నాం లెండి. మా ఇన్స్యూరెన్స్ దొంగతనంలో పోయిన వాటికి ఇస్తారు కానీ కావాలని పోగొట్టుకున్నవాటికి, పారేసుకున్నవాటికీ ఇవ్వరు." ఏమనాలో తెలియని రమేష్ నోరుమూసుకున్నాడు ఎందుకంటే ఎవరి ఇన్స్యూరెన్స్ కష్టాలూ, రాతలూ కోతలూ వేరు వేరు కాబట్టి. ముప్ఫై ఏళ్లనుంచీ అమెరికాలో ఉంటున్న హనుమంతుడి లాంటి కమలత్త గారి దగ్గిరా కుప్పిగంతులు?

ఆ పై వారాంతానికి ఆర్టేసియా లో కమలత్త గారికి బాగా తెలిసున్న ఒక బంగారం షాపులో తేలాయి రెండు కుటూంబాలూను. కమలత్తగారికి ఉన్న చంద్రహరం మోడల్ ఇప్పుడు లేదుట; కాలం మారింది కదా, మరోటి ఏదైనా ఉంది. కమలత్త గారు చెప్పారు – "ఇప్పటికే చంద్రహారం పోగొట్టినందుకు పాపం అన్నపూర్ణ చాలా బాధపడుతోంది కనక అన్నపూర్ణకి నచ్చిన చంద్రహారం ఏదైనా సరే నాకు నచ్చినట్టే." అలా అన్నపూర్ణకే ఇచ్చారు సెలక్షన్ అంతాను. ఓ మూడు గంటలు పోయాక పంతొమ్మిదివేల డాలర్లు ఇచ్చి అన్నపూర్ణకి నచ్చిన చంద్రహారం మోడల్ కమలత్తగారికి చేతికి సమర్పించుకుని ఇంటికి బయల్దేరారు. ఏడుపులో ఉన్న ఇద్దర్నీ అనునయించడానికో మరిదేనికో కానీ కమలత్తగారు

చెప్పేరు, "ఇక్కడే భోజనం చేసి పోదాం, మా ఆయన మీ ఇద్దరికీ ఇచ్చే ట్రీట్ ఇది, పోయిన చంద్రహారం మాకు వెంఠనే కొనిచ్చేసినందుకు." అలా కథ రెండోసారి సుఖాంతం అయింది.

ఆరో ఏడో వారాలు పోయాక మరోసారి కమలత్త గారు భోజనానికి పిలిచారు. "క్రితం సారి చంద్రహారం పోగొట్టావు, ఈ సారి డైమండ్ నెక్లస్ పోగొట్టడానికా? నేను రాను," అని బిగదీసుకుని కూర్చున్నాడు రమేష్. అన్నపూర్ణ ఆవిడతో ఈ విషయం చెప్తే రమేష్ ని బతిమాల్డానికి కమలత్త గారే ఫోనే చేసారు. ఈ సారి ఏ నెక్లస్ గురించీ, పెళ్ళి గురించీ కాదు, ఓ ముఖ్యమైన విషయం – అమెజాన్ స్టాక్ గురించే, కమలత్త గారి మొగుడు మాట్లాడతారుట రమేష్ తో. స్టాక్ మాట వినగానే రమేష్ సరే అనక తప్పలేదు, తనకి స్టాక్ మార్కెట్ గురించి తెల్సిన విశ్వరూపం చూపించవచ్చు కదా?

భోజనం చేస్తున్నంతసేపూ కమలత్త గారి మొగుడు అమెజాన్ స్టాక్ గురించి మాట్లాడుతూనే ఉన్నాడు. ఎన్ని కొంటే మంచిదీ, ఎంతకాలం ఉంచుకుంటే మంచిదీ అంటూ. భోజనాలు అయ్యాక చెప్పింది కమలత్త గారు అసలు విషయం. పెళ్ళిలో అన్నపూర్ణ పోగొట్టుకున్న చంద్రహారం ఒక అమెరికన్ కి దొరికిందిట చర్చ్ లో బైబిల్ పుస్తకాలు పెట్టే బెంచీ అరలో. అక్కడే ఉన్న ఫాదర్ కి నగ ఇచ్చి వెళ్ళారు. ఫాదర్ గారికీ ఆ నగ ఎవరిదో తెలియదు. చర్చ్ లో జరిగే పెళ్ళిళ్లలో ఎవరైనా పోగొట్టుకున్నారేమో చూడాలి. అలా కనుక్కోవాలంటే మొత్తం పెళ్ళి ఫోటోలన్నీ చూడాలి. అందులో చంద్రహారం వేసుకున్నావిడని గుర్తించడం సులభం. కానీ ఈ పెళ్ళి ఫోటోలన్నీ వచ్చి ఫాదర్ గారు ఆ వెబ్ సైటు చూసేసరికి రెండువారాలు దాటింది. ఆయనకి ఈ అన్నపూర్ణా, కమలత్త గారూ అంత బాగా తెలియదు; పెళ్ళి కూతుర్నీ, అక్కడ్నుంచి కమలత్త గారి నెంబర్ సంపాదించి పిలుద్దాం అనుకుంటూనే ఎప్పటికప్పుడు ఆలస్యం అయింది. అసలే జీవితం ఉరుకులు పరుగులతో ఉంది కదా? మొత్తానికి పిలిచి ఇలా చంద్రహరం కమలత్త గారింటికి వచ్చేసరికి ఏడు వారాలు పైనే పట్టింది. ఏమైనా నగ ఇచ్చేసిన ఆ అమెరికన్ మంచిది. బంగారం నగ దొరికాక ఎవరికీ దొరకలేదని చెప్పి కొట్టేస్తే, కొట్టేసిన దాన్ని ఎవరికైనా అమ్మేస్తే, కరిగించేస్తే ఎవరేం చేయగలరు? బంగారంలో ఉన్న సులువే అది. ఓ సారి మీ చేతిలో పడగానే దాన్నీ గానీ కరిగించారంటే బ్రహ్మదేవుడు కూడా చెప్పలేడు అదెవరిదో.

సరే, మొత్తానికి తమ నగ తమకి వచ్చేసింది కనక కమలత్తగారు ఉవాచ, "మా నగ పోయాక కొత్తగా రమేష్ కొనిపెట్టిన చంద్రహారం అన్నపూర్ణదే. ఇదిగో తీసుకోండి."

ఒక్కసారి అన్నపూర్ణ మొహంలో ఉవ్వెత్తున సంతోషం; రమేష్ ఏమంటాడో అనే సందేహంతో ఏమీ మాట్లాడలేదు ఆవిడ. రమేష్ అన్నాడు, "ఈ నగ వెనక్కి ఇచ్చేస్తే తీసుకుంటారా బంగారం కొట్లో?"

దీనికి బుల్లెట్ లాగా సమాధానం వచ్చింది కమలత్త గారి నుంచి "ఎందుకలా ఇచ్చేయడం? ఈ నగ మీదే, అన్నపూర్ణ మెడలోనే ఉండనివ్వండి. స్టాకులో పెట్టాలంటే డబ్బు మరోలా చూసుకోవచ్చు కదా?" దీనికి కమలత్త గారి మొగుడు కూడా

వంత పాడేసరికి రమేష్ ఒప్పుకోక తప్పలేదు. తర్వాత అక్కడే రమేష్ తన చేతుల్తో కొత్త చంద్రహారం అన్నపూర్ణ మెడలో కడుతుంటే కమలత్త గారు రెండు మూడు ఫోటోలు తీసింది కూడా. అలా మూడో సారి కధ సుఖాంతం అయింది.

అన్నపూర్ణ తన మెడలో చంద్రహారంతో, రమేష్ పక్కనే ఉన్న ఫోటో ఇండియాలో ఉన్న మామ్మకి పంపించింది ఉత్తరోత్తరా. ఫోటో చూసిన మామ్మగారు తన చిరకాలవాంఛ నెరవేరినందుకు ఆ రోజు రాత్రి పడుకున్నంత సుఖంగా ఏరోజూ నిద్రపోలేదు. చంద్రహారం కోసం అన్నపూర్ణ, కమలత్త గారూ కలిసి ఆడిన ఈ నాటకం స్టాక్ మార్కెట్ మీద డబ్బులతో కుస్తీ పట్టే రమేష్ కి ఏనాటికీ తెలియ[నివ్వ]లేదు. ఎవరండీ చెప్పినది, ఆడవాళ్ళు రహస్యాలు దాచలేరని?

***నీతి: స్టాకు మార్కెట్లో పెట్టిన డబ్బులు పెరగొచ్చు లేదా తరగొచ్చు కానీ చంద్రహారం భార్యామణి మెడలో ఎప్పుడూ తళతళా మెరుస్తూనే ఉంటుంది. "హేపీ వైఫ్ ఈజ్ హేపీ లైఫ్" అనేది గుర్తుంచుకోకపోతే ఎలా?***

## ఇంటి పేరు

**మొదటి సారి** నరహరి పటేల్ గారికి డాక్టర్ గిరీ చేతిలోకి వచ్చాక చేసిన మొదటి పని అమెరికాలో ఉన్న తన వేలువిడిచిన మేనకోడలి కొడుకు బావమర్దికి ఫోన్ చేసి అమెరికా రావడం ఎలా అనేది కనుక్కోవడం. ఏదో విధంగా విజిటర్ వీసా సంపాదించి వచ్చాక అమెరికాలో డాక్టర్ అంటే కనకవర్షం కురుస్తుంది కనక దానికి సంబంధించిన టెస్టు పాసై సెటిల్ అయిపోవడం. అలా డిగ్రీ చేతిలోకొచ్చి అమెరికాలో డాక్టర్ ప్రాక్టీస్ పెట్టడానికి పటేల్ గారికి సరిగ్గా ఆరేడేళ్ళు సరిపోయింది. ఇన్నేళ్లలో ఆయన ఏనాడూ అందరు దేశీయులూ అనుకునే "అమ్మదావాద్" అనే నగరం, గుజరాత్ రాష్ట్రం దాటినవాడు కాదు. ఎప్పుడైనా ఎవరో బొంబాయ్ లాంటి నగరాల నుంచి తమ ఇంటికి వస్తే గిస్తే వాళ్ల దగ్గిర్నుంచి ఏవో దేశ రాజకీయాలు, కధలు వినడం మాత్రం తెలుసు. ఆ కధల ప్రకారం గుజరాతీలు ప్రపంచంలో అతి పెద్ద గొప్పవారు. ఏ దేశంలో చూసినా వాళ్లదే బిజినెస్ హవా. కొంతమంది మద్రాసీలు కంప్యూటర్ మీద పనిచేసినా వాళ్లెప్పుడూ బిజినెస్ చేయరు; చేసినా తమవంటి కాకలు తీరిన గుజరాతీలతో తూగలేరు.

ఈ బిజినెస్ సంగతి అలా ఉంచితే డాక్టర్ నరహరి గారికి ఉన్న కొన్ని ఆలోచనల ప్రకారం మద్రాసీల పేర్లు అదో పిచ్చి. వాళ్లకి కూడా "షర్మ, షాస్త్రి, అవధాని," అనే పేర్లు ఉన్నా వాటిని "శర్మ, శాస్త్రి, అవధాన్లు" అని రాసి గొప్పలు చెప్పుకుంటారు. అదేమిటయ్యా మీరు "షర్మ" అనే పేరుని ఇంగ్లీషులో "హెచ్" అక్షరం వదిలేసి "శర్మ" అని రాస్తారు అంటే, ఈ మద్రాసీలు చెప్పేది – వాళ్ల పేరు నిజంగా శర్మ అని ఉండాలిట, షర్మ కాదు అని. అలాగే మిగతా శాస్త్రి, అవధానులు, వెంకటేశ్వర్లు అనేవి. ఇంటి పేర్లు మరీ దరిద్రం – ఆమదాలవలస, కోరంగి, కోటిరెడ్డి, ఓరుగంటి, ద్వివేదుల, పోటుపర్తి వగైరాలతో పటేల్ గారికి వాటిని పలకడానికే అసయ్యం. ఆ పేర్లు చూస్తే వాళ్లని ఏడిపించ బుద్ధీను. కానీ ప్రాక్టీస్

ఉన్న ఆఫీసులో అలా ఏడిపిస్తే కోర్టులో కేస్ పడుతుంది కనక ఈయన ఈ మద్రాసీ పేషెంట్ల గురించి తోటి నార్త్ ఇండియన్స్ తో వారాంతంలో చెప్పుకుని, కడుపుబ్బా నవ్వుకుని ఆనందిస్తూ ఉంటాడు.

నరహరి పటేల్ గారి ఆలోచనల ప్రకారం, అదేలెండి, ఆయనకి చిన్నప్పటినుండీ చెప్పిన గుజరాతీ పెద్దల, చుట్టాల, హితుల, స్నేహితుల ప్రకారం, ఈ మద్రాసీలు వెర్రివెధవలు. తమ స్వంత పేర్లు రాయడం కూడా సరిగ్గా నేర్చుకోరు కానీ సాఫ్ట్ వేర్ లో ఉద్యోగాలకి వస్తూ ఉంటారు. తన డాక్టర్ ఆఫీసులో ఎవరైనా మద్రాసీలు ఈ పేర్లతో వస్తే ముందు కౌంటర్లో ఉన్న అమ్మలకి చెప్పేడు హెచ్ అనే అక్షరం తప్పనిసరిగ్గా చేర్చి "షర్మ," "షాస్త్రి" అని రికార్డుల్లో రాయమని. అలా నరహరి అంబాలాల్ పటేల్ గారు తన స్వంత డాక్టర్ గిరీ వెలగబెట్టడం న్యూ జెర్సీ లోని ఎడిసన్ అనే ప్రాంతంలో సాగుతోంది; ప్రాక్టీస్ మరీ మూడు పువ్వులూ ఆరు కాయలూ కాకపోయినా ఐదు బెడ్రూముల ఇల్లూ, రెండు బెంజ్ కార్లూ కొనుక్కోవడానికి సహాయపడింది ఎందుకంటే ఎడిసన్ లో అందరూ మనవాళ్ళే కాబట్టి.

అన్నింటిలోనూ లాభసాటి వ్యాపారం – ఇమ్మిగ్రేషన్ లో గ్రీన్ కార్డు అప్లై చేసుకునే వారికి మెడికల్ టెస్టులు నిర్వహించడం. రక్త పరీక్షలూ, ఎత్తూ బరువూ, వగైరాలు చూసి అన్నీ బాగున్నాయని చెప్పి 'తే, నా 450 డాలర్లు' అని లాగేయడమే. వీటికి మరో సులభం ఏమిటంటే, కేష్ ఇస్తే ఓ యాభై డిస్కౌంట్ ఇవ్వడం. అలా టేక్స్ కట్టక్కర్లేని ఆదాయంతో హాయి. కొన్ని మెడికల్ ఇన్స్యూరెన్స్ కంపెనీల వారు వీటికి డబ్బులు ఇస్తే సరే లేకపోతే కేష్ ఆఫర్ సిద్ధంగా ఉంది. అలా నరహరి పటేల్ గారు ఎక్కడా తన ఆలోచనలు మార్చుకోకుండా మద్రాసీలని, వాళ్ల పేర్లనీ వెక్కిరిస్తూ హాయిగా ఉన్న రోజుల్లో ఓ వీకెండ్ ఎవరింటికో భోజనానికి వెళ్ళారు, సకుటుంబ సతీ సమేతంగా, బంధు మిత్రులని కలుసుకోవడానికి. పార్టీలో తెలుపు నలుపు గోధుమ ఎరుపు అనే రకరకాలైన జనం ఉన్నారు. పూల్ దగ్గిర బీరు వరదలై పారుతుంటే, ఇంట్లో లోపల కావాల్సినంత భోజనం ఉన్నాయి తినడానికి. పటేల్ గారు ఓ బీరు తర్వాత లోపలకి వెళ్ళి కూర్చున్నాడు. పక్కనే కొంతమంది ఎవరో ఉన్నారు కానీ ఈయన చూసుకోలేదు వాళ్లెవరో.

కూర్చున్నవాళ్లలో ఒక పక్కన ఓ మద్రాసీ కూడా ఉన్నాడు. ఇటుపక్కన తన చుట్టం గారి ఇరవైఏళ్ల కుర్రాడు కూర్చుని ఉన్నాడు ఫోనుమీద మెసేజిలు చూసుకుంటూ. పటేల్ గారికి ఈ మద్రాసీని ఏడిపించాలని ఉధృతంగా కోరిక తన్నుకొచ్చింది. పక్కనే ఉన్న గుజరాతీ కుర్రాడితో లోగొంతులో అన్నాడు, "ఒరే అబ్బాయ్, ఇక్కడున్న మద్రాసీ చూసావా, వాళ్లపేర్లు భలే సరదాగా ఉంటాయి, ఓ సారి వీళ్ళని ఏడిపిస్తాను చూస్తావా?"

ఫోను మెసేజీలతో బోరు కొడుతున్న కుర్రాడికి ఒక్కసారి హుషారు ఎత్తుకొచ్చింది, అతను కూడా అటువేపు కూర్చున్న మద్రాసీ కేసి చూసి "సరే సరే కానివ్వండి," అంటూ తల ఊపాడు. అయితే, తాము మాట్లాడుకునే హిందీ, ఇంగ్లీష్ కలిపి వెరసి – హింగ్లీషు, అటువైపు కూర్చున్న మద్రాసీ చెవిలో పడిందని వీళ్లిద్దరూ గ్రహించలేదు.

కొన్ని క్షణాలు ఆగి పటేల్ గారు జరగబోయే సీన్ ని చూడ్డానికి కుర్రాణ్ణి మోచేత్తో తట్టి పక్కనే ఉన్న మద్రాసీని పలకరించారు, "హల్లో మీ పేరు ఏమిటండి?"

"శాస్త్రి," చెప్పేడు మద్రాసీ అనబడే మన తెలుగాయన.

"షాస్త్రి అనా మీ ఉద్దేశ్యం? మన ప్రధానమంత్రి లాల్ బహదూర్ గారి పేరు కూడా షాస్త్రి అనే కదా?" వెక్కిరింపు నవ్వు నవ్వబోయేడు పటేల్ గారు.

"కాదండి, తెలుగువాళ్లలో శాస్త్రి అనే పేరుంది," సౌమ్యంగా చెప్పబోయేడు మద్రాసీ.

"షాస్త్రి అనేది ఇంటిపేరు మహానుభావా, తప్పు పలకడం ఒకటీ, అది తమ పేరు అని చెప్పుకోవడం ఒకటీనా?"

"అయ్యా మీరు పేరు అడిగారు, శాస్త్రి అని చెప్పాను, ఇప్పుడు ఇంటిపేరూ, అసలు పేరూ, నాపేరు నాకే రాయడం, పలకడం రాదని చెప్పడం ఏం బాగుంది?"

"ఇదేనండి మీ మద్రాసీలతో ఉన్న చిక్కు. పేరు ఇష్టం వచ్చినట్టూ అంటారు. అడిగితే కోపం. శాస్త్రి మీ పేరు అయితే మీ ఇంటిపేరేమిటి? ఏదో తంబి శాస్త్రి అని గానీ వెంకట్రాం శాస్త్రి అని ఉండాలి కదా?" వంకర నవ్వు పటేల్ గారి మొహంలో, పక్కనున్న కుర్రాడు నవ్వుతూంటే.

పార్టీలో ఎవరో పలకరించి పేరు అడుగుతారు. వాళ్ళు పలకగలిగే మన పేరు చెప్తాం కానీ మొత్తం మన ఇంటిపేరుతో మొదలుపెట్టి పూర్తిపేరు చెప్పం కదా? అది పట్టుకుని, ఇండియాలో ఉన్న, లేని, తమకి తెలియని పేర్ల గురించి అజ్ఞానం చూపిస్తే ఎలా? నషాళం అంటుకుంటూంటే ఈ పటేల్ గారి పని పట్టడానికి సదరు మద్రాసీ అనబడే శాస్త్రి గారు చెప్పడం మొదలుపెట్టాడు.

"అవునా, నా పేరు అలా ఉండాలంటారా? అయితే వినండి. మా తాత గారు దేవులపల్లి వెంకటేశ్వర అవధాన్లు గారు. ఆయన ఇంటిపేరు దేవులపల్లి, అసలు పేరు వెంకటేశ్వర అవధానులు గారు. మా నాన్న గారి పేరు దేవులపల్లి కామేశ్వర రావు గారు. ఇందులో మళ్ళీ ఆయన ఇంటిపేరు దేవులపల్లి, అసలుపేరు కామేశ్వర రావు. ఇంక నాపేరు కొస్తే నేను లేకలేక పుట్టిన కొడుకుని కనక అందరూ తలో ముక్కా కలిపి పెట్టారు పేరు. మీరు ఉత్సుకత అణుచుకోలేకపోతున్నారు కనక చెప్తున్నాను – మర్చిపోతారేమో రాసుకోండి, నాకేం అభ్యంతరం లేదు. నా పూర్తిపేరు దేవులపల్లి చిట్టి సత్య వీర వెంకట సత్య సాయి హరినారాయణ రామ బ్రహ్మ పరమేశ్వర శాస్త్రి. ఇంత పేరులో మీ గుజరాతీలు, అదే నార్త్ ఇండియన్స్ పలక గలిగే పేరు శాస్త్రి అని చెప్పాను. ఇందులో ఇంటిపేరు దేవులపల్లి. మాకు మీలాగా మధ్యపేరు, చివరిపేరు మొదటి పేరూ ఉండవు. మాది పేరు, ఇంటిపేరు అంతే. జనం ఎక్కడ ఉన్నా వాళ్ళిష్టం వచ్చినట్టూ పేర్లు పెట్టుకుంటారు. వెస్ట్ ఇండీస్ నుంచి, శ్రీలంక నుంచి వచ్చే క్రికెట్ ఆటగాళ్ళూ, వారన కులసూరియ పాతబెండిగె ఉషాంత జోసెఫ్ చమిందా వాస్ – అంటూ పెద్ద పేర్లు ఉన్నవాళ్ళే. వాళ్లని మీరేం అనలేరు కానీ మీరు నన్నూ

నా తోటి సౌత్ ఇండియన్ స్నేహితులనీ గేలి చేయడానికి ఇప్పుడే ఆ పక్కనున్న కుర్రాడితో మాట్లాడి పూనుకున్నారు కనక చెప్తున్నాను వినండి. మీ ప్రపంచం గుజరాత్ రాష్ట్రం ఒకటే కాబోలు. అక్కడ ఏమి జరుగుతుందో ప్రపంచం అంతా అలాగే ఉంటుదనుకుంటూ ఉంటారేమో. అది నిజం కాదు. కనీసం అమెరికా వచ్చాక కూడా మీరు మారినట్టు కనిపించదు. చూడబోతే మీకో యాభై ఉండొచ్చు వయస్సు. డాక్టర్ పట్టా వచ్చినా, ఇన్నేళ్ళు నెత్తిమీదకి వచ్చినా మీ బుద్ధి మాత్రం అలా ఉండడం చింతించాల్సిన విషయం...."

"నేను డాక్టర్ అని మీకెలా తెలుసు? నేను పేరు గురించి అడిగితే అలా..." ఏదో అనబోయేడు డాక్టర్ పటేల్.

"నేను కొన్నాళ్ళ క్రితం మీ దగ్గిరకి గ్రీన్ కార్డ్ కోసం మెడికల్ టెస్ట్ కి వచ్చాను. అప్పుడు ఓ సారి వెక్కిరించారు నా పేరు విని. ఇప్పుడు అందరి మధ్యా నన్ను గేలి చేయడానికి మొదలు పెట్టారు ఆ కుర్రాడితో మాట్లాడి; వాడికో సరదా చూపిద్దామని కాబోలు, నేను వినలేదనుకున్నారా? అదిగాక నన్ను మద్రాసీ అంటున్నారు. నేను తెలుగువాణ్ణి. అసలు మీకు జ్ఞానినాడి అనేది ఉందో లేదో; మీకు ఆంధ్రాకీ మద్రాస్ కీ ఉన్న తేడా కూడా తెలియదు."

"నేను ఆ కుర్రాడితో ఏమన్నానో మీకు తెలుసా, నేను మాట్లాడింది హిందీలో," తనని కవర్ చేసుకోబోయేడు పటేల్ డాక్టరు. పక్కనున్న కుర్రాడి మొహం నెత్తురు లేక పాలిపోయింది.

"అవునా, నేను హిందీలో విశారద అనే పరీక్ష పాసైయ్యాను. అది స్కూల్లో హిందీ పాఠాలు చెప్పే మాస్టర్ల స్థాయిది. మీరన్న ప్రతీ ముక్కా ప్రతి పదార్థంతో సహా చెప్పగలను. ఇప్పటికే మాడిపోయిన మొహం ఇంకా మాడ్చుకోవాలని ఉంటే చెప్పండి," ఇంక చెప్పడానికేమీ లేదన్నట్టూ లేచాడు, దేవులపల్లి చిట్టి సత్య వీర వెంకట సత్య సాయి హరినారాయణ రామ బ్రహ్మ పరమేశ్వర శాస్త్రి ఉరఫ్ శాస్త్రి.

మొహం పూర్తిగా మాడిపోయి అందర్లోనూ పరువు భంగమైన పటేల్ జీ ఏం మాట్లాడాలో తెలియక అటు పక్క కుర్రాడికేసి చూసాడు. జరిగినదానికి తనకేం సంబంధం లేదన్నట్టూ ఫోన్ మీద మెసేజ్ లు చూసుకోవడంలో నిమగ్నమై ఉన్నాడు పక్కనే కూర్చున్న ఇరవై ఏళ్ళ కుర్రాడు.

**నీతి: ఏదైనా తెలియక పోవడం తప్పుకాదు. తెలుసుకోకపోవడం సుతరామూ తప్పే. అజ్ఞానంతో ఉత్తినే నోరు పారేసుకుంటే మిగిలేది అభాసుపాలు కావడం ఒకటే.**

## స్వాతంత్ర్యం

**మూర్తిగారింట్లో రాత్రి** తొమ్మిదింటికి దిగాడు దివాకర్. మూడు వారాల క్రితం ఒకసారి ఫోన్ చేసి అడిగాడు, ఉన్న ఉద్యోగం పోయింది; ఇప్పుడు ఇలా మీ ఊర్లో ఉద్యోగం వచ్చేలా ఉంది, ఎక్కడైనా అపార్ట్ మెంట్ దొరికేదాకా సర్దుకోవడం ఎలాగైనా కుదురుతుందా అని. ఆ మధ్య ఇండియానుంచి వచ్చినప్పుడు ఎలాగో ఈ మూర్తిగారితో పరిచయం ఫోను మీద.

మూర్తిగారు కూడా ఆపేక్షగానే మాట్లాడాడు. మూర్తి గారికి ఉన్న ఇద్దరు చిన్న పిల్లలతో వాళ్లింట్లో ఉండాలి దివాకర్ వెళ్ళి అపార్ట్ మెంట్ దొరికేదాకా; ఉంటానంటే ఏమౌతుందో? వెళ్ళాక అపార్ట్ మెంట్ వెంఠనే దొరుకుతుందా? సవాలక్ష ప్రశ్నలు. అన్నీ ఫోనులో మాట్లాడి, మూర్తిగారు ఓకే అన్నాక, వెళ్లడం మంచిదే అనిపించి బయల్దేరాడు.

తీరా వెళ్ళాక తెల్సింది – "వచ్చేలా ఉన్న" ఉద్యోగం రాలేదు. 'నువ్వున్న ఊర్నుంచి పూర్తిగా బిచాణా ఎత్తేసి వచ్చేయి; ఉద్యోగం గారంటీ' అన్న బ్రోకర్ చేతులెత్తేశాడు. ఇప్పుడు చూడబోతే ముందు నుయ్యీ, వెనక గొయ్యీ. ఖాళీ చేసి వచ్చేసిన ఊరికి వెనక్కి వెళ్ళడం కుదిరేది కాదు. అలాగని ఇక్కడ ఉందామా అంటే ఉద్యోగం లేకుండా ఎవరిస్తారు అపార్ట్ మెంటు? ఇచ్చినా దానికి అద్దె కట్టాలి. జీతం రాకుండా ఎంతకాలం ఉండగలడు? మూర్తి గారింట్లో దిగిన రెండో రోజున ఏమిచేయాలో తెలియక దివాకర్ ఆయన్నే అడిగాడు సలహా.

మాట్లాడుతున్నప్పుడు మూర్తిగారి వాళ్ళావిడ అక్కడే ఉంది కూడా పిల్లల్తో. ఎలాగా ఆవిడ ఒప్పుకోదు అనుకుంటున్న దివాకర్ కి ఒక్క పెద్ద ఆశ్చర్యం ఆవిడ సమాధానం. "పోనీ ఉద్యోగం వచ్చేవరకూ ఇక్కడే బేస్ మెంట్లో ఉండగలరా? నేనూ ఆయనా బయటకి వెళ్ళినప్పుడు పిల్లల్ని చూస్తూ ఉండవచ్చు. లేదా వాళ్లచేత హోమ్ వర్క్ చేయిద్దురు గాని." మూర్తి కూడా కొంచెం ఆశ్చర్యపోయినట్టు కనిపించినా ఇదేదో బాగానే ఉందన్నట్టూ ఒప్పుకున్నాడు. అయితే దివాకర్ మాత్రం తిండికి నెల నెలా డబ్బులు ఇచ్చేస్తానని చెప్పాడు. అలా దివాకర్ మూర్తి గారింట్లో అద్దె లేకుండా స్థిరపడ్డాడు. పిల్లలు అలవాటు అవుతున్నారు. ప్రతీ రోజూ కాకపోయినా రెగ్యులర్ గా బ్రోకర్ కి ఫోన్ చేస్తూనే ఉన్నాడు మరో ఉద్యోగం కోసం. ఆయన కూడా పాపం కష్టపడుతూనే ఉన్నాడు దివాకర్ గురించి.

మూడునెలలు కష్టపడ్డాక బ్రోకర్ ద్వారా ఒక పార్ట్ టైం ఉద్యోగం, తర్వాత అది కాస్తా ఫుల్ టైం గా మారేసరికి దివాకర్ కి కాస్త వెసులుబాటు రాగానే ఓ రోజు మూర్తిగారికి ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చేసి వేరే అపార్ట్ మెంట్ లోకి మారిపోయేడు. ఇన్నాళ్లూ దివాకర్ కీ మూర్తి గారి కుటుంబానికీ బాగా జరిగినట్టే; గొడవలు ఏమీ రాలేదు కనక. అపార్ట్ మెంట్ లోకి మారే ముందు దివాకర్ మూర్తి, వాళ్ళావిడకీ చెప్పాడు – మీ సహాయం లేకపోతే ఏమైపోయేవాడినో, అంటూ. "అదేమిటండోయ్, రేప్పొద్దున్న నాకో, మరెవరికో సహాయం కావాలిస్తే చేయరా ఏమిటి, మనలో మనం సహాయం చేసుకోకపోతే ఇంకెందుకూ?" అంటూ మూర్తి అన్నీ కొట్టిపారేశాడు కానీ దివాకర్ చెప్పేడు, "మీకు కావాల్సినప్పుడు సహాయం చేయకపోతే భగవంతుడు కూడా నన్ను క్షమించడు సార్." ఈ మాట నిలబెట్టుకోవడం ఎంత కష్టమో తొందర్లోనే తెలిసివచ్చింది దివాకర్ కి.

వేరే అపార్ట్ మెంట్ కి వెళ్ళినా దివాకర్ మూర్తిగార్ని కలుస్తూనే ఉన్నాడు. ఫోన్లు ఎప్పటిలాగానే అట్నుంచి ఇటూ కలుస్తున్నాయి. బ్రహ్మచారి దివాకర్ ఓ శుభముహూర్తాన ఇండియా బయల్దేరి వెళ్ళాడు, అవును పెళ్ళికే. ఆ తర్వాత అందరికీ జరిగినట్టే ఆయనకి ఫలానా పద్మజ అనే ఆవిడతో పట్టాభిషేకం; మరో ఏడాదికి ఆవిడ అమెరికా రావడం

జరిగాయి. దివాకర్ మరోసారి అపార్ట్ మెంట్ మారాడు. ఉన్న ఊర్లో అద్దెలు ఎక్కువైనా రెండు బెడ్ రూం లు ఉన్న కాస్త పెద్ద ఇంట్లోకి. ఒక బెడ్ రూం లో దంపతులు ఉంటారు. ఎవరైనా వచ్చినా లేదా ఆఫీసు రూముగా వాడుకోవడానికి రెండో బెడ్రూం. పెళ్ళైయ్యాక కూడా మూర్తిగారితో బాగానే ఉంది సంబంధం.

అలా జీవితంలో ఆరు నెలల మీద కొన్ని రోజులు పరుగెట్టాక ఓ రోజు మూర్తి దివాకర్ కి ఫోన్ చేసి చెప్పాడు భోజనానికి రమ్మని. ఏదో విషయం మాట్లాడాలిట.

భోజనం టైములో తెల్సిన విషయం మూర్తిగారికి వేరే మంచి ఉద్యోగం వచ్చింది – అటు పక్క కెనడా దేశంలో మరీ దూరంగా – అంటే దాదాపు వెయ్యిమైళ్ళకి పైన దూరంలో. ముప్పైరోజులలో వెళ్ళడానికి దాదాపు అంతా ఖాయం అయిపోయింది. అయితే ఉన్న చిక్కేమిటంటే, మూర్తిగారు అమెరికా వచ్చిన కొత్తలో చెల్లెలికి గ్రీన్ కార్డ్ అప్లికేషన్ పెట్టారు. అది ఇప్పటికి పూర్తి అయ్యి చెల్లెలు అమెరికా వస్తోంది ఈయన కెనడా వెళ్లడానికి ఒక్క రెండు వారాల ముందు. ఆవిడకి ఇదే ఊర్లో ఉద్యోగం చూసుకోవడం సులభం, మూర్తిగారు వెళ్లబోయే కెనడాలో కొత్తఊరి కంటే. కొత్త ఊరు, ఆ దేశం మరీ పల్లెటూరు టైపు; అక్కడ కంప్యూటర్ ఉద్యోగం రావడం దాదాపు అసంభవం. ఉన్న చిక్కేమిటంటే మూర్తిగారి చెల్లెలికి అమెరికా కొత్త కనక ఆవిడ వచ్చాక దివాకర్ ఇంట్లో ఉండవచ్చా అని కనుక్కోబోతున్నారు. దివాకర్ కి తెలిసిన బ్రోకర్ కూడా ఏదైనా సహాయం చేస్తాడేమో ఉద్యోగం రావడంలో?

దివాకర్ కి పచ్చి వెలక్కాయ నోట్లో పడ్డట్టూ అయింది. తనకైతే సరే అనడానికి ఏమీ అభ్యంతరం లేదు కానీ పక్కనే అమ్మగారు ఇప్పుడు అమెరికా వచ్చి మొత్తం స్వాతంత్ర్యం తన చేతిలోకి తీసుకున్నారు కనక ఆవిడ ఏమంటారో తెలియదు. పుసుక్కున ఏమాట అన్నా అది బూమరాంగ్ లాగా తనమీదకి వస్తుంది. ఏమిచేయాలా అని ఆలోచిస్తుంటే అమ్మగారే చెప్పింది, "ఓ మీకు చెప్పలేదు కదూ, ఇప్పుడు నాకు మూడో నెలండి. వచ్చే రెండు నెలలో మా అమ్మగారు నాన్నగారు వస్తున్నారు. రెండు బెడ్రూములలో సర్దుకోవడం కష్టమేమో."

"అవునా, అసలు మీరిద్దరూ తల్లి తండ్రీ అవబోతున్నారనీ తెలియదే? సంతోషం. దివాకర్ తనకి తెల్సిన బ్రోకర్ తో చెప్పి ఉద్యోగం చూడమంటే చాలు. ఎవరో తెలిసినవాళ్లతో చెప్పి షేర్ చేసుకునే అపార్ట్ మెంట్ చూపించినా చాలు."

దివాకర్ వాటికి ఒప్పుకున్నాక బయల్దేరారు వెనక్కి. ఇంత సులభంగా అమ్మగారు తన ప్రోబ్లెం సాల్వ్ చేసేస్తుందని తెలియక దివాకర్ ఆవిడతో అన్నాడు కార్లో వెనక్కి వచ్చేటప్పుడు, "నీకు మూడు నెలలా ఇప్పుడు? నేను ఇక్కడకి వచ్చినప్పుడు మూర్తిగారు నాకెంత సహాయం చేసారో నీకు తెలుసా? అసలు మాట్లాడేటప్పుడు అలా అబద్ధాలు ఆడటం దేనికీ?"

"ఎవర్నో తీసుకొచ్చి మన ఇంట్లో పెడతారా? నేను ఒక్కత్తినీ ఆవిడతో ఉండాలా? అసలు ఇవన్నీ ఆలోచించారా? ఆ మాత్రం బుద్ధి ఉండక్కర్లా?" అమ్మగారు ఎదురు తిరిగింది.

"మరి నేను ఒక్కణ్ణీ వాళ్ల ఇంట్లో ఉన్నప్పుడు వాళ్ళు అలా అనుకోలేదే? కష్టంలో ఉన్నాడు ఉద్యోగం లేక అందుకని మా ఇంట్లోనే ఉండండి అన్నారు. నాకు సహాయం చేసినందుకైనా తిరిగి సహాయం చేయవద్దా?"

"ఉద్యోగం లేనప్పుడు మీకు జీతం లేదేమో. ఇప్పుడు మూర్తిగారికి డబ్బులున్నాయి, ఆయన చెల్లెల్ని ఆయన పోషించుకోగలడు. వేరే అపార్ట్ మెంట్ చూసిపెట్టండి. మీకు తెల్సిన బ్రోకర్ ఉన్నాడన్నారు కదా ఆయన ఉద్యోగం లో సహాయం చేయవచ్చు. మన ప్రైవసీ కి అడ్డం రాదు, అయినా వీటికి మూర్తి గారు ఒప్పుకున్నారు కదా?"

"కొత్తగా అమెరికా వచ్చే ఆవిడ ఒక్కత్తీ అపార్ట్ మెంట్ లో ఎలా ఉండగలదు?" అంటూ ఏదో చెప్పబోయిన దివాకర్ కి స్ఫురించింది, ఇంక దీనిమీద మాట్లాడడం అనవసరం. నోరు మూసుకున్నాడు దివాకర్.

ఆ తర్వాతెప్పుడో తెల్సింది దివాకర్ కి – చెల్లెల్ని ఒక్కత్తీ ఉంచడానికి ఎక్కడా షేర్ అపార్ట్ మెంట్ దొరకలేదుట మూర్తిగారి చెల్లికి. దివాకర్ మొగాడికైతే ఏదో చూపించగలడు కానీ ఆడవాళ్లకి ఎలాగో తెలియదు; ఆవిడ వచ్చి పాస్ పోర్టు మీద స్టాంపు వేయించుకుని వెనక్కి వెళ్ళిపోతున్నారు. ఎప్పుడో మళ్ళీ మూర్తిగారు వెనక్కి అమెరికా రాగానే వస్తారుట. అలా ఆవిడ ఇండియా వెనక్కి వెళ్ళిపోయింది. మూర్తిగారు కెనడా వెళ్ళిపోతూంటే దివాకర్ ఒక్కడూ వెళ్ళాడు సహాయం చేయడానికి సామాను సర్దడానికీను.

ఈ సందులో చూసి ఏడుపుగొట్టు మొహంతో మూర్తిగారితో చెప్పేసాడు తన మనసులో విషయం, "పట్టాభిషేకం అయ్యాక తనకీ ఏం చేద్దామన్నా కుదరదు. మీ చెల్లెల్ని మా ఇంట్లో ఉంచుకుందామని ఎంత ప్రయత్నం చేసినా అమ్మగారు ఒప్పుకోలేదు. మరో ఆడది ఇంట్లో ఉంటే మీ మగాళ్లు ఏం చేస్తారో అంటూ అవాకులూ చవాకులూ అంటోంది. మీరు నాకు ఉద్యోగం లేనప్పుడు చేసిన సహాయం అన్నీ చెప్పి ఒక్క రెండు నెలలకే అని సర్ది చెప్పబోయాను. అసలు మరో ఆడది ఈ ఇంట్లోకి వస్తే నేను ఒప్పుకోను ఒక్క రోజైనా సరే అని ఆవిడ గొడవ. మీరూ, వదిన గారు నాకు చేసిన సహాయానికి నేను ఏమి చేసినా తక్కువే కానీ ఇప్పుడు నాకు కరచరణాలు కట్టేసింది ఈవిడ. క్షమించండి, ఇది వదిన గారితో చెప్పండి. మీ కాళ్ళు పట్టుకోవడం ఒక్కటే తక్కువ."

ఈ కళ నున్నాడో కానీ మూర్తి చెప్పాడు, "ఇవన్నీ మనసులో ఉంచుకోకు బ్రదర్. పెళ్లయ్యాక ఇవి సర్వ సామాన్యం. ఏదో జన్మలో మేము నీకు ఉన్న బాకీ తీర్చేసాం. నువ్వు మాకేమీ బాకీ లేదు అంతే."

మూర్తిగారు కెనడా వెళ్ళాక మళ్ళీ ఎప్పుడూ దివాకర్ ఆయన దగ్గిర్నుంచి గానీ ఆయన గురించి గానీ సమాచారం వినలేదు. మంచి కుటుంబంతో సంబంధం తెగిపోయినందుకూ, మంచి స్నేహితుణ్ణి పోగొట్టుకున్నందుకూ, అన్నింటికన్నా ముఖ్యంగా తాను తీసుకున్న సహాయానికి ప్రతి సహాయం చేయలేకపోయినందుకు దివాకర్ జీవితాంతం కుమిలిపోతూనే ఉన్నాడు.

***నీతిః స్వతంత్రంగా ఏదైనా చేద్దాం అనుకునేది అనేది పెళ్ళి కానంతవరకే.***

# బ్రహ్మచారిణి

బెంగుళూర్ నుంచి హెచ్ – 1 వీసా మీద ఫీనిక్స్ అరిజోనా కి వచ్చిన దీపిక కి కంపెనీవారు ఒక అపార్ట్ మెంటూ, ఓ సీనియర్ అయిన మరో అమ్మాయితో కలిసి ఉండడానికి ఏర్పాటు అయ్యాక ఆ పై వారం ఎక్కడ పనిచేయాలో, ఎలా చేయాలో అనేవి చూపించారు. మొదట్లో ఎత్తైన బిల్డింగులూ అవీ చూసి నోరు వెళ్ళబెట్టిన దీపిక మరో మూడు నెలలకి అన్నీ అలవాటై ఉద్యోగంలో కుదురుకుంటూండగా చెప్పారు – ఆవిడ రూమ్మేట్ పని అయిపోయిందిట, ఇండియా పంపించేస్తున్నారు. మరొకరెవరూ రారు కనక అపార్ట్ మెంట్ లో ఉండేది దీపిక ఒక్కరే.  అలా అమ్మాయికి ఒక్కత్తీ ఉండడం అలవాటైంది. అయినా ఇదేం కొత్త కాదు కదా, బెంగుళూర్ లో ఉద్యోగం చేసేటపుడూ, కాలేజీలో హాస్టల్ లో ఉండేటపుడూ ఒక్కత్తే ఉండడం అలవాటే కదా?

రూమ్మేట్ వెళ్ళిపోతూంటే ఆవిడ అమ్మేసే కారూ, మిగతా వస్తువులకీ డబ్బులిచ్చేసి దీపిక తనమటుక్కి తానే డ్రైవ్ చేయడం, సరుకులు తెచ్చుకోవడం అలవాటు చేసుకుంది. సోమవారం నుంచి శుక్రవారం దాకా ఉరుకులు పరుగులు కనక ఏదీ ఆలోచించడానికి తీరిక లేదు కానీ శని ఆదివారాల్లో ఏం చేయాలో తోచదు. మొదట్లో ఓ సారి గుడీకీ, మరోసారి పటేల్ స్టోర్ కి వెళ్ళినా మిగతా సమయంలో ఏం చేయాలి? అదీగాక ఇప్పుడు దీపికకి ఇరవై ఆరు ఏళ్ళొచ్చాయి. ఎప్పుడు దేశంలో ఇంటికి ఫోన్ చేసినా ఒకటే గొడవ – ఫొటోలు పంపిస్తారు అబ్బాయిలవి, చూసి ఓకే అంటే పెళ్ళి చేసుకోవాలి మరో ఆరునెలల్లో. కుదురుతుందా?

అమెరికా వచ్చాక డేటింగ్ అంటే అవగాహన వచ్చేసింది కనక అమ్మాయిగారి ఐడియాలు ఇప్పుడు వేరేగా ఉన్నాయి. ఎవరినో ముక్కూ మొహం తెలియనివాణ్ణి చేసుకోవడం కంటే ఇక్కడే అమెరికాలో ఉండే దేశీ కుర్రాణ్ణే చూసి మాట్లాడి, రెండు మూడు సార్లు భోజనానికి వెళ్తే – అదే డేటింగ్ -  చేస్తే బాగుండదూ? అసలే తనకి తెల్సిన స్నేహితులు ఇలాగే చేస్తున్నారు కూడా. ఈ డేటింగ్ వేటలో కనీకనపడనట్టూ మరో నాలుగేళ్ళు గడిచాక తెలిసిన విషయం – అమ్మాయిగారికి అటు ఇండియాలోనూ ఇటు అమెరికాలోనూ కావాల్సిన కుర్రాడు దొరకలేదు. ఎవరికోసమూ సమయం ఆగదు కనక అది పరిగెడుతూనే ఉంది.

అమ్మాయిగారికి దేశీ అబ్బాయి దొరకక, రెండు మూడు "తెల్ల సంబంధాలతో" డేటింగ్ అయ్యాక తెల్సివచ్చిన విషయం ఏమంటే, తెల్లవారి అలవాట్లు వేరు, జీవితాలు వేరు. పెళ్లైన మొదట్లో బాగానే ఉన్నా వాళ్లకి పెళ్లనేది జీవితపరమావధి కాదు. బాగున్నంతకాలం ఉండి తర్వాత బై బై అంటారో భౌ భౌ అంటారో తెలియదు. భోజనపు అలవాట్లు వేరే, మతాలు వేరే, దేవుళ్ళు వేరే. తెల్సున్న దూరపు స్నేహితుల ప్రకారం వీళ్ళని చేసుకుంటే వచ్చే గొడవలు వేరు, ప్రయోజనాలూ వేరే. అలా దీపిక తెల్లవాళ్లని డేటింగ్ చేసి తన అవసరం కోసం చుట్టూ తిప్పుకున్నాక ఇష్టం లేదని చెప్పి

వాళ్ళని వదిలించుకుంది. మరో కొంతమంది దీపిక వ్యవహారం చూసి వాళ్ళే చెప్పారు, తమకి కుదరదనీ స్నేహితులుగా మాత్రమే ఉండొచ్చనీను. ఇన్నాళ్లలోనూ ఎప్పటికప్పుడు అమ్మాయిగారికి స్నేహితులూ తల్లీ గుర్తు చేస్తూనే ఉన్నారు పెరిగే వయసు సంగతీ అదీను.

మరో మూడేళ్ళు గడిచేసరికి అమ్మాయిగారి సంగతి చూచాయగా ఊర్లో తెలిసింది, ఇటువంటి విషయాలు ఎలాగా దాగవు కనక. ఈవిడ ఎవరినైనా సరే మూడేసి నెలలు తన చుట్టూ తిప్పుకుని సరదా తీరిపోయాక వదిలించుకుంటారు. మళ్ళీ అలా వదిలించుకోవడంలో బాగా సిద్ధహస్తురాలని ప్రతీతి. ఒకసారి ఇటువంటి పేరు రాగానే అమ్మాయిగారికి తెలిసిన విషయం, తనకి ఈ ఊర్లో సంబంధం దొరకడం కష్టం. పై ఊర్లో వెతుక్కుంటే మంచిది. ఈసారి ఆటలాడడం మంచిది కాదు; మొదటి కారణం తనకి వయసు వస్తోంది. రెండోది, పై ఊరివాళ్లతో ఆడుకుంటే అది మేచ్ మేకర్ల చేతిలో పడగానే ఆ వార్త మహమ్మారిలా వ్యాపించి ఇంక తనకి అమెరికాలో మొగుడే దొరకడు. ఇండియా నుంచి ఎవరినైనా రప్పించాలంటే వీసా అదీ అంత ఈజీ వీజీ కాదు కదా? అయితే అమ్మాయిగారికి తెలియని విషయం ఏమిటంటే ఈవిడ ఆడే నాటకాలు ఇండియాలో కూడా అందరికీ తెలుస్తున్నాయి ఈవిడ కొలీగ్స్ ద్వారా.

అలా మేచ్ మే 'కింగ్' లో వెతగ్గా వెతగ్గా మొత్తానికో కుర్రాడు – అమిత్ దొరికాడు దీపికకి అమెరికాలో డేటింగ్ కోసం. దీపిక ఉండేది ఫీనిక్స్ అరిజోనాలో అయితే అమిత్ అండేది శాన్ ఫ్రాన్సిస్కో. అంత సులభంగా ఇటూ అటూ తిరగడం కుదరదు కనక ఫోన్ మీద కబుర్లు గడుస్తున్నాయి. ఈ కబుర్లు పెరిగి ఫోటోలు చూసుకున్నాక ఓ సారి కలుసుకుందామనే ప్లాను వేసుకున్నారు. "మీరు ఒక్కరే ఇక్కడకి రాలేరు కనక నేనే ఫీనిక్స్ రావచ్చా?" అని అడిగాడు అమిత్. ఆయన ఈ ఊర్లోకి వచ్చాక తాను అంతకు ముందు చేసిన డేటింగ్ గురించీ అదీ ఆయనకి తెలిస్తే ఏమౌతుందో? దాంతో మళ్ళీ తర్జన భర్జనలు. పోనీ తాను కాలిఫోర్నియా వెళ్తే? అక్కడా ఇదే ప్రశ్న. తాను అమిత్ ఒక్కడితో ఆయన ఇంట్లో ఉండొచ్చా అని అడిగితే ఆయన ఏమనుకుంటాడో; పోనీ హోటల్లో ఉందామా అంటే ఆయన ఉండేది కాలిఫోర్నియా శాన్ ఫ్రాన్సిస్కో; ఆ నగరంలో హోటల్ ఖరీదులు ఉండేది ఆకాశంలో. మరెలా కల్సుకోవడం? ఎంత ఆలోచించినా ఏమీ తేలలేదు. మధ్యవర్తిలాంటి వాళ్ళెవరో ఉంటే బాగుణ్ణు, వాళ్ళ ఇంట్లో కలుసుకోవచ్చు. కానీ మధ్యవర్తి ఎవరూ దొరకనప్పుడు తర్వాత, తర్వాత అనుకుంటూ వాయిదా పడుతూ వస్తోంది కలుసుకోవడం. మరో కొన్ని నెలలు గడిచిపోయేయి. ఇలా వాయిదాలు పడుతూంటే అటు అమిత్ కి విసుగెత్తి వేరే సంబంధాలు చూసుకుంటూనే ఉన్నాడని ఈవిడకి తెలియలేదు.

కల్సుకోవడం కుదరకపోవడం వల్ల మాటలు మెల్లిగా తగ్గుతూంటే ఓ రోజు అమిత్ ఫోన్ చేసి చెప్పాడు, ఆయన ఇండియా వెళ్తున్నాడుట డిసెంబర్ లో, దీపిక కూడా వస్తే అక్కడే కలుసుకుని మాట్లాడుకోవచ్చు. ఇది విన్నాక దీపిక అనుకున్న ప్రకారం తాను ఇండియా వెళ్ళాక తమలో ఒకరికొకరు నచ్చకపోతే, తల్లీ తండ్రీ ఎలాగోలా తనకి ఎవర్నో ముడిపెట్టేస్తారు బలవంతం చేసి. డేటింగ్ లేకుండా ముక్కూ మొహం తెలియని వాడితో పెళ్ళా? డిసెంబర్ మరో రెండు

నెలలు మాత్రమే. వెంఠనే చెప్పింది, "డిసెంబర్ లో కాదుకానీ మార్చ్ లో కుదురుతుంది." "నేను చేసే ప్రోజక్ట్ పని వల్ల మార్చ్ లో కుదరదు," అట్నుంచి బాణం లాగా వచ్చింది సమాధానం. మరో దారి చూడాలి.

కానీ మరో దారి చూసేలోపులే నవంబర్ డిసెంబర్ వచ్చేసాయి. ఓ శనివారం అమిత్ కి ఫోన్ చేద్దామని అనుకునేలోపు ఆయనే చేసాడు. మర్నాడు ఆదివారం ఇండియా వెళ్తున్నాట్ట, వీలుంటే దీపిక కుటుంబాన్ని ఇండియాలో కలుస్తాడు. జనవరి ఇరవైన వస్తాడు మళ్ళీ. అలా అమిత్ ఇండియా వచ్చేడు. అమ్మాయిగారు ఫీనిక్స్ అరిజోనాలోనే ఉండిపోయింది.

జనవరి లో రెండురోజులు దీపిక ఇంట్లో శెలవు మీద కూర్చుని అప్పటివరకూ ఫ్రిజ్ లో ఉన్న చెత్తా, మూడు నెలలబట్టీ కుళ్ళిపోయిన కూరలూ అవీ తీసి శుభ్రం చేయడానిక్కూర్చున్నప్పుడు సడన్ గా అమిత్ గుర్తొచ్చాడు. ఈ పాటికి ఇండియా నుంచి వెనక్కి వచ్చేసి ఉండొచ్చు. ఈ సారి ఎలాగో ఒకలాగ అమిత్ ని కలిసి పెళ్ళికి ఒప్పేసుకోవడమే మంచిది. లేకపోతే అందరూ అంటున్నట్టూ ఇంక తనకి పెళ్ళి కాకపోవచ్చు. ఫ్రిజ్ క్లీన్ చేయడం అనే పని అయిపోయాక ఫోన్ తీసి అమిత్ కి చేసింది. అమిత్ తనకి ఇచ్చిన ఫోన్ నెంబర్ ఇప్పుడు పని చేయటంలేదు. సరే తర్వాత ఈమెయిల్ చేద్దాం అనుకుని అక్కడ ఆపి మరో పనిలో పడింది.

మర్నాడు అమిత్ కి ఈమెయిల్ పంపింది దీపిక– "ఇండియా నుంచి వెనక్కి ఎప్పుడు వచ్చారు? మనం మాట్లాడుకోవడం గురించీ, కల్సుకోవడం గురించీ నేను ఆలోచించాను. మీరు ఒప్పుకుంటే నేను కాలిఫోర్నియా వద్దామనుకుంటున్నాను. కావాల్సొస్తే, హొటల్లో ఉండగలను నా స్వంత ఖర్చులతో. వివరాలు చెప్పండి."

రెండు రోజులాగాక దీపికకి ఒక మెయిల్ వచ్చింది అమిత్ దగ్గిర్నుంచి. "నేను మిమ్మల్ని చాలాసార్లు ఇక్కడకి రమ్మనీ, లేదా నేను ఫీనిక్స్ వస్తాననీ అడిగాను. ఎన్ని సార్లు అడిగినా కుదరదనే సమాధానం వచ్చింది ఇండియా వెళ్ళేటపుడు కూడా చెప్పాను. దేనికీ మీకు కుదరలేదు. నేను ఇండియా వెళ్ళినప్పుడు పెళ్ళి చేసుకుని వచ్చాను. అమ్మాయి మాకు తెల్సున్నవాళ్ల ద్వారా ఇండియాలో చూసాము. ఇద్దరికీ నచ్చిన సంబంధమే. తాజాకలం: "మనం ఇక్కడ కలుసుకోకపోవడం మంచిదే అయింది. మీ గురించి ఇండియా వెళ్ళినప్పుడు తెల్సింది. పెళ్ళి అనేది జనాలతో ఆడుకునే సరదా ఆట కాదు. అది మీకు ఎంత గొప్ప విషయమో, అవతల వాళ్లకి కూడా అంతే గొప్ప విషయం."

వచ్చిన ఈమెయిల్ కేసి చూస్తూ చాలాసేపు స్థబ్దుగా కూర్చున్నప్పుడు కంట్లోంచి ఒక్క చుక్క నీరు చేతిమీద పడేసరికి దీపికకి వళ్ళు తెలిసి వచ్చింది. కళ్ళు తుడుచుకుని లేవబోతూంటే అమిత్ కి పెళ్ళైనందుకు శుభాకాంక్షలు చెప్పలేదనే విషయం కూడా గుర్తుకి రాలేదు.

నీతిః మీ ఇష్టం వచ్చినట్టూ జనాలని "ఆడించడానికి" పూనుకుంటే, ఎంతోకాలం ఆటలు సాగవు.

# మర్యాద రామన్న

**గురువారం సాయంత్రం** కుటుంబం అంతా కలిసి వారాంతం ఏం చేద్దామా అని చర్చించుకుంటున్నప్పుడు ఎవరో తెలుగాయన ఫోన్ చేసాడు ప్రసాదుకి; ఎవరో సుధాకర్ అని. ఎప్పుడో ఒకసారి వాల్ మార్ట్ లో కనబడితే హల్లో అని అనుకున్నాక ఫోన్ నెంబర్లూ అవీ తీసుకున్నారు కదా? వచ్చే శనివారం వాళ్ళింటికి వస్తారా మధ్యాహ్నం చాయ్ తాగడానికి అని అడుగుతున్నాడు. ఇంట్లోవాళ్లతో మాట్లాడి ఫోన్ చేస్తానని చెప్పి పెళ్ళాం పిల్లల్తో చెప్పాడు ఈ సంగతి.

ఈ ఊరొచ్చి రెండేళ్లయింది. ఇండియన్స్ అన్నవారు ఒకరిద్దరు కనిపించారు కానీ తెలుగాయన అనేవాడు ఒక్కడూ కనపళ్ళేదు. ఈ సుధాకర్ గారు ఎప్పుడో మూణ్ణెల్ల క్రితం కనిపించి నెంబర్ ఇచ్చాక ఎప్పుడో ఆయన మర్చిపోయి ఉంటాడని అనుకున్నారు. కానీ ఇన్నాళ్ళకి ఈయన ఫోన్ చేసాడు. సరే ఆయన కష్టాలు ఆయనకి ఉన్నాయేమో, ఓ సారి వెళ్ళి చూస్తే పోయిందేమీ లేదు కనక మర్నాడు ఫోన్ చేసి చెప్పాడు ప్రసాద్, శనివారం రావడానికి కుదురుతుంది అని. వాళ్లకి ఒక చిన్న పాప ఉన్నట్టు వాల్ మార్ట్ లో చూసారు. ఏదో ఓ బహుమతి కొని ఇస్తే పాపకి బాగానే ఉండొచ్చు. అలా శనివారం రెండు కుటుంబాలూ కలిసేయి.

కేకుముక్కలు, బిస్కట్లు తిని టీ తాగుతూ అనేకానేక కబుర్లు. ఎక్కడనుంచి వచ్చారు, ఎంతకాలం అయింది అమెరికా వచ్చి, ఉద్యోగం లో అంతా బాగుందా, అక్కడ్నుంచి రాజకీయాలు, మోడీగారి హవా, చివరకి ఇండియన్ క్రికెట్టూ, ఆ టీము ఈ మధ్యన వెధవల్లా ఆడి పోగొట్టుకున్న ప్రపంచ కప్పూ, ప్రసాదు అప్పుడప్పుడూ చదివే తెలుగు పుస్తకాలూ అన్నీ మాట్లాడాక తెల్సిన విషయం సుధాకర్ డాక్టరేట్ చేసి ఊర్లో ఉన్న యూనివర్సిటీలో ప్రొఫెసర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఉద్యోగంలో చేసే రీసెర్చ్ కి పేపర్లు రాస్తూ, కథలూ కాకరకాయలూ కూడా రాస్తాడు. అవును తెలుగులోనే. ఫలానా పత్రికలలో చూడవచ్చు. ప్రసాదు కి హుషారు పుట్టుకొచ్చింది సాహిత్యం సంగతి చెప్పగానే. ప్రసాదు కూడా పుస్తకాలు అవీ చదువుతూ కొంచెం సాహిత్యాభిలాష ఉన్నవాడే. మళ్ళీ మరోసారి కలుద్దామని చెప్పి బయటకొచ్చారు.

అలా మొదలైన స్నేహం కొంచెం కొంచెం ముదురుతోంది. సుధాకర్ రాసే కథల గురించి ఎప్పటికప్పుడు ప్రసాద్ కి ఈమెయిల్ పంపుతున్నాడు. ఈయన చదివితే ఎలా ఉందో చెప్పడం, లేకపోతే నిశ్శబ్దం. ఒకరి పుస్తకాలు ఒకరు పంచుకోవడం, డివిడి లు షేర్ చేసుకోవడం జరుగుతున్నై. పిల్లల పుట్టినరోజులకీ, ఎప్పుడైనా మరో పండగకీ కలుసుకోవడం, భోజనాలు వగైరా. ఇద్దరు ముగ్గురు తెలుగువాళ్ళు ఎక్కడైనా కలుసుకోగానే ముందు చేసే పనేమిటంటే ఇద్దరూ దెబ్బలాడుకుని కొట్టేసుకుంటారుట. అదెంత నిజమో గానీ కొన్ని కొన్ని మనస్పర్ధలు వచ్చినా అవి పైకి కనిపించడం లేదు కుటుంబాల మధ్య. ఉన్న చిన్నపాటి ఊర్లో తామిద్దరే తెలుగువాళ్ళు అని తెలిసింది కనక కుటుంబాలు రెండూ కలిసి ఉంటున్నట్టే అని చెప్పుకోవాల్సిందే.

ఇలా రెండేళ్ళు గదిచాక సుధాకర్ బాంబు పేల్చాదు. ఆయనకి వేరే ఊర్లో ఉద్యోగం వచ్చిందిట; వెళ్ళిపోతున్నారు. ఆ వెళ్ళేది వచ్చే నెలలోనే. అయ్యో అనిపించినా ఉద్యోగానికి ఎవరి దగ్గిరో తల తాకట్టు పెట్టుకున్నాక ఇవి తప్పవు కదా? అలా సుధాకర్ కుటుంబం పైనెల దూరంగా ఉన్న రాష్ట్రానికి తరలిపోయింది. వీకెండ్ అయి, ఓ సారి సోమవారం రాగానే ఊపిరి పీల్చుకోవడానిక్కూడా సమయం లేదు కదా ఎవరికీను, పనిలో పడ్డాక. ఇంక మిగతా సాహిత్యం అవీ ఎక్కడ గుర్తు ఉంటాయి? సుధాకర్ అసలే కొత్త ఉద్యోగంలో జేరాడాయె, సామాను పేకింగ్ లో, మళ్ళీ కొత్త ఊర్లో అన్నీ సర్దుకోవడంలో అంతా బిజీ బిజీ.

ఆరునెలలు పోయాక ఓ రోజు ప్రసాదు తన పుస్తకాల షెల్ఫ్ లో ఏదో వెతకబోతుంటే చటుక్కున గుర్తొచ్చింది. ఆ మధ్యన కావాలంటే కవి సామ్రాట్ వారి వేయి పడగలు, బాపిరాజుగారి నారాయణరావు పుస్తకాలు సుధాకర్ కి అరువిచ్చాడు అడిగితే. పాత అట్ట చిరిగిపోయిన చందమామలు రెండో మూడో ఏనాటివో ఉంటే అవీ తీసుకెళ్ళినట్టు గుర్తు. అవీ తిరిగి ఇవ్వలేదు. ఓ ఈమెయిల్ పంపాడు సుధాకర్ కి 'ఈ పుస్తకాలు మీకు ఇచ్చినట్టు గుర్తు కాస్త చూస్తారా మీ దగ్గిర ఉన్నాయేమో?' అంటూ. వారం పోయాక సమాధానం వచ్చింది – ఈ ఊరొచ్చి సామాను సర్దడంలో ఇంకా ఏది ఎక్కడ ఉందో చూడలేదు, చూసి చెప్తాను అంటూ.

మరో నెలకి మళ్ళీ అటూ ఇటూ ఈమెయిల్ రాయబారం, ఏమండీ చూసారా పుస్తకాల సంగతి అంటూ ఈయన అడగడం, ఇంకా లేదని ఆయన సమాధానం. ఇలా తాత్సారం చేస్తూనే మరో మూడునెలలు గడిచాయి. ఇంక వీటి సంగతి సరిగ్గా చూడాలి అనుకుంటూ ప్రసాదు ఈ సారి ఫోన్ చేసి అడిగాడు సుధాకర్ ని, "కాస్త ఈ పుస్తకాలు చూసి పెట్టండి. నా దగ్గిర ఉండేవి, మీకు ఇచ్చినట్టు గుర్తు" అంటూ. ఆ రోజే చూసి, ఉంటే పంపుతానని చెప్పాక ఫోన్ పెట్టేసి కింద బేస్ మెంట్ లో వెతకడం మొదలు పెట్టాడు సుధాకర్. ఈ వెతకడం లో మళ్ళీ కోపం. "ఆఫ్టరాల్ మొన్న మొన్న అమెరికా వచ్చిన ఈ ప్రసాదు నన్ను ఇంత మాట అంటాడా? నేను గానీ ఈయన పుస్తకాలు కొట్టేస్తానా? వెతుకుతానని చెప్పాను కదా? నాకేం పని లేదా? తీరిక లేకే కదా? ఇటువంటి తెలుగువాళ్లతో స్నేహం చేయడం నాదే తప్పు" అంటూ కోపం. ఇంత కోపంలో ఒక్కసారి కూడా తాను తీసుకున్న పుస్తకాలు తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత ఉందని కానీ, అవతల ప్రసాదు వాటికోసం ఎందుకు అన్ని సార్లు అడుగుతున్నాడో అని గానీ తట్టలేదు. తాను రీసెర్చ్ ప్రొఫెసర్ కనక తాను గొప్పవాడు, తాను ఇష్టం వచ్చినప్పుడు పంపుతాడు ఆయన పుస్తకాలు. కొంచెం లేటు అయితే ఏమిటి అనే వన్ వే ఆలోచనే తప్ప అవతలవాళ్ళు ఏమనుకుంటారో అనే అలోచనే లేదు.

ఏదైతేనేం అరగంట గడిచాక మొత్తం ఈ రెండు పుస్తకాలు కనిపించేయి ఓ మూల. వాటిని ఓ అట్టపెట్టిలో పారేసి పైకి తీసుకొచ్చేడు ప్రసాదుకి పంపడానికి. ఈలోపుల వచ్చిన అర్ధాంగి అడిగితే చెప్పేడు కథంతా – తాము ఆ మహానుభావుడి పుస్తకాలు కొట్టేసామనుకుంటున్నాడు కాబోలు, ఇప్పటికే ఆరునెలబట్టి చంపుతున్నాడు, వీటిని ఇప్పుడే

పంపుతే దరిద్రం వదులుతుంది. ఓ సారి ఇటువంటి విప్లవ ఆలోచనలు రాగానే జరిగేది తెల్సిందే కదా? ఇంతకుముందు కనబడని తప్పులన్నీ ఒక్కసారి కళ్లముందుకొస్తాయి. ఆరోజున ఆ ప్రసాదు ఇలా అన్నాడు, వాళ్ళావిడ ఇలా అంది నాతో అంటూ ఇద్దరూ పాత విషయాలు నెమరు వేసుకున్నారు. ఓ సారి తప్పులు చూడ్డం మొదలు పెడితే, కూరిమి గల దినములలో నేరములెన్నడు కలుగనేరవు, మరి యా కూరిమి విరసంబైనను నేరములే తోచుచుండు నిక్కము సుమతీ అని బద్దెన చెప్పనే చెప్పేడు కదా? అలా మాట్లాడుకుంటూ పోతే ఆ లెక్కల ప్రకారం ప్రసాదు కుటుంబం వీళ్లతో రెండేళ్ళు కలిసి ఉన్నా మొత్తానికి ఆ కుటుంబం అంత మంచిదేమీ కాదు!! ఇప్పుడు కూడా  వాళ్ల పుస్తకాలు వెంఠనే ఇమ్మని అడగడంలో వాళ్ళ కుళ్ళుమోతుదనం  తెలుస్తోంది కదా?

అలా ఓ గంట ప్రసాదు కుటుంబంమీద కావాల్సినంత బురద జల్లి మనసులు కుదుటపర్చుకున్నాక సుధాకర్ చెప్పేడు వాళ్ళావిడతో "ఇప్పుడు వీళ్ల రోగం కుదర్చడానికి ఏం చేస్తానో చూడు." ఆవిడ చూస్తూండగానే ఆ రెండు పుస్తకాలూ మరో కొన్ని పుస్తకాలు, కాయితాలూ కలిపి ఆవిడ కడుపుబ్బా నవ్వుతుంటే పార్సెల్ చేసాడు. ఆ బాక్సు లో ఓ ఉత్తరం పెట్టి మర్నాడు యూనివర్సిటీ పోస్టు ఆఫీసులోంచి ప్రసాదు ఎడ్రస్ కి పంపించేడు – అదీ మేడియా మెయిల్ అనే అతి చవకబారు పోస్టులో ఖర్చు ఎక్కువకాకుండా ఉండడానికి – పంపించేవి పుస్తకాలు కనక.

మరో మూడు వారాలకి ఆ పేకెట్టు ప్రసాద్ కి చేరింది. విప్పి చూస్తే అందులో ఉన్నవి ప్రసాద్ సుధాకర్ కి అరువిచ్చిన వేయి పడగలూ, నారాయణరావు పుస్తకం కాక మరేవో ఉన్నాయి. తీరిగ్గా చూస్తే తెల్సిన విషయం, అవి సుధాకర్ కూతురికి సంబంధించిన ఎ, బి, సి, డి లు నేర్పించే ఎలిమెంటరీ స్కూల్ పుస్తకాలు, మూడేళ్ల పసిపాపలకి పాలు పడుతూ పాడే 'కాళ్లా గజ్జా కంకాళమ్మా' వంటి రైమ్స్ ఉన్న పుస్తకాలూ, సుధాకర్ ఊర్లో ఉండే చవకబారు పేపర్లూ, మరి కొన్ని ఆనియన్ అని చెప్పబడే ఊరి రోడ్డుమీద ఉచితంగా దొరికే పేపర్లూ ఉన్నాయి. వాటితో బాటు గ్రోసరీ స్టోర్ వారి వారం వారం వచ్చే ఎడ్వర్ టైజ్ మెంట్ కాయితాలూ వగైరాలు. అన్నింటికీ పైన తెలుగులో రాసిన ఉత్తరం – ప్రసాద్, నీ పుస్తకాలు పట్టుకుని పారిపోతానని అనుకుని నాకు మూడునెలల్లో ముప్పై సార్లు ఈమెయిల్ పంపావు. నేను పేరు పొందిన రీసెర్చ్ స్కాలర్ ని. నీ వంటి వాడితో స్నేహం చేయడమే నీకు గొప్ప. నీ పుస్తకాలు ఇవ్వలేదని నన్ను అవమానించినందుకు నీ "అద్భుతమైన పుస్తకాలు" ఇలా పంపించేస్తున్నాను. మరెప్పుడూ మమ్మల్ని ఈమెయిల్, ఫోన్ ద్వారా పలకరించవద్దు. అసలు మీతో స్నేహం చెయడమే ఒక పెద్ద తప్పు. గుడ్ బై.

ఉత్తరం చదివి అవాక్కైన ప్రసాద్ ఏమి చేయాలో తెలియక అలా చూస్తూ ఉండిపోయేడు. ఈ లోపుల అక్కడికి వచ్చిన వాళ్ళావిడ ఈ పేకెట్ అంతా చూస్తూ అడిగింది – "ఏమిటండీ ఇవి?" అంటూ. సుధాకర్ రాసిన ఆ ఉత్తరం ఆవిడ చేతిలో పడితే మరింత రాద్ధాంతం అవుతుంది కనక దాన్ని దాచి పెట్టి చెప్పాడు ప్రసాద్, "సుధాకర్ ఆ మధ్యన నా దగ్గిర

తీసుకున్న పుస్తకాలు మర్చిపోయేట్ట వెనక్కి ఇవ్వడం. పోస్టులో పంపించేదు; అవి పాడవకుండా పేకింగ్ కోసం పైన రకరకాల కాయితాలు పెట్టాడులే.”

**నీతిః మర్యాదగా తీసుకున్న వస్తువులు మర్యాదగా ఇవ్వడం నేర్చుకోవాలి. ఆ మర్యాద వంటబట్టడం జీవితంలో స్వతహాగా కష్టపడి నేర్చుకునేది కానీ సంపాదించిన పై చదువులూ, డిగ్రీలూ, చేసే రీసెర్చ్ వల్ల రావాలని ఏమీ లేదు.**

# రాత్రికి మీ ఇంట్లో

**చదువయ్యాక** కొత్తగా ఉద్యోగం వచ్చిన వెంకటాచలం – ఉరఫ్ చలం వర్జీనియా లో దిగాడు కొత్త పెళ్ళాంతో సహా. ఉద్యోగం రాక ముందు విన్న కథ వేరు, ఉద్యోగంలో వచ్చే డబ్బులతో ఎదురుగా ఉన్న వాస్తవం వేరు. పోనీ ఏదో ఒక ఉద్యోగం, గ్రీన్ కార్డు వచ్చేదాకా, ఆ తర్వాత ఎలాగా మారడూ? కొత్తగా ఉన్న ఊర్లో అద్దెలు ఎక్కువ, అది చాలదన్నట్టూ, కారుకి నెల నెలా కట్టే డబ్బులు, ఇన్స్యూరెన్సు, అది కదలడానికి గేస్, ఇంట్లో మళ్ళీ హీటింగ్ కీ, కూలింగ్ కీ ఎలెక్ట్రిసిటీ బిల్లు, ఫోను వగైరా వగైరాలన్నీ తీసేస్తే మిగిలేది రెండు వందలు కూడాలేదు. ఇది చాలదన్నట్టూ వర్జీనియాలో స్టేట్ టేక్స్, కార్ టేక్స్ అనేవొకటీ, మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టూ. ఏది ఏమైనా వచ్చే జీతానికీ పోయే ఖర్చులకీ సరికి సరి అయ్యాక జీవితం గడిచిపోతోంది, ఆ గడిచిపోవడం అనేది ఎలా అనేది పట్టించుకోకపోతే.

స్కూల్లో ఉన్నప్పుడైతే ఇంత గుంజాటన లేదు జీవితంలో. రూమ్మేట్లు 'ఇదిగో నీ వంతు బిల్లు నెలకి ఇంత' అంటే ఓ చెక్కు రాసి పడేయడమే. ఇప్పుడైతే అన్నీ తానే చూసుకోవాలి. ఉన్న స్నేహితులు తక్కువ. కొత్త ఊర్లో ఎవరూ తెలియదు. పటేల్ లోనో ఎక్కడో తెలుగాయన కనిపిస్తే పలకరించవచ్చు కానీ భోజనానికి పిల్చేంత చనువు లేదు అప్పుడే. ఎవరో ఒకటీ అరా ఇంటర్నెట్ స్నేహితులున్నా వాళ్లని నిజంగా కలిసినది లేదు. ఇటువంటి రోజుల్లోనే ఓ ఈమెయిల్ వచ్చింది చలానికి – ఫలానా అనంతం గారు దగ్గర్లోనే ఉన్న ఊళ్ళో ఉన్నారుట. మీకు కావాలిస్తే ఆయన్ని కలుసుకోవచ్చు. అయితే ఆయన ఉండేది డబ్భై మైళ్ళ దూరంలో ఉన్న రిచ్ మండ్ అనే చోట. వర్జీనియాకి ఉన్న త్రిరాష్ట్ర బృహత్ తెలుగు సంఘం ఏటా జరిపించే సంక్రాంతి, ఉగాది, దీపావళీ వరైగా ఉత్సవాల్లో వచ్చి వెళ్ళిపోతూంటారు. అలా కాని రోజుల్లో ఎప్పుడైనా సంగీత కచేరీలు ఉన్నా వస్తారు కూడా. ఆయన అమెరికా వచ్చి పాతికేళ్ళు దాటింది. పిల్లలకి రెక్కలొచ్చి ఎగిరిపోయి, గూడు ఖాళీ అయ్యాక ఇంట్లో ఉండేదీ ఆయనా, వాళ్ళావిడా మాత్రమే.

అనంతంగారు ఇంటర్నెట్ మీద చలానికి తెల్సినవాడే. అందువల్ల చలానికి ఆయన్ని చూడాలని సరదా పుట్టి మెయిల్ పంపాడు – ఈసారి వర్జీనియా వస్తే మా ఇంటికి రండి అంటూ. అనంతంగారు వెంటనే చెప్పేసాడు – ఎప్పుడో ఉగాదీ అదీ వచ్చేదాకా అనవసరం; పై శుక్రవారమే వస్తాడు వర్జీనియా ఆయన. అయితే వచ్చేది ఢబ్భై మైళ్ళ దూరం నుంచి కనక రాత్రి ఇక్కడే ఉండి మర్నాడు వెళ్తాడు. ఫర్వాలేదా అని ప్రశ్న సంధించాడు.

మొదటిసారే కదా అని వెంఠనే సరే అని చెప్పాడు వెంకటాచలం.

శుక్రవారం అనంతంగారూ వాళ్ళావిడా దిగారు చలం అపార్ట్ మెంట్లో. ఈ అనంతం గారు చలం అనుకున్నంత చిన్నాయన కాదు. అరవై ఏళ్ళుంటాయి. వాళ్ళావిడకి కూడా దగ్గర్లో దగ్గిర అదే వయసు. వచ్చినది పెద్దాయన కనక చలం మర్యాదలన్నీ చేసాడు. రాత్రి పడుకోవడానికి ఉన్నది చలం బెడ్రూం ఒకటే. ఆయన్ని హాల్లో పడుకోమంటే ఏమౌతుందో? అందువల్ల ఉన్న బెడ్రూం వాళ్లకిచ్చేసి చలం వాళ్ళావిడతో హాల్లో ఉన్న సోఫాలో బెడ్ ని బయటకి తీసి దాని మీద పడుకున్నాడు; పక్కనున్న పెళ్ళాం కోపంతో ఉంటే రాత్రి పెద్దాయన పడుకున్నాక మెల్లిగా చెప్పాడు చెవిలో – "పెద్దవాళ్ళు కదా మొదటిసారి ఇలా వచ్చినందుకు హాల్లో పడుకోమంటే ఏమనుకుంటారో?" ఆవిడ విసుక్కుంటూనే ఉంది కానీ చేసేదేం లేదు కనక నోరుమూసుకోవాల్సిన పరిస్థితి.

మర్నాడు పొద్దున్నే శనివారం వెళ్ళిపోతానన్న పెద్దాయన చెప్పాడు చలంతో, "ఈ ఊర్లో మాకు కొన్ని పనులున్నాయి అవి అయ్యాక పటేల్ స్టోర్ లో పని. మీరు కూడా రండి." ఈ పనులకి బయల్దేరేలోపు, ఇడ్లీలు, చట్నీ చేయడం, కాఫీలు పెట్టడం. మొదటి డోసు అయ్యాక బయటకెళ్ళేముందు పెద్దాయన రెండో డోసు కాఫీ తాగుతారుట. అలా మరో సారి కాఫీ. నలుగురూ బయల్దేరే ముందు అనంతం గారు చెప్పారు మళ్ళీ, "నా కార్లో సామాను పెట్టుకోవాలి, నలుగురం కుర్చోడానికి కుదరదు, నా కారు వెనకే మీరిద్దరూ మీ కార్లో రండి."

చలానికి మొహం మీద పేడ నీళ్ళు జల్లినట్టైంది. ఈయన వెళ్ళేది ఎక్కడికో తనకి తెలియదు. ఆయనే రండి అని పిలిచాక వచ్చిన ఆ ఎనిమిది సీట్ల వేన్ లో తామిద్దరికీ కుదరదుట. సరే ఎలాగా వస్తామని ఒప్పుకున్నారు కనక మొహమాటంతో ఇంక వెళ్లక తప్పదని ఇద్దరూ బయల్దేరారు ఆయన వేన్ వెనకనే తమ స్వంత కారు నడుపుకుంటూ. వర్జీనియా నుండి మేరీలేండ్ లో ఉన్న పటేల్ స్టోర్ కి ప్రయాణం. అదీ రాక్ విల్ల్ అనేచోట ఉన్న పటేల్ కి. అక్కడ ఉన్న పటేల్ బాగుంటుందిట మరోచోట ఉన్న పటేల్ కన్నా. ఈ ప్రయాణం వర్జీనియా నుంచి అరవై మైళ్ళు. అక్కడికెళ్ళాక తెల్సిన విషయం – అనంతం గారు అక్కడ కొనేది మామూలు బెండకాయలూ, దొండకాయలూ వగైరా – అదీ ఇద్దరికి మాత్రమే సరిపడా. అది చాలదన్నట్టూ వెనక్కి వస్తుంటే మేరీలేండ్ లో ఉన్న లైబ్రరీకి వెళ్తారుట పెద్దాయన. ఆ లైబ్రరీ ఉన్నది మరో ముప్ఫై మైళ్ళ అవతల. మేరీలేండ్ వచ్చి ఇలా సాహిత్య సేవ చేయకపోతే ఆయనకి నచ్చదు.

ఇవన్నీ అయ్యేసరికి గంట ఆరు దాటింది. "సరే ఇంక ఇంటికి పోదాం. మేము రేప్పొద్దున్న వెళ్లిపోతాం మాఊరికి," అంటూ చెప్పాడు పెద్దాయన. ఆయన చెప్పిన "కారులో మా సామానులు పెట్టుకోవాలి ఖాళీ ఉండదు మీరు కూర్చోవడానికి," అన్నది అప్పటికి అర్ధమైంది చలానికీ వాళ్ళావిడకీను. అనంతంగారు ఉండేది పై ఆకాశంలో అందువల్ల చలం లాంటి చిన్న చిన్న అర్భక జీవులని ఆయన తన వేన్ లో కూర్చోనివ్వరు. సామానూ లేదు, సుత్తీ లేదు. ఇప్పటికీ అర్ధం కాకపోతే మీ ఖర్మ. ఇప్పుడే చెప్పారు కదా ఆయన మర్నాడు కానీ వెళ్లరు. ఈ రోజు రాత్రి కూడా మీకు చాకిరీ తప్పదు. ఆ

రోజు మధ్యాహ్నం భోజనం ఎలాగా లేదు ఈ అనంతంగారి చుట్టూ తిరగడంతో. రాత్రి ఇంటికెళ్ళాక మళ్ళీ వీళ్లకి సేవలు చేయాలి. ఉసూరుమంటూ బయల్దేరారు అపార్ట్ మెంట్ కి.

అపార్ట్ మెంట్ కి వచ్చాక అనంతంగారి భార్య చెప్పారు. శనివారం రాత్రి ఆవిడ భోయనం చేయరు. ఉప్మా, ఉప్పిడిపిండి అలా ఏదైనా నచ్చుతుంది కానీ అన్నం మెతుకు కంచంలోకి రారాదు. కోపం వస్తూంటే చలం వాళ్లావిడ ఏదో అనబోయింది కానీ చలం మొహం చూసి ఊరుకుంది. ఒక్కరోజే కదా? అలా అనంతం గారికి కూరా పప్పూ పచ్చడీతో మామూలు భోజనం, వాళ్లావిడకి ఉప్మా చేయబడింది. ఉప్మా చేస్తుంటే అనంతంగారి భార్య వచ్చి సహాయం చేస్తూ ఆవిడకి అందులో కావాల్సిన జీడిపప్పూ, కొంచెం మసాలాలు వగైరాలు వేయించుకుంది కూడా. పెరుగు ఉండనే ఉంది.

రాత్రి కాసేపు కబుర్ల తర్వాత మళ్ళీ చలం వాళ్లావిడా వారి బెడ్రూం పెద్దాయనకి సమర్పించుకుని బయట హాల్లోనే పడుకున్నారు. చలం రాత్రంతా వాళ్ళావిడని బతిమాలుతూనే ఉన్నాడు ఒక్కరోజే కదా అంటూ.

ఆదివారం ఉదయం మరో సారి ఇడ్లీలు, రెండు దోసుల కాఫీ తర్వాత అనంతంగారు బయల్దేరారు వారింటికి. చలం, వాళ్ళావిడా కారు పార్క్ చేసిన చోటుదాకా వచ్చారు దిగబెట్టడానికి. వెళ్ళిపోయేముందు అనంతం గారు చెప్పేరు, "మళ్ళీ వస్తాం మరోసారి. బై, బై." వాళ్ళావిడ వేన్ ముందు సీట్లో కూర్చుని వెళ్ళేముందు చెప్పకపోతే బాగోదన్నట్టూ చెయ్యి మాత్రం ఊపింది. అలా వీకెండ్ లో శుక్రవారం సాయింత్రం పట్టుకున్న దరిద్రం ఆదివారం దాదాపు మధ్యాహ్నానికి గానీ వదల్లేదు చలానికి.

వెనక్కి అపార్ట్ మెంట్ లోకి రాగానే జూలు విదిల్చింది చలం భార్య. ఈ అనంతంగారి స్నేహానికీ, వాళ్ళు ఎటువంటివారో చెప్పడానికీను. అంట్లు అన్నీ కడుక్కుంటూ, దుప్పట్లన్నీ దులుపుకుని ఉతుక్కుంటూ మొత్తానికి ఇద్దరూ గ్రహించిన విషయం ఏమిటంటే ఈ అనంతంగారు తమని వీకెండ్ కి హాయిగా వాడుకున్నారు. ఇంతా చేసి తమ ఇంటికి వచ్చిన పెద్దమనిషికి వీళ్ళు కొత్తగా పెళ్లైన వాళ్లనీ ఏదో ఒక బహుమతి ఇద్దామని కూడా స్పృహే లేదు. ఎలా వచ్చారో అలాగే ఉత్తి చేతుల్తో వెళ్ళారు. వచ్చిన మనిషి తమ వేన్ లో కూడా ఎక్కనివ్వలేదు. పోనీ వెళ్ళేటప్పుడు తమని ఆహ్వానించారా వాళ్ళుండే ఊరికి అనేది చూసుకుంటే మళ్ళీ వస్తాం అనే తప్ప మా ఇంటికి రండి అనేది పొరపాటున కూడా అనలేదు. చలం వాళ్ళావిడ చెప్పిన దాని ప్రకారం వీళ్ళిద్దరూ వాళ్లకి చేసిన సేవ తప్ప ఆయన వీళ్లని పనిమనుషుల్లా చూసి వాడుకున్నాడు. వెళ్ళేటప్పుడు పేడనీళ్లు జల్లి మరీ వెళ్ళారిద్దరూను. మొహం చిన్నబుచ్చుకుని అన్నాడు చలం, "ఆయన ఇలాంటివాడని నాకు తెలియదు. ఇంటర్నెట్ మీద తెలుసు కానీ ఇదే మొదటిసారి కల్సుకోవడం. సారీ, నీకెంత కష్టం కలిగిందో నాకూ అంతే కలిగిందిగా?"

ఏ కళనుందో కానీ మిసెస్ చలం అంది, "ఇప్పుడు తెల్సింది కదా ఎవర్ని ఇంటికి పిలవాలో వద్దో?"

కొన్నాళ్ళు గడిచాక చలానికి పటేల్ స్టోర్ లో మరో తెలుగాయన కనిపించాడు – ఒకసారి ఆయన్ని ఈ బృహత్ తెలుగు సంఘంలో కలిసిన గుర్తు తో చేయి కలిపాడు చలం. మాటల్లో అనంతంగారి విషయం కూడా వస్తే ఆ తెలుగాయన అడిగాడు వంకరగా నవ్వుతూ, "మీరాయనకి అతిధ్యం ఇచ్చారా ఏమిటి?" ఈ కబుర్లలో తెలిసిన విషయం ప్రకారం చలం అనంతంగారి వలలో పడిన కొత్త చేప. ఆయన ఇలా తెలుగువాళ్లని వీకెండ్ కో, మరో అవసరానికో వాడుకోవడంలో సిద్ధహస్తుడు. ఓ సారి అవసరం తీరిపోగానే మరెప్పుడూ పలకరించడు. విడిపోయేముందు తెలుగాయన సలహా ఇచ్చాడు చలానికి, "ఈ సారి జాగ్రత్తగా ఉండండి."

ఆ తర్వాత కొన్నాళ్లకి అనంతంగారి దగ్గిర్నుంచో ఈమెయిల్ వచ్చింది చలానికి. వీకెండ్ కి ఫలానా డిసి ఏరియాలో తెలుగు సంగీత మహోత్సవం జరగబోతోంది. తాను "వాళ్ళావిడతో వచ్చి చలాన్ని కుటుంబంతో సహా" తీసుకెళ్తాడు; త్యాగరాజ కీర్తనలతో పాటు పాటలు అద్భుతంగా పాడేది ఫలానా తమిళ తంబి.

మరో ఆలోచన లేకుండా చలం మెయిల్ పంపించాడు వెంఠనే – "ఆ మహోత్సవం జరిగేరోజుకి తాము రెండు రోజులు పిట్స్ బర్గ్ వెళ్తున్నారు వెంకన్నని చూడ్డానికి. మాకు "అస్సలు కుదరదు"; ఈ కచేరీలంటే ఇష్టం లేదు కూడా."

నీతిః ఒకసారి మిమ్మల్ని కలుసుకున్నాక, స్నేహితుల ఇంట్లో రాత్రికి ఉండనిస్తారా లేదా అన్నది వాళ్ళు నిర్ణయించుకుంటారు, మీరు కాదు.

## చదువు, డబ్బు

**శివరావు ఏడో** తరగతిలో ఉండగా కొత్త కుర్రాడు రమేష్ వచ్చిజేరాడు క్లాసులో. ఆరునెలలు గడిచేసరికి కొత్తకుర్రాడే శత్రుత్వం పెంచుకున్నాడు – అప్పటివరకూ శివరావు క్లాసులో మొదటిమార్కులు సంపాదించడం అనే అతి చిన్న కారణంగా. కొత్తకుర్రాడు అన్నింట్లోనో ఫస్ట్ మార్కులు సంపాదించుకుంటూంటే శివరావు స్నేహంగా ఉండడానికి ప్రయత్నించాడు కానీ రమేష్ అదో రకం. తనదెప్పుడూ మొదటి రేంక్ కనక శివరావు పనికిరానివాడు. వాణ్ణి చిన్నబుచ్చడం, గేలిచేస్తూ వాడి రేంకుని కింద కిందకి జార్చి పనికిరాకుండాచేయాలి. అలా ఓ రోజుకి వాణ్ణి తన జీవితంలోంచి అడ్డం తొలగించుకోవచ్చు. రెండు మూడు సార్లు శివరావు స్నేహంగా ఉండబోయేడు కానీ మార్కులతో సంబంధం లేకుండా స్నేహం కుదరదుట రమేష్ కి; శివరావు లాంటి పగ వాడితో తనకి స్నేహం ఏవిటి?

ఇంటర్మీడియట్లో రమేష్ కి స్టేట్ రేంక్; అక్కడ్నుంచి ఐఐటికి, శివరావు అనంతపూర్ లో "అతి మామూలు" ఇంజినీరింగ్ కాలేజీకి జేరారు. ఎప్పుడైనా శెలవుల్లో కలుసుకుంటే రమేష్ ఎప్పటిలాగానే "రెండో రేంక్ శివరావు" నీ, వాడు చేరిన "చెత్త కాలేజీని", వాడు చేసే "పనికిరాని సివిల్ ఇంజినీరింగ్" నీ గేలి చేస్తూనే ఉన్నాడు. రమేష్ ని మార్చడం తన

తరం కాదని తెలియగానే శివరావు వీటినన్నింటినీ స్పోర్టివ్ గా తీసుకుని నవ్వి వదిలేసేవాడు. శివరావు ఎంత నవ్వితే అంత రెచ్చిపోవడం రమేష్ వంతు.

ఐఐటిలో జేరాక సంగతి తెల్సిందే కదా? మూడో ఏడు జరుగుతుండగానే అమెరికా వెళ్ళడానికి పరీక్షలూ, నాలుగు పూర్తవుతూనే విమానం ఎక్కడం; అలా రమేష్ ఐఐటి నుంచి కాలిఫోర్నియా, అక్కడ పి.హెచ్.డి తర్వాత కొలరాడోలో ఓ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా జేరిపోయేడు. టీచింగ్ లో జేరడానికి్కారాణాలున్నై. మొదటి మూడేళ్ళలో కొంచెం కష్టపడాలి పేపర్లు పబ్లిష్ చేయడానికీ, కొన్ని గ్రాంట్లు సంపాదించడానికీ, వీలుంటే ఒకరిద్దరి సీనియర్స్ తో కలిసి పుస్తకాలు కాకపోయినా వాటిలో కొన్ని చాప్టర్లు రాయడానికీను. ఆ తర్వాత టెన్యూర్ ఇచ్చారా, ఇంక వెనక్కి చూసుకునే పనే లేదు. యూనివర్సిటీలో ఇచ్చే జీతం, గ్రాంట్లు ఏవైనా వస్తే అందులో వచ్చే డబ్బులూ; ఇంక ఆకాశమే హద్దు.

శివరావు అనంతపూర్ లో సివిల్ ఇంజినీరింగ్ చదివాక ఇంజినీర్స్ ఇండియా లో చేరాడు. రెండేళ్లు కష్టపడ్డాక ఇంక అక్కడ నేర్చుకోవడానికేమీ లేనప్పుడు ఆ లైన్ వదిలేసి కంప్యూటర్ల మీద పడ్డాడు. తర్వాత మరో రెండేళ్ళు హైద్రాబాద్, అక్కణ్ణుంచి కంపెనీ ద్వారా డెట్రాయిట్ లో రెండేళ్లకి ఉద్యోగం. ఇంటర్నెట్ అప్పుడప్పుడే పుంజుకుంటోంది. ఓ సారి ఇండియా వెళ్తే ఎవరో చెప్పారు రమేష్ సంగతి. ఎప్పుడో కొన్నేళ్ళ క్రితం మర్చిపోయినా ఫోన్ నెంబర్ తీసుకుని అమెరికా వెనక్కి వచ్చాక ఫోన్ చేశాడు ఓ సారి రమేష్ కి.

ఫోన్ కాల్ శివరావుకి చెంప పెట్టులా తగిలింది. డబ్బులొచ్చిన పొగరో, చదువు తెచ్చిన గర్వమో కానీ రమేష్ పొడిపొడిగా, ఏం చేస్తున్నావు, ఎక్కడుంటావు అన్నీ అడిగాక చివరకి తన గురించి ఎప్పట్లా గొప్పలు చెప్తూ తన చేతిలో ప్రస్తుతం ఐదు మిలియన్ డాలర్ల కి ప్రోజక్ట్ లు ఉన్నాయనీ, జీతం ఇంతనీ, అంతనీ చెప్పి డబ్బా కొట్టుకున్నాక అడగనే అడిగేడు – నీ జీతం ఎంత అంటూ. "ప్రోగ్రామర్ గా నాకు వచ్చేది డబ్భైవేలు," శివరావు సమాధానం చెప్పాక ఇంక మాట్లాడ్డానికేమీ లేనట్టూ ఆగింది సంభాషణ. అన్నింటికన్నా ముఖ్యంగా రమేష్ చెప్పబోయినదేమంటే, ప్రొఫెసర్ గారు మిల మిల మెరిసే అద్భుత సౌందర్యరాసీ, తెల్లావిడా అయిన అమెరికన్ ని పెళ్ళి చేసుకున్నారు, అవును ప్రేమించీ, డేటింగ్ చేసీను. ఇటువంటి తన మోడర్న్ జీవితంలో మళ్ళీ ఈ "దేశీ శివరావు" ఎక్కడ దాపురించాడ్రా అన్నట్టూ మాట్లాడాడు రమేష్. ప్రొఫెసర్ గారికి ఉన్న మరో గొడవ ఏమిటంటే, తాను ఐఐటి లెవెల్లో క్లాసిక్ హై లెవెల్ మనిషి. ఇప్పుడు తన స్నేహితులు వేరు. ఎప్పుడో ఏడో తరగతి లోనో ఇంటర్మీడియట్ లోనో తనతో చదివిన ఈ శివరావు అనే కుర్రాడు అప్పుడూ, ఇప్పుడూ, ఏనాడూ తన సాటి కాదు. చివర్లో శివరావు అనుకోని మాట వచ్చింది రమేష్ నుంచి. మరో సారి ఎప్పుడైనా మాట్లాడ్డానికి కుదరదుట, అబ్బో ప్రొఫెసర్ గారు ముందు ముందు కాబోయే డీన్; ఎంతో బిజీ జీవితంలో. ఇది మాత్రం శివరావుకి అర్ధమైంది – నాకు మరోసారి ఫోన్ చేయకు అని చెప్తున్నాడు మాట రమేష్.

ఇంటర్నెట్ ఊపందుకుంటూంటే తను పనిచేసే కంపెనీలో మేనేజర్ అయ్యి, ఆ కంపెనీ పబ్లిక్ అయ్యాక దాని షేర్లు చేత్తో పుచ్చుకుని పైకొస్తున్నాడు శివరావు. గ్రీన్ కార్డు వచ్చిన మరో నాలుగేళ్లకి ఉద్యోగానికి తిలోదకాలిచ్చేసి ఈ షేర్లన్నీ పది మిలియన్లకి అమ్మి సిలికాన్ వాలీ జేరాడు. ఇప్పుడు శివరావు చేసే పని ఒకటే – తన దగ్గిరున్న డబ్బులు వెంచర్ కాపిటల్ గా పెట్టడం, కొత్తగా మొదలయ్యే సిలికాన్ వేలీ కంపెనీల్లో. అవి కొంచెం పెద్దవయ్యాక తన స్టాకు అమ్మేసి మరింత శ్రీమంతుడవడం. పదేళ్ళు తిరిగేసరికి శివ ఆర్ రాపర్ల అనే ఆయన పెద్ద వెంచర్ కాపిటలిస్ట్ కాలిఫోర్నియాలో. ఎవరైనా కంపెనీలు పిలిస్తే వెళ్ళి తాను ఎలా డబ్బులు పెట్టదల్చుకున్నాడో, ఎటువంటి ప్రోజక్ట్ లు మంచివో అవి చెప్తూ ఉంటాడు మీటింగులలో. పైకి న్యూసు పేపర్లలోకి పేరు రాకపోయినా టెక్నాలజీ కంపెనీలలో అందరికీ బాగా తెలిసినవాడే. ఒక్కోసారి ఇండియా వెళ్ళి అక్కడ సాఫ్ట్ వేర్ కంపెనీలకి సలహాలు ఇవ్వడం కూడా ఉంది.

యూనివర్సిటీలో పాఠాలు చెప్పుకునే రమేష్ కి ఒక్కో గ్రాంటు అయిపోయాక నీరసం ఆవహించింది. పాఠాలు చెప్పినవే చెప్పడం; కొత్తగా గ్రాంట్ రావాలంటే గవర్నమెంట్ రూల్స్ ప్రకారం, కొత్త అధ్యక్షులవారి రాజకీయాల వల్లా కష్టమౌతోంది. అన్నింటికన్నా ముఖ్యంగా ఇంటర్నెట్ అన్నింటినీ తినేస్తోంది – యూనివర్సిటీలు ఎన్నాళ్ళుంటాయో, అన్నీ ఆన్ లైన్ మీద పాఠాలు చెప్తారో, ఏమౌతుందో తెలియదు. అనుకున్న డీన్ ఉద్యోగం రాలేదు రాజకీయాల వల్ల. డిపార్ట్ మెంట్ చైర్ గా తప్పించారు రోటేషన్ ప్రకారం. చేతిలో గ్రాంటులూ లేక, చెప్పిన పాఠాలే చెప్తూంటే, ఉద్యోగంలోంచి ఎప్పుడు ఉద్వాసన పలుకుతారో అనే సందేహం. ఇద్దరు పిల్లలకీ పెద్దగా చదువు అబ్బలేదు ఎందువల్లో. ఏవో ఉద్యోగాలున్నాయి కానీ వాళ్ళకి రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు. బాగా చదువుకుని ఉద్యోగాలు చేసే అందరి బతుకులూ సజావుగా ఉన్నాయని చెప్పలేం కదా? అద్భుత సౌందర్యరాసి అయిన తెల్లావిడతో ప్రేమ అంకురించి ఇద్దరు పిల్లలు పుట్టిన కొన్నాళ్ళకి ప్రొఫెసర్ గారంటే మోజు తీరిపోయింది ఆవిడకి. పెళ్ళి పెటాకులయ్యేసరికి ఆవిడ పిల్లలని చూసుకోవాలనీ, ఈయన మొగుడిగా ఎప్పుడూ తనని సరిగ్గా చూడలేదనీ, ఇదనీ, అదనీ చెప్పి కోర్టు, లాయర్ల సహాయంతో ఈయన జేబులూ, బేంకు ఎకౌంట్లూ ఊడ్చి, ఇంటి తలుపు తీసి బయటకి సాగనంపింది. ఇప్పుడు ఒక చిన్న అపార్ట్ మెంట్లో రమేష్ ఒక్కడే ఉంటున్నాడు. మరో ప్రేయసి దొరికీ దొరకకుండా ఉంది. అయినా ఒకసారి చేతులు కాలాక మరోసారి తెలిసీ కాల్చుకోవడం దేనికీ?

ఈ బిక్కుబిక్కుమనే రోజుల్లోనే కాలిఫోర్నియా వెళ్ళాడు ఓసారి రమేష్ ఏదో కాన్ఫరెన్స్ కి. అందులో మాట్లాడబోయే శివ ఆర్ రాపర్ల ని చూసాక తెలిసి వచ్చింది. వీడు తన చిన్నప్పటి స్నేహితుడే. తనతో ఏ నాడూ చదువులో తూగలేని శివగాడు, కాన్ఫరెన్స్ లో ప్రత్యేకంగా పిలవబడి మాట్లాడుతున్నాడు ఇప్పుడు. సివిల్ ఇంజినీరింగ్ చదివిన శివగాడు మాత్రం ఇప్పుడో అపర కుబేరుడు. అప్పుడు తెలిసివచ్చింది రమేష్ కి. తాను చదువులో ఐఐటిలో జేరినా, ప్రొఫెసర్ గా ఉద్యోగం చేసినా శివరావు లాగా ఏనాటికీ మిలియన్ల డాలర్లు సంపాదించలేదు. అయితే ఐఐటిలో చదివిన హైక్లాస్ మనిషి,

యూనివర్సిటీలో ప్రొఫెసర్ అయిన తాను ఇంత దూరం వచ్చాడు కనక ముళ్ళమీద కూర్చున్నట్టూ తప్పక వినాల్సిన పరిస్థితి.

శివ చెప్పే విషయం బట్టి తెల్సినదేమంటే ఆయన తన లాంటి ఉద్యోగం చేసే ప్రొఫెసర్ల రీసెర్చ్ కి వెంచర్ కాపిటల్ పెట్టగలడు. కానీ ఏవో పేపర్లు పబ్లిష్ చేసే పనికిరాని రీసెర్చ్ కి కాదు. ఏదో ప్రోడక్ట్ చేసి చూపించాలి. ఇన్నాళ్ళ బట్టీ తాను చేసిన రీసెర్చ్ చూసుకుంటే అలా ప్రోడక్ట్ లు తయారు చేసేదేమీ తాను చేయలేదు. అతనికి తానో పనికిరాని మనిషి.

శివరావు మాట్లాడ్డం అయ్యాక అతనొక్కణ్ణీ కలిసి అడిగాడు రమేష్ – తాను గుర్తున్నానాడో లేదో. "ఆ, నువ్వు గుర్తు లేకపోవడమే? నన్ను నీ జీవితంలోంచి చారులో కరివేపాకులా తీసిపారేసినవాడివి. నేను డెట్రాయిట్ లో పనిచేస్తున్నాను అని స్నేహంగా ఫోన్ చేస్తే పనిగట్టుకుని నా జీతం ఎంతో అడిగిన పెద్దమనిషివి; మరోసారెప్పుడూ నాతో మాట్లాడ్డానికి సమయమే లేదన్నావు కదా? నువ్వు ఈ పాటికి యూనివర్సిటీ లో డీన్ అయ్యుంటావు. ఇప్పుడు నా జీతం ఏడాదికి ఇరవై మిలియన్లు; ఉద్యోగం మాత్రం ఏమీ లేదు; వెంచర్ కేపిటల్ పెట్టడమే. నీకు ఇంకా ఏమైనా వెంచర్ కాపిటల్ గురించి విషయాలు కావాలిస్తే నా ఆఫీసుకి ఫోన్ చేయి, మా సెక్రటరీ అన్నీ వివరంగా చెప్తుంది." విజిటింగ్ కార్డు తీసి రమేష్ చేతికి ఇస్తూ శివరావు చెప్పాడు.

"అప్పట్లో ఏదో కుర్రతనం వల్ల అలా అన్నాను…." ఏదో నసిగేడు రమేష్.

"ఓ, కుర్రతనం ఎలిమెంటరీ స్కూల్లో ఉన్నప్పుడు కదా? అమెరికా వచ్చి ప్రొఫెసర్ గా పనిచేసే రోజుల్లో కూడా కుర్రతనం పోలేదన్నమాట. భేష్, చాలా బాగుంది. చేసినది వెధవ పని కాక దాన్ని సమర్ధించుకోవడం కూడానా? ఇంతకీ ఏమిటి సంగతి? ఇంట్లో వంట్లో అంతా కులాసాయేనా?"

ఏమనాలో తెలియక, మాడిపోయిన మొహం పక్కకి తిప్పుకుని, "అంతా బాగానే ఉంది, మళ్ళీ కలుద్దాం," వెనక్కి తిరిగేడు రమేష్.

**నీతిః జీవితంలో డబ్బులు బాగా సంపాదించడానికి పెద్ద కాలేజీల్లో పెద్ద పెద్ద చదువులు చదవక్కర్లేదు.**

# వెండి కంచంలో భోజనాలు

**కొత్తగా పెట్టే బిజినెస్** వెంచర్ లో పెట్టుబడి పెట్టడానికి సిలికాన్ వాలీలో దిగాడు చందర్రావు, ఉరఫ్ చందు. డబ్బులు పెట్టేముందు అక్కడ కొంతమందితో మాట్లాడాక తెలిసిన విషయాల ప్రకారం మొత్తం తాను జేబులోంచి పెట్టేది అంతా ఒకే కంపెనీకి. ఆ కంపెనీ బతికి బట్టకడితే తానూ బతుకుతాడు లేదా ఒకే బుట్టలో పెట్టిన గుడ్లన్నీ విరిగిపోయి, మళ్ళీ ఉద్యోగం వెతుక్కోవడమే. ఇంటావిడ కాస్త నసిగినా, వద్దు అని వ్యతిరేకించినా మొత్తానికి ఆవిడని నయానో భయానో ఒప్పించి సిలికాన్ వాలీ చేరాడు. చేరడం అయితే చేరాడు కానీ మొదట్లో ఉండడానికి ఇల్లూ అదీ చూసుకోవడంలో తలమీద

ప్రాణం తోకకి వచ్చేలా ఉంది. ఇంటి అద్దెలు ఆకాశంలో, తానేమో జీతం లేని వెంచర్ కాపిటలిస్టు. మొత్తానికి వీరినీ వారినీ కలిసి ఫోన్ మీదో, ఈమెయిల్ మీదో మాట్లాడిన విషయాలతో కలిపి అమ్మగారికి తెలిసిన దూరపు బంధువనబడే బీరకాయపీచు చుట్టం తగిలాడు మాట్లాడ్డానికి. ఈ చుట్టం మూర్తిగారు అమెరికా వచ్చి ఇరవై సంవత్సరాలూ, వాలీలో సెటిలై పదిహేను సంవత్సరాలు. అందువల్ల ఆయనకి చుట్టు పక్కల బాగా తెలిసిన ఊరే. విషయం అంతా విని ఆయన ఫోన్ లో చెప్పాడు చందు కి, నేరుగా వాళ్ళింటికి వచ్చేయమని.

చందు, వాళ్ళావిడా తప్ప ఇంకా పిల్లలు లేరు. ఉన్న సామానులో కావాల్సినది ఉంచుకుని మిగతాది అమ్మేసో, ఎవరికో ఇచ్చేసో న్యూ మెక్సికో రాష్ట్రం నుంచి మిగిలిన సరుకంతా ఉన్న కార్లో పెట్టి బయల్దేరారు. దాదాపు పద్దెనిమిది గంటల డ్రైవింగ్. ఒక రోజులో వెళ్ళేది కాదు కనక దారిలో ఒక హొటల్లో విరామం. దారంతా ఆలుమగలు వాదించుకుంటునే ఉన్నారు – మూర్తిగారు ఎలా చూస్తారో అనే దగ్గిర్నుంచి, తమ జీవితం ఎలా ఉండబోతోందో అనే విషయం వరకూ. కాలిఫోర్నియా హైవేల మీద ట్రాఫిక్ పద్మవ్యూహాల్లోంచి తప్పించుకుంటూ ఎక్కడా ఏక్సిడెంట్ అవ్వకుండా మొత్తానికి అన్ని అవరోధాలూ దాటుకుని కాలిఫోర్నియా చేరారు మూడో రోజు సాయంత్రానికి. మూర్తిగారుండే ఊరు చేరడం ఒక ఎత్తైతే ఆయన ఇల్లు కనుక్కోవడం మరో ఎత్తు. మూర్తిగారి తలుపు తట్టేసరికి రాత్రి ఎనిమిది. అప్పుడు మరో కష్టం దాపురించింది.

తెల్సిన విషయాల ప్రకారం మూర్తిగారు ఇంట్లో లేరు. ఆయనకి ఎక్కడో మీటింగ్ పడింది. మరో నాలుగు రోజులగ్గానీ రారు. ఇంట్లో వాళ్ళావిడా ఇద్దరు అబ్బాయిలూ ఉన్నారు. పిల్లలిద్దరూ హై స్కూల్ వయసేమో. ఎవరిలోకం వారిది. మూర్తిగారు ఇంట్లో లేరనే సరికి చందుకి నీరసం ఆవహించింది. ఎందుకంటే తనకి అన్నింటికన్నా ముఖ్యం ఒక అపార్ట్ మెంట్ చూడ్డంలో సహాయం. దానికి మూర్తిగారి సపత్ని కంటే ఆయనకే బాగా తెలుస్తుంది కదా? అయినా ఇంత దూరం వచ్చాక ఇంక చేసేదేవీ లేదు కనక ఏవో మాట్లాడి తమకిచ్చిన బెడ్రూంలో ఆ రోజుకి పడుకున్నారు. మర్నాడు చూచాయగా తెల్సిన విషయం ప్రకారం, చందు పెట్టుబడి పెట్టే కంపెనీ ఉండేది ఊరికి ఉత్తరంగా. మూర్తిగారిల్లు దక్షిణంగా నలభై మైళ్ల అవతల. తానుగానీ మూర్తిగారుండే ఏరియాలో అపార్ట్ మెంట్ చూసుకుంటే రోజూ మూడు గంటలు ఈ ట్రాఫిక్ లో కూర్చోవడం తప్పదు – అదీ ట్రాఫిక్ జామ్, ఏక్సిడెంట్లూ లేకపోతే. ఏ రోజైనా ట్రాఫిక్ జాం ఉంటే అంతే సంగతులు. మర్నాడు ఈ విషయాలు అన్నీ తెలుసుకున్నాక ఇల్లు చూసుకుని మళ్ళీ వస్తాం సాయంత్రానికి అని చెప్పి బయల్దేరారు చందు పెట్టే కంపెనీ ఉండబోయే ఏరియాకి.

రోజంతా తిరిగాక మరింత క్లారిటీ. కంపెనీకి మూడు మైళ్ళ దూరంలో అపార్ట్ మెంట్ అయితే దొరికింది కానీ మరో మూడు రోజులగ్గానీ ఇవ్వరు. సరే ఏదో ఒకటి. ఈ మూడ్రోజులూ ఏదో విధంగా గడిపేస్తే తమదంటూ ఓ అపార్ట్

మెంట్లోకి మారిపోవచ్చు. ఆ అపార్ట్ మెంట్ కి ఎడ్వాన్స్ ఇచ్చేసి సాయంత్రం మళ్ళీ మూర్తిగారింటికి చేరారు. తలుపు తీసిన మూర్తిగారి అర్ధాంగి మొహంలో చిరాకు చందు గమనించాడు.

ఆవిడ వెనక్కి తిరగ్గానే తన అర్ధాంగి కేసి తిరిగి 'చూసావా ఈవిడ ఏమందో?' అన్నట్టు చూసాడు. మూర్తిగారి వాళ్ళావిడతో విషయాలు చూచాయగా చెప్పి, క్రితం రోజు రాత్రి తమని ఏ గదిలో ఉండమన్నారో ఆ గదిలోకి వెళ్ళి గదిలో మంచం ఉన్నా అది తమది కాదు కనక నేలమీద కార్పెట్ మీదే నడుం వాల్చాడు చందు. పొద్దున్ననుంచీ తిరుగుతున్నాడో ఏమో, వెంఠనే నిద్ర పట్టేసింది.

కాసేపటికి ఏవో మాటలు వినబడుతుంటే అలాగే పడుకుని చెవులు రిక్కించాడు. మూర్తిగారి అబ్బాయి కాబోలు అడుగుతున్నాడు, "మామ్ నా రూమ్ నన్ను అడక్కుండా వీళ్ళకి ఎందుకిచ్చావు? వాళ్ళు నా మంచం మీద పడుకుంటే నేను మళ్ళీ అక్కడ పడుకోను. నా ఇష్టాయిష్టాలతో ఏమీ పనిలేదా?"

చందు లేవబోతూ పక్కకి చూసాడు. పక్కనే ఎప్పుడు వచ్చి పడుకుందో తన అర్ధాంగి కూడా నిద్రలోకి జారుకున్నట్టుంది. మూర్తిగారి వాళ్ళావిడ కంఠం వినిపించింది చందుకి – "వీళ్ళు మీ నాన్నగారి చుట్టాల్రా నాయనా, నేను పిలిచాననుకున్నావా? వీళ్ళు వస్తామంటే వెంఠనే వచ్చేయమని చెప్పారు నాన్న. తీరా వీళ్ళొచ్చే సమయానికి ఏదో మీటింగ్ పేరు చెప్పి ఊళ్ళోంచి వెళ్ళిపోయారు. వెనక్కి రానీయ్ అడుగుదాం, ఇటువంటి దరిద్రులందర్నీ ఎందుకు పిలుస్తారో? ఇప్పుడు చూసావా, సామాను మనింట్లో పెట్టి ఊరుమీద తిరిగొచ్చారు. మనతో మాటా మంతీ లేదు. ఇప్పుడు వీళ్ళు లేచాక నా సంగతి చూడవేం, నేను వీళ్ళిద్దరికీ వండి పెట్టాలి. వచ్చీరాగానే ఈ ఇల్లు తమ స్వంతం అన్నట్టూ నీ గదిలోకి పోయి పడుకున్నారు. ఈ పీడ వదలగానే నేను నీ బట్టలూ దుప్పట్లూ అన్నీ ఉతికిపెడతానులే. అయినా మన ఇండియన్స్ కి ఇలా స్వంతంగా తమకి తాము ఆహ్వానించుకోవడం మామూలే."

చందుకి ఒక్కసారి ఉవ్వెత్తున ఆశ్చర్యం, కోపం తన్నుకొచ్చాయి. తాము వస్తామంటే ముందే వద్దని చెప్తే తానేమీ అనుకుని ఉండేవాడు కదా? తీరా రమ్మని, వచ్చాక ఇలా అంటారేమిటి? తాము ఉన్న మూడు రోజులూ తమకిచ్చిన గదిలో కూడా పడుకోకూడదా? తామింత దూరం నుంచి వచ్చామనీ రోజంతా తిరిగామనీ తెలియదా ఇరవై ఏళ్లనుంచీ ఇక్కడ ఉండేవారికి? ఈవిడ ఇక్కడ ఇరవై ఏళ్ళు ఉండగానే "ఇండియన్స్" అంటోందే? ఈవిడ ఇండియన్ కాదా? కాసేపటికి వళ్ళు తెల్సి వచ్చాక సర్దుకుని పక్కనున్న ఆవిడని లేపి మెల్లి లో గొంతుకతో ఈ విషయాలన్నీ చెప్పాక ఇద్దరూ గదిలోంచి బయటకొచ్చేసరికి మూర్తిగారి వాళ్ళావిడ హాల్ లో కనిపిస్తే చందూ, వాళ్ళావిడా ఒకేసారి చెప్పారు.

"ఈ రోజు బయట తినడం వల్ల ఆకలిగాలేదు, మాకేమీ వండకండి, ప్లీజ్."

పుటుక్కున దారం తెంపినట్టూ ఆవిడ అంది, "సరే పోయి పడుకోండి అయితే." ఈ మాటతో ఆవిడ ఇంక తమతో మాట్లాడదని తెల్సింది కనక "మాకు అపార్ట్ మెంట్ దొరికింది ఎల్లుండి వెళ్ళిపోతాం. ఈ రెండు రోజులూ కాస్త సర్దుకోవడం కుదురుతుందా మీకు?" అడిగేడు చందు.

చటుక్కున అంది ఆవిడ, "తప్పదు కదా." ఈ సమాధానంతో చందుకి మొహం మీద పేడనీళ్ళు జల్లినట్టైంది. మరో నలభై ఎనిమిది గంటలు.

మొత్తానికి వెళ్లబోయే ఎల్లుండి వచ్చాక వీళ్లతో చెప్పి కొత్త అపార్ట్ మెంట్లోకి మారారు. మరో మూడు వారాలకి కొంచెంలో కొంచెం సర్దుకుంటూంటే ఈ సారి మూర్తిగారి నుంచి ఫోను, భోజనానికి రమ్మని. తమకి వీలు కాదని పని ఉందనీ తప్పించుకుందామన్నా ఆయన వదల్లేదు. అలా మరోసారి మూర్తిగారింట్లో అయిష్టంగానే భోజనానికి తయారయ్యేరు. ఈ సారి మరో ఆశ్చర్యం చందుకి – భోజనం వెండి కంచాలలో వడ్డించబడింది. ఒక స్వీటూ, హాటు, ఆహా ఓహో అనేటువంటి టేబిల్ క్లాత్ వేసిన బల్ల మీద. తాము పట్టుకొచ్చిన ఏదో గిఫ్ట్ అక్కడే పెట్టి ముభావంగా భోజనం చేసి వెళ్తామని బయటకొచ్చాక కారు దాకా వచ్చిన మూర్తిగారు వాళ్ళావిడ పక్కనే ఉండగా అన్నారు, "మీ కంపెనీ పబ్లిక్ ఇష్యూ కి వెళ్లగానే మాకు షేర్లు వచ్చేలా చూడాలి సుమా. మనం మనం చుట్టాలం కదా, మీకు అపార్ట్ మెంట్ దొరికేదాకా మేము సహాయం చేసినట్టే, మనలో మనం ఆ మాత్రం సహాయం చేసుకోపోతే ఎలా?"

రాబోయే నవ్వు అదిమిపెట్టి అవునూ కాదూ అన్నట్టు బుర్ర ఆడించి బయల్దేరారు చందు వాళ్ళావిడా ఇంటికి. దారిలో కొంతదూరం వెళ్ళాక జరిగినదంతా గుర్తొచ్చి, ఫకాలున నవ్వొచ్చింది చందుకి. పక్కన్నున్న అర్ధాంగి అడిగితే చెప్పాడు అసలు విషయం. "మూర్తిగారు మీటింగ్ కి వెళ్లకముందు వాళ్ళావిడతో మన వెంచర్ కాపిటల్ కంపెనీ గురించి చెప్పలేదనుకుంటా. అందుకే ఆవిడ మనని పురుగుల్లా తీసిపారేసింది. ఈయన మీటింగ్ నుంచి వచ్చి ఆవిడకి బ్రెయిన్ వాష్ చేసినట్టున్నాడు మనం పెట్టే కంపెనీలో షేర్లు వస్తాయనీ వాటితో మిలియన్లు సంపాదించవచ్చనీను. ఒక్కసారి మిలియన్లు అనేది తెలిసొచ్చేసరికి మనకి వెండి కంచాల్లో భోజనం పెట్టేసింది ఆవిడ. అదొకటీ, మరో విషయం చెప్పనా?"

"ఏమిటా రెండో విషయం?"

"మూర్తిగారు ఇంట్లో లేనప్పుడు మనల్ని ఎలా చూసినా, తీసిపారేసినా, ఆయన చుట్టాలని తాను ఎంత బాగా చూస్తుందో అని చెప్పడానిక్కాబోలు, వెండి కంచాలు బయటకి తీసింది, ఆయన వెనక్కొచ్చాక. ఆవిడ తన కొడుకుతో మాట్లాడినది మనం విన్నామని ఆవిడకి తెలియదు."

"మీ కంపెనీ రాబోయే రోజుల్లో బాగానే నడుస్తుంది అనుకుంటున్నారుగా, షేర్లు వీళ్లకి ఇస్తారా?"

తమ కంపెనీ కనక పబ్లిక్ ఇష్యూకి వెళ్తే ఎవరికైనా షేర్లు ఇస్తాడు కానీ వీళ్ళకి మాత్రం ఖచ్చితంగా కాదు అనుకున్నాడు మనసులో చందు. అయితే అమ్మగారికి మూర్తిగారు చుట్టమే కనకా, తను ఏదైనా నోరు జారితే ముందు

ముందు ఎటు తిరిగి ఎటొస్తుందో తెలియదు కనకా పైకి జనాంతికంగా అన్నాడు చందు, "చూద్దాంలే, ఇంకా ఈ కంపెనీ పైకి రావాలి కదా?"

**నీతిః రా, రమ్మని పిలిచిన అతిథిని సరిగ్గా చూడకుండా తర్వాత వెండి కంచంలో భోజనాలు పెట్టి లాభం లేదు.**

# ఇంటి తాళాలు

**సియాటెల్, వాషింగ్టన్:** ఊర్లో ఆ మధ్య ఓ సారి కలిసిన సుధీర్ పిలిచాడు ప్రసాద్ ని ఎందుకో. ఫోన్ మీద కాదు కానీ కలిసి మాట్లాడే పని ఉందిట. ఏమిటో ఈ కలిసి చెప్పే విషయం, అదీ తనతో పెద్దగా పరిచయం లేదు కూడా. సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికొస్తుంటే సుధీర్ ఇంటి దగ్గిర ఆగాడు ప్రసాదు. ఫలహారం, టీ అయ్యేక చెప్పాడు సుధీర్ అసలు విషయం. ఫలానా రోజు తానూ, అమ్మగారు పక్క ఊర్లో ఎవరో పిలిస్తే వాళ్ళింటికి వెళ్ళాలి గృహప్రవేశానికి. పిల్లలని తీసుకెళ్ళడం కుదరదు; వాళ్లకి స్కూల్లో ఏదో అర్జంట్ పరీక్ష ఉంది. ఇంతకీ సుధీర్ అడిగేదేమిటంటే, ఆ ఫలానా రోజున ప్రసాదు పిల్లలని తీసుకొచ్చి ఇంట్లో దింపగలడా? అలా దింపాక ఓ గంటలోపునే తాము వచ్చేస్తారు; అందువల్ల ఇంట్లో పిల్లలని దింపాక ఓ గంట పిల్లలకి సహాయంగా కూర్చుంటే చాలు.

మొదట్లో కొంచెం మొహమాటం. అసలే డే కేర్ లో పెడితే పిల్లలకి ఏ చిన్న దెబ్బ తగిలినా కోర్టులో కేసు, అక్కడ్నుంచి అనేకానేక గొడవలూను. ఆ మాటే చెప్పాడు ప్రసాదు. 'అబ్బే వీళ్ళు డే కేర్ అంత చిన్నపిల్లలు కాదు కదా, ఊర్లో సరిగ్గా రెండే రెండు మైళ్ళు స్కూల్ ఇంటికి. ఇంటికి తీసుకొచ్చి టివి ఆన్ చేసి వాళ్ళకి ఇంట్లో తాము సిద్ధంగా ఉంచే ఫలహారం పెడితే చాలు. అసలు అదీ పెట్టక్కర్లేదు. ఇంటికి తీసుకొస్తే వాళ్ళే చేసుకోగలరు.' ఓ డూప్లికేట్ తాళం చెవి ఉంది అది ఇస్తారు ప్రసాద్ కి. కార్లో పిల్లల్ని తీసుకొచ్చి ఇంటి తాళాలు తీసి తాము వచ్చేదాకా ఒకే ఒక గంట కూర్చుంటే చాలు, చేసిన మేలు మర్చిపోరు. ఈ గొడవ ఇంక ఎలాగా తప్పించుకోలేక ప్రసాద్ చెప్పేడు, "రేప్పొద్దున్న పిల్లల్ని సరిగ్గా చూడలేదనీ వాళ్ళనేదో అన్నాననీ ఏమీ కేసులు వేయరని ఏమిటి గారంటీ?" ఇలా అడగడానికి ప్రసాదు ఏమీ భయపళ్ళేదు. ఎందుకంటే సుధీర్ తనకి బాగా తెల్సినవాడు కాదు. ఎవరి బుద్ధి ఎలా తిరుగుతుందో ఎవరు చెప్పలేం కదా? దీనికి చేతులో చెయ్యేసి ప్రామిస్ చేసి చెప్పేడు సుధీర్, "మీ మీద కేసా? భలేవారండి. దేవుడి మీద ఒట్టు, అటువంటిదేమీ లేదు." ఆయన రేప్పొద్దున్న ఒట్టు తీసి గట్టుమీద పెట్టినా తాను చేసేదేమీ లేదని తెల్సి కూడా ఇంక ఒప్పుకోక తప్పలేదు ప్రసాద్ కి. సరే అని చెప్పి వాళ్ళిచ్చిన ఇంటి తాళం తీసుకుని బయల్దేరాడు. సుధీర్ స్కూల్లో ప్రిన్సిపాల్ గారికి ముందే చెప్తాడుట ప్రసాదు వచ్చి పిల్లలని తీసుకెళ్తాడని. అందువల్ల ఏమీ సమస్యే లేదు.

ఇంటికెళ్ళాక మళ్ళీ అమ్మగారి దగ్గిర ఈ ఊసు వెళ్లబోసుకోవడం, ఆవిడ తనకేం పట్టనట్టూ మాట్లాట్టం అన్నీ అయ్యాక అక్కడితో ఊరుకున్నాడు ప్రసాదు.

అనుకున్న ఫలానా రోజుకి ఆఫీసులో ఓ గంట ముందే బయల్దేరి స్కూల్ కి వెళ్ళాడు సుధీర్ పిల్లలని తీసుకురావడానికి. వాళ్లని ఎక్కించుకుని ఇంటికి తీసుకొచ్చాక తలుపు తాళం ఎక్కడుంచాలో తెలియలేదు ప్రసాద్ కి. పెద్ద పిల్లకి ఎనిమిదో పదో ఏళ్ళుంటాయేమో, ఆ పిల్లని అడిగాడు ఇంటి తాళం ఏం చేస్తారో. 'నేను దాస్తా' ఇవ్వండి అనేసరికి ఆ తాళం పాపకి ఇచ్చి అక్కడే కూర్చుని టివి చూడ్డం మొదలుపెట్టాడు. మరీ గంటలో కాదు కానీ గంటన్నరకి సుధీర్ వాళ్ళావిడా కంగారుగా వచ్చారు. వస్తూనే అనేకానేక ధన్యవాదాలు వగైరా చెప్పాక, హమ్మయ్యా ఏ గొడవా జరగలేదు అనుకుంటూ ప్రసాద్ ఇంటికి బయల్దేరాడు.

మూడు రోజులు పోయాక అసలు గొడవ మొదలైంది. సుధీర్ వాళ్ళావిడ ప్రసాదు ఇంటికి ఫోన్ చేసి చెప్పింది, 'ఇంటి తాళాలు మీ ఆయనకి ఇచ్చాం కదా, అవి వెనక్కి ఇస్తారా?' అంటూ.

వెంటనే ప్రసాద్ చెప్పాడు ఫోన్ తాను అందుకుని, వాళ్ల పాపకి తాళాలు ఇచ్చినట్టూ, ఆ పాప ఎక్కడ పెట్టిందో కనుక్కోమనీను. అటువైపునుండి ఓ కసురూ, ఓ నీలుగూ వినిపించాక ప్రసాద్ భృకుటి మీద కోపం స్పష్టంగా కనిపించిది వాళ్ళావిడకి. అదను చూసి ఆవిడో బ్రహ్మాస్త్రం వదిలింది, "నేను ముందే చెప్తామనుకున్నాను మీతో ఇటువంటి పనులు నెత్తికెత్తుకోవద్దని కానీ తగుదునమ్మా అంటూ వెళ్ళారు, ఇప్పుడావిడ తాళాలు కనిపించలేదు అంటోంది. రేపు డైమండ్ నెక్లస్ కనపడలేదంటే ఏం చేస్తారు?"

అసలే కోపంలో ఉన్న ప్రసాద్ కి ఇది వినేసరికి ఒళ్ళు కంపరం ఎత్తింది. అమ్మగారి మాటలో కాస్త నిజం ఉంది కదా, అందువల్ల నోరుమూసుకున్నాడు. అప్పటినుండి రోజుకి మూడు సార్లు సుధీర్ ఫోన్ చేస్తూనే ఉన్నాడు పోయిన తాళాల కోసం. ఇటునుంచి ఈయన చెప్పినమాటే చెప్తూనే ఉన్నాడు – మీ అమ్మాయికిచ్చాను మహా ప్రభో అంటూ. "తొమ్మిదేళ్ల అమ్మాయికి ఇచ్చారా? అదేమిటండి మీరు మా చేతికి ఇవ్వాలి గానీ," అంటూ ఆయన మరోసారి మీ జేబులో, ఇంట్లో, కార్లో చూస్తారా అంటూ నసగడం. మొత్తానికి ప్రసాద్ కి తెలిసొచ్చినదేమంటే, సుధీర్, వాళ్ళావిడా తాను తాళాలు కొట్టేసినట్టు నమ్ముతున్నారు. ఏం చేయాలో తెలియక తలపట్టుకునే పరిస్థితి. దీనికంతటికీ తానే కారణం.

అలా ఓ వారం గడిచాక అమ్మగార్ని తీసుకుని సుధీర్ ఇంటికి వెళ్ళాడు ఈ విషయం అమీతుమీ తేల్చడానికి. వాళ్ల ఇంటికెళ్ళాక తేలినదేమంటే తాను తాళాలు ఇచ్చినట్టు ఆ తొమ్మిదేళ్ల అమ్మాయికి గుర్తు లేదు. నేను దాస్తా అని చెప్పి తన చేతిలోంచి తీసుకున్న ఆ తాళాలు ఏం చేసిందో కూడా అసలే తెలియదు.

ఈ లోపునే సుధీర్ వాళ్ళావిడ అంది, "ఈ తాళం ఈ మధ్య వచ్చే కొత్త రకం తాళమండి. దానికి డూప్లికేట్ చేయించాలన్నా అరవై డాలర్లు అవుతుంది. ఇప్పుడేం చేయాలో తెలియటం లేదు."

ప్రసాద్ వెంటనే చెప్పాడు, "మీ దగ్గిరో తాళం చెవి ఉంటే ఇలా ఇవ్వండి, డబ్బులదేవుంది. తాళం పారేసింది నేనే అంటున్నారు కనక నేను డూప్లికేట్ చేయించి ఇస్తాను."

ఈ మాటలు మెల్లిగా మెల్లిగా వేడి పుంజుకుంటూంటే సుధీర్ అన్నాడు, "అది కాదండి సమస్య, పోయిన తాళం ఎవరికైనా దొరికితే ఇంట్లో దొంగతనం అవుతుంది కదా? పోనీ తాళం మారుద్దామంటే మొత్తం ఇంట్లో అన్నింటికీ మార్చాలి కదా?" ఓ గంట అటూ ఇటూ వాగ్యుద్ధాలు అయ్యాక ప్రసాద్ వాళ్ళావిడా లేచారు వెళ్ళడానికి. మరో సారీ మరోసారీ తమ ఇంట్లో, పేంట్ జేబుల్లో, కార్లో అంతా చూస్తామని చెప్పి. కానీ సుధీర్ వాళ్ళావిడకి ప్రసాద్ ఇలా తాళాలు విసిరేయడం – ప్రసాదు తాళాలు విసరలేదని తెల్సినా సరే – ఏమీ నచ్చలేదు. ఎలాగోలా ప్రతీకారం తీర్చుకోవాలని సుధీర్ కి పురి ఎక్కించింది.

ఈ ప్రతీకారానికి తొందర్లోనే ఓ అవకాశం తన్నుకొచ్చింది సుధీర్ కి.

స్థానిక గుడిలో సత్యన్నారాయణ పూజకి కుటుంబంతో సహా వెళ్ళాయ్ రెండు కుటుంబాలూను. పూజ అయ్యాక మిగిలిన ప్రసాదం వితరణ చేస్తుంటే ఓ చేయి కావాల్సొచ్చినప్పుడు ప్రసాద్ అక్కడ నుంచుని వడ్డించడం మొదలుపెట్టాడు. ఇదిగో ఇది అవగానే వెళ్ళిపోదాం అనుకుంటూను. అలా గంట గడిచాక ప్రసాద్ వాళ్ళావిడ వచ్చి 'కారు తాళాలు ఇలా ఇవ్వండి, నా బేగ్ మర్చిపోయాను,' అంటే ఆవిడకి తాళాలిచ్చాడు. ఆవిడ వెనక్కి వచ్చి అవి ప్రసాద్ అందరికీ వడ్డించే చోట టేబిల్ మీద అతని పక్కనే పెట్టి పక్కనే ఉన్న బాత్రూం లో దూరింది. చేతులు ఖాళీలేక, చేతికంటుకున్న అన్నం, ప్రసాదం కారు తాళాలకి అంటించడం వేస్టు కనక ఆ తాళాలని అలాగే వదిలి వడ్డించడం పూర్తి చేసాడు. అంతా అయ్యాక ఇంక వెళ్దామా అనే అర్ధాంగితో బయటకి వచ్చి జేబులు తడుముకుంటే కారు తాళాలు లేవు. నీకిచ్చానుగా అంటే, తిరిగి నీకిచ్చేసానుగా అంటూ వాదులాడుకున్నాక మరోసారి గుడిలో కెళ్ళి చూసారు. అప్పటికి భోజనాలైపోయి వెళ్ళిపోయారందరూ. ఉన్నవాళ్ళెవరికీ ఈ తాళాలు చూసిన గుర్తు లేదు. మరో అరగంట వెతికాక తెల్సిన విషయం ఏమంటే, తాను తాళాలు పోగొట్టుకున్నాడు ఎక్కడో. ఈ చీకట్లో అవి దొరకడం అసంభవం.

ఎమర్జన్సీ గా లాక్ స్మిత్ అనే ఆయనకి ఫోన్ చేస్తే ఆయనొచ్చి చెప్పాడు. కారు స్టార్ట్ అవ్వడానికి సహాయం చేస్తాడు. ఎక్కడా ఆపకుండా ఇంటికెళ్ళిపోవచ్చు. దారిలో పోలీసులు కానీ ఆపితే వారికి అనుమానం రాకుండా ఆ స్మిత్ గారిచ్చే రసీదు కాయితం, కారు రిజిస్ట్రేషన్ అవీ చూపించవచ్చు. అయినా ఆపితే కదా, "స్పీడ్ లిమిట్ దాటకుండా వెళ్లండి. ఇంట్లో వేరే డూప్లికేట్ ఉంటే మరో కీ చేయించుకోండి తర్వాత." దీనికి ఛార్జ్ కేవలం నాలుగు వందల యాభై డాలర్లు మాత్రమే. ఓ, దాన్దేవుంది, క్రెడిట్ కార్డు తీసుకుంటారు, ఏమీ ఫర్వాలేదు. అలా కారు స్టార్ట్ చేయించుకుని ఇంటికి ఏడుపుమొహాల్తో బయల్దేరారు ప్రసాద్ కుటుంబం. తాను గుడిలో వాలంటీర్ గా దేవుడి ప్రసాదం అందరికీ వడ్డిస్తున్నప్పుడు సుధీర్ కూడా లైన్ లో వచ్చి ప్లేట్ లో భోజనం పెట్టించుకున్నాడనీ ఆయనే ప్రసాద్ చూడనప్పుడు అక్కడున్న కారు తాళాలు కూడా తీసుకుని వెళ్ళాడనీ ప్రసాద్ కి ఎన్నటికీ తెలియలేదు. అయితే ఇంటికొచ్చే దారిలో ప్రసాద్ కి ఎందుకో ఆ రోజు సుధీర్ మొహంలో ఎప్పుడూ చూడని సంతోషం కనిపించడం ఎందుకో అర్ధం కాలేదు.

సుధీర్ కుటుంబం గుడిలో భోజనం అయ్యాక నవ్వుకుంటూ బయటకి వెళ్ళి అక్కడనుంచి పక్కనే ఉన్న వాల్ మార్ట్ దగ్గిరకీ దాని దగ్గిరే ఉన్న ట్రాష్ బిన్ దగ్గిరకీ వెళ్ళి ప్రసాద్ కారు తాళాలు అందులో పారేసి నిశ్చింతగా ఇంటికెళ్ళిపోయారు – ప్రతీకారం తీర్చుకున్న ఆనందంతో.

మరో నాలుగు వారాలు గడిచేయి. అప్పుడు ప్రసాద్ కి కొత్తగా తెల్సిన విషయం మూడో పార్టీ ద్వారా ఏమిటంటే, తొమ్మిదేళ్ల సుధీర్ కూతురు తాళాలు సోఫా మీదకి విసిరింది కేర్ లెస్ గా. అవి అక్కడనుండి గురుత్వాకర్షణ ద్వారా కిందకీ అక్కడనుంచి మరో చోటికీ బదీలీ అయ్యి, ఓ సారి కొన్నాక మరి ఇంకెప్పుడూ తెరవని పిల్లలు బొమ్మలు పెట్టుకునే డబ్బాలోకి చేరిపోయింది. సుధీర్ వాళ్ళావిడకి ఓ రోజు వెతుకుతుంటే కనిపించాయి ఈ తాళాలు. కొంతమంది గిల్టీ గా ఫీల్ అయినా దాన్ని పదే పది నిముషాల్లో వదిలించుకోగలరు. సుధీర్ అటువంటివాడే, ఆయనా వాళ్ళావిడా తమ తాళాలు తమ ఇంట్లోనే దొరికినట్టూ, తాము ప్రసాద్ కారు తాళాలు కావాలని వాల్ మార్ట్ దగ్గిర ట్రేష్ లో విసిరేసిన విషయం ఎవరికీ ఎప్పటికీ చెప్పలేదు. ఎలా చెప్తారు, కడుపు చించుకుంటే కాళ్లమీద పడదూ?

**నీతిః మీ స్నేహితుల మీద తప్పుమోపడానికి ఉన్న ధైర్యం, మీరు చేసిన తప్పు ఒప్పుకోవడానికి ఉండాలి.**

## మరెప్పుడూ రాకండి

**హ్యూస్టన్ లో** ఉద్యోగం వచ్చిన కొత్తలో శాస్త్రి హిందూ గుడికెళ్ళాడు వీకెండ్ లో. అక్కడ పరిచయమైన అరవిందన్ అనే ఆయన తన ఫోన్ నెంబర్ ఇచ్చి మరీ చెప్పాడు ఏదైనా సహాయం కావాలిస్తే అడగమని. మరీ అంత తెలియని మనిషిని ఏమడిగితే బాగుంటుందో తెలియదు కనక ఊరుకున్నాడు శాస్త్రి. అయితే ఆయనే ఫోన్ చేసాడు రెండు రోజుల తర్వాత. కారు ఉందా, కొత్తది కొనాలంటే సహాయం కావాలా, ఎక్కడ ఉంటున్నారు, వగైరా. ఆయన అడిగేడు కదా అని శాస్త్రి చెప్పాడు విషయాలు – కారు కొత్తది కొనాలి నిజమే కానీ అంత అర్జంటు కాదు, అపార్ట్ మెంట్ ఉంది ప్రస్తుతానికి, ఊళ్ళో ఉన్న ఇండియన్ స్టోర్స్ ఎక్కడుంటాయో అనే డిటైల్స్ గుడిలో సంపాదించాడు కనక ఏమీ ఢోకా లేదు ప్రస్తుతానికి. శామ్స్ క్లబ్బూ, కాస్ట్ కో క్లబ్బూ ఉన్నాయి కనక అన్నీ అమరినట్టే. మరో వారం పోయాక వద్దన్నా సరే ఆ అరవిందన్ అనే ఆయనే పిలిచాడు మరో సారి గుడికి వచ్చి కలుసుకోమని. వెళ్ళాక తెల్సింది ఆయనకి తెల్సున్న డీలర్ ఉన్నాట్ట కారు కొనడానికి. ఇప్పుడు వద్దు అంటున్నా – కొనక్కర్లేదు, జస్ట్ వెళ్ళి చూద్దాం అంటూ తీసుకెళ్ళాడు – ఫోర్డ్ డీలర్ దగ్గిరకి.

కొత్తకారు అంటే తెల్సిందే కదా, అన్నీ అద్భుతంగా ఉంటాయి ముందు ఆ కారు రంగూ, వాసనా అన్నీ కలిపి. ఓ సారి కొన్నాక ఏ కారు ఎన్నేళ్ళు ఎలా మన్నుతుందో ఎవరికీ తెలియదు. అసలు FORD అంటేనే Found On Road

Dead అని చెప్పుకోవడం శాస్త్రి విన్నాడు కనక ఆ బ్రాండ్ కొనే ఉద్దేశ్యమే లేదు. ఈ అరవిందన్ గారి వ్యవహారం చూస్తే వదిలేలా లేదు కనకా, ఆయన కారులోనే తీసుళ్తున్నాడు కనకా, వెళ్ళక తప్పని పరిస్థితి. అలా డీలర్ దగ్గిర తేలారు.

డీలర్ గారి భవనంలోకి వెళ్ళేముందే చెప్పేడు అరవిందన్ శాస్త్రితో. 'జీతం ఎంత, ఎక్కడ ఉద్యోగం, ఎన్నేళ్ళ బట్టీ ఈ ఉద్యోగం చేస్తున్నారు, ఎడ్రసు, కారుకి ఇన్సూరెన్స్ ఎవరి దగ్గిర, కొత్తది కొంటే పాతది తనకి అమ్ముతారా, అన్నీ అడుగుతాడు, ఓ కాయితం క్రెడిట్ కి నింపమనవచ్చు. ఏదీ కొనక్కర్లేదు. జస్ట్ కాయితాలు నింపేసి కారు ఓ టెస్ట్ డ్రైవ్ చేసి తర్వాత మళ్ళీ వస్తాం అని వెళ్ళిపోవడమే. ఏమీ కొనవలసిన అవసరం లేదు.'

'సరే,' అని శాస్త్రి లోపలకి వెళ్ళాడు అరవిందన్ తో పాటు. లోపల కాయితాలు నింపడం, డ్రైవర్ లైసెన్సు చూపించడం, అన్నీ అయ్యాక ఓ టెస్ట్ డ్రైవ్ చేసారు. దారిలో అరవిందన్ గారు సేల్స్ మాన్ కంటే ఎక్కువగా చెప్పాడు ఫోర్డ్ కారు ఎంత మంచిదో, తాను కొన్నాడనీ, అది దాదాపు ఆరేళ్ళ బట్టీ అస్సలు ట్రబుల్ ఇవ్వకుండా ఎలా నడుస్తోందో వగైరా విషయాలు చెప్తూను. రెండు గంటల తర్వాత బయటకొచ్చారు. ఇప్పటికి ధైర్యం వచ్చిన శాస్త్రి చెప్పాడు, "డబ్బులు చూసుకోవాలి, మా ఆవిణ్ణి అడగాలి కూడా, ఆవిడకి కారు నచ్చాలి కదా, అందువల్ల మరోసారి వస్తాం." మళ్ళీ కార్లో గుడి దగ్గిర దింపే ముందు అరవిందన్ చెప్పాడు, "వీడి దగ్గిర కారు కొంటే మరో పదీ–ఇరవై శాతం వరకూ తగ్గించడానికి తాను సహాయం చేస్తాడు. మీ ఆవిడతో చెప్పండి. దాదాపు రెండువేలు ఆ పై మాటే డిస్కౌంటు." మొత్తానికి ఆయన్ని వదిలించుకుని ఇంటికొచ్చాడు శాస్త్రి.

తర్వాత ప్రతీ రోజూ డీలర్ నుంచి శాస్త్రికి ఫోన్ రావడం మొదలైంది. మొదట్లో ఎత్తి సమాధానం చెప్పినా ఈ ప్రహసనం ఎక్కువౌతూండడంతో ఆ కాల్ రాగానే ఫోన్ ఎత్తడం మానేసారు. తర్వత అరవిందన్ ఫోన్ చేసినా, ఏమనుకున్నాడో మరి, మళ్ళీ ఫోర్డ్ కారు గురించి మాట ఎత్తలేదు. కుటుంబాలు రెండూ అటూ ఇటూ ఎప్పుడైనా కలుసుకుంటూనే ఉన్నారు. అలా ఓ సారి భోజనానికి వెళ్ళినప్పుడు చిన్న స్వీటు పాకెట్ ఇచ్చాడు శాస్త్రి. అది ఓపెన్ చేసిన అరవిందన్ అన్నాడు సీరియస్ గా – "ఇదేమిటి ఇలా చిన్న పేకెట్ ఇచ్చారు, మరీ నేను అర్భకుళ్ళా కనిపిస్తున్నానా?" శాస్త్రికి మూర్ఛ వచ్చినంత పనైంది. ఈ సారి నుంచీ అరవిందన్ తో ఎలా ఉండాలో, ఉండకూడదో నిర్ణయించుకుని వెనక్కి వచ్చేశారు.

మూడోవారానికి శాస్త్రి దగ్గిర ఉన్న పాత కారు కదలడానికి మొరాయించింది. రిపేర్లు అయ్యాక మెకానిక్ చెప్పేడు – "ఇప్పటికే నూటయాభై వేల మైళ్ళకి చేరిన బండిని ఇంకా ముందుకి తోయడం అనవసరం. ఇది ఇచ్చేసి కొత్తది కొనుక్కోండి." ఫోర్డ్ గురించి ఇప్పటికే తెల్సింది కనక శాస్త్రీ వాళ్ళావిడా డైరక్ట్ గా హోండా డీలర్ దగ్గిరకెళ్ళి బేరసారాలు అయ్యాక పాతకారు ఇచ్చేసి కొత్తది తెచ్చుకున్నారు. ఈ మాట అరవిందన్ కి చెపితే ఏమౌతుందో తెల్సు కనక ఆయనకి

చెప్పడం అనవసరం. పాత కారుకి వెయ్యి డాలర్లు వచ్చింది డీలర్ దగ్గిర దాన్ని ఇచ్చేసినప్పుడు. ఏదైతేనేం మొత్తానికి నెలకి నాలుగువందలు చప్పున అయిదేళ్ళు కడితే హోండా కారు అప్పు తీరిపోతుంది.

ఇది జరిగిన రెండువారాలకి అరవిందన్ మళ్ళీ ఫోన్ చేసాడు. వాళ్ల ఇంటికి భోజనానికి రమ్మంటూ. కుదరదని తప్పించుకున్నాడు శాస్త్రి. కానీ మరోసారి గుడిలో కనిపించి బలవంతం చేసాడు ఇంటికి రమ్మని. ఇంక తప్పదు కనక పటేల్ షాపులో ఓ స్వీటు పేకెట్టు కొని ఓ శనివారం బయల్దేరారు దంపతులిద్దరూను. ఈ సారి స్వీట్ పేకెట్ లో మూత తీయగానే కిందపడిపోయేటన్ని స్వీట్లు పెట్టి మరీ ఇచ్చాడు. అది చూసి అరవిందన్ భార్య అడగనే అడిగింది కూడా. ఈ నిర్భయంగా చెప్పాడు, శాస్త్రి, "క్రితం సారి వచ్చినప్పుడు మీరే అన్నారుగా పెద్ద పేకెట్ ఇవ్వాలని? మళ్ళీ అలా అడుగుతారేం?" భోజనాల సమయంలో పిచ్చాపాటీ అయ్యాక పాయసం ఇచ్చారు కప్పులో తాగడానికి. అప్పుడు శాస్త్రి అనుకున్న విషయమే అరవిందన్ మొదలుపెట్టాడు. ఫోర్డ్ కారు కొంటే ఎంత మంచిదో అనే విషయం, దానిలో వచ్చే డిస్కౌంటూ, నెలవారీ ఎంత కట్టవచ్చో, హోండా అయితే ఎంత ఎక్కువో వగైరా.

కాసేపు ఆయన చెప్పేది విని అవునూ కాదూ అనకుండా కూర్చున్నప్పుడు అరవిందన్ శాస్త్రి వాళ్ళావిడతో అన్నాడు, "మీరే చెప్పండమ్మా, నాకు ఈ డీలర్ తెల్సున్నవాడు, నాదీ ఫోర్డు కారే, కొంటే మీకే లాభం" ఎట్సెటెరా. ఈ వాగుడు మరీ ఎక్కువౌతూంటే ఇంక దీన్ని తుంచడానికేమార్గం తట్టక శాస్త్రి చెప్పేసాడు, "ఫోర్డు గురించి కనుక్కున్నామండి. మా ఆఫీసులో వాళ్ళు వద్దన్నారు. మా బాసుకి తెలిసిన హోండా డీలర్ దగ్గిర మూడు వారాల క్రితం హోండా కొనుక్కున్నాం. మీతో చెప్దాం అనుకుంటూనే ఎప్పటికప్పుడు మర్చిపోతున్నాం."

తాను విసిరిన బాంబు అరవిందన్ మీద న్యూక్లియార్ క్షిపణిలా పనిచేయడం గమనించాడు శాస్త్రి. మొదట్లో ఆయన మొహం వివర్ణమవడం, దాని వెంఠనే ఓ మూలుగు, తర్వాత పెద్ద లెక్చరూను. మిమ్మల్ని అంత దూరం తీసుకెళ్ళాను, నాకు ఇప్పుడు చెడ్డపేరు తెచ్చారు మీరు కారు కొనకుండా అంటూ అలా ఓ అరగంట తిట్టిన తిట్టు తిట్టకుండా వాగుతూనే ఉన్నాడు. అప్పుడు చెప్పేడు శాస్త్రి, "అయ్యా ఫోర్డ్ కారు మంచిదే కావొచ్చు కానీ అది రెండేళ్లకి మించి పనిచేయదంటున్నారు, నాకు నచ్చలేదు కూడా." ఈ సారి అరుస్తున్నట్టూ అన్నాడు అరవిందన్ –

"నేను కొన్న ఫోర్డు కారు బ్రహ్మాండంగా పనిచేస్తోందని చెప్పానుగా? అయినా నాతో చెప్పకుండా హోండా కొనడం దేనికీ? ఇప్పుడు నేను డీలర్ కి ఏం సమాధానం చెప్పుకోవాలి?"

ఈ సమస్య అలా తేలేది కాదు కనక శాస్త్రి, వాళ్ళావిడా లేచి వెళ్ళడానికి బయల్దేరుతూ చెప్పాడు, "పోనీయండి, డీలర్ కి బోల్డు మంది ఉంటారు కొనేవారు. మనం మనం ఈ విషయంలో కొట్టుకోవడం దేనికీ? నాకు నచ్చని కారు నేను కొనలేను కదా?"

అరవిందన్, వాళ్ళావిడా కూర్చున్నవారు అలాగే కూర్చుని చెప్పారు, "సరే వెళ్ళండి అయితే, మా పాట్లు మేం పడతాం." శాస్త్రీ వాళ్ళావిడా ఈ మాట విని, వాళ్ల పాట్లేవిటో అర్ధం కాక ఒకరిమొహం ఒకరు ఆశ్చర్యంగా చూసుకుని బయటకి నడిచారు. మూడో అంతస్తులో ఉన్న అరవిందన్ గారి అపార్టుమెంట్లోంచి కిందకి దిగుతూంటే అరవిందన్ కూతురు ఏడేళ్ల పిల్ల పైనుంచే అరిచింది – "మరెప్పుడూ మా ఇంటికి రాకండి."

ఆ పాప అలా అరుస్తూంటే, వెంఠనే తల ఎత్తి ఏదో అనబోయి, పక్కనే ఉన్న భార్యామణి ఒక్కసారి చేయి నొక్కడంతో మాట్లాడకుండా బయటకి వచ్చేశాడు శాస్రి. బయటకి వచ్చి కార్లో కూచున్నాక అదోరకమైన స్థబ్దత ఆవరించింది దంపతులని. శాస్త్రి ఓ సారి తాను చేసినదాంట్లో ఏదైనా తప్పు ఉందా అని చాలాసేపు ఆలోచించాడు అక్కడే కూర్చుని. తనకి నచ్చని కారు తాను కొనుక్కోవాల్సిన అవసరం లేదు. చిన్న స్వీటు పేకెట్ ఇస్తేనే నసుక్కున్న ఈ అరవిందన్ అనే మనిషి, ఆయన చెప్పిన ఫోర్డు కారు కొన్నా ఏదో వంక పెట్టి ఉండేవాడేమో పోనీ అది కొన్నాక మరోటీ, మరోటీ అంటగట్టడని ఏమిటి నమ్మకం? అదీగాక ఈయనకెందుకో అంత ఇది, తాను ఫోర్డు కారు కొనకపోతే? అప్పుడు స్ఫురించింది సడన్ గా – తనచేత ఫోర్డు కారు కొనిపిస్తే ఈయనకి ఏదో మిగుల్తుంది డీలర్ ద్వారా. అదీ సంగతి. అది కొననందుకు డబ్బులు పోయాయి కనకా, ఇంక తమతో మరేం లాభం లేదు కనకా ఇంట్లో పిల్ల చేత "మరెప్పుడూ రాకండి మా ఇంటికి" అని అరిపించి మరీ చెప్పించాడు. స్వస్తి.

ఈ మాటే శాస్త్రి పక్కనున్న భార్యామణితో చెప్పినప్పుడు ఆవిడ అంది, "అంటే వీళ్ళతో మన స్నేహం ఊడినట్టేనా?" బండి ముందుకి నడుపుతూ శాస్త్రి చెప్పేడు సీరియస్ గా "పీడా పోయింది."

**నీతిః మీ ఇంట్లో ఆరేడేళ్ళ పిల్లల నోట్లో వచ్చేమాటలు ఎవరివో అవతలవాళ్లకి తెలియదా?**

# ఉద్యోగపు వేట

**ఆఫీసులో పనిచేస్తున్న** రామారావు దగ్గిరకొచ్చి పిలిచేడు బాసు. ఆయన కూడా వెళ్తూంటే ఎన్నో ఆలోచనలు. తను పని బాగానే చేస్తున్నాడు కదా, ఉద్యోగం పీకడానికేమీ కారణంలేదు. ఎవరైనా పితూరీలు చెప్పినా ఏమౌతుందో ఎవరూ చెప్పలేరు కనక, మౌనంగా ఆయనని అనుసరించాడు. తన గదిలోకి తీసుకెళ్ళాక నవ్వుతూ చెప్పాడు పెద్దాయన, "నీ గ్రీన్ కార్డు కి అప్లికేషన్ పెట్టాం కదా? అది ఓకే చేసారు. అయితే నువ్వు బ్రహ్మచారివి కనక చెప్తున్నాను, పెళ్ళి చేసుకుంటే నీకూ మీ ఆవిడకీ ఒకేసారి గ్రీన్ కార్డు ఇస్తారు. ఎవర్నైనా డేటింగ్ చేస్తున్నావంటే ఇప్పుడే సరైన సమయం పెళ్ళికి. ఆ తర్వాత మీ ఇండియన్స్ ఇండియా వెళ్ళి పెళ్ళి చేసుకుని వస్తే గ్రీన్ కార్డు రావడానికి చాలా సంవత్సరాలు పట్టొచ్చు."

పెద్దాయన ఇచ్చిన సలహా అద్భుతం కనక, దాని ప్రకారం ఓ రెండు వారాలు శెలవు తీసుకుని ఇండియా బయల్దేరాడు రామం. అవును పెళ్ళికోసమే. ముందే ఫోన్ చేసి చెప్పాడు కనక తల్లీ తండ్రీ ఓ ఐదారు సంబంధాలు చూసి పెట్టారు హీరోగారు ఇండియాలో దిగి ఇంటికెళ్ళగానే చూడ్డానికి. రామానికి తెలియకుండా దాచిన విషయం ఏమిటంటే, ఎవరో ఒక అమ్మాయి ఎలాగా నచ్చేస్తుంది కనకా, హీరోగారు ఉండేది రెండువారాలే కనకా, ముహూర్తం పెట్టేసి అన్నీ సిద్ధంగా పెట్టుకున్నారు. రామం సరే అనగానే మూడు ముళ్ళూ వేయడానికి అన్నీ రడీగా ఉన్నాయి. అలా హీరోగారికి చటుక్కున పెళ్ళైపోయింది. ఓ నాలుగు నెలలు కొత్త దంపతులు చిలకా గోరింకాలాగా టింగురంగుమంటూ తిరగడం అయ్యాక గోరింకకి చిలక గురించి మరింత సమాచారం తెల్సింది. అమ్మగారు శ్రీదేవి అంతకుముందు ఎమ్. ఏ చేసారు, హిస్టరీలో. ఆవిడకి లెక్కలన్నా సైన్సు అన్నా పరమరోత. అయితే కంప్యూటర్ కోర్స్ చెస్తే ఉద్యోగం వస్తుంది కదా? అలా అమెరికాలోనే స్నేహితుల ప్రోత్సాహంతో మరీ ప్రోగ్రామింగ్ కాదు కానీ టెస్టింగ్ లో శిక్షణకి చేరారు. అదయ్యాక ఓ సర్టిఫికేషన్ పాస్ కావాలి ఉద్యోగం కావాలంటే.

ఇక్కడే వచ్చింది అసలు ప్రోబ్లెం. సర్టిఫికేషన్ పాస్ అవ్వాలంటే పుస్తకాలు చదవాలి. ఉన్న సాఫ్ట్ వేర్ ఇంట్లో ప్రాక్టీస్ చేయాలి. అసలు టెస్టింగ్ అంటే ఏమిటి, ఎందుకు చేస్తారు చేసాక రిపోర్ట్ ఎలా రాయాలి అనేవి అర్ధం కావాలి. అవి నేర్చుకోవడానికి కష్టపడాలి. అయితే దేవిగారికి ఇదంతా ఇష్టం లేదు. కోర్సులు చేసేటపుడు ఏవైనా డౌట్ వస్తే రామం చెప్పేవాడు తనకి తెల్సున్నంతలో. అయితే సర్టిఫికేషన్ పరీక్షలో మొగుణ్ణి పక్కన కూర్చోనివ్వరు కనక మొదటిసారి పోయింది పరీక్ష. అలా రెండోసారి ప్రయత్నానికి సిద్ధపడ్డారు. అమ్మగారికి టివిలో కాటుకతల్లీ, కుంకుమరేఖా అనేటువంటి సీరియల్స్ చూడడానికి ఉన్న ఇంటరెస్టు పరీక్షమీద లేదు. అన్నింటికన్నా కష్టం రిపోర్ట్ రాయడం టెస్టింగ్ అయ్యాక. ఆ రిపోర్ట్ కి కాస్త ఇంగ్లీషు బాగా వచ్చి ఉండాలి. పటేల్ లో ఎవరో కనబడినప్పుడు, గుళ్ళో మరో గుజరాతి కనిపించినప్పుడూ 'వాట్ అర్యూ టాకింగ్' అన్నట్టు రిపోర్ట్ రాయడం కుదరదు కదా? మరో రెండు సార్లు పరీక్షకి కూర్చున్నాక తెలిస్న విషయం అమ్మగారి పరీక్ష స్కోరు దక్షిణ దిశలో పరిగెడుతూ ఉంది. అలా మొత్తానికి ఆ ఉద్యోగం దొరకడంకష్టమైనప్పుడు ఇంక ఇంట్లోనే ఉండడం నేర్చుకున్నారు.

ఈ కంప్యూటర్ పర్వం తమకి కుదరదని తెలియగానే మరో దానికోసం చూడ్డం మొదలు పెట్టారు దంపతులు. హెల్త్ కేర్ అయితే ఉద్యోగం వస్తుంది ఏదో ఒకటి. కానీ శ్రీదేవి చేసినది ఎమ్ ఏ హిస్టరీ. ఆవిడకి సైన్స్ అంటే రోత కదా? నర్సింగ్ కష్టం. నాలుగేళ్ళు చేయాలి కోర్సులు. అప్పుడు ఊళ్ళో కమ్యూనిటీ కాలేజ్ లో కనిపించిన కోర్సు అల్ట్రాసౌండ్ ఒకటీ, ఎక్స్ రే కోర్సు ఒకటీను. మళ్ళీ ఇవి పాసయ్యాక సర్టిఫికేషన్ చేయాలి. ఆ కాయితం రాకపోతే ఉద్యోగం రాదు గాక రాదు. శ్రీదేవి జేరతానన్నా ఈ సారి రామం వద్దనేసాడు ఈ గుంజాటనం. ఎందుకంటే ఇప్పటికే సర్టిఫికేషన్ విషయంలో ఏమైందో తెలిసి వచ్చింది కదా? అలా ఆ రెండు కోర్సులూ కూడా పోయాక మళ్ళీ అమ్మగారు హోమ్ కమింగ్.

ఈ తతంగం అయ్యేసరికి ఇద్దరు పిల్లలు పుట్టుకొచ్చారు. దానితో బాటే ఏళ్ళు గడిచాయి కనక ఇప్పుడు రామం, శ్రీదేవీ ఇద్దరు అమెరికా పౌరసత్వం తీసుకున్నారు కూడా. పిల్లలిద్దరూ స్కూల్ కెళ్ళేంత పెద్దయ్యేసరికి మళ్ళీ అమ్మగారికి కాస్త వెసులుబాటు. ఏదైనా ఉద్యోగం చేద్దామనే సరదా. మరోసారి కనుక్కుంటే ఇప్పటికి తెల్సిన విషయం ప్రకారం మరోసారి ఉద్యోగ ప్రయత్నం. అయితే ముందు చేతులు కాలిన విషయం ఇద్దరికీ గుర్తు ఉంది కనక ఈ సారి మరో చిన్నది ఏదైనా చేద్దామనుకుంటున్నప్పుడు తెల్సిన విషయం ప్రకారం. మెడికల్ బిల్లింగ్ అనేది ఒకటి ఉంది. దానితో పాటే మెడికల్ డాక్టర్లకి కేసు విషయాలు రాసిపెట్టడం. బిజీగా ఉండే డాక్టర్లకి మెడికల్ కేసుల విషయాలు రాసేంత టైమ్ ఉండదు కదా? దాన్ని పక్కనే ఉన్న వాయిస్ రికార్డర్లో చెప్పేస్తారు. ఆ వాయిస్ రికార్డింగ్ విని దాన్ని తప్పులు లేకుండా కాయితం మీద టైప్ చేసి ఫైల్ చేయాలి. ఇందులో మరో తంటా. డాక్టర్ గారు చెప్పిన విషయాలు ఒళ్ళు దగ్గిరపెట్టుకుని రాయాలి – స్పాండిలోసిస్ అనేదాన్ని స్పాంజ్ లైసిస్ అని రాస్తే అర్ధం మారిపోగలదు. అలాగే స్టెర్నో క్లియో మాస్టాయిడ్ అనేదాన్ని సరిగ్గా రాయాలి. ఈ విషయాలకి కాస్త తప్పులు చూసే సాఫ్ట్ వేర్ ఉన్నా అసలనేది రాయగలగాలి కదా ముందు? ఏదైతేనేం మొత్తానికి శ్రీదేవి ఈ వాయిస్ రికార్డింగ్ తనకి పనికొస్తుందనుకుని అందులో జేరింది. కోర్సు అయ్యాక మళ్ళీ సర్టిఫికేషన్ కి వెళ్ళినప్పుడు ఈ సారి కాస్త నయం. రెండోసారి సర్టిఫికేషన్ వచ్చింది.

అది పట్టుకుని ఉద్యోగం వేటలో పడ్డాక తెల్సిన విషయం, ఇటువంటి ఉద్యోగాలకి దేశీయులని అంత తేలిగ్గా తీసుకోరు. మనకి ఇంగ్లీష్ వచ్చినా ఉచ్చారణా అదీ వేరు కదా? మొత్తానికి ఓ ఆరు నెలలు కష్టపడ్డాక ఓ హాస్పిటల్లో ఉద్యోగం ఇస్తారుట. అదీ ప్రొబేషన్ మీద. ఆరునెలలు చూసి పని బాగుంటే మరో ఆరునెలలూ, తర్వాత ఏడాదీ అలా కొంచెం కొంచెం పొడిగిస్తారు. అప్పటికి తెల్సిన విషయాల ప్రకారం అమెరికా అనే ఈ దేశం లో దేశాధ్యక్షుడితో సహా ఎవరికీ 'పెర్మనెంట్' అనే ఉద్యోగం లేనే లేదు. అధ్యక్షులవారికి నాలుగేళ్ల కంట్రాక్టు. ఆయన సరిగ్గా ఆ నాలుగేళ్ళూ వెలిగిస్తే మరో నాలుగేళ్ళు లేదా స్వంత గూటికి పోవడమే. ఈ విషయం అర్ధమయ్యాక ఉద్యోగంలో చేరింది శ్రీదేవి.

మూడు నెలలకి హాస్పిటల్ వారికి తెలిసి వచ్చిన విషయాల ప్రకారం – ఈవిడ పనివేళలకి సరిగ్గానే వస్తుంది కానీ తోటి వారితో కబుర్లు చెప్పడానికీ, మన ఇండియన్ వంటలు తనతో పనిచేసేవారికి రుచి చూపించడానికీ ఉన్న ఉత్సాహం అసలు పనిలో లేదు. తనకి నచ్చినట్టు ఏదో టైప్ చేసి పారేస్తుంది ఆ వాయిస్ రికార్డర్లో డాక్టర్లు చెప్పినవి. కొత్త విషయాలు నేర్చుకోవడానికి పెద్ద ఇష్టం ఉండదు. అక్కడకీ రెండు మూడు సార్లు డాక్టర్లూ, తోటి మేనేజరూ చెప్పిచూసారు కానీ ఈవిడకి ఆ పని అలాగే చేయడం చేతనౌను. అలా మొదటి ఆరునెలలూ, మరో మూడు నెలలూ చూసాక ఉద్వాసన చెప్పేరు ఈవిడకి. మరోసారి స్వంత గూటికి చేరేసరికి అసలు నిజం అవగతమైంది చిలకా గోరింకలకి. ఈ దేశంలో వళ్ళు వంచి పనిచేయాలి. మరోదారి లేదు.

ఈ సరికి పిల్లలిద్దరూ కాలేజీలకి జేరారు. ఖాళీ గూట్లో చిలకాగోరింకలు మళ్ళీ ఒక్కరే కనక రామం పనిచేస్తూనే ఉన్నాడు. ఇంటావిడ తన సీరియల్సూ టివి ప్రోగ్రాములూ చూస్తూనే ఉంది. అయితే రామానికి మాత్రం అర్ధం కాని విషయం ఒకటుంది. కార్తీక దీపం, కాటుక కన్నూ అనే సీరియల్స్ లో ప్రతీ నటీమణీ మాట్లాడే ప్రతీ వాక్యం గుర్తుండే అమ్మగారికి మెడికల్ వొకాబ్యులరీ కానీ కంప్యూటర్ విషయాలు కాని ఎందుకు గుర్తుండవా అనేది. ఈ గుర్తుండకపోవడం వల్లే ఆవిడ సర్టిఫికేషన్ పాస్ అవడం కుదర్లేదు కదా? ఉత్తరోత్తరా ఎప్పుడో ఓ సారి చటుక్కున వెలిగిన లైట్ ప్రకారం రామానికి ఈ విషయం లో కాస్త క్లారిటీ వచ్చింది. మనకి ఏ విషయం అయితే ఇష్టమో అవే మన బుర్ర గుర్తు ఉంచుకుంటుంది. మిగతావాటిని అది ఎప్పటికప్పుడు ఏరి పారేస్తూ ఉంటుంది. ఏమైనా అమెరికా వాడు చెప్పేది అదే కదా? జీవితంలో మీకేది ఇష్టమో అదే కోర్సు, అదే విద్యా నేర్చుకోండి. అక్కడే మనకీ అమెరికావాడికీ తేడా. మనకి ఏ కోర్సులో సీటు వస్తే అందులో చేరడం అలవాటు. అందువల్ల హిస్టరీలో ఎమ్ ఏ చేసినా ఇంజినీరింగ్ లో పి హెచ్ డి చేసినా మనకి ఇష్టం ఉండి చేసామా అనే విషయం మనకెప్పటికీ కొరకరాని కొయ్యే.

***[దయచేసి గమనించండి – ఈ కథలో రామం, శ్రీదేవి ల కారెక్టర్లు ఒకరికొకరు మారినా కథ ఇలాగే ఉంటుంది.]***

*నీతిః రెండు మూడు కోర్సులు చే(సే)యగానే ఉద్యోగం రాదు. మీ జ్ఞానం, మీరెంత గుర్తుంచుకోగలరూ, ఎలా ఉపయోగించగలరూ అనేదాని మీద మాత్రమే మీకు ఉద్యోగం రావచ్చు, వచ్చిన ఉద్యోగం నిలుపుకోగలరు.*

## మానసిక వేదన

**అట్లాంటా సబర్బ్ మరియెటా** ఇంట్లో ఉన్న డాక్టర్ గారిఫోను మోగింది. అమ్మగారు లీలావతి ఉరఫ్ లైలా గారు గైనకాలజిస్టు, అయ్యగారేమో కిషన్ రావు గారు చేసేది మామూలు ఏ స్పెషాలిటీ కాని డాక్టర్. అనగా ప్రైమరీ కేర్ ఫిజీషియన్ లేదా పిసిపి. మరీ కృష్ణారావు అనడం అమెరికాలో కష్టం కనకా, అమ్మగారి పేరు కాస్త మోడర్న్ గా ఉంటే బాగుంటుంది కనకా ఇరవై ఏళ్ల క్రితం అమెరికా వచ్చిన వీరు ఇప్పుడు లైలా, కిషన్ గా రూపాంతరం అన్నట్టూ పేరాంతరం లేదా నామాంతరం చెందారు. ఇద్దరబ్బాయిలు బాగా చదువుకుంటున్నారు. అందులో పెద్దబ్బాయికి యూనివర్సిటీలో సీటొచ్చింది. మరీ ఇక్కడా అక్కడా కాదు, హార్వార్డ్ లో. అక్కడకి పంపించే ముందు గత పదేళ్లుగా వాడి చెవిలో ఊదుతున్న మంత్రం మరోసారి చెప్పారు తల్లీ తండ్రీను – అమెరికాలో డాక్టర్ ఉద్యోగం కంటే మంచిది మరోటి ఏదీ లేదు, ముందు ఉండబోదు. అందువల్ల కుర్రాడు చేయాల్సినది ముందు బయాలజీ, లేదా కెమిస్ట్రీలో ఒక డిగ్రీ. ఆ నాలుగేళ్ళూ అయ్యేలోపుల టెస్టు రాస్తే మెడికల్ కాలేజీ. అక్కడ నాలుగేళ్ళు ముక్కుమూసుకుంటే మరో రెండు మూడేళ్ళు రెసిడెన్సీ ఆ తర్వాత ఆకాశమే

హద్దు డబ్బులకి. స్వంతంగా షాపు పెట్టుకోవచ్చు, పెద్ద హాస్పిటల్లో జేరవచ్చు లేదా అట్లాంటాలోనే తమకున్న ప్రాక్టీస్ అందిపుచ్చుకోవచ్చు.

కుర్రాడి మనసులో ఏముందో కానీ పైకి మాత్రం సరే సరే అనేసి బోస్టన్ వెళ్ళిపోయాడు. అక్కడ మొదటి రెండేళ్ళూ ఏమీ స్పెషలైజేషన్ లేదు కనక ఏవో కోర్సులు చేస్తున్నాడు. నవంబర్ లో థేంక్స్ గివింగ్ కీ, డిసెంబర్ లో శెలవలకీ వచ్చినా వేసవిలో మాత్రం మరో కోర్సూ, మరో రీసెర్చీ చేస్తాట్ట, అందువల్ల ఇంటికిరాడు. రెండేళ్ళు అలాగే గడిచాయి. ఇంటికొచ్చినప్పుడల్లా డాక్టర్ దంపతులు కుర్రాడికి డాక్టర్ చదువే ముఖ్యమనే మంత్రోపదేశం మానలేదు. వాడూ వినడం మానలేదు. మూడో ఏడు వచ్చాక ఓ శెలవుల్లో కుర్రాడు చెప్పాడు, "వచ్చే వేసవిలో మాకు ఒక ఉచిత కేంప్ ఉంది దక్షిణ కొరియాలో, అక్కడ మూడునెలల పాటు ఓ కోర్సుకి యునివర్సిటీ వారు డబ్బులూ అవీ ఏర్పాటు చేస్తున్నారు. నేను సెలక్ట్ అయ్యాను."

డాక్టర్లు కంగారు పడ్డారు ఒక్కసారి కొరియా అనేసరికి. ఏమిటీ ఎందుకూ అనేవి విన్నా మనసు కుదుటబడలేదు. యూనివర్సిటీకి ఫోన్ చేసి కనుక్కున్నారు. ఇదో మామూలు అమెరికా/ఫారిన్ యూనివర్సిటీలలో జరిగే అతి మామూలు తతంగం. ఇటునుంచి అటూ, అటునుంచి ఇటూ అలా పిల్లకాయల్ని పంపిస్తూ ఉంటారు. కోర్సుల్లో ఏదైనా నేర్చుకుంటారా అనేది పక్కనపెడితే, మరో దేశం వెళ్లడం వల్ల లాభం అనీ, మనోవిస్తారత వస్తుందనీ చెప్తారు. ఈ మనో విస్తారత కోసం వెరే దేశం వెళ్ళాలా అనేది పట్టించుకోక పోతే మొత్తానికి ఈ కోర్సు అంత ప్రమాదమైనదేవీ కాదు కనక సరే అనక తప్పని పరిస్థితి. అయితే డాక్టర్లకి తెలియని విషయం మరోటి ఉంది. వీళ్ళు కనక ఈ కొరియా ట్రిప్పుకి నో అంటే ఏం చెప్పాలో కుర్రాడు సమాధానం సిద్ధం చేసుకునే వచ్చాడు. అదృష్టం కొద్దీ అది చెప్పాల్సిన అవసరం రాలేదు, కుర్రాడికి.

మూడో ఏడు వేసవి గడిచింది. కుర్రాడి గ్రేడ్స్ మరీ అంత నాసిరకంగా లేవు కానీ వీక్ అని చెప్పుకోవాల్సిందే. మొదటి సంవత్సరంలో యూనివర్సిటీ ఇచ్చినన్ని డబ్బులు ఇప్పుడు ఇవ్వరుట – గ్రేడ్స్ అంత బాగోలేవు కనక. డాక్టర్లకి ఏమీ ఫర్వాలేదు ఈ విషయంలో. మిగిలినది ఒక్కఏడే కదా అని ఒకటీ, అదీగాక డాక్టర్లుగా తాము సంపాదిస్తున్నారు కనక కుర్రాడికి ఇవ్వగలరు. నాలుగో ఏడు ఇంక మెడికల్ కాలేజీ కి టెస్టు రాయాలనగా కుర్రాడు చెప్పాడు తనకి ఇంక మెడికల్ కాలేజీ అంటే ఏమీ ఇష్టం లేదుట. సైకాలజీలో ఏదో డిగ్రీ చేస్తాట్ట. డాక్టర్లకిద్దరికీ వళ్ళు మండిపోయింది. కూర్చోబెట్టి వార్నింగ్ ఇచ్చారు. సైకాలజీలో డిగ్రీ చేస్తే ఏ వుద్యోగం రాదనీ, మహా వస్తే గిస్తే ఏదో యాభైవేలు వచ్చే గవర్నమెంటు గుమాస్తా గిరీలాంటిది రావచ్చనీ. నయానో భయానో ఇంత చెప్పాక కూడా కుర్రాడు ఒప్పుకోనప్పుడు చివరి వార్నింగ్ ఇచ్చారు. మెడికల్ కాలేజీలో జేరకపోతే తమ దగ్గిర్నుంచి ఒక్క పైసా కూడా రాదు మర్నాటినుండి. ఎప్పుడో కాదు మర్నాటి నుండీను. అలా భయపెట్టి దగ్గిరుండి మరీ ఈ మెడికల్ కాలేజీ టెస్టుకి రిజిస్టర్ చేయించారు. కుర్రాడు భయపడ్డాడని చెప్పుకోవాల్సిందే. డబ్బులివ్వరనే భయం ఒకటీ, తనకి యూనివర్సిటీ నుంచి వచ్చే డబ్బులు తగ్గడం మరోటీ కారణాలేమో.

కుర్రాడు "ఈ టెస్ట్ నేను చేయలేనేమో" అనేసరికి లైలాగారి సలహా అద్భుతంగా పనిచేసింది. కోచింగ్ కి ఏర్పాటు చేస్తారు. పర్సనల్ కోచింగ్ కొంచెం ఎక్కువే ఖరీదు. అయితేనేం, తల్లీ తండ్రీ ఇస్తామన్నారుగా డబ్బులు? అలా కిందా మీదా పడి నాలుగో సంవత్సరం అవుతూంటే ఈ పరీక్ష పాసయ్యాననిపించాడు కుర్రాడు. వచ్చిన మార్కులకి మరీ అంత పెద్ద కాలేజీలో సీటు రాదు కానీ ఏదో ఫ్లోరిడాలో స్కూల్లో సీటొచ్చింది. నాకు ఇష్టం లేదంటూనే చేరాడు – తప్పదన్నట్టూ. అప్పటికి అలా గడిచిపోయింది. ఒకసారి మెడికల్ కాలేజీలో జేరిపోయాడు కనక ఇంక ఏమీ ఢోకాలేదు నాలుగేళ్ళు ముక్కుమూసుకుంటే డిగ్రీ గారంటీ. ఆ తర్వాత రెండో మూడో ఏళ్ళు రెసిడెన్సీ. టట్టడాం!

కుర్రాడి మెడికల్ కాలేజీ రెండో ఏడు అయి మూడో ఏళ్ళో ఉన్నప్పుడు డాక్టర్ గారికో ఫోనొచ్చింది మెడికల్ కాలేజీ నుంచి, ఎమర్జన్సీట, ఓ సారి వెంఠనే వచ్చి కలుసుకోమని. తల్లీ తండ్రీ ఉరుకులు పరుగులమీద బయల్దేరారు. మెడికల్ కాలేజీలో ఉన్న కౌన్సిలర్ ట ఎవరో ఒకావిడ లోపలకి పిల్చి చెప్పింది, "మీ అబ్బాయి, రోహిత్ రావు డిప్రసెంట్స్ అతిగా వాడుతున్నాడుట. క్రితం వారం తానుండే అపార్ట్ మెంట్ బయట తెలివి లేకుండా పడి ఉంటే ఎవరో హాస్పిటల్లో జేర్పించారు. మీ కుర్రాడికేమైనా మానసిక రోగాలు ఉన్నాయా?" డాక్టర్లిద్దరూ ఆశ్చర్యపోయేరు. తమ కుర్రాడు అఖండమైన తెలివితేటలు గలవాడనీ, అసలు ఇటువంటి మందులు వాడుతున్నట్టు తమకి తెలినే తెలియదనీ చెప్పాక కుర్రాణ్ణి చూడ్డానికి హాస్పిటల్ కి వెళ్ళారు. మూడునెలల క్రితం చూసిన తమ అబ్బాయి రోహిత్ వేరు. ఇప్పుడు మంచంమీద ఉన్న బొమికల పోగు వేరు. అక్కడ డాక్టర్ తో మాట్లాడాక ఆయన ఇద్దరినీ పక్కకి వేరే గదిలోకి తీసుకెళ్ళి చెప్పాడు, "ఈ అబ్బాయి ఆరోగ్యం బాగుపడ్డానికి కనీసం ఆరునెలలు పడుతుంది. ఆయన వాడిన డిప్రసెంట్స్ అవీ అలవాటు మానిపించడానికి ముందు థెరపీ అవీ అత్యంతావశ్యకం. అన్నింటికన్నా అర్జంటు, కుర్రాడికి కాస్త ఆరోగ్యం బాగుబడి లేచి తిరగ్గానే ఓ సైకాలజిస్టుకి చూపించండి. మానసికంగా అసలు బాగోలేదేమో, లేకపోతే ఇలా డిప్రసెంట్స్ అతి ఎక్కువ డోసుల్లో వాడే అవసరం రాదు.

ఆ తర్వాత తెలిసిన విషయాలు మరింత విస్మయ పరిచాయి అట్లాంటా డాక్టర్లని. రోహిత్ పెద్దయ్యి ఇరవై రెండేళ్ళు దాటగానే తమ మెడికల్ ఇన్సూరెన్స్ మీద లేడు. వాడికో వేరే ఇన్సూరెన్స్ కంపెనీ ఉంది. అందువల్ల వాడు చూసే డాక్టర్ల గురించి గానీ, వాడు వాడే మందుల గురించి గానీ తల్లికీ తండ్రికీ తెలియడంలేదు. ఓ సారెప్పుడో తల్లికీ తండ్రికీ చెప్పడానికి ప్రయత్నం చేసాడు – తనకి ఈ మెడికల్ కాలేజీ ఇష్టం లేదనీ మానేస్తాననీ అసలు ముందే జేరనంటే బలవంతంగా జేర్పించారనీ తన మానసిక స్థితి బాగోలేదనీ చెప్పబోయేడు కానీ ఇండియాలో చదువుకున్న డాక్టర్లు దీన్ని సులభంగా తీసిపారేసి చెప్పేరు వాడితో – "నువ్వు మెడికల్ కాలేజీ పూర్తి చేయకపోతే నీకూ మాకూ ఇంకేమీ కనక్షన్ లేదు." అమెరికా పిల్లాడైతే – పోతే పొండి అనేవాడేమో తల్లీతండ్రీతో కానీ చిన్నప్పటినుండీ తల్లీ తండ్రీ పెట్టిన భయంతో పెరిగిన కుర్రాడికి మరింత భయం తోడైంది. ఏదోలాగా నెట్టుకొచ్చాడు కానీ మెడికల్ కాలేజీలో ఉండే ప్రెషర్ కి తట్టుకోలేక డిప్రెసెంట్స్

వాడ్డం మొదలుపెట్టాడు. ప్రెషర్ ఎక్కువయ్యే కొద్దీ మందుల వాడకం ఎక్కువైంది. అలా కిందకి జారుతున్నా ఎప్పటికీ, ఎవరికీ పైకి చెప్పుకోలేక చివరకి ఇలా అయింది పరిస్థితి.

వళ్ళు జలదరించింది అట్లాంటా డాక్టర్లకి. మర్నాడు వెళ్ళిపోవాలనగా మరోసారి సైకాలజిస్టు ఇద్దరు డాక్టర్లనీ తన గదిలోకి పిల్చి చెప్పాడు, "మీ కుర్రాడికి విశ్రాంతి అవసరం. మీరు మెడికల్ కాలేజీ అంటూ బలవంతంగా రుద్దడం వల్లే ఇలా తయారయ్యానని మాతో చెప్పేడు. దీనికి రికార్డ్ ఉంది. అందువల్ల ఇప్పుడు చెప్పేది ఏమిటంటే కుర్రాణ్ణి ఇంటికి తీసుకెళ్ళండి, కాస్త లేచి తిరగ్గానే. మీ ఇష్టాఇష్టాలు కుర్రాడి మీద రుద్దకుండా అతనికేది ఇష్టమో కాదో కనుక్కుని అలా చేయండి. ఓ ఏడాది పాటు చూసాక మళ్ళీ మెడికల్ కాలేజీ కి వస్తానంటే కాలేజీ ఒప్పుకోవచ్చు. ప్రయత్నించండి. ఇప్పుడు కానీ మీరు ఇద్దరూ మరీ మొండికెత్తితే కుర్రాడి ప్రాణానికే ప్రమాదం…"

ఇంకా ఏదో చెప్పబోతున్న సైకాలజిస్ట్ ని అడ్డుకుని కిషన్ రావు అన్నాడు, "మేమూ డాక్టర్లమే, ఇండియాలో పేరు మోసిన మెడికల్ కాలేజీలలో చదువుకున్నాం. మాకేమీ మానసిక రుగ్మతలు లేవు మెడికల్ కాలేజీలో. వీడికెందుకిలా అయిందో?" సైకాలజిస్టు చెప్పాడు, "మీ జీవితం వేరు, మీరు చదివిన దేశం వేరు, మీ ఇంటరెస్టులు వేరు. మీకు నచ్చినది మీ అబ్బాయికి నచ్చాలని లేదు. మీకెప్పుడైనా మెడికల్ కాలేజ్ అంటే తనకి ఇష్టం లేదని చెప్పబోయేడుట. మీరిద్దరూ వినిపించుకోలేదనీ మెడికల్ కాలేజ్ పూర్తిచేయకపోతే మీకూ అతనికీ ఏమీ సంబంధంలేదనీ చెప్పార్ట కదా? అదృష్టం కొద్దీ మీ కుర్రాడి ప్రాణం పోలేదు. అతనిచ్చిన స్టేట్ మెంట్ ప్రకారం తన ప్రస్తుత పరిస్థితికి కారణం మీరిద్దరూను" – తన దగ్గిరున్న ఫైల్ చూపిస్తూ రోహిత్ చెప్పినది రికార్డ్ చేసామని చూపించడానికా అన్నట్టూ చెప్పాడు సైకాలజిస్టు. "అతను కానీ చనిపోయి ఉంటే లీగల్ కేసు వచ్చి ఉండేది మీ మీదకి. జాగ్రత్తగా ఉండండి," ఇంక చెప్పడానికేమీ లేదన్నట్టూ లేచాడు సైకాలజిస్టు.

తామెంత కష్టపడినా, ఎన్ని డబ్బులు పోసి చదివించినా తమ కుర్రాడిలా ఎందుకయ్యాడో తెలియక మాడిపోయిన మొహాలతో బయటకొచ్చి కార్ పార్కింగ్ కేసి బయల్దేరారు తమ స్వంత కొడుకు ఆరోగ్యం తమ చేతులతో పాడుచేసి, అది కుదర్చలేని – అట్లాంటాలో పేరు మోసిన, డాక్టర్ లైలా కిషన్ రావు లు.

*నీతిః మానసిక వైద్యం కావాల్సింది మీ పిల్లలకి కాదు. మీకు.*

# అరువు కారు

**డిసెంబర్లో శెలవులకి** రామ్మూర్తి పెళ్ళాం పిల్లల్తో చలి తప్పించుకోవడానికి వర్జీనియా నుంచి ఫీనిక్స్ అరిజోనాలో ఉన్న చుట్టం ఇంటికి బయల్దేరాడు. వెళ్ళేటప్పుడు అనేకసార్లు ఫోన్ చేసాడు కూడా వాళ్ళకి వీలౌతుందో లేదో అన్నీ కనుక్కోవడానికి. అన్నీ సర్దుకున్నాక విమానం ఎక్కి వారం, పదిరోజుల వెకేషన్ కి బయల్దేరారు. ఫీనిక్స్ లో ఉన్న చుట్టాలకి కొన్ని బహుమతులూ అవీ కొని పట్టుకెళ్ళారు కూడా.

ఎయిర్ పోర్ట్ లో దిగాక వీళ్ళని ఇంటికి తీసుకెళ్ళడానికి వచ్చిన చుట్టాన్ని అడగనే అడిగాడు రామ్మూర్తి – తానో కారు అరువు తీసుకుంటే మంచిదేమో అని. రెండు కుటుంబాలు ఒకే కార్లో పట్టడం కష్టం కదా? అయితే చుట్టం అయిన విశ్వేశ్వర్రావు ఉరఫ్ విషి గారు చెప్పడం ప్రకారం ఆయనకి రెండు కార్లున్నాయి. ఒకటి పెద్ద వేన్ ఎనిమిదిమంది కూర్చోగలిగేది. రెండోది వాళ్ళావిడకున్న అయిదుగురు కూర్చోగలిగే కారు. వేరే మూడో కారు తీసుకోవడం డబ్బులు దండగ. ఎలాగా శెలవుల్లో ఎక్కడకీ వెళ్ళేది లేదు కనక మరో కారు వద్దని ఆయన చెప్పాక విషి గారింటికి వెళ్ళారు.

రామ్మూర్తి అయితే అమెరికా వచ్చి పదేళ్ళే అయింది కానీ విషి గారొచ్చి పాతిక దాటుతోంది. అందువల్ల ఆయన ఇల్లు పెద్దది, డబ్బూ దస్కం పెద్దవీ అని ఆయన వేన్, ఆయన ఇల్లూ, ఇల్లు ఉన్న ప్రదేశం అన్నీ చెప్పకనే చెప్తున్నాయి. ఇంటికెళ్ళాక భోజనాలు చేసి శెలవుల్లో ఏం చేయాలో ప్లాన్ వేసుకున్నారు. దాని ప్రకారం ఓ రోజు ఊరు చూడ్డం. ఊరు చూడ్డం అంటే అదేలెండి ఊర్లో ఉన్న గుడీ, పటేల్ వారి పచారీ కొట్టూ, అక్కడ కనిపించే వాటి ధరవరలూ వాటిని తమ వర్జీనియాలో దొరికేవాటితో పోల్చి చూసుకోవడం, అవయ్యాక ఊర్లో మరి కొన్ని చారిత్రాత్మక కళాఖండాలు చూడ్డం వగైరా. పనిలో పనిగా దేశీవారి రెస్టారెంట్లో భోజనాలు. ఇవన్నీ అయ్యాక ఎప్పట్లాగే రాత్రి ఇంట్లో ఓ తెలుగు సినిమా, అందులో హీరో చొంగ కార్చుకుంటూ హీరోయిన్ దగ్గిర పాటలు పాడ్డం, ఆ మహేష్ బాబు ఇలా చేయి ఎత్తగానే రెండు మూడు బిల్డింగులు కూలిపోవడం, ఇద్దరు జమాజెట్టీ బాడీ బిల్డర్ లాంటివాళ్ళు మూడు గిరికీలు కొట్టి కింద ఎముకలు విరిగి పడడం – ఆ పడడం అందరికీ సరిగ్గా కనిపించడానికి స్లో మోషన్ లో చిత్రీకరణ, ఓహ్ ఏం చెప్పమంటారు – శెలవులు గడపాలంటే ఇంతకన్నా మంచిదేవుంది?

క్రిస్టమస్ నాడు రామ్మూర్తి విషీ గారికి వాళ్లావిడకీ తాము పట్టుకొచ్చిన ఖరీదైన – అంటే విలువ నూట యాభై డాలర్ల కంటే ఎక్కువైనదే – బహుమతి ఇచ్చాడు. విషీగారు నొచ్చుకున్నారు ఇలా ఇచ్చినందుకు. ఆయన ప్రకారం ఈ వయసులో ఆయనకి అసలు బహుమతి ఇవ్వడం అనవసరం కదా, పిల్లలున్న రామ్మూర్తి డబ్బులు ఇలా వృధాగా ఎందుకు పాడుచేయడం? ఈ మాటల్లో విషీగారి వాళ్ళావిడ ఈ మాట అన్నందుకు విషీగారి కేసి చుర చురా చూసిందంటే అది రామ్మూర్తి గమనించకపోయినా రామ్మూర్తి వాళ్ళావిడ కంట్లో పడనే పడింది. మొత్తానికి బహుమతి ఇచ్చాక అంతా సంతోషం. ఇచ్చిన బహుమతి వల్లో మరోటో గానీ, విషీగారి వాళ్ళావిడ క్రిస్టమస్ అయిన రెండు రోజులకి అందరం కల్సి గ్రాండ్ కన్యాన్ అనే చోటకి వెళ్దాం అని మొదలుపెట్టింది. విషీగారికి ఎటువంటు గొడవా లేదు ఇందులో, రామ్మూర్తిని గ్రాండ్ కన్యాన్ తీసుకెళ్ళడానిక్కానీ, శెలవుల్లో ఇంటిపట్టున కూర్చోకుండా దేశం మీద తిరగడానిక్కానీ. అయితే ఒకటే చిక్కు వచ్చిపడింది. వెళ్ళడానికి విషీగారి కుటుంబంలో అయిదారుగురు తయారయ్యారు, ఊర్లో ఎవరో స్నేహితులు వస్తానంటే వాళ్లతో కలిపి. ఇటువైపు రామ్మూర్తి కి నలుగురు. తొమ్మిదీ పది మంది ఒక వేన్ లో వెళ్ళడం కష్టం కనక రెండు కార్లు కావాలి. ఒకటి విషీగారు డ్రైవ్ చేస్తారు. రెండోది వాళ్ళావిడ చేయొచ్చుకానీ, రామ్మూర్తి చేయగలడా అనేది విషీగారి ఆలోచన. విషీగారి వాళ్ళావిడే చేస్తుంది కానీ శెలవుల్లో పిల్లలూ కుటుంబం కబుర్లు చెప్పుకుంటే బావుంటుంది కదా మగాళ్ళు డ్రైవ్ చేస్తుంటే అని విషీగారి ఆలోచన. పొద్దున్నే బయల్దేరితే సాయంత్రం వచ్చేయవచ్చు కొంచెం ఆలస్యమైనా.

రామ్మూర్తి కొంచెం బెదిరాడు అవతలి వాళ్ళ కారు తాను డ్రైవ్ చేయాలనే సరికి. ఏం ఫర్వాలేదు, నాకు ఇన్స్యూరెన్స్ ఉంది మీరు డ్రైవ్ చేయండి ఒక బండి వెనక ఒకటి వెళ్తుంది కనక ఏం తేడా వచ్చినా ఒకరికొకరు సహాయం చేసుకోవచ్చు అని విషీగారి భార్య ఉవాచ. రామ్మూర్తి వాళ్ళావిడ కూడా వంత పాడేసరికి రామ్మూర్తికి ఇంక తప్పలేదు. అలా రెండు కుటుంబాలూ పొద్దున్నే లేచి అనుకున్న రోజున బయల్దేరారు. రామ్మూర్తి వాళ్ళావిడా, విషీగారి అర్ధాంగీ, కూడా వచ్చే మరో స్నేహితురాలి తరఫువారు అందరూ తలో చేయి వేసి పులిహారా, పెరుగూ, బండిలో వెళ్తున్నప్పుడు పంటికిందకి జీడిపప్పూ, చిప్సూ వగైరాలు పట్టుకుని. నీళ్ళ సీసాలు ఉండనే ఉన్నై.

వాతావరణం అద్భుతంగా ఉంది అనుకున్నరోజుకి. ఏడింటికి బయల్దేరదామనుకున్నవారు తొమ్మిదైంది బయల్దేరేసరికి. భలేవారే, పులిహార అవీ తయారుచేసేసరికి టైమ్ పట్టదా, ఏడింటికి వెళ్లిపోదాం అనుకుంటే మాత్రం ఎలా కుదురుతుంది? విషీగారు మెర్సిడెస్ వేన్ లో కూర్చుంటే వాళ్ళావిడ ఆయన పక్కసీట్లో, వాళ్ల స్నేహితులు అందులోనే వెనక సీట్లలో. వేన్ వెనకాల విషీగారి రెండో టయోటా కార్లో రామ్మూర్తి కుటుంబం. వెళ్ళేది దాదాపు రెండువందల ముప్పై మైళ్ళు. నాలుగ్గంటలు పట్టవచ్చు. అలా బయల్దేరాక బండి హైవే మీదకి మళ్ళింది. మరో గంటా రెండు గంటలకి 'డాడ్,' అంటూ రామ్మూర్తి కూతురు చిటికిన వేలు చూపించేసరికి దారిలో రెస్ట్ ఏరియా దగ్గిర ఆపడానికి ప్రయత్నం చేసాడు. ఇక్కడ రామ్మూర్తి ఇలా ఆపబోయేంతలోనే విషీగారు జామ్మని వేన్

మీద వెళ్ళిపోయారు ముందుకి. ఇదేమంత పెద్ద విషయం కాకపోయినా ఒకరి వెనక ఒకరు వెళ్దాం అనుకున్న మొదటి సూత్రం తప్పిపోయింది. రామ్మూర్తిక్కూడా ఇదేం పట్టలేదు. ఓ సారి బండి హైవే మీదకి వెళ్ళాక కాసేపటికి ఎలాగా కల్సుకోవచ్చు వాళ్లని లేకపోతే ఎలాగా ఆగుతారు కదా? మహా ఐతే గ్రాండ్ కన్యాన్ దగ్గిరే కల్సుకోవచ్చు.

అల్పాచమానం అయ్యాక బయటకొచ్చి బండి బయటకి తీసి మళ్ళీ హైవే మీద కి వెళ్ళబోతూంటే సడన్ గా పక్కనుంచి అప్పుడే హైవే మీదకి వెళ్ళే పెద్ద ట్రక్ కారు పక్కనుంచి దూసుకుపోయింది. తప్పు రామ్మూర్తిదే ట్రక్ ని చూడకపోవడం. ట్రక్ డ్రైవర్ కి తెల్సిందో లేదో గానీ వాడు ఆపకుండా వెళ్ళిపోయేడు. రామ్మూర్తి మతిపోయినవాడిలా బండి పక్కకి ఆపి కాసేపటికి దిగి చూసాడు. ఎవరికీ దెబ్బలు తగల్లేదు గానీ టయోటా కారు ముందు తలుపూ, వెనక తలుపూ గీరుకుపోయాయి. తలుపులు బాగానే పనిచేస్తున్నా బండి పాడైనట్టే లెక్క. బాడీ షాపుకి తీసుకెళ్తే దాదాపు రెండువేలు వేస్తాడు బిల్లు గారంటీగా – తలుపులు రెండూ తీసి, పాలిష్ చేసి పెయింట్ వేయడానికి. గీరుకుపోయిన గీతలు చాలా అసహ్యంగా కనిపిస్తున్నాయి. ఈ ఏడుపు ఇలా ఉండగానే వెనకనో నీలం ఎరుపు లైట్ కనిపించేసరికి రామ్మూర్తికి ప్రాణం పోయినట్టైంది.

బండి దిగిన పోలీసాయన అడిగాడు ఎలా జరిగిందో. అదయ్యాక తన లైసెన్సూ, ఇన్స్యూరెన్సూ చూపించాలి. బండి తనది కాదు కనక వివరాలు చూసిన పోలీసాయన అడిగాడు, బండి ఎవరిదో, అసలు రామ్మూర్తి ఎందుకు నడుపుతున్నాడో. ఏ కళనున్నాడో కానీ పోలీసాయన రామ్మూర్తి ఏడుపు మొహం చూసాడులా ఉంది, "బండి మీరు ఎత్తుకొచ్చారని అనను కానీ, మీది కానందుకు, ట్రక్ ని చూసుకోకుండా ఇలా నడిపినందుకూ చిన్న ఫైన్ తో పోనిస్తున్నానంటూ' టికెట్ చేతిలో పెట్టి జాగ్రత్తగా నడపమని చెప్పి ఆయన దారిన వెళ్ళాడు. చేతిలో టికెట్ చూసుకుంటే అది మూడువందల నలభై డాలర్లకి. గుండె ఆగినంత పనైంది రామ్మూర్తికి.

మరో రెండో మూడో గంటలు గడిచాక మూడ్ అంతా తగలబడిన రామ్మూర్తి బండి నడుపుతుంటే విషీగారి వేన్ పక్కనే లేన్ లో ఆగి వీళ్ళకోసం వేచి చూడ్డం గమనించి తానూ ఆపాడు. కథంతా చెప్పాక ఆయన తన టయోటా చూసి కాస్త నవ్వూ ఏడుపుతో అన్నాడు, "ఇన్స్యూరెన్స్ ని అడుగుదాం రేపు ఇంటికివెళ్ళాక. మీరందరూ క్షేమంగా ఉన్నారు కదా, ఎవరికీ దెబ్బలూ అవీ లేవు. అదో సంతోషం." ఏమనలో తెలియక రామ్మూర్తి వెర్రిమొహం వేసాడు. రామ్మూర్తి వాళ్ళావిడ మొగుడి తప్పు ఏం లేదనీ ట్రక్ వాడు చూసుకోకుండా రాసుకుంటూ వెళ్ళిపోయినా ఆగలేదనీ విషీగారికీ వాళ్ళావిడకీ సర్ది చెప్పబోయింది. ఏదైతేనేం అలా హైవే మీద ఏడుస్తూ కూర్చోడం కుదర్దు కాబట్టి మళ్ళీ బయల్దేరారు. ఈ సారి ఏమీ కష్టాలు లేకుండా గ్రేండ్ కన్యాన్ చూడ్డం అయింది. ఆ గ్రేండ్ కన్యాన్ చూసి ఎవరెలా సంతోషించినా రామ్మూర్తికి మాత్రం ఏడుపు తప్పలేదు. తప్పు తనదే. మొదట పోలీస్ టికెట్ కి డబ్బులు కట్టుకోవాలి. ఈ బండికి ఎంతవుతుందో రిపేర్ కి రేపటిదాకా తెలియదు. రామ్మూర్తి ఏడుపు మొహం చూసాడు లావుంది విషీ, పక్కకి తీసుకెళ్ళి చెప్పాడు, "రేపు ఇన్స్యూరెన్స్ కి ఫోన్ చేసి అడుగుదాం, మనం కార్ పార్క్ చేసినప్పుడు ఎవరో ఇలా గుద్దేసారనీ మనం చూడలేదనీ చెప్తే వాళ్ళు రిపేర్ చేస్తారు. దానికి కాస్త డిడక్టిబిల్ అనేది కడితే మిగతాది వాళ్ళు ఇస్తారు, ఏమీ కంగారు పడకండి."

"డిడక్టిబిల్ ఎంతండి మీ కారుకి?" రామ్మూర్తి అడిగేడు.

"తెలియదు ఇంటికెళ్లాక చూద్దాం. మహా అయితే వెయ్యి డాలర్లు. అంతే."

గంట ఐదు దాటుతుంటే ఇంటికి బయల్దేరారు. ఇంకేం బాలారిష్టాలు లేకుండా ఇంటికొచ్చాక నిద్ర పట్టనిది రామ్మూర్తికి ఒక్కడికే ఆ రాత్రి. నేను చేయను మొర్రో అంటే తనచేత నడిపించాడు బండి విషీగారు. అదీగాక తాను అద్దెకి కారు తీసుకుంటానంటే ఎయిర్ పోర్ట్ లోనే వద్దన్నాడు ఈయన. ఈ ఆలోచనల్తో నిద్రపట్టక పొద్దునే లేటుగా లేచిన రామ్మూర్తికి విషీగారు చెప్పాడు, "ఇన్స్యూరెన్స్ కి ఫోన్ చేసాను. డిడక్టిబిల్ ఐదు వందలే. అవి కట్టేస్తానంటే ఇప్పుడే చెక్ ఇచ్చేయండి. లేకపోతే మీరింటికి వెళ్లి పంపినా సరే."

వచ్చేటప్పుడు పట్టుకొచ్చిన చెక్ బుక్ తీసి రెండు చెక్కులు రాసాడు రామ్మూర్తి. ఒకటి విషీగారికి రెండోది తనకి పోలీసాయన ఇచ్చిన టికెట్ కీ, ఆ కౌంటీ క్లర్క్ పేరుమీద. హమ్మయ్యా డబ్బులు పోయినా తలమీదనుంచి భారం దిగిపోయాక వెకేషన్ అయిందనిపించి విమానం ఎక్కి వర్జీనియా వచ్చేసారు. దార్లో రామ్మూర్తి వాళ్ళావిడ మొగుణ్ణి సాధించింది – రామ్మూర్తి చుట్టం విషీ గారి గురించి. "ఆయనే మనల్ని డ్రైవ్ చేయమన్నాడు, అద్దె కారు వద్దన్నాడు, మళ్ళీ ఇన్స్యూరెన్స్ కి ఐదు వందలు ఇమ్మన్నాడు' అంటూ.

ఈ సాధింపు ఎక్కువౌతుంటే రామ్మూర్తి చెప్పాడు, "అద్దె కారు తీసుకుంటే దానికిలా అయితే అప్పుడు కూడా దానికి ఇన్స్యూరెన్స్ కట్టుకోవాలి. అసలు విషీగారు ఇన్స్యూరెన్స్ కి చెప్పకుండా మొత్తం రిపేర్ మననే పెట్టుకోమని చెప్తే మూడువేలదాకా అయిండేది. మాట్లాడేటపుడు ఇవన్నీ తెల్సి మాట్లాడు. ఆయన మంచివాడు కనక ఇన్స్యూరెన్స్ మీదకి నెట్టాడు దీన్ని కానీ మరొకరైతే ఏమై ఉండేదో? మనకి ఇందులో మరో విషయం ఏమిటంటే పోలీస్ నన్ను ఎవరికారో ఎత్తుకొచ్చినట్టు అభియోగం పెట్టి జైల్లో పెట్టలేదు. సంతోషించు."

అప్పటిదాకా సాధించిన సాధ్వీమణి ఈ మాట రామ్మూర్తి నోట్లోంచి వినగానే టక్కున నోరుమూసుకుంది.

*నీతిః కారు మీద కానప్పుడు దాని ఓనర్ పక్కన కూర్చుని మిమ్మల్ని డ్రైవ్ చేయమన్నప్పుడు కానీ దాన్ని మీరు ఎన్నడూ, ఎటువంటి పరిస్థితులలోనూ నడపరాదు.*

# రెండింటికీ చెడ్డ రేవడి

**పదో తరగతిలో జేరకముందు** శెలవల్లో తెల్సింది రమణమూర్తి తండ్రికి, తాడికొండలో ఉండే రెసిడెన్షియల్ స్కూలు గురించి. కుర్రాడు చాకులా చదువుతున్నాడు కనక అక్కడ జేర్పిస్తే బాగుంటుందని ఊళ్ళో తెల్సున్నవాళ్ళు చెప్తే అక్కడ జేరడానికి ఉండే టెస్టులూ అవీ కనుక్కుని దగ్గిరుండి అని కాయితాలు నింపి అక్కడ సీటు సంపాదించాడు కొడుక్కి. రమణ సరిగ్గా వెళ్ళాల్సిన రోజుకి మాత్రం గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టూ అయింది తల్లికీ తండ్రికీను. ఉన్న ఇద్దరబ్బాయిలలో, అందులోనూ పెద్ద కుర్రాణ్ణి దూరంగా పంపించేస్తున్నందుకు. అయినా కొడుకు బాగుపడుతుంటే ఏడవడం తప్పు కదా? తాడికొండ హస్టల్ లో కుర్రాణ్ణి దిగబెట్టి మళ్ళీ తెనాలి వచ్చేసాడు. మొదట్లో కాస్త ఏడుపొచ్చినా రెండు మూడు నెలలకి అక్కడ కుర్రాడికీ ఇక్కడ అమ్మానాన్నలకీ అలవాటైంది ఒంటరిగా ఉండడం. ఇంట్లో ఉన్న రెండో కుర్రాడు ఇప్పుడు ఆరో తరగతిలో ఉన్నాడు. తాడికొండలో పెద్ద కుర్రాణ్ణి అక్కడే మేష్టర్లు చూస్తున్నారు.

ఏడాది గడిచాక అటు కుర్రాడికీ ఇటు నాన్నకీ తెల్సిన విషయం ప్రకారం, తాడికొండ వంటి స్కూలే మరోటి ఉంది నాగార్జున సాగర్ లో అక్క రెండేళ్ళు ఇంటర్మీడియేట్ కోసం మళ్ళీ పరుగు, కాయితాలు నింపడం వగైరా. పదో తరగతి పరీక్షల్లో తెల్సిన ఫలితాల ప్రకారం మొత్తం స్కూల్ లో అందరికీ ఫస్ట్ క్లాసే! తాడికొండా, మజాకా? కుర్రాడు ఎడంగా ఉండడం అలవాటైనా తెనాలి నుంచి తాడికొండ దగ్గిరే కనక బాగానే ఉండేది. అనుకున్నట్టే చాకులాంటి మూర్తి నాగార్జునసాగర్ లో తేలాడు. తాడికొండలో సంగతి వేరు. అక్కడందరూ తెలుగు కుర్రాళ్ళే. ఇంగ్లీషు వచ్చినా రాకపోయినా పెద్ద గొడవలేదు. ఇక్కడ జూనియర్ కాలేజ్ అలాకాదు. అనేక చోట్లనుంచి వచ్చిన కుర్రాళ్ళు – అదీ చిన్నప్పట్నుంచీ మమ్మీ డాడీ అంటూ పెరిగిన మరిన్ని చాకులు ఇంగ్లీషు గడ గడా మాట్లాడుతూంటే మూర్తి వెర్రిమొహం వేసుకుని చూడ్డమే. రెండునెలల్లో తెల్సిన విషయం మరోటి. గడగడగా వాగే ఇంగ్లీషొచ్చిన కుర్రాళ్లకి వచ్చినది ఆ ఇంగ్లీషొక్కటే. మిగతా పుస్తకాల్లో విషయాల్లో సినిమాలూ అవీ కబుర్లు చెప్తారు. మూర్తి అలాక్కాదు – అన్ని సబ్జక్టుల్లో మొదటి రేంక్. ఈ విషయం మొదటిసారి పెట్టిన పరీక్షల్లో తెలియగానే మూర్తి తన ఇంగ్లీషుమీద పట్టుకోసం మొదలుపెట్టాడు. మొదటి ఏడు

పూర్తవుతుండగానే జూనియర్ కాలేజీలో బాగా తెల్సిన విషయం మూర్తికి దరిదాపుల్లో ఎవరూ లేరు. ఇంగ్లీషు మాట్లడగల్గుతున్నాడు మరీ అంత అమెరికావాడిలా కాకపోయినా తప్పుల్లేకుండా. పదో తరగతిలో మొదలుపెట్టిన పరుగుపందెం ఇంటర్ రెండో ఏటికి జోరు అందుకుంది, తర్వాత కాలేజీ కోసం.

ఇంటర్ రెండో ఏడు మొదటి మూడునెలల్లో కాలేజీ టీచర్లు చెప్పినది విన్నాక రమణ మూర్తి దృష్టి ఐఐటి మిద పడింది. అక్కడ ఏ బ్రాంచ్ చదవాలా అనేది తర్వాత చూడొచ్చు కానీ మొదట దాని టెస్ట్ పాస్ అవ్వాలి. అది కనక తన్నేస్తే మామూలు ఇంజినీరింగ్ కాలేజీ ఉండనే ఉంది. పరుగుపందెం లో మొదట ఉండాలంటే కొన్ని కోచింగ్ పుస్తకాలు కొనాలి. లేదా సీనియర్ల దగ్గిర పాతవి అప్పుతెచ్చుకోవచ్చు. లైబ్రరీలో ఉన్నవి సరేసరి. కొంతమంది కుర్రాళ్ళు అయ్యేఎస్ కీ దానికీ వెళ్తారేమో కానీ రమణ మూర్తి మాత్రం ఐఐటి మీదే సారించాడు. ఇదంతా తెనాలి లో ఉన్న తల్లికీ తండ్రికీ ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉంది. కుర్రాడు పరుగుపందెం లో బాగా నెట్టుకొస్తున్నాడు కనక వాళ్లకేమీ ఇబ్బంది లేదు. ఇంటర్ పూర్తయ్యేసరికి రమణమూర్తి కి కాన్పూర్ ఐఐటిలో సీటు సిద్ధంగా ఉంది వచ్చిన టెస్టులో మార్కులవల్ల. అలా తెనాలి నుంచి ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడికొండకీ, వంద కిలోమీటర్ల పైన నాగార్జునసాగర్ కీ అక్కడ్నుంచి అనేక వందల కిలోమీటర్ల కాన్పూర్ కి పయనమైపోయాడు పరుగులో రమణ మూర్తి. ఐఐటి లో మరోసారి నాగార్జునసాగర్ సంగతే రిన్స్ అండ్ రిపీట్. అక్కడకొచ్చే కుర్రాళ్ళు క్రీమ్ ఆఫ్ ద కంట్రీ – అందువల్ల తాడి తన్నేవాడి తలకాయ తన్నేవాళ్ళు చాలామంది ఉన్నారక్కడ. రమణ జేరింది తనకి వచ్చిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్ లో. మరోసారి జీవితంలో ఎడతెగని పరుగు పందెం మొదలైంది. మూడో ఏళ్ళో మరో రెండు విషయాలు తెలిసాయి. ఐఐటి లో సీటురావడం కష్టం అనుకుంటాం కానీ దీనికన్నా ఇంకా కష్టాలు మరో రెండున్నాయి. ఒకటి ఐ ఐ ఎమ్ లో ఎమ్ బి ఏ లో సీటు తెచ్చుకోవడం. రెండోది అయ్యేఎస్. ఐఐటిలో పాసైతే ఇంజినీర్ ఉద్యోగం ఎలాగా వస్తుంది కానీ జీతం ఎం బి ఏ తో పోలిస్తే అయిదో వంతు ఉండదు. ఐయ్యేఎస్ అయితే జీతం ఎంతొచ్చినా మొత్తం చేతిలో ఉండే పవర్ ఎక్కువ. ఇంతా కష్టపడి ఇక్కడికొచ్చాక తెల్సిన విషయం ప్రకారం ఐఐటిలో సీటు అంత గొప్ప విషయమేం కాదు – కనీసం ఐఐఎమ్ లో ఎంబియే, కానీ అయ్యేఏస్ కన్నా! అయితే తాను అయ్యేఎస్ కంటే ఎంబియే చేయడమే బాగుండొచ్చు.

పరుగుపందెం ఓ వ్యసనం కనక కాన్పూర్ లో మూడో ఏడు అవుతూండగానే మూర్తి ఐఐఎం కి టెస్ట్ రాసి సిద్ధంగా ఉన్నాడు. ఇలా బి.టెక్ అవగానే అలా కలకత్తాలో ఐఐఎంలో జేరేడు మూర్తి. అక్కడ తెల్సిన విషయం మరోటి. ఎంబిఏ అవగానే పెద్ద అమెరికన్ కంపెనీ ఉద్యోగం ఇస్తుంది ఏమీ ఢోకాలేకుండా. కానీ కొంతమంది అమెరికా డైరక్ట్ గా వెళ్ళి పి హెచ్ డి చేస్తున్నారు. ఈ విషయం తనకి కాన్పూర్ లో ఉండగానే తెల్సినా ఐఐఎం మీద మమకారంతో అమెరికా వెళ్లనేలేదు. అయినా ఇప్పుడు పోయినదేముంది? అదిగో అలా ఎంబిఏ అయ్యే సమయానికి అయ్యగారు అమెరికాలో తేలాడు పి.హెచ్.డి చేయడానికి. పరుగుపందెం ఆగుతుందనుకున్నాడు కానీ అమెరికాలో పి.హెచ్.డి చేస్తున్నప్పుడు తెల్సిన

విషయం ప్రకారం ఏదైనా కంపెనీలో ఉద్యోగం రావడం కష్టం అయితే కాదు అయితే అజయ్ బంగా లాగా ప్రతీ వారికీ అటువంటి ఉద్యోగాలు వచ్చేయవు. వచ్చినా అందులో స్ట్రెస్ తట్టుకోవడం కష్టం. దీనికన్నా కాలేజీలో పాఠాలు చెప్పడం ఉత్తమం. నాలుగేళ్ల పి.హెచ్.డి అయ్యాక అలా డాక్టర్ గా రమణ మూర్తి పరుగు మరోసారి – న్యూ యార్క్ రాష్ట్రంలో ఆల్బనీ అనేచోట ఓ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా ఉద్యోగం. చెప్పేవి మేనేజ్ మెంట్ పాఠాలు. పరుగు నిజంగానే పూర్తైందా అంటే లేదనే సమాధానం ఎందుకంటే ఇప్పటివరకు కేవలం ఇండియా జనాలతోనే పోటీపడిన ఇరవై ఆరేళ్ల రమణ మూర్తి ఇప్పుడు ప్రపంచంలో అన్నిచోట్ల నుంచీ అమెరికా వచ్చే ప్రతిభావంతులతో పోటీపడుతున్నాడు.

టీచింగ్ లో ఉండే కష్టాలు – పీత కష్టాలు పీతవి అన్నట్టూ వేరే. మొదటి మూడు సంవత్సరాల్లో గ్రాంట్లు సంపాదించాలి. కనీసం రెండో మూడో పేపర్లు ప్రచురించాలి. రెండు పేపర్లు ప్రచురించాడు రమణ మూర్తి. అయితే ఎంత కష్టపడినా ఓ ఇరవైవేల డాలర్ల యూనివర్సిటీ గ్రాంట్ తప్ప మరేమీ రాలేదు. దీనిక్కారణాలు అనేకం. రాజకీయాల వల్ల గ్రాంట్లు ఇచ్చే డబ్బులు తగ్గించారు సర్కారు వారు. వచ్చే అప్లికేషన్లకీ ఇచ్చే డబ్బులకీ పొంతనలేదు. కాంపిటీషన్ ఎక్కువైపోయింది. రెండేళ్లు మూడయ్యాక అప్పుడు చెప్పారు యూనివర్సిటీవారు చావుకబురు చల్లగా. ఉద్యోగానికి టెన్యూర్ ఇవ్వడం కుదరదు, మీ డిగ్రీ అద్భుతం, మీ పనితీరు మరింత అద్భుతం, మీరు పాఠాలు కూడా వీర అద్భుతంగా చెప్తున్నారు కానీ మీకు టెన్యూర్ ఇవ్వలేం. చైనా నుంచొచ్చిన మీ కొలీగ్ యాంగ్ లీ గారు మీకన్నా ప్రతిభావంతులు అదీగాక ఆయన మొదట బాచిలర్ డిగ్రీ నుంచి ఇప్పుడు పి.హె.డీ దాకా అంతా మేనేజ్ మెంట్ లోనే చదువుకున్నారు. అలా రమణమూర్తి మొదటిసారి ఓటమి చవిచూసి రోడ్డుమీద పడ్డాడు. మరో ఉద్యోగం అంత కష్టం కాదు కానీ ఓటమి జీర్ణించుకోవడమే అన్నింటికన్నా కష్టం.

ఆ తర్వాత విషయాలన్నీ ఆటోమేటిగ్గా జరిగాయి. రమణమూర్తి ఓ ఫైనాన్స్ కంపెనీలో జేరాడు, 'ప్రోగ్రామ్ మేనేజర్' గా – వాళ్ళు తయారుచేసే కొత్త సాఫ్ట్ వేర్ కి లీడర్ కావాలిట. మరో రెండేళ్ళు గడిచాయి. మార్చ్ నెలలో ఓ రోజెందుకో వంట్లో నలతగా ఉండి, బాగా తగ్గని తలనెప్పితో డాక్టర్ దగ్గిర తేలాడు మూర్తి. అప్పుడు తెల్సిన వివరాల ప్రకారం, రమణమూర్తిగారి సిస్టోలిక్ రక్తపోటు రెండు వందల పైమాటే. డయాస్టోలిక్ కూడా అంత బాగాలేదు, నూట ముప్పై చూపిస్తూ. డాక్టర్ గారు స్ట్రెస్ తగ్గించుకోమనీ రోజూ వ్యాయమం చేస్తూ ఫలానా మందు వాడమనీ చెప్పాడు. ఇంక ఇప్పట్నుంచీ అలా వాడుతూనే ఉండాలిట. ఏదైనా తేడాలొస్తే హార్ట్ ఎటాక్ లేదా స్ట్రోక్ రావచ్చు.

ఓ రెండురోజులు శెలవు తీసుకుని ఇంట్లో తీరిగ్గా కూర్చున్నప్పుడు తనకి వచ్చిన రక్తపోటూ, ఇప్పటివరకూ గడిచిన జీవితావలోకనం చేస్తుకుంటూంటే తట్టిన విషయం ఇదీ. చదువుకుందామనే పరుగుపందెం మొదలుపెట్టిన తాను మిగతావన్నీ మర్చిపోయి పోటీల్లో నెగ్గుతూ వచ్చాడు కానీ దీనికి తాను తన ఆరోగ్యాన్ని పణంగా పెట్టాడు. ఐఐటిలో చదువు అవగానే ఉద్యోగంలో జేరితే తాను మెకానికల్ ఇంజినీర్ గా రాణించేవాడా? ఐఐఎం లో చదవడానికి ఐఐటిలో డిగ్రీ అసలు

అక్కర్లేదు కూడా అయినా తాను పోటీ తత్త్వం వదులుకోలేక ఐఐఎం లో జేరాడు. అక్కడే ఉండి ఉంటే ఏదో ఉద్యోగం వచ్చి బాగానే ఉండేది కానీ అందరిలాగానే అమెరికా అంటూ దిగాడు ఈ దేశంలో. ఇంతా కష్టపడ్డాక కావాల్సిన టెన్యూర్ రాలేదు. తనవల్ల ఐఐటిలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ లో మరో కుర్రాడికి సీటురాలేదు. జేరిన తాను ఆ ఇంజినీరింగ్ బ్రాంచ్ ని వాడుకోలేదు. పోనీ ఎంబిఏ ని వాడుకున్నాడా అంటే అదీ లేదు. అలా తనవల్ల మరో కుర్రాడో కుర్రమ్మో ఐఐఎం లో సీటు మిస్సై ఉండొచ్చు. తనకి తెలియకుండానే కొంతమందిని తొక్కాడు పైకి రాకుండా. ఇప్పుడు పి.హెచ్. డి వల్ల తానో "అతి" విద్యాధికుడు. చేసే ఉద్యోగం మాత్రం మామూలు ఆరునెలలు సర్టిఫికేట్ కోర్స్ చేసి ఐదారేళ్ళు పనిచేసాక వచ్చే సాఫ్ట్ వేర్ మేనేజర్ ఉద్యోగమే.

ఎప్పటికప్పుడు జీవితమనే పరుగుపందెంలో తాను నెగ్గుతున్నాడనుకున్నాడు కానీ తాను ఓడిపోయాడు. మామూలుగా కాదు దారుణంగా – అదీ తన శరీరాన్ని, ఆరోగ్యాన్ని పోగొట్టుకుని. ఓ నిట్టూర్పుతో నిస్త్రాణగా మంచంమీద ఒరిగిపోయాడు డాక్టర్ రమణమూర్తి బి.టెక్ (ఐఐటి), ఎంబిఏ (ఐఐఎం), పి.హెచ్.డి (అమెరికా).

నీతిః జీవితంలో పరుగులు పెడుతూ పోతే అనుభవించేది మీరొక్కరే కాదు, మీ ముక్కూమొహం తెలియని వారు కూడా.

# వెంచర్ కాపిటల్

**అమెరికా వచ్చేముందు** అమోల్ గారు విన్న విషయం – అది లాండ్ ఆఫ్ ఆపర్ట్యునిటీ. డబ్బు సంపాదనకి ఆకాశమే హద్దు. పని చేసేవారికీ, చేయని వారికీ, చేయించుకునేవారికీ కూడా అమెరికా అద్భుతమైన దేశం. అందుకే డిగ్రీ అవగానే పరీక్షలు రాసి ఎమ్. ఎస్ లో సీటు సంపాదించి అమెరికాలో దిగారు అయ్యగారు. చదువుకునే రోజుల్లో డబ్బులు దాచడం అసంభవం కనక ఉద్యోగం రాగానే ఓ సేవింగ్స్ ఎకౌంటూ, ఓ స్టాకులు కొనే ఎకౌంట్ మొదలు పెట్టాడు. నెలకింత అని దాస్తూ షేర్లు కొనడం, అమ్మడమే పని. మొదట్లో ఓ టయోటా కంపెనీ వి, పెప్సి, కోకో కోలా కంపెనీవి షేర్లు కొని దాచుకున్నాక నాలుగేళ్ళు గడిచేయి. స్టాకు మార్కెట్ అప్పుడప్పుడూ కుదేలైనా మళ్ళీ పుంజుకుంటోంది. డబ్బులు పోయినట్టే పోయి మళ్ళీ వస్తున్నాయి. నాలుగేళ్ళ తర్వాత చూసుకుంటే పది శాతం వృద్ధి ఉన్నట్టే.

రోజులెవరి కోసమూ ఆగవు కనక అమోల్ గారికి పట్టాభిషేకం, ఆ తర్వాత అమ్మగారు అమెరికా వచ్చాక మరింత జోరుగా పెట్టుబళ్ళూ, ఈ లోపున ముగ్గురు పిల్లలూ అవీ అందరికీ జరిగినట్టే అయ్యగారిక్కూడా జరిగేయి. అమ్మగారు కూడా ఉద్యోగం చేస్తున్నారు కనక ఇప్పుడు మరిన్ని స్టాకులు కొనడం, అమ్మడం లేదా దాచుకోవడం జరుగుతోంది. దీనితోపాటే, స్టాకు కొనకుండా షార్టింగ్ చేయడం అంటే ఏమిటో నేర్చుకున్నారు అయ్యగారిప్పుడు. దాని ప్రకారం ఓ

కంపెనీ బ్రోకర్ దగ్గిర్నుంచి ముందు రోజుల్లో తప్పకుండా కిందికి అంమాంతం జారిపోబోయే స్టాకు అరువు తీసుకుంటారు పది, ఇరవై రోజులకి. ఉదాహరణకి ఆ స్టాకు యాభై డాలర్ల దగ్గిరున్నప్పుడు ఓ ఇరవైవేల స్టాకు అప్పు తెచ్చుకోవడం. వెంఠనే వాటిని అమ్మేసి ఓ మిలియన్ డాలర్లు దగ్గిరుంచుకుంటారు. ఆ స్టాకు ఎలాగా కిందకి పడుతుందనే ధైర్యంతో ఓ వారం పదిరోజులు డబ్బులుంచుకున్నాక అది ముప్పైకి పడగానే వెంఠనే దాన్ని మళ్ళీ ముప్పైకి కొనడానికి  ఆరు లక్షల డాలర్లు చాలు; అంటే ఏమైంది? మిలియన్ డాలర్లలో ఆరు లక్షలు పోతే నాలుగు లకారాలు మిగుల్తాయి. ముప్పై డాలర్ల దగ్గిర స్టాక్ ఎలాగా కొనేసారు కనక ఆ కొనేసిన స్టాకుని అప్పు తెచ్చుకున్న బ్రోకర్ కి ఇచ్చేయడమే. అయితే ఇందులో రిస్కేవిటంటే, యాభై డాలర్ల దగ్గిర కొన్న స్టాకు ముప్పైకి తప్పకుండా దిగజారుతుందనేది సరిగ్గా చెప్పగలిగి ఉండాలి. అదికానీ కిందకి రాకపోయి పైకి పెరిగిందా, అయ్యగారి జేబులోంచి డబ్బులు వేసి మరీ ఆ స్టాకు కొని బ్రోకర్ కి ఇచ్చుకోవాలి.  కానీ అమోల్ గారు చాలాకాలం నుంచీ పెట్టుబడి పెట్టే ముదుపరి కనక, షార్టింగ్ బాగానే చేస్తున్నారు. డబ్బులు బానే వస్తున్నాయి. అమ్మగారు కూడా ఆల్ హేపీస్.

ఇటువంటి రోజుల్లోనే అమోల్ గారికి ఒక వెంచర్ కాపిటలిస్టు తగిలారు. ఆయన సిలికాన్ వేలీ నుంచి వచ్చిన, అనేక సంవత్సరాలు అనుభవం ఉన్న పెద్దాయన. అమోల్ గారితో చెప్పాడు ఆకాశంలో హద్దు జేరడానికి మరిన్ని పద్ధతులు. దాని ప్రకారం, వెంచర్ కాపిటల్ ఈ షార్టింగ్ కన్నా మరింత లాభదాయకం. కొత్తగా పెట్టే కంపెనీలో పెట్టుబడి పెట్టడం, దాని షేర్లు తీసుకోవడం. ఆ కంపెనీ పెద్దదవగానే ఏ గూగిల్ లాంటి కంపెనీకో అమ్మేసి డబ్బులు తీసుకోవడం. మూడు నుంచి అయిదేళ్ళలో పదేసి మిలియన్లు సంపాదించవచ్చు – కాలు కదపకుండా. అయితే ఒకే కంపెనీలో వెంచర్ కాపిటల్ పెట్టడం కంటే మూణ్ణాలుగు కంపెనీలలో పెడితే మరింత వెసులుబాటు. దానికి కాలిఫోర్నియా దాకా వెళ్ళడం కూడా అనవసరం. ఇప్పుడు అమోల్ ఎక్కడున్నాడో అక్కడ్నుంచే పెట్టుబళ్ళు పెట్టొచ్చు.  హై టెక్ అమెరికా, మజాకా?

అలా అమోల్ గారు వెంచర్ కాపిటలిస్టుగా తేలాడు మరో రెండేళ్ళలో. పిల్లలు పెద్దాళ్ళవుతున్నారు. ముగ్గురూ ఎలిమెంటరీలు దాటి పెద్ద స్కూల్లోకి వచ్చారు. అన్నీ బాగానే ఉన్నై. అత్తగారు అప్పుడప్పుడూ బాంబే నుంచి వచ్చి కూతురి సంసారం చూసి వెళ్తున్నారు కూడా. మామగారు పోయి చాలాకాలం అయింది కనక ఆయన ప్రసక్తి లేదు. అత్తగారొచ్చినప్పుడల్లా కూతురు ఆవిడకి చెప్తూనే ఉంది మొగుడు డబ్బులు ఎలా సంపాదిస్తున్నాడో, తామెంత ధనవంతులో, పిల్లలు ఎంత బాగా చదువుకుంటున్నారో అన్నీను. అత్తగారు అన్నీ చూసి మురిసిపోతోంది ఎప్పటికప్పుడు.

బాతు ఇటువంటి బంగారం గుడ్లు పెట్టే రోజుల్లోనే అమోల్ గారు అనుకునే అద్భుతమైన మరో అవకాశం తన్నుకొచ్చింది. అదీ ఇంతకుముందు తెల్సున్న వెంచర్ కాపిటల్ స్నేహితుడు చెప్పిందే. ఆయన కూడా ఎంతో చెప్పలేదు కానీ పెట్టుబడి పెడుతున్నాట్ట. అదెలా ఉండబోతోందో అవన్నీ పేపర్ల్లూ, వెబ్ సైట్లూ చూసి నేర్చుకోచ్చు. చివర్లో ఆయన

చెప్పనే చెప్పాడుకూడా – అమోల్ డబ్బులు పెట్టకపోయినా ఏమీ అభ్యంతరం లేదు. తనని చూసి మాత్రం మొహమాటంతో పెట్టవద్దు సుమా అని హెచ్చరించాడు కూడా.

అమోల్ గారు ఆ రోజు, మర్నాడు అంతా చూసాడు ఇంటర్నెట్ మీదా అక్కడానూ. అన్నీ కనుక్కునాక తనకి తోచిన విధం ఏమిటంటే ఈ కంపెనీ కొత్తగా పెట్టినది ఫలానా మాస్సాచుసెట్స్ యూనివర్సిటీంచి వచ్చిన మెరికలాంటి కుర్రాడు. సరిగ్గా రాబోయే ఐదేళ్ళలో ఈ కంపెనీ స్టాకు కొనాలన్నా దొరకదు ఎందుకంటే ఈయన చేసే రీసెర్చ్ తో కొత్త పరికరం రాబోతోంది వెన్ను మీద చేయబోయే సర్జరీకి. ఈ సర్జరీ వల్ల వెన్నుగాయం మూలంగా కాళ్ళూ చేతులూ కదపలేని వారుంటే వాళ్ళందరూ లేచి నడుస్తారు మూడునెలల్లో. ఇటువంటి రోబోటిక్ సర్జరీకి పెట్టుబడి ఇప్పుడు పెట్టారా చూసుకోండి ఏమౌతుందో! మొదటి సారీ, రెండో సారీ ఈ విషయాలన్నీ చూసాక మూడోసారి చూసి అమోల్ గారు నిర్ణయించుకున్నారు – భారీగా పెట్టుబడి పెట్టడానికి. దీనిక్కారణాలు మసాచుసెట్స్ మెరిక కుర్రాడు ఒకటి, రెండోది వెన్ను సర్జరీ చేసి నరాలు బాగుచేయడం, మూడోది రాబోయే మిలియన్లు. ఈ మిలియన్లు వస్తే ఇంక తానెప్పుడూ అసలు పెట్టుబడి పెట్టడం కానీ ఉద్యోగంచేసే అవరసరం కానీ ఉండనే ఉండదు. ఈ విషయంలో అమ్మగారితో మాట్లాడడమా వద్దా అని కొంచెం ఆలోచించి మొత్తానికి చెప్పకుండా ఆవిడకో సర్ప్రైజ్ ఇవ్వడానికే నిశ్చయించుకున్నాడు.

మరోవారానికి అమోల్ చేసిన పనేవిటంటే తనకున్న మొత్తం డబ్బులూ, మరో తెలుసున్న బ్రోకర్ దగ్గిర మరో మిలియన్ అప్పూ, అన్నీ కలిపి ఆ కొత్త కంపెనీ లో పెట్టాడు. ఎందుకంటే మెరిక కుర్రాడితో మాట్లాడితే అతను చెప్పడం ప్రకారం సరిగ్గా ఏడాది లోపు సర్జరీకి రోబోట్ ను బయటకి తీసుకొస్తాట్ట. డబ్బులు పెట్టగానే, ఆ కంపెనీ అమోల్ గారికి ఎర్ర కార్పెట్ వేసి ఆహ్వానం పలికింది. ఇంక ఇప్పట్నుంచీ చేయాల్సినది ఒక సంవత్సరం ఏమీ చెప్పకుండా కుదురుగా కూర్చోవడమే.

మొదట్లో మూణ్ణెల్లు కాస్త కష్టంగా గడిచినా, ఒడిదుడుకులకి అలవాటు పడ్డాక అసలు కంపెనీ ఎలాగా పైకి వస్తుందని తెలుసు కనక దానికేసి చూసీ చూడకుండా మరో మూణ్ణెల్లు గడిచాక అప్పుడు తెల్సింది అసలు విషయం. మెరిక కుర్రాడు ముందు అనుకున్నంత మెరిక కాదు. అసలీ నరాలు బాగుచేసే మెడికల్ ప్రోసిడ్యూర్ ఇంకా రానేలేదు. ఈ కుర్రాడు ఊరికే జనాలని ఊదరకొడుతూ డబ్బులు సంపాదించడానికి నానా అవస్థా పడుతున్నాడు. ఇంకా తెల్సిన విషయాల ప్రకారం తనకి సలహా ఇచ్చిన వెంచర్ గారు ఓ మిలియన్ పోగొట్టుకున్నాడు కానీ ఆయన లక్ష్మీ పుత్రుడు కనక ఆయన పట్టించుకోలేదు. మరి తానో? ఉన్నదంతా ఊడ్చిపెట్టాడు. మరో మూణ్ణెల్లకి మిగతాది తెల్సింది. తానుపెట్టిన డబ్బూ, తెచ్చిన మిలియన్ అప్పూ గంగలో కలిసిపోయాయి. దీనికి పెద్ద కారణం మెరిక కుర్రాడు మెడికల్ ఫీల్డ్ లో అనుసరించే కొన్ని రూల్స్, పాలసీలు, రెగ్యులేషన్స్ అవీ పట్టించుకోలేదు. ఆయన హాత్ హూత్ అంటూ ఏదో మాయచేసి ఏదో

చేసేస్తానని చెప్పినది ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే ఉన్నట్టూ ఉంది. మెరిక కుర్రాడెలా ఉన్నా ఇదంతా కలిపి అమోల్ గారి నెత్తిమీద కుచ్చుటోపీ పడింది.

ఇదంతా తెలిసాక ఆ రోజు సాయంత్రం ఇంటికొచ్చాడు అమోల్. రెండు మూడు వారాల క్రితమే బాంబే నుంచి వచ్చిన అత్తగారు టీ కలిపి ఇచ్చింది. ముభావంగా తీసుకుని తాగుతూ ఉంటే తట్టిన విషయం – ఈ కంపెనీ దివాలా సంగతి తెలియగానే బ్రోకర్ తన డబ్బులు అడుగుతాడు. తన ఇల్లూ అమ్మగారి వంటిమీద బంగారం అంతా కలిపినా అయిదు లక్షల డాలర్లు కూడా ఉండదు. ఇంట్లోకి వెళ్ళి పిల్లలేంచేస్తున్నారో చూసి బయటకి నడిచాడు. అమ్మగారింకా ఇంటికిరాలేదు పనిలోంచి. బయటకి వెళ్ళిన అమోల్ రాత్రి ఎప్పుడో రెండు దాటాక ఇంటికొచ్చాడు. కొంచెం మందు కొట్టినా మనిషి కంట్రోల్ లో ఉన్నట్టే లెక్క. కారు గరాజ్ లోనే పెట్టి ఇంట్లోకి నడిచాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. అందరూ పడుకున్నట్టే. అమోల్ అప్పుడప్పుడూ ఇలా లేటుగా రావడం మామూలే కనక ఎవరూ మెలుకువగా లేరు ఈయన కోసం. అక్కడే హాల్లో లైట్ వేయకుండా కూర్చుని తాను చేయబోయే పని మంచిదా కాదా అనేది ఆలోచించాడు మరోసారి. మంచిదే అనిపించాక మొదటగా అమ్మగారి గదిలోకెళ్ళి ఆవిడ నుదిటిమీద శబ్దం రాకుండా పేల్చాడు సైలెన్సర్ గన్. తర్వాత ముగ్గురి పిల్లలనీ కూడా అలాగే కాల్చాక బయటకి వస్తూంటే అత్తగారు లేచి బాత్రూంలోకి వెళ్తూ కనిపించింది. ఈవిడ కనక బతికి ఉంటే రేపు పొద్దున్నే వచ్చే పోలీసులకి తాను చేసిన ఘనకార్యం చెప్పదూ? అవిడ బయటకి రాగానే ఆవిణ్ణీ కాల్చి పారేసాడు. తర్వాత కిందకొచ్చి తన నుదిటి మీద గన్ పెట్టుకుని కాల్చుకున్నాడు ఆఖరి బులెట్ తో.

మూడు రోజుల తర్వాత ఈ ఇంట్లోంచి ఏదో వాసన వస్తోందని ఎవరో పోలీసులని పిలిస్తే వాళ్ళు తలుపులు బద్దలు కొట్టి చూసారు. తర్వాత జరగడానికేవుంది? ఓ డిటెక్టివ్ సులభంగా పట్టుకున్నాడు అమోల్ గారు చేసిన పని. స్టాకుల్లో పెట్టిన డబ్బుల వల్లే ఇలా అయిందనీ, గన్ లోంచి వచ్చిన తూటాలు, వాడిన గన్ ఆయన దగ్గిరలోనే ఉంది కనక ఆయనే ఈ కుటుంబాన్ని ఇలా కడతేర్చాడని ఓ రిపోర్ట్ రాసి కేసు మూసేసారు. అలా ఆకాశమే హద్దుగా పైపైకి వెళ్ళిపోదామనుకునే అమోల్ గారు, తాను పోయాక కుటుంబం ఏడవకూడదని కాబోలు పిల్లల్తో సహా అందర్నీ కడతేర్చాడు. అయితే తాను చేసిన తప్పు ఆఖరి బుల్లెట్ తన నుదిటిమీద తగిలాక కూడా ఆయనకి తెలియలేదు.

నీతిః గుడ్లన్నీ ఒకే బుట్టలో పెట్టరాదు.

# ఉచిత సోఫా

**ఆగస్ట్ నెలలో సెమెస్టర్లు** మొదలౌతూంటే దిగాడు మురళి అమెరికాలో పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ మీద. యూనివర్సిటీలో ఉద్యోగం, బయట ఇద్దరు ముగ్గురితో రూములో మకాం, వంటా అదీ కుదిరాక అమెరికా అంటే మెల్లిగా

తెలిసి వస్తోంది. జీతం ఫర్వాలేదు మరీ అంత స్టూడెంట్లకి ఇచ్చేంత తక్కువా కాదు, ప్రొఫెసర్లకి ఇచ్చేంత ఎక్కువా కాదు. అయితే వచ్చే ఈ జీతంతో కాపురం పెట్టవచ్చా అంటే చెప్పడం కష్టం. ఉన్న ఊర్లో ఉన్న జీతం, వసతీ మరో ఊర్లో ఉండకపోవచ్చు. ప్రస్తుతానికి రెండేళ్ళు కాన్సాస్ లో ఉంటే ఓ ఉద్యోగం రాగానే వెళ్ళిపోవచ్చు.

ఓ ఏడాది గడిచాక మిగతా విషయాలు తెలిసాయి. ఎలాగో ఒకలాగ ఈ రీసెర్చ్ కి డబ్బులకోసం ఓ ప్రాజెక్ట్ మరో అయిదేళ్ళకి సంపాదించగలిగితే తనని ఉద్యోగంలోకి తీసుకున్న ప్రొఫెసర్ గారు గ్రీన్ కార్డు ఇప్పిస్తానన్నాడు. అలా కిందా మీదా పడి మరో ముగ్గురు ఆచార్యులతో కుస్తీ పట్టి మొత్తానికో ప్రోజెక్ట్ కి ప్రపోజల్ రాసి పంపించాడు. అది వచ్చేసరికి మరో ఆరునెలలు గడిచాయి. ప్రాజక్ట్ రావడం అయితే వచ్చింది కానీ అందులో తనకొచ్చే డబ్బులు తక్కువే. మిగతావాళ్ళకీ, రీసెర్చ్ లో ఖర్చుపెట్టేది పోతే తన జీతం కడిగి చేతులో పెడతారు. అయితే గ్రీన్ కార్డ్ వస్తుంది కనక ప్రస్తుతం ఆ డబ్బులగురించి యావ పనికిరాదు.

అయితే అనుకున్నట్టు అన్నీ జరగవు కనక, రీసెర్చ్ నత్త నడక నడుస్తోంది. అయ్యగారికి అమెరికా మెల్లిగా అలవాటౌతోంది. ఇండియాలోలాగా పెన్సిళ్ళూ, పెన్నులూ, కాయితాలూ ఎవరూ దాచుకోరు. ఓ సారి వాడాక పెన్సిల్ బాగున్నా సరే పారేయడం అలవాటు. తిండి దగ్గిర చెప్పనే అక్కర్లేదు – తినేది ఓ ప్లేట్ అయితే పారేసేది అయిదు ప్లేట్లు. తిండి చవక కనక ఎవరేం పారేసినా పరేషాన్ లేదు. ఈ పారేయడంలో మళ్ళీ ఒక్కొక్కరిది ఒక్కో ప్రత్యేకత. కొంతమంది భోజనం మాత్రం పారేస్తే మరి కొంతమంది ఇంట్లో వస్తువులు, పరుపులూ, పాత టివీలు, కార్పెట్లూ, గిన్నెలూ, బట్టలూ పారేస్తూ ఉంటారు. అదీగాక వేసవి వీకెండ్ లలో జరిగే యార్డ్ సేల్ మరో రకం. అక్కడ బట్టల దగ్గిర్నుంచి, బంగారం దాకా, సైకిల్ దగ్గిర్నుంచి టెన్నిస్ రాకెట్ దాకా ఏదైనా దొరకవచ్చు. అదీ పీకిపీకి బేరం ఆడి మరీ కొనవచ్చు. అందులోనూ మురళీ గమనించడం ప్రకారం, తాను యూనివర్సిటీలో పని అంటే వెంటనే ధరలు తగ్గిస్తారు. లేదా, "ఇదిగో ఈ పదిహేను డాలర్లు, ఇంతే ఉంది అంతకన్నా ఇవ్వలేను" అంటే, సరే తీసుకో అనడం సాధారణంగా జరిగేదే. అలా మురళీ అపార్ట్ మెంట్లోకి ఓ నలభై డాలర్ల సోఫా, అరవై డాలర్ల టివీ, మరో పనిచేసే పాత మైక్రోవేవ్ వచ్చి చేరాయి. మొదట్లో పాత సామాను కొనడం అనేది నామోషీగా అనిపించినా తొందర్లోనే అలవాటైంది, పాత బట్టలు మాత్రం ఏనాడూ కొనడం లేకపోయినా.

మరో ఏడాదికి గ్రీన్ కార్డ్ రాబోయేసరికి ఇండియా వెళ్ళి పట్టాభిషేకం చేయించుకుని అమ్మగార్ని తీసుకొచ్చి కాపరం మొదలుపెట్టాడు మురళి. కుటుంబం ఏర్పడ్డాక ఓ చిన్నకారు ఉండొద్దూ, దానికో పాత కారూ, దానికి అప్పుడప్పుడూ వచ్చే రిపేర్లూ అన్నీ కలిసి నెలాఖరుకి కొంచెం కటకటే. కానీ అంత అధ్వాన్నంగా లేదు పరిస్థితి. ప్రోజక్ట్ పూర్తయ్యేసరికి ప్లాస్టిక్ గ్రీన్ కార్డు చేతిలోకి వచ్చింది. మరో ప్రోజక్టూ మరోటీ రాసినా ఎక్కడవేసిన గొంగళీ అక్కడే అన్నట్టుంటుంది కనక వేరే ఉద్యోగం చూడ్డానికి బయల్దేరాడు అబ్బాయి. మరో మూడు నెలలు యూనివర్సిటీలలో

ప్రయత్నాలు చేసాక తెల్సింది, ఈ టీచింగ్ ఉద్యోగం అంత గబుక్కున రాదు. తను చదివినది కెమిస్ట్రీ కనక వేరే కంపెనీలో చూసుకోవడం ఉత్తమం. అలా ఓ ఉద్యోగం సంపాదించి టెక్సాస్ లో తేలాడు. మొదట్నుంచీ పాతకారు, పాతసామాను అలవాటే కనక ఉన్న సామానులో ఎక్కడిది అక్కడ వదుల్చుకుని, మిగిలినవన్నీ కారు వెనకసీట్లో పెట్టి అమ్మగారితో పాటు బండి నడుపుకుంటూ టెక్సాస్ చేరాడు. అపార్ట్ మెంట్ దొరికాక తెల్సిన విషయం, ఇప్పుడు బిల్లులన్నీ తానే కట్టుకోవాలి. ఏదో వచ్చేస్తుందనుకున్న పెద్ద జీతంలో టేక్సులు పోగా మిగిలేది మరీ అంత పెద్దదేం కాదు కానీ బాగున్నట్టే. ఇంట్లోకి మరి సామానో? దానికోసం అలవాటైన పాత సామాను, అమ్మే చోటా, కొనే చోటా, పేపర్లలో చుట్టు పక్కల యార్డ్ సేల్ లలో చూడ్డం మొదలుపెట్టాడు.

అప్పుడు తగిలిందో అవకాశం. ఒక రిటైరైపోయిన పెద్దాయన ఓ సోఫా పారేస్తున్నారు. కావాల్సినవాళ్ళు ఫోన్ చేసి వచ్చి తీసుకెళ్ళచ్చు. గమనిక – సోఫా లో లోపల ఒక బెడ్ కూడా ఉంది. అందువల్ల అది బరువు. ఒకరితో అవదు మోయడం. వచ్చేటప్పుడు కనీసం ఇద్దరు రావాలి. ఉచిత సోఫా అంటే ఎలా ఉంటుందో అని అమ్మగారు కొంచెం గునిసింది కానీ తీరా ఇద్దరూ ఫోన్ చేసి పెద్దాయన దగ్గిరకి వెళ్ళి చూస్తే తెల్సింది. సోఫా మీద మరకలూ అవీ లేవు నీట్ గానే ఉంది. రిటైరైపోయినాయన వేరే ఊరికి వెళ్తున్నారు అందువల్ల ఇది పూర్తిగా ఉచితం. రెండురోజుల్లో మరో మనిషితో వచ్చి తీసుకెళ్తానని చెప్పి వెనక్కొచ్చి రెండో మనిషి కోసం వెతకడం మొదలుపెట్టాడు మురళి. మర్నాడు అక్కడా ఇక్కడా కనుక్కుంటే తెల్సింది, ఫలానా వాల్ మార్టులో పనిచేసే మరొకాయన సహాయం చేస్తాడు కానీ పాతిక డాలర్లు ఇవ్వాలిట. వెసులుబాటేవిటంటే ఆయనకో పికప్ ట్రక్ అనబడే బండి ఉంది. అందులో సోఫా తెచ్చేసుకోవచ్చు. సరే అంటే సరే అనుకుని మర్నాడు పెద్దాయన దగ్గిర్నుంచి సోఫా తీసుకొచ్చారు మురళి ఉండే అపార్ట్ మెంట్ దగ్గిరకి.

అప్పుడొచ్చింది అసలు గొడవ.

మురళీ ఉండేది పైన రెండో అంతస్తులో. పైకి తీసుకెళ్ళడానికి మోయాలి ఈ బరువంతా. ఇద్దరూ మోయడం మొదలుపెట్టేసరికి మొదట్లో బానే ఉందనిపించినా కాసిని మెట్లెక్కే సరికి నడుమ్మీద ఏదో కలుక్కుమంది. నెప్పితో ఇంక నడవలేక అక్కడ కూలబడినప్పుడు అపార్ట్ మెంట్ కాంప్లెక్స్ లో పైనుంచి దిగుతూ వచ్చే మరొకాయన సహాయం చేసాడు. మొత్తానికి సోఫా ఇంట్లోకి జేరిపోయింది పాతిక డాలర్లతో. సహాయం చేసిన మూడో ఆయన ఓ షేక్ హేండ్ ఇచ్చేసి తన దారిన తాను పోయాడు. సోఫా ఇంట్లో కావల్సిన చోటకి జరిపి అమ్మగారూ అయ్యగారూ ఆల్ హేపీస్. ఇప్పుడు రోజూ టీవిగా సోఫాలో కానీ అందులో ఉన్న మంచం మీద పడుకుని కానీ టివి చూడొచ్చు!

మురళి పైవారం లో ఉద్యోగానికి వెళ్తుంటే నడుమ్మీద నెప్పితో శరీరం మొరాయించింది కదలడానికి –సరిగ్గా లేవలేకపోవడం, లేస్తే సరిగ్గా నడవలేకపోవడం వగైరా. మరో రెండు రోజులు టైలెనాల్, అవీ మింగి ఏమీ ఫలితం లేనప్పుడు అమ్మగారి పోరుతో డాక్టర్ దగ్గిర తేలాడు, అదీ ఎముకల స్పెషలిస్ట్ దగ్గిర. ఆయన కాస్త అటూ ఇటూ నొక్కి

వెన్నులో ఫలానా చోట ఏదో డిస్క్ జారిందేమో ఎందుకైనా మంచిది ఓ ఎమ్ ఆర్ ఐ తీయమని ఆర్డర్ రాసి ఇచ్చాడు. ఆ స్కాన్ రిపోర్ట్ వచ్చేలోపుల నెప్పి తగ్గడానికీ కాస్త అటూ ఇటూ తిగరడానికీ మందు రాసిచ్చాడు. అది వేరే ఫార్మసీలో కొనుక్కోవచ్చు. మురళీ దగ్గిర ఆయన ఇన్స్యూరెన్స్ కార్డు తీసుకున్నాడు, దానికి బిల్లు పంపుతాట్ట ఆయన ఫీజు కింద. అలా మర్నాడు ఎమ్ ఆర్ ఐ తీయడానికో లేబ్ లో అపాయింట్ మెంటూ, వాళ్లకి ఇన్స్యూరెన్స్ కార్డ్ ఇవ్వడం అదీ ఓ తతంగం. అయిదార్రోజులకి మళ్ళీ ఎముకల డాక్టర్ పిలిచాడు స్కాన్ వచ్చింది, మాట్లాడ్డానికి రమ్మని. వెళ్ళాక చల్లగా చెప్పాడు కబురు – మధ్య వెన్నులో ఓ డిస్క్ జారింది కానీ సర్జరీ అవసరం లేదు. ప్రస్తుతానికి ఫిజికల్ థెరపీ చేయండి. సాధారణంగా ఇటువంటివి ఆరోగ్యంగా ఉన్న మురళీ లాంటి వాళ్లలో సర్దుకుని మామూలుగా అవుతాయి. అవ్వకపోతే తర్వాత మరోసారి రండి.

అలా ఈ సారి మురళీ ఫిజికల్ థెరపీలో చేరాడు. ఆ పి.టి థెరపిస్ట్ అమ్మగారు మరోసారి ఇన్స్యూరెన్స్ తీసుకుని రోజూ ఏం చేయాలో అవన్నీ చెప్పి రాబోయే పది రోజులకీ అపాయింట్ మెంట్లు రాసి ఇచ్చారు. ధన్యోస్మి. రోజూ ఈ పిటి కి వెళ్లడం, అవిడ చెప్పినట్టూ వంగడం, బరువులు అటూ ఇటూ తిప్పడం అవీ ఓ అరగంట కథ. మెల్లిగా నడుమ్మీద నెప్పి సర్దుకుంటోంది. అప్పుడప్పుడూ నెప్పి వచ్చినా ఎనభై శాతం తగ్గినట్టే.

ఇవన్నీ గడిచేసరికి ఇన్స్యూరెన్స్ దగ్గిర్నుంచి బిల్లులు రావడం మొదలైంది. ఎముకల డాక్టర్ గారికి కో పే ముప్పై డాలర్లు – రెండుసార్లు వెళ్ళాడు కనక అరవై. ఎమ్ ఆర్ ఐ కి పూర్తిగా డబ్బివ్వరుట ఇన్స్యూరెన్స్, అందువల్ల మురళి ఇరవైశాతం ఇచ్చుకోవాలి. అది ఎంతోనా? కేవలం మూడువందల ఇరవై మాత్రమే. పి.టి చేసిన థెరపీ అమ్మగారు పది అపాయింట్ మెంట్లకీ వేరు వేరుగా బిల్లు ఇచ్చారు. అందులో మళ్ళీ మురళి కో పే, కో ఇన్స్యూరెన్స్ కట్టాలిట. ఆవిడకి ఇవ్వాల్సినవి మొత్తం ఏడు వందల నలభై, పది రోజులకీ కలిపి. ఇదంతా చాలదని కాబోలు ఫార్మసీ వారు మందులు కొన్నప్పుడు కో పే అంటూ లాగినది కేవలం ఇరవై డాలర్లు మాత్రమే. అయితే ఏ మాటకామాట చెప్పుకోవాల్సిందే. ఫార్మసీ వారు మాత్రం అందరికంటే చవక! ఇలా మొత్తం అయిన ఖర్చు కూడితే మురళీ జేబులోంచి పడినది – పదకొండువందల డాలర్లపైన కాస్త చిల్లర. నెప్పి తగ్గింది కాదుటండీ ఇంకా ఏడుపెందుకూ?

ఈ బిల్లులన్నీ సెటిల్ చేసిన తర్వాత ఓ వీకెండ్ ఖాళీగా ఆ ఉచిత సోఫామీద కూర్చుని తెలుగు సినిమాలో హీరో ఆహ్, ఊహ్ అంటూ విలన్లని కొట్టే ఫైటింగులన్నీ చూస్తున్నప్పుడు తట్టింది అయ్యగారికి అసలు విషయం. తాను ఏ షాపుకో వెళ్ళి కొత్త సోఫా నాలుగు వందలకి కొని ఆ షాపువాళ్ళకి మరో వంద ఇచ్చినా తన కాలూ చేయీ కదపకుండా వాళ్ళు సోఫా ఇంటికి తెచ్చిపెట్టి ఉండేవారు. యూనివర్సిటీలో పుస్తకాలూ, కాయితాలూ, పెన్సిళ్ళూ, పెన్నులూ పారేసినట్టే రిటైరీలు సోఫాల లాంటి సామాను పారేస్తారు. తనకున్న అలవాటువల్ల కక్కుర్తి పడితే ఇప్పుడేమైంది ఉచిత సోఫా వల్ల? పదకొండు వందల ఖర్చు!! ఎందుకో మురళీకి ఇంక ఆ సోఫాలో కూర్చోవాలనిపించలేదు. చటుకున్న లేచి దాన్నో తన్ను తన్ని కిచెన్

లోకి నడిచాడు కాఫీ తెచ్చుకోవడానికి. ఇదంతా అర్ధంకాని అమ్మగారు మొగుడికేసో వెర్రిచూపు చూసి, వీడింతేలే అనుకుంటూ తెలుగు సినిమాలో హీరోయిన్ వెనకాల గెంతుతూ చొంగ కార్చే హీరోని చూడ్డంలో మునిగిపోయింది.

నీతిః ముందు వెనకలు ఆలోచించకుండా ఉచిత సామానుకి కక్కూర్తి పడరాదు. బి ఏన్ ఇటాలియన్ ఇన్ ఇటలీ అన్నట్టే, బీ ఏన్ అమెరికన్ ఇన్ అమెరికా.

# నాస్తికుడు

**శంకరం తానో** నాస్తికుణ్ణని చెప్పుకున్నాడంటే, తన ఇంట్లో తండ్రి ప్రతిరోజూ చేసే పూజల వల్ల విసుగెత్తి అయ్యాడా లేక తను దేవుణ్ణి అడిగిన కోరికలు తీరనందుకిలా అయ్యాడా అనేది చెప్పడం కష్టం. ఏదైతేనేం శంకరం పైకి నాస్తికుడే. ఇందులో ఎవరికీ ఏమీ చిక్కులేదు, ఎవరిష్టం వారిది కదా? కానీ శంకరంతో వచ్చిన గొడవేమిటంటే ఆయన పబ్లిగ్గా అందరితోనూ చెప్పుకుంటాడు. తానేమిటో అందరికీ తెలియాలనే తపన. ఓ రోజు ఎందుకో తల్లీతండ్రీ రమ్మంటే ఊర్లో రామాలయానికి బయల్దేరాడు. తల్లి గుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తూంటే – తాను ముందే తల్లితో ఎవరికీ మొక్కననీ దణ్ణాలు, ప్రదక్షిణాలూ చేయమని బలవంతపెట్టద్దనీ చెప్పేడు కనక – ఆవిడ రామనామం నోట్లో ఆడుతూంటే నడుస్తోంది గుడి చుట్టూ, శంకరం ఠీవిగా నిలబడి చూస్తూంటే. గుడిలో పూజారి శఠగోపం నెత్తిమీద పెట్టబోతే చేతులు జోడించి నమస్కారం కూడా పెట్టకుండా అలాగే నుంచున్నాడు శంకరం. పూజారి ఇదేమీ గమనించనట్టూ ఊరుకున్నాడు, అసలే శంకరం తల్లీ తండ్రీ తెలుసున్నవారు ఆయనకి. బయటకి వస్తుంటే పూజారిచ్చిన కొబ్బరిముక్క ఇచ్చింది తల్లి తినడానికి. ఆ ప్రసాదం తింటే చచ్చిపోతాడన్నట్టూ శంకరం దానికేసి నిరసనగా చూసి చెప్పేడు తల్లితో "వద్దు, నేను నాస్తికుణ్ణి." ఇంటికి వెళ్ళిపోయేముందు మరోసారి రాముణ్ణి చూడ్డానికి వెనక్కి తిరిగి చూసిన శంకరం తల్లికి రాముడు గలగలా నవ్వుతున్నట్టు అనిపించింది ఎందుకో.

శంకరాన్ని చూసి రాముడేవనుకున్నాడో తెలియదు కానీ సరస్వతీ దేవి మాత్రం నవ్వుకుంటూనే తన కటాక్షం చూపించినట్టుంది శంకరం మీద. చదువులో బాగా రాణిస్తూ కళ్ళు మూసి తెరిచేంతలో ఊర్లోనే ఉన్న ఇంజినీరింగ్ కాలేజీలో తేలాడు. అక్కడ చదువు వల్ల మరింత రాటు తేలడం, దేవుడంటే ఇదీ, అదీ అని వాదించడం తెలుస్తూనే ఉంది తల్లికీ తండ్రికీ. ఏమీ చేయలేని అశక్తత. ఏ మాట అంటే ఎటుతిరిగి ఎటుస్తుందో తెలియదు కదా. అసలే కొడుకు తమకున్న వంశోద్ధారకుడు. ఇంజినీరింగ్ అయ్యాక పై చదువులకి వేరే ఊరు వెళ్తాననే సరికి ఒప్పుకోక తప్పలేదు. అయితే ఈసారి శంకరం తేలినది ఉత్తర్ ప్రదేశ్ లో రూర్కీ అనేచోట. ఎంత ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ అయినా మొదటిసారి ఇంట్లోంచి వెళ్తూంటే కాస్త తడబాటు. రైలు కదులుతూంటే కంట్లోంచి నీళ్ళు. తండ్రి తన చేయి పట్టుకుని మహా మృత్యుంజయ

మంత్రం జపిస్తూ, "అంతా బాగుంటుంది కంగారు లేదు," అన్నప్పుడు దాదాపు వెక్కి వెక్కి ఏడిచే పరిస్థితి. బండి కదిలాక మరో అరగంటకి అన్నీ సర్దుకున్నాయి. ఆంధ్ర దేశం దాటి జనాలు మారుతున్నారు బండిలో – ఇప్పుడంతా హిందీ, మరోటీ, మరోటీ అర్థంకాని భాషలు వినబడుతున్నై. రూర్కీ వెళ్ళాక ఒకటీ అరా తెలుగువాళ్ళున్నా వంటరితనం ఆవహించింది. దక్షిణ దేశంలో పూజలూ హిందూమతం ఎలా ఉన్నా ఉత్తరంలో పరిస్థితి వేరే. అక్కడ వీర భక్తులున్నారు. నాస్తికుడైనా స్నేహితులతో కల్సి బయటకి వెళ్ళి, శివాలయానికి వెళ్తే లైన్ లో నించునప్పుడు 'జై మహకాళేశ్వర్' అని అందరూ అన్నప్పుడు మనం నోరు కలపకపోతే మీదకి వచ్చి మరీ అడుగుతారు.

ఏమైనా శంకరం మొత్తానికి రాటుదేలి, దేవుడి పేరు నోట్లోకి రాకుండా జాగ్రత్తపడుతున్నాడు. పేరు కూడా ఇప్పుడు శంకు; మరి నాస్తికుడికి భగవంతుడి పేరు బావోదు కదా? అయితే అపరాత్రో, అర్ధరాత్రో ఎప్పుడైనా తన తండ్రో, తల్లో సడన్ గా చనిపోయినట్టు ఏ పీడకలలో వస్తే తనకి తెలియకుండానే మనసులోంచి చిన్నప్పుడు తండ్రి నేర్పించిన మహా మృత్యుంజయ మంత్రం తన్నుకు వస్తోంది. మొదట్లో ఇది కాస్త హాస్యంగా అనిపించినా ఐదారు నెలల్లో ఈ "అవరోధాన్ని" దాట గలిగేడు. తన మనసులో ఆ "గెలుపు" ని స్నేహితులకి గొప్పగా చెప్పుకున్నాడు కూడా. అయితే రూర్కీలాంటి ప్రదేశాల్లో తెలుగువాళ్ళు తక్కువ కనక వంటరితనం ఎక్కువ అలవాటైంది. నాస్తికవాదం ఎవరితోనూ చెప్పుకోలేనిది. వినడానికి ఎప్పుడైనా పాటలు ఉన్నా మన తెలుగువాళ్ళకి ఉన్నవన్నీ భజన పాటలు కాదుటండీ? అందువల్ల శంకరానికి మరోదారిలేక "రామా నను బ్రోవరా" వినడం తప్పలేదు.

రోజులు మారి మరో రెండేళ్ళకి అమెరికా వచ్చి పడ్డాడు శంకరం. ఊర్లో ఉన్న గుడికి వెళ్ళడం అమెరికాలో ఉండే తెలుగువాళ్ళందరూ చేసే పనే కదా? అసలు గుడికి వెళ్ళడం ఎందుకంటే దానికి వేరే సమాధానం ఉంది. గుడిలోకి వెళ్ళగానే మొదటగా చేయాలసిన పనేమిటి? దేవుణ్ణి చూస్తూ నమస్కారం పెట్టడమా లేకపోతే దేవుణ్ణి ఆయన మానాన ఆయన్నొదిలేసి చుట్టూ కూర్చున్న స్నేహితులని పలకరించడమా? స్నేహితులని పలకరించకపోతే వాళ్ళు కాసేపటికి వెళ్ళిపోవచ్చు. గుళ్ళో దేవుడెక్కడకి పోతాడు? ఇంకాస్త ముందుకెళ్తే చుట్టూ కూర్చున్న పట్టుచీరలని చూడొచ్చు, లేదా అమెరికాలో పుట్టిన మన దేశీ కుర్రాళ్ళనీ కుర్రమ్మలనీ వాళ్ళు వేసుకున్న రంగు రంగుల దేశీ బట్టలని చూసి సరదాగా నవ్వుకుంటూ చూడొచ్చు. శంకు కాలేజీ రోజుల్లో అమ్మాయిలని చూసినప్పుడు చెప్పుకునే పదం 'కలర్.' అమెరికాలో శంకరం గుళ్ళోకి వచ్చే 'కలర్' ని చూసి నవ్వుకుంటూ ఉంటే శంకరాన్ని చూసి గుళ్ళో దేవుడు కూడా సరదాగా నవ్వుకుంటూనే ఉన్నాడు. ఎవరి నవ్వు వారిది, ఎవరి కారణాలు వారివి.

ఇండియా వెళ్ళినప్పుడు, పెళ్ళి చూపుల్లోనే చెప్పేడు శంకరం అమ్మగారితో తన నాస్తికత్వం గురించి. ఆవిడకి కాస్త పట్టింపు ఉన్నా తల్లి చెప్పిన విషయం ఏమంటే "పెళ్లయ్యాక మనుషులు మారతారు; జీవితంలో తినే రెండు మూడు దెబ్బలు పడగానే; అసలు అదేం పెద్ద గొడవకాదు." శుభలేఖల్లో 'జానక్యా కమలాంజలి.. పద్మరాయాయితా" అన్నా,

పెళ్ళిలో పంతులు గారు చెప్పమనే మంత్రాలు పలకడానికీ శంకరం నోరుమూసుకోవాల్సిన పరిస్థితి తల్లీ తండ్రీ మొహం చూసి. వీసా రాగానే మిస్సెస్ శంకరం అమెరికాలో అడుగుపెట్టింది. అపార్ట్ మెంట్ లో గోడలకి దేవుడి పటం ఉండరాదు. ఇంట్లో ఎటువంటి పూజలూ పనికిరావు. ఇంట్లో పూజా, ప్రసాదం చేసే పరిస్థితే లేదు. అమ్మగారికి కావాలిస్తే నోట్లో జపం చేసుకోవచ్చు, పైకి శంకరానికి వినిపించరాదు వగైరా వగైరా వంటి ఆంక్షలన్నీ విధించబడ్డాయి. సంసారం సాగుతోంది. ఎప్పుడైనా అమ్మగారికి పట్టుచీర కట్టుకుని స్థానిక గుడికి వెళ్ళాలని ఉంటే "నేను తీసుకెళ్లను, నేను రాను" అనే సమాధానం వచ్చినా అమ్మగారి కన్నీటితోనో, మర్నాడు వంట సరిగ్గా, లేదా అసలే చేయకపోవడంతోనో శంకరమే మెట్టు దిగి రావాల్సి వస్తోంది. తన లోపల అమ్మగారు గింజుకుంటున్నట్టే శంకరం కూడా లోలోపల గింజుకుంటున్నాడు. గుడి ఊరికి చాలాదూరం; అక్కడికి కనక ఏ పుణ్యతిథికో – అంటే దీపావళి లక్ష్మీ పూజకో, శివరాత్రికో, వెళ్తే దారిలో అమ్మగారు భజన పాటలు వింటారు కారులో. అందువల్ల శంకరం కూడా 'రామా నను బ్రోవరా' అనే పాట నోరెత్తకుండా తప్పనిసరిగా వినాల్సిన పరిస్థితి.

ఎప్పుడైనా ఊర్లోకి ఏ సంగీతం మేళమో సభో వస్తే అమ్మగారికి మహా ఇంటరెస్ట్, వెళ్ళి తీరాల్సిందే. అయితే ఈ సభల్లో మనవాళ్ళు పాడే పాటలు అన్నమాచార్యుల కీర్తనలూ, త్యాగరాజ పంచరత్నాలు కనక శంకరానికి ఇప్పుడు వద్దనుకున్నా 'పతిత పావనుడనే పరాత్పరుని గురించి పరమార్థమును నిజమార్గమును" పాడే వారి వల్ల రాముడు మనసులోంచి పోవడంలేదు. ఎప్పుడైనా ఆఫీసులో పని అయ్యాక చిరాగ్గా ఇంటికొచ్చేటప్పుడు కార్లో పాట పెట్టబోతే మళ్ళీ – రామా నను బ్రోవరా! తానెంత తప్పించుకుందామని చూస్తే అంత ఏడిపిస్తున్నాడు రాముడు శంకరాన్ని.

ఇటువంటి రోజుల్లోనే అమ్మగారు నెలతప్పేరు. సహాయానికి తల్లి తండ్రులని కానీ అత్తమామలని కానీ పిలవడం మన దేశీయుల ఆచారం కదా? అయితే వీళ్లెవరికీ రావడం కుదర్లేదు. అమ్మగారికి రాముడే తోడు. శంకరానికి అమ్మగారే తోడు. ఏడో నెలలో అమ్మగారికి వంట్లో నలతగా ఉంటే చెప్పారు డాక్టర్, "ఇది ఎక్టోపిక్ ప్రిగ్నెన్సీ కావచ్చు, జాగ్రత్తగా ఉండాలి లేదా తల్లీ బిడ్డా దక్కరు. వెంటనే వెళ్ళి మరో అల్ట్రాసౌండ్ తీయించండి!" ఉరుకులు పరుగులమీద ఊర్లో హాస్పిటల్లో ఎమర్జన్సీకీ అక్కడనుంచీ ఐ సి యూ లోకీ తోయబడ్డారు అమ్మగారు. శంకరాన్ని లోపలకి అప్పుడే రానివ్వరుట. ప్లీజ్ వెయిట్ ఔట్ సైడ్. వచ్చి పిలుస్తాం.

మరో గంటా రెండు గంటలు గడిచాయి కానీ ఏమీ సమాధానం రాలేదు లోపల్నుంచి. ఇంక ఊరుకోలేక డెస్క్ దగ్గిర అమ్మాయిని అడిగేడు. ఏమైందో. వాళ్లకీ తెలియదుట, "కూర్చోండి డాక్టర్ బయటకి వచ్చినప్పుడు చెప్తారు," వచ్చింది సమాధానం. మరో గంటకి డాక్టర్ రావడం కనిపించింది దూరం నుంచి. ఆయన వస్తూంటే శంకరానికి గుండెల్లో బెదురు, దడ దడ. తల్లీ, బిడ్డా దక్కకపోతే ఎలా? ఇంక ఊరుకోలేక లోపలే అప్రయత్నంగా అనేసుకున్నాడు శంకరం తనకి తెలియకుండానే, "ఈయన వచ్చి అంతా మంచిగా ఉందని చెప్తే నేను నాస్తికత్వం వదులుకుంటా." డాక్టర్ వచ్చి చెప్పేడు,

"సర్జరీ చేసామండి. ఎక్టోపిక్ ప్రిగ్నెన్సీ కాదు కానీ ఆపరేషన్ చేసే పరిస్థితే వచ్చింది. సరైన సమయానికి వచ్చారు. పిల్లాడు పుట్టాడు కానీ ఎర్లీ ఎరైవల్ కనక కొన్నాళ్ళు కాస్త వీక్ గా ఉంటాడు. మీ ఆవిడకేమీ ప్రమాదం లేదు. డోన్ట్ యు వర్రీ." వచ్చినవాడు వచ్చినట్టే వెళ్ళేడు తెల్లకోటు డాక్టర్.

మరో ఏడాదికి అన్నీ దార్లో పడ్డాక శంకరం ఇప్పుడు ఆస్తికుడు కాదు కానీ కార్లో "రామా నను బ్రోవరా" అనే దేవుడి పాటలు "ఇష్టపడుతూనే" వింటాడు. గుళ్ళో అమ్మగారు పూజ చేయిస్తే తన పేరూ, గోత్రం, నక్షత్రం చెప్తాడు కూడా దంపతుల పూజకి. వాళ్ళావిడ అనడం ప్రకారం శంకరం బయటకి నాస్తికుడు, లోపల ఆస్తికుడు. పీడకలో, మరో కష్టమో వస్తే డాలర్ బిల్లు బయటకి తీసి దానిమీద ఉన్నది చదువుతూ "ఇన్ గాడ్ వియ్ ట్రస్ట్" అనగలడు లేదా మహా మృత్యుంజయ మంత్రం జపించనూ గలడు. సీతారామలక్ష్మణులూ హనుమాన్ జీ శంకరం ఒకప్పుడు తన ఊర్లో "నేను నాస్తికుణ్ణి" అన్నప్పుడు చూసి గలగల నవ్వినట్టే ఇప్పుడు అమెరికా ఊళ్ళో గుడిలోనూ పేరూ, గోత్రం, నక్షత్రం చెప్పినప్పుడు చూస్తూ అలా గలగలా నవ్వుతూనే చూస్తున్నారు. ఏమో ఇప్పుడు పగలబడి నవ్వుతున్నారేమో కూడా. ఎవరైనా తాను ఇలా మారినందుకు కారణం అడిగితే ఇప్పుడు శంకరం చెప్పే సమాధానం ఒకటే – "మనుషులు మారతారు వయస్సు వచ్చేకొద్దీ." మిస్సెస్ శంకరం వాళ్ల అమ్మ పెళ్ళికి ముందు చెప్పిన మాట గుర్తు తెచ్చుకుని శంకరానికి కనబడకుండానో, తెలియకుండానో పగలబడి నవ్వుకుంటూ ఉంటుంది. పిబరే రామరసం, జనన మరణ భయ శోక విదూరం. అంతా విధి విలాసం.

నీతి: అత్తగారి ముందుచూపు అమోఘం!